www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గొడుగులు, బొట్టుబిళ్లలు, రిస్ట్‌వాచీలు!



తిరుపతి విమానాశ్రయం సమీపంలోని గోదాములో గుట్టలు గుట్టలుగా దాచిన వైసీపీ కానుకలు

గుట్టలుగా వైసీపీ తాయిలాలు

- తిరుపతి విమానాశ్రయం సమీపంలోని గోదాముల్లో దాచి పెట్టిన వైనం
- టీడీపీ నిరసనతో రంగంలోకి అధికారులు
- వైసీపీ కీలక నేత ఒత్తిడితో తొలుత తాత్సారం
- ఎట్టకేలకు తనిఖీలు.. బయటపడిన సామగ్రి

12

బుధవారం | 27-3-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 342 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: విదియ సా. 5.08 తదుపరి తదియ; నక్షత్రం: చిత్త సా. 4.16 తదుపరి స్వాతి; వర్జ్యం: రా. 10.25-12.10; దుర్ముహూర్తం: ఉ. 11.57-12.45; అమృతఘడియలు: ఉ. 9.08-10.55; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.18; సూర్యాస్తమయం: 6.25 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రామకుప్పం మండలం రాజుపేట సమీపంలో (సీఎం జగన్ బటన్ నొక్కిన గేటు ప్రాంతంలో) నీళ్లులేని హంద్రీ-నీవా కాలువలోకి దిగిన చంద్రబాబు

ఉత్తుత్తి జీవోలు.. డమ్మీ బటన్లే!

- ఎన్నికల ముందు ఉద్యోగాలు, రెగ్యులరైజేషన్ పేరుతో నాటకాలు
- హంద్రీ-నీవా నీళ్లకు బటన్ నొక్కితే మట్టి పెళ్లలూ తడవలేదు
- జగన్‌కు ఓటేస్తే సొంత కుటుంబాలకు అన్యాయం చేసినట్లే
- ఇంత విధ్వంసాన్ని జీవితంలో చూడలేదు
- తిరుగుబాటు చేయనంతవరకూ వీళ్లు అరాచకాలు చేస్తూనే ఉంటారు
- ఈ ఐదేళ్లలో రూపాయి పెట్టుబడి రాలేదు
- ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు
- మేమొచ్చాక 60 రోజుల్లో మెగా డీఎస్సీ
- కుప్పంలో టీడీపీ అధినేత స్పష్టీకరణ

రామకుప్పం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్నట్లు సీఎం జగన్ ఉత్తుత్తి జీవోలు విడుదల చేశారని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. రామకుప్పంలో హంద్రీ-నీవా-కుప్పం కాలువ ద్వారా నీళ్లను వదులుతున్నట్లు డమ్మీ బటన్ నొక్కారని ఎద్దేవాచేశారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో మంగళవారం రెండో రోజూ పర్యటించారు. కుప్పంలోని

మిగతా 11వ పేజీలో...

వేడెక్కుతున్న రాజకీయం!

- జనంలోకి పార్టీల అధినేతలు
- నేటి నుంచే బాబు ప్రజాగళం
- 30న పిఠాపురంలో పవన్ ప్రచారం
- నేటి నుంచి జగన్ 'మేమంతా సిద్ధం'

12

కోడ్ ఉన్నా బొమ్మల కొలువే




ఈసీకి కనిపిస్తోందా.. ఈ బొమ్మల పిచ్చి?

జగన్ బొమ్మ ఉంచాల్సిందే.. జేసీల భేటీలో ఓ ఉన్నతాధికారి హుకుం

పాస్‌బుక్‌లు, ఎల్‌పీఎమ్‌లపై ఫొటోలు తొలగించొద్దు

- సర్వే పత్రాలపై జగన్ పేరు ఉండాల్సిందే
- జాయింట్ కలెక్టర్లపై తీవ్రస్థాయిలో ఒత్తిడి
- అది ఈసీ రూల్స్‌కు విరుద్ధమన్న జేసీలు
- అయినా ఫొటోలు ఉంచాల్సిందేనని పట్టు



రాష్ట్రంలో దాదాపు ఐదేళ్లు జగన్ బొమ్మల పండగ నడిపించారు. కుప్పతొట్టి నుంచి రైతులకు ఇచ్చే పాస్‌బుక్ వరకు వైసీపీ రంగులు, జగన్ ఫొటోలతో నింపి ముఖ్యమంత్రి పట్ల కొందరు ఉన్నతాధికారులు తమ వీరవిధేయతను చాటుకున్నారు. కానీ, ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చేసింది. అయినా.. పాస్ పుస్తకాలు, భూమి పత్రాలు, ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌లపై జగన్ బొమ్మలు తీసేయడానికి వీల్లేదని ఓ ఉన్నతాధికారి హుకుం జారీచేయడం జేసీలను, రెవెన్యూ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. ఆ అధికారి ఆదేశించినట్టు చేస్తే కోడ్ వేటుకు బలి కావాల్సి వస్తుందని వారంతా కలవరపడుతున్నారు.

అధికారిక వాట్సప్ గ్రూపుల్లోనూ ఆదేశాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"పాస్ పుస్తకాలు, భూమి పత్రాలు, ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎమ్), ఇతర డాక్యుమెంట్లపై ముఖ్యమంత్రి జగన్ సారు బొమ్మలు ఉండాల్సిందే. వాటిని తొలగించడానికి వీల్లేదు. నవరత్నాల స్కీమ్ లోగోను తొలగించవద్దు" అంటూ ప్రభుత్వంలో ఓ ఉన్నత స్థాయి అధికారి...జిల్లా జాయింట్ కలెక్టర్లకు హుకుం జారీ చేశారు. తన ఆదేశాలు తూచా తప్పకుండా పాటించాల్సిందేనని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్లు, రెవెన్యూ, సర్వే అధికారులతో ఇటీవల జరిగిన వీడియోకాన్ఫరెన్స్ వేదికగా ఆ ఉన్నతాధికారి తనకు ముఖ్యమంత్రి జగన్‌పై ఉన్న వీర విధేయతను, స్వామిభక్తిని

మిగతా 12వ పేజీలో...

ఎన్నికల ముందు ఎంత ప్రేమో!

మునిసిపాలిటీలకు రూ.1000 కోట్ల బిల్లుల చెల్లింపు

- లోకేశ్ బరిలో ఉన్న మంగళగిరిపై ప్రత్యేక శ్రద్ధ
- అక్కడ 'పూర్తి కాబోయే' పనులకు ఇప్పుడే నిధులు
- జగన్, బుగ్గన, అవినాశ్ నియోజకవర్గాలకూ..
- కిమ్మనకుండా నిధులు ఇచ్చేసిన ఆర్థిక శాఖ
- కోడ్ వచ్చిన రోజునే 13 ప్రతిపాదనలకు ఓకే
- 23వ తేదీన వరుస జీవోలు విడుదల
- స్క్రీనింగ్ కమిటీ ఆమోదం తీసుకున్నారా? లేదా?

2

పనులు పూర్తి చేసి.. బిల్లుల క్లియరెన్స్ కోసం ఎంతగా మొత్తుకుంటున్నా దిక్కులేదు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఇదే పరిస్థితి. కానీ.. ఇప్పుడు కొన్ని 'ఎంపిక చేసిన' మునిసిపాలిటీల్లో భవిష్యత్‌లో పూర్తికాబోయే పనులకూ ఇప్పుడే బిల్లులు చెల్లించారు. కొన్ని 'పార్ట్ పేమెంట్'లూ జరిగిపోయాయి.



కాణిపాక బాలాత్రిపురసుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో అధికారుల సమక్షంలో సాగుతున్న రాజీ చర్చలు

బలవంతపు రాజీ!

- వైసీపీ నేత చేతిలో దెబ్బలు తిన్న అర్చకులతో దేవదాయ శాఖ అధికారుల పంచాయితీ
- దాడికి పాల్పడిన వ్యక్తితో వారికి 'క్షమాపణలు'
- బయటకు వచ్చి క్షమాపణలే చెప్పలేదని బుకాయింపు
- వ్యవహారంలో చక్రం తిప్పిన ఎమ్మెల్యే ద్వారంపూడి
- బాధిత అర్చకులకు పరోక్షంగా బెదిరింపులు
- వివాదం ముగిసిందని వారితోనే చెప్పించిన వైనం
- వైసీపీ నేతను అరెస్ట్ చేశామన్న పోలీసులు
- బయటే తిరుగుతున్న మాజీ కార్పొరేటర్

11

వైసీపీనే అంటారా... వ్యాన్‌తో తొక్కించేస్తాం!

- సీఎంకు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడుతున్నారు
- పేద బ్రాహ్మణ కుటుంబానికి వైసీపీ నేతల బెదిరింపులు

ముస్లిం మహిళపై చెప్పుతో దాడి

- వైసీపీ కదిరి అభ్యర్థి బంధువు దారుణం
- ప్రచారానికి 10 మందిని తెమ్మంటే 15 మందిని తెచ్చావంటూ దుర్భాషలు

11

- సొమ్ము ఎగ్గొట్టి.. చెప్పుతో కొట్టిన వైనం

క్యాన్సర్ పేషంట్లకు ఉచిత హెల్ప్‌లైన్ నెంబర్

» 'సెకండ్ ఒపీనియన్' కోసం ప్రారంభించిన ఆంకాలజిస్టులు

» అందుబాటులో సీనియర్ వైద్యుల సేవలు

న్యూఢిల్లీ, మార్చి 26: క్యాన్సర్ పేషంట్లకు ఫోన్‌లో ఉచితంగా వైద్య సేవలు అందించటానికి వీలుగా కొందరు ఆంకాలజిస్టులు (క్యాన్సర్ వైద్యులు) 'క్యాన్సర్ ముక్త్ భారత్ క్యాంపెయిన్' పేరుతో హెల్ప్‌లైన్ నెంబరును ఏర్పాటు చేశారు. 93555 20202 నెంబరుపై ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇది ముఖ్యంగా సెకండ్ ఒపీనియన్ (క్యాన్సర్ నిర్ధారణపై ఒక డాక్టర్‌పైనే ఆధారపడకుండా.. మరో డాక్టర్ అభిప్రాయం కూడా తీసుకోవటం) కోసం పేషంట్లకు ఉపయోగపడుతుందని క్యాంపెయిన్ సారథి డాక్టర్ ఆశీష్ గుప్తా వెల్లడించారు. 'క్యాన్సర్ జీవన్మరణ సమస్య కాబట్టి.. దాని బారిన పడినవారందరికీ సెకండ్ ఒపీనియన్‌ను సిఫార్సు చేస్తారు. చికిత్స సమయంలో కూడా పేషంట్లకు పలు సందేహాలు వస్తుంటాయి. క్యాన్సర్ చికిత్స వ్యయమూ అధికమే. ఈ నేపథ్యంలోనే, ఎటువంటి ఆర్థికభారం లేకుండా ఉచితంగా సీనియర్ ఆంకాలజిస్టుల సేవలను ఈ హెల్ప్‌లైన్ ద్వారా అందిస్తున్నాం' అని తెలిపారు. క్యాన్సర్ చికిత్స రోజురోజుకీ మెరుగుపడుతోందని, అత్యాధునిక పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయని.. సెకండ్ ఒపీనియన్ హెల్ప్‌లైన్ ద్వారా వీటి గురించి విలువైన సమాచారం పేషంట్లకు అందుబాటులో ఉంటుందన్నారు.




ఓటీపీ మోసాలకు 'అడాప్‌ఐడీ'తో చెక్!

» ఐఐటీ మండి పరిశోధకుల నూతన ఆవిష్కరణ

న్యూఢిల్లీ, మార్చి 26: ఇటీవల కాలంలో ఓటీపీ మోసాలు, పాస్‌వర్డ్ హ్యాకింగ్ వంటి నేరాలు అధికమయ్యాయి. అయితే ఈ తరహా నేరాలకు చెక్ పెట్టే విధంగా ఐఐటీ మండి పరిశోధకులు ప్రత్యేకమైన బయోమెట్రిక్ ఆధారిత వ్యవస్థను అభివృద్ధి చేశారు. 'అడాప్‌ఐడీ' అని పిలిచే ఈ వ్యవస్థ పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు అవసరం లేకుండానే సురక్షితమైన యూజర్ యాక్సెస్ ప్రక్రియను అందిస్తుంది. ఏఐ సాయంతో పనిచేసే అడాప్‌ఐడీని ఐఐటీ మండీలోని సెంటర్ ఫర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్ (సీఏఐఆర్)కు చెందిన అమిత్ శుక్లా, డీప్ అల్గారిథమ్స్‌కు చెందిన జేపీ మిశ్రాతో కలిసి అభివృద్ధి చేశారు. 'అడాప్‌ఐడీ' వ్యవస్థకు ఇప్పటికే పేటెంట్ లభించిందని, దీన్ని ఇప్పటికే ఒక బ్యాంకు, ఫోరెన్సిక్ కార్యాలయాల్లో ఉపయోగించారని పరిశోధకులు తెలిపారు. ప్రభుత్వ పథకాల్లో దీని వినియోగం కోసం పరిశోధక బృందం ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై)తో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నంద్యాల	41.0	25.0
కర్నూలు	40.5	26.5
అనంతపురం	40.0	24.0
విజయవాడ	36.6	23.2
ఒంగోలు	34.3	24.7
బాపట్ల	33.6	24.7
సత్యసాయి	29.0	23.0

34 కంపెనీలు.. రూ.170 కోట్ల బాండ్లు

» తెలుగు రాష్ట్రాల్లోని పునరుత్పాదక ఇంధన కంపెనీలు కొన్న ఎన్నికల బాండ్ల విలువ

హైదరాబాద్, మార్చి 26: మొత్తం 34 కంపెనీలు.. పవన శక్తి, సౌర శక్తి, హైడ్రోపవర్.. ఇలా అన్నీ పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేసే సంస్థలే.. తెలుగు రాష్ట్రాలకు చెందినవే! ఈ కంపెనీలన్నీ కలిసి అక్షరాలా 170 కోట్ల రూపాయల విలువ చేసే ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయి. వీటిలో గ్రీన్‌కో గ్రూప్ రూ.34 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసి, అందులో రూ.13 కోట్ల బాండ్లు బీజేపీకి, రూ.11 కోట్ల బాండ్లు బీఆర్ఎస్‌కు, రూ.10 కోట్లు వైసీపీకి చదివించుకుంది. మైత్రా ఎనర్జీ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఒక్కొక్కటీ రూ.కోటి విలువ చేసే 19 బాండ్లు కొని.. అందులో 10 బాండ్లు బీజేపీకి, 6 బాండ్లు బీఆర్ఎస్‌కు ఇచ్చింది. ఎస్ఈపీసీ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ కొనుగోలు చేసిన రూ.40 కోట్ల బాండ్లలో రూ.4 కోట్లు బీజేపీకి ఇచ్చింది. దాదాపు 18 కంపెనీలు.. కొన్న బాండ్లలో అత్యధికం కారు పార్టీకే ఇవ్వడం గమనార్హం. ఇక.. ఏపీలో అధికారంలో ఉన్న వైసీపీకి స్నేహ కైనెటిక్ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.10 కోట్లు, స్కీఐరన్ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ రూ.7కోట్ల చొప్పున బాండ్లను కొన్నాయి.

మైక్రోసాఫ్ట్‌లో మరో కీలక పదవిలో తెలుగు తేజం పవన్



» విండోస్-సర్ఫేస్ హెడ్‌గా నియామకం

వాషింగ్టన్, మార్చి 26: మైక్రోసాఫ్ట్‌లో మరో తెలుగు తేజానికి కీలక పదవి లభించింది. మైక్రోసాఫ్ట్ విండోస్ అండ్ సర్ఫేస్ విభాగం బాస్‌గా పవన్ దావులూరి నియమితులయ్యారు. ఇంతవరకు ఈ పదవిని నిర్వహించిన పనోస్ పనయ్ గత ఏడాది రాజీనామా చేసి అమెజాన్‌లో చేరడంతో ఆయన స్థానంలో పవన్‌ను నియమించారు. గతంలో విండోస్, సర్ఫేస్ అంశాలకు రెండు విభాగాలు ఉండేవి. సర్ఫేస్ సిలికాన్ వర్క్ విభాగాన్ని పవన్ దావులూరి చూసేవారు. ప్రస్తుతం రెండు విభాగాలను ఏకం చేసి ఆయనను అధిపతిగా నియమించారు. ఐఐటీ-మద్రాసులో విద్యాభ్యాసం చేసిన ఆయన 1999లో మేరీలాండ్ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎస్.పట్టా పొందారు. అనంతరం మైక్రోసాఫ్ట్‌లో చేరి గత 23 ఏళ్లుగా వివిధ హోదాల్లో సేవలు అందిస్తున్నారు. 2001లో రిలయబిలిటీ కాంపోనెంట్ మేనేజర్‌గా ఉద్యోగంలో చేరారు. మైక్రోసాఫ్ట్ సీఈఓగా ఇప్పటికే సత్య నాదెళ్ల వ్యవహరిస్తుండగా ప్రస్తుతం ఆ కోవలో పవన్ చేరారు.

వెంట్రుక ముక్కతో దొరికిపోయాడు

» 1994లో బ్రిటన్‌లో కొలంబియా యువతి హత్య

» పెరిగిన టెక్నాలజీతో 30 ఏళ్లకు పరిష్కారమైన కేసు

» హంతకుడు భారతీయ సంతతికి చెందినవాడే





లండన్, మార్చి 26: ముప్పై ఏళ్ల క్రితం జరిగిన హత్య కేసును లండన్ పోలీసులు ఛేదించారు. భారతీయ సంతతికి చెందిన హంతకుడికి 19 ఏళ్ల జైలుశిక్ష పడేట్లు చేశారు. కొలంబియా నుంచి 1980ల్లో పొట్టకూటి కోసం లండన్‌కు వలస వచ్చిన మరీనా అక్కడ డేవిడ్ కొప్పల్‌ను పెళ్లి చేసుకున్నారు. 11ఏళ్లపాటు కాపురం సంతోషంగా గడిచింది. అయితే, ఆమెకు కొలంబియాలో గత వివాహానికి సంబంధించిన పిల్లలను పోషించాల్సిన బాధ్యత ఉండటం, సంపాదిస్తున్న డబ్బు సరిపోకపోవడంతో భర్తకు ఇష్టం లేకపోయినా స్థానికంగా మసాజ్ పార్లర్‌లో ఉద్యోగంలో చేరింది. తర్వాత వేశ్యావృత్తిలో కూడా దిగింది. ఇదే విషయంలో వారిద్దరికీ తరచూ గొడవలు అయ్యేవి. డేవిడ్ కొప్పెల్ ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. మరీనా వేశ్యావృత్తిని కొనసాగిస్తూనే వారాంతంలో భర్త దగ్గరకు వెళ్లి వస్తుండేది. 1994 జూలైలో కొత్త ఫ్లాట్ కూడా తీసుకుంది. అదే ఏడాది ఆగస్టు 8న ఆమె ఫ్లాట్‌లోనే దారుణ హత్యకు గురైంది. మరుసటి రోజు మరీనా ఎంతకీ ఫోన్ ఎత్తకపోవడంతో డేవిడ్ ఆమె ఫ్లాట్‌కు వెళ్లాడు. భార్య మృతదేహాన్ని చూసి వెంటనే పోలీసులకు కాల్ చేశాడు. మెరీనా హత్యకు సంబంధించి అనుమానితుల్లో భారతీయ సంతతికి చెందిన 21 ఏళ్ల సందీప్ పటేల్ కూడా ఉన్నాడు. ప్లాస్టిక్ బ్యాగు మీద సందీప్ వేలి ముద్రలు కూడా ఉన్నాయి. ఆ ప్లాస్టిక్ బ్యాగు సందీప్ తండ్రి నిర్వహించే పుస్తకాల షాపు నుంచి రావడంతో అక్కడ పనిచేసే సందీప్ వేలిముద్రలు పడే అవకాశం ఉందని భావించి వదిలేశారు. 2008లో కేసును తిరగదోడినపుడు గదిలో దొరికిన ఆమె చేతి వేలి ఉంగరంలో హంతకుడి వెంట్రుక ఉన్నట్లు గమనించారు. అప్పటికి డీఎన్ఏ టెక్నాలజీ అంతగా అభివృద్ధి చెందకపోవడంతో వెంట్రుకను దాచారు. 2022లో మరీనా కేసు మరోసారి తిరగదోడారు. పోలీసులు దాచిపెట్టిన నిందితుడి వెంట్రుకకు డీఎన్ఏ ప్రొఫైలింగ్ చేసేశారు. నేరగాళ్ల డేటాబేస్‌ను స్కాన్ చేయగానే సందీప్ పటేల్ డీఎన్ఏతో సరిపోలింది. ఆధారాలన్నీ సరిపోలడంతో 2023 జనవరిలో సందీప్ పటేల్‌ను అరెస్టు చేశారు.

జై భారత్ పార్టీకి బ్యాటరీ టార్చ్

విజయవాడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మాజీ ఐపీఎస్ లక్ష్మీనారాయణ సారథ్యంలోని జై భారత్ నేషనల్ పార్టీ(జేబీఎన్‌పీ)కి ఎన్నికల గుర్తుగా బ్యాటరీ టార్చ్‌ని కేటాయిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం లక్ష్మీనారాయణ ఓ ప్రకటన చేస్తూ... 'ఆంధ్రప్రదేశ్‌లో గతంలోనే బ్యాటరీ టార్చ్ గుర్తును కేటాయించారు. ఇప్పుడు అదే గుర్తును తెలంగాణలోనూ కేటాయించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బ్యాటరీ టార్చ్ గుర్తు కామన్‌గా ఉంటుంది. మహారాష్ట్రలో కూడా పోటీకి అనుమతి వచ్చింది. అక్కడ ఎన్నికల గుర్తుగా గ్యాస్ స్టవ్' అని తెలిపారు.

అమెరికాలో నౌక ఢీకొని కుప్పకూలిన వంతెన

న్యూయార్, మార్చి 26: అమెరికాలోని మేరీలాండ్ రాష్ట్రం బాల్టిమోర్‌లో అనూహ్య ప్రమాదం చోటు చేసుకుంది. కంటెయినర్ల లోడుతో వెళ్తున్న ఓ భారీ నౌక పటాప్‌స్కో నదిపై ఉన్న వంతెనను ఢీ కొనడంతో ఆ బ్రిడ్జి కుప్పకూలింది. దాంతో ఆ వంతెనపై వెళ్తున్న వాహనాలు నదిలో పడడంతో కనీసం 20 మంది గల్లంతయినట్టు సమాచారం అందింది. ఆ కంటెయినర్ షిప్‌పై పనిచేస్తున్న ఇద్దరు పైలట్లు సహా మొత్తం 22 మంది సిబ్బంది భారత దేశానికి చెందిన వారేనని, వారు సురక్షితంగా ఉన్నారని నౌకను నిర్వహిస్తున్న సినర్జీ మెరైన్ గ్రూపు ప్రకటించింది.



అమెరికాలో హిందూ ఫోబియా!

అగ్రరాజ్యంలో హిందూ ఆధిపత్యం పెరుగుతోందని 100కు పైగా హక్కుల సంఘాల ఆందోళన

» పలు కీలక తీర్మానాలకు ఆమోదం

» ప్రజాస్వామ్యానికి పెను ముప్పని, భారత్‌కూ ఇబ్బందేనని హెచ్చరిక



యూఎస్ కాంగ్రెస్ భవనంలో హిందూ-అమెరికన్ సదస్సు(ఫైల్)

న్యూఢిల్లీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అగ్రరాజ్యం అమెరికాలో చాపకింద నీరులా హిందూ ఆధిపత్యం పెరిగిపోతోందని, ఫలితంగా ఇప్పటి వరకు అందరికీ అన్ని హక్కులు అనే విధానాన్ని అవలంబిస్తున్న దేశంలో హిందూత్వం పెరిగిపోతోందని హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదంగా పరిణమించిందని పేర్కొన్నాయి. ఈ క్రమంలో చేయి చేయి కలిపి అమెరికాలో అందరికీ హక్కులు అనే విషయంపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని 100కు పైగా హక్కుల సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు కొన్ని కీలక తీర్మానాలు సైతం చేశాయి. "అమెరికాలో హిందూత్వ ఆధిపత్యం వివిధ అంశాల్లోకి చొచ్చుకుపోయింది. దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది" అని హక్కుల సంఘాల నాయకులు వ్యాఖ్యానించారు. కొన్ని సంస్థలు, వ్యక్తులు అమెరికాలో హిందూత్వను పెంచి పోషిస్తున్నారని తెలిపారు. "20వ శతాబ్దం ప్రారంభంలో నాజీయిజం, ఫాసిజం, ఇతర జాతిపరమైన అణిచివేత సిద్ధాంతాల నుంచి ప్రత్యక్ష ప్రేరణతో తొలిసారి వ్యక్తీకరించిన రాజకీయ భావజాలం.. ఇప్పుడు అమెరికాలో తీవ్ర ప్రభావం చూపిస్తోంది" అని వక్తలు పేర్కొన్నారు. "హిందూత్వ పెరుగుదల ప్రజాస్వామ్యంపై పెను ప్రభావం చూపిస్తుంది. న్యాయం, భావవ్యక్తీకరణ వంటిని నియంత్రిస్తుంది. ఇది అమెరికాకే కాదు.. భారత్ వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి కూడా ఇబ్బందే" అని వ్యాఖ్యానించారు. "భారతీయ అమెరికన్ల పక్షాన గళం వినిపించేందుకు ఏర్పడిన కొత్త యునైటెడ్ ఫ్రంట్ 'సవేరా'కు సంఘీభావం ప్రకటిస్తున్నాం" అని నేతలు పేర్కొన్నారు. హిందూత్వ వాదులు, సంస్థలు.. బహుళ సాంస్కృతికత, వైవిధ్యాలపై తెరచాటున ఉండి యుద్ధం చేస్తున్నాయని విమర్శించారు. ముస్లిం వ్యతిరేక తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాలను అణిచివేసే చర్యలకు పాల్పడుతున్నాయన్నారు. హిందూత్వ వాదుల చర్యలు కేవలం భారత్‌కు మాత్రమే కాకుండా దక్షిణాసియా, అమెరికాలోని ముస్లింలకు కూడా ప్రమాదకరంగా మారాయన్నారు.

సత్వర న్యాయవిచారణ ఆశిస్తున్నాం

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టుపైనా అమెరికా స్పందించింది. కేజ్రీవాల్ విషయంలో న్యాయవిచారణ పారదర్శకంగా జరగాలని ఆశిస్తున్నామని పేర్కొంది. 'కేజ్రీవాల్ అరెస్టు, తదనంతర పరిణామాలను అమెరికా గమనిస్తోంది" అంటూ అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి ఒకరు రాయిటర్స్‌తో అన్నారు. కాగా, కేజ్రీవాల్ విషయంలో న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తుందని, భారత్ ప్రజాస్వామ్య ప్రమాణాలను పాటిస్తుందని భావిస్తున్నట్లు జర్మనీ విదేశాంగ ప్రతినిధి ఇటీవల వ్యాఖ్యానించింది. దీనిపై తీవ్రంగా స్పందించిన భారత్.. మా అంతర్గత వ్యవహారాల్లో మీ జోక్యమేంటి ? అని జర్మనీ విదేశాంగ ప్రతినిధి వద్ద నిరసన తెలిపిన సంగతి తెలిసిందే.

ఇవీ తీర్మానాలు

- హిందూత్వ సహా రాజకీయాల్లో ద్వేషం ఏ రూపంలో ఉన్నా సహించరాదు.
- హిందూ ఆధిపత్య సిద్ధాంతాలపై అవగాహన పెంపొందించాలి.
- సరిహద్దులు దాటి విస్తరిస్తున్న హిందూత్వపై పోరాడాలి.
- ఇస్లామోఫోబియాను నిర్మూలించే క్రమంలో ప్రపంచవ్యాప్త ఉద్యమానికి సంఘీభావం ప్రకటించాలి.
- అమెరికాలో కుల వివక్షకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలి.
- మోదీ హయాంలో మానవహక్కులు, ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న అమెరికా ప్రభుత్వం పిలుపునకు మద్దతివ్వాలి.

మతం ఆధారంగా పౌరసత్వమా?

పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై అమెరికా మరోసారి తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. ఈ చట్టం చాలా స్పష్టంగా ముస్లింలను దూరం పెట్టిందని అమెరికా హక్కుల సంస్థ అయిన యూఎస్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్ (యూఎస్‌సీఐఆర్ఎఫ్) పేర్కొనడం వివాదాస్పదంగా మారింది. దీన్ని భారత్ తీవ్రంగా నిరసించింది. సీఏఏ నిబంధనలు తమను ఆందోళనకు గురిచేస్తున్నాయని, ఈ చట్టం అమలును నిశితంగా పరిశీలిస్తామని ఇటీవలే అమెరికా ప్రభుత్వం వ్యాఖ్యానించింది. తాజాగా 'యూఎస్‌సీఆర్ఎఫ్' ప్రకటన కూడా అదే వైఖరిని ప్రకటించింది. మతం, విశ్వాసాల ఆధారంగా ఏ వర్గానికీ పౌరసత్వం నిరాకరించడానికి వీల్లేదని తెలిపింది. సమస్యాత్మకమైన ఈ చట్టం శరణార్థులను మత ప్రాధాన్యాల ఆధారంగా పరిశీలిస్తుందని ఈ సంస్థ కమిషనర్ స్టీఫెన్ ష్నెక్ వ్యాఖ్యానించారు.

బీజేపీ మాయ నుంచి బయటపడితేనే బతుకు

» మేం అధికారంలోకి వచ్చాక 30లక్షల ఉద్యోగాల భర్తీ



న్యూఢిల్లీ, మార్చి 26: ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన పేరుతో అధికారంలో ఉన్న బీజేపీ దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. బీజేపీ మాయ నుంచి బయటపడితేనే దేశ యువత రాత మారుతుందని అన్నారు. యువత ఉపాధి కల్పనకు ప్రధాని మోదీ వద్ద ఉన్న ప్రణాళిక లేంటని ఆయన ప్రశ్నించారు. యువ న్యాయ్ ద్వారా ఉపాధి విప్లవం చేపట్టాలని కాంగ్రెస్ సంకల్పించిదని, తాము అధికారంలోకి వస్తే 'పెహ్లీ నౌక్రీ పక్కీ' పథకం ద్వారా 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. మరోవైపు అసంఘటిత కార్మికులకు ఉద్దేశించిన అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) పథకంపై అధికార బీజేపీ.. కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం రాజుకుంది. ఈ పథకం ప్రచారంలో తప్ప వాస్తవంలో లబ్ధిదారులకు చేరడం లేదని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం వల్ల ఇచ్చే పెన్షన్ ఏ మూలకు రాదని, స్కీమ్‌ను సరిగా డిజైన్ చేయలేదని జైరాం విమర్శించారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల స్పందించారు. జైరాం రమేశ్ వాస్తవాలను విస్మరించారని పేర్కొన్నారు. ఏపీవై కింద చందాదారులకు కనీసం 8% ప్రతిఫలం అందేలా ప్రభుత్వ హామీ ఉందని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా, విపక్షాలతో కూడిన ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన మరుక్షణమే సీఏఏను చించి చెత్త బుట్టలో పడేస్తామని కేరళలో ఓ కార్యక్రమంలో థరూర్ స్పష్టం చేశారు.

నువ్వో శక్తిస్వరూపిణివి

ఓ అరాచకవాదిని జైలుకు పంపావ్!

» సందేశ్‌ఖాలీ బాధితురాలు, బసిర్ హట్ బీజేపీ అభ్యర్థి రేఖా పత్రాతో ఫోన్‌లో మోదీ



రేఖా పత్రా

న్యూఢిల్లీ, మార్చి 26: పశ్చిమ బెంగాల్‌లోని బసిర్‌హట్ ఎంపీ టికెట్ పొందిన సందేశ్‌ఖాలీ బాధితురాలు రేఖా పత్రాకు ప్రధాని మోదీ నేరుగా ఫోన్ చేశారు. ఎన్నికల సన్నాహాలు ఎలా ఉన్నాయంటూ ఆరా తీశారు. రేఖా అభ్యర్థిత్వంపై స్థానిక ప్రజలు ఏమనుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. బెంగాలీలో ఫోన్ సంభాషణ మొదలుపెట్టిన మోదీ.. 'దుర్గా పూజకు నెలవైన బెంగాల్‌లో నువ్వో శక్తి స్వరూపిణివి. ఓ అరాచకవాదిని జైలుకు పంపావ్. ఎన్నికల్లో మీ మీద పెద్ద బాధ్యత ఉంచాం. మా సంపూర్ణ మద్దతు ఉంటుంది. మహిళల గౌరవం కోసం బసిర్‌హట్‌లోనే కాదు. యావత్ బెంగాల్‌లోనూ పోరాటం సాగిద్దాం' అని సూచించారు. సందేశ్‌ఖాలీలో మహిళలు గొంతెత్తగలగడం సామాన్య విషయం కాదని, తృణమూల్ పాలనతో విసిగిపోయిన బెంగాల్ నారీశక్తి ఈసారి తమకు అండగా ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిగా రేఖా పత్రా స్పందిస్తూ "మీరు మా పాలిట దేవుడిలా వచ్చారు. ఆ శ్రీరాముడే మాతో ఉన్నట్లుగా భావిస్తున్నాం. 2011 నుంచి ఇక్కడ ఎవరం ఓటు వేయలేదు. ఈ సారి హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పించండి" అని కోరారు. సందేశ్‌ఖాలీలో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు షాజహాన్ షేక్, అతడి అనుచరులు మహిళలపై లైంగిక వేధింపులు, భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఇటీవల తీవ్ర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అరెస్టు చేసేందుకు వెళ్లిన ఈడీ అధికారులపై షాజహాన్ అనుచరులు దాడికి కూడా పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో సందేశ్‌ఖాలీలో జరుగుతున్న దారుణాలను, వాటికి తృణమూల్ మద్దతు ఇస్తుండడాన్ని మోదీ ఇప్పటికే పలుసార్లు ప్రస్తావించారు. కాగా, బెంగాల్ సీఎం మమతాబెనర్జీని ఎదుర్కొనేందుకు సందేశ్‌ఖాలీని బీజేపీ ఓ ఆయుధంగా ఎంచుకుంది. ఈ క్రమంలో షాజహాన్ అకృత్యాలపై మహిళలు సాగించిన ఆందోళనలకు నాయకత్వం వహించిన రేఖా పత్రాను బసిర్‌హట్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. సందేశ్‌ఖాలీ ఈ నియోజకవర్గం పరిధిలోకే వస్తుంది. తృణమూల్ తరఫున ఇక్కడినుంచి హాజీ నరుల్ ఇస్లామ్ పోటీ చేస్తున్నారు.

వేశ్యనైనా సరే గౌరవించాల్సిందే



» వృత్తిని బట్టి ఏ మహిళనూ కించపర్చవద్దు

» తనపై కాంగ్రెస్ నేతలు సుప్రియ, ఆహిర్ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై కంగన

న్యూఢిల్లీ, మార్చి 26: సినీ నటి కంగనా రనౌత్‌పై కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనతే, మరో యువనేత హెచ్ఎస్ ఆహిర్ సోమవారం సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. ఈ పోస్టులపై కంగన స్పందిస్తూ.. "ఒక మహిళ సామాజిక నేపథ్యం, ఆమె చేసే పనిని బట్టి ఆమెను తక్కువగా చూడకూడదు. కించపర్చవద్దు. ఉపాధ్యాయురాలు, నటి, జర్నలిస్టు, రాజకీయ నాయకురాలు, వేశ్య.. ఇలా ఎవరైనా సరే ప్రతీ మహిళను గౌరవించడం మన సంస్కారం" అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు తనతో పాటు, మండీ ప్రజలను తీవ్రంగా బాధించాయని చెప్పారు. కాంగ్రెస్ నేతల అభ్యంతరకర పోస్టులపై జాతీయ మహిళా కమిషన్ కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రియపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. ఫిర్యాదులో ఆహిర్ పేరును కూడా ప్రస్తావించింది. అయితే, తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల పాస్‌వర్డ్ పలువురికి తెలుసని, తనకు తెలియకుండానే రనౌత్‌పై ఎవరో అభ్యంతరకర పోస్టు చేశారని సుప్రియ వివరణ ఇచ్చారు. తన దృష్టికి వచ్చిన వెంటనే ఆ పోస్టును డిలీట్ చేసినట్లు చెప్పారు. ఈ పోస్టు మొదటి 'సుప్రియాపేరడీ' అనే 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారని, దాని నిర్వాహకులు ఎవరో తనకు తెలియదని చెప్పారు. మరోవైపు, తన ఎక్స్ అకౌంట్ హ్యాక్ అయిందని ఆహిర్ చెప్పారు. ఇదిలా ఉండగా, సుప్రియ వివరణ నేపథ్యంలో వివాదానికి ఇంతటితో ముగింపు పలకాలని కాంగ్రెస్ పేర్కొంది. హిమాచల్‌లోని మండీ లోక్‌సభ అభ్యర్థిగా కంగనను బీజేపీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ వివాదం రేగింది.

ఎన్నికలముందు ఎంత ప్రేమో!

ప్రకాశం జిల్లా కనిగిరిలో నీటి సరఫరా ట్యాంకర్ల బిల్లులను ఆగమేఘాల మీద చెల్లించారు. కోర్టు కంటెంప్ట్ కేసు ఉండటమే దీనికి కారణమట! ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు రావత్, సత్యనారాయణ అనేక సార్లు పెండింగ్ బిల్లుల కంటెంప్ట్ కేసుల్లో హైకోర్టు ముందు నిలబడి సంజాయిషీ ఇచ్చుకొన్నారు. వాటి బిల్లులు మాత్రం చెల్లించలేదు.

ప్రస్తుతం రాష్ట్రంలో పెండింగ్ బిల్లులు దాదాపు రూ.2 లక్షల కోట్లున్నాయి. పెండింగ్ బిల్లులు చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ దాదాపు 4 లక్షల పిటిషన్లు కోర్టుల్లో దాఖలయ్యాయి. ఇవి కాకుండా ప్రస్తుతం సీఎఫ్ఎంఎస్‌లో దాదాపు పెండింగ్ బిల్లులు రూ.50,000 కోట్లకుపైగా ఉన్నాయి. ఇవేవీ పట్టని సర్కారు కేవలం రాజకీయ కోణంలో కొన్ని మునిసిపాలిటీలకు సంబంధించిన బిల్లులే చెల్లించింది.

» మునిసిపాలిటీలకు రూ.1000 కోట్ల బిల్లుల చెల్లింపు

» లోకేశ్ బరిలో ఉన్న మంగళగిరిపై ప్రత్యేక శ్రద్ధ

» అక్కడ 'పూర్తి కాబోయే' పనులకూ ఇప్పుడే నిధులు

» జగన్, బుగ్గన, అవినాశ్ నియోజకవర్గాలకూ చెల్లింపులు

» కిమ్మనకుండా నిధులు ఇచ్చేసిన ఆర్థిక శాఖ

» కోడ్ వచ్చిన రోజునే 13 ప్రతిపాదనలకు ఓకే

» 23వ తేదీన వరుస జీవోల విడుదల

» స్ర్కీనింగ్ కమిటీ ఆమోదం తీసుకున్నారా? లేదా?

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో 108 మునిసిపాలిటీలు, 20 కార్పొరేషన్లు ఉన్నాయి. ఐదేళ్లుగా వాటికి సంబంధించిన పెండింగ్ బిల్లుల గురించి పట్టించుకోనే లేదు. ఇప్పుడు... ఒక్కసారిగా నిధుల వరద పారిస్తున్నారు. అదికూడా... 'ఎంపిక' చేసిన కొన్ని నియోజకవర్గాల పరిధిలోని మునిసిపాలిటీలకు మాత్రమే! ఇందులోనూ రాజకీయ కోణమే! టీడీపీ యువ నేత లోకేశ్ బరిలో ఉన్న మంగళగిరిపై మరింత ప్రత్యేక ప్రేమ కనబరిచారు. ఇక్కడ ఇంకా పూర్తికాని పనులకు కూడా నిధులు విడుదల చేస్తూ జీవో నెంబర్ 345 జారీ చేశారు. పూర్తికాని పనులకు బిల్లులను చెల్లించడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి. అలాగే, సీఎం జగన్ నియోజకవర్గం పులివెందులకు, ఎంపీ అవినాష్ రెడ్డి నియోజకవర్గం కడప, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నియోజకవర్గం డోన్ మున్సిపాలిటీలకు బిల్లులు విడుదల చేస్తూ సంబంధిత పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి జీవోలు ఇచ్చారు. ఇవికాకుండా... కనిగిరి, నర్సీపట్నం మున్సిపాలిటీలకు కూడా నిధులు ఇచ్చేశారు. పైగా... ఇవన్నీ అదనపు నిధులు కావడం గమనార్హం. బడ్జెట్లో కేటాయించిన పరిమితి దాటిపోయినప్పటికీ డబ్బులు ఇచ్చేశారు.

పట్టణ ఓటర్ల కోసం...: పట్టణ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకే చకచకా నిధులు జారీ చేస్తున్నారనే అనుమానాలున్నాయి. ఈ 13 జీవోల్లో అధికంగా వాటర్ ట్యాంకర్ల పెండింగ్ బిల్లుల చెల్లింపులే ఎక్కువగా ఉన్నాయి. ఇక... నర్సీపట్నంలో ఎలక్ట్రిక్ పోల్స్ తరలింపునకు రూ.16 కోట్లు ఇచ్చారు. కనిగిరిలో వాటర్ ట్యాంకర్ల పెండింగ్ బిల్లులు ఇస్తున్నట్లు రాశారు. పులివెందుల మునిసిపాలిటీలో నీటిసరఫరా కోసం రూ.15 కోట్లు ఇచ్చారు. కడపలో పూర్తయిన పనుల కోసం రూ.5 కోట్లు ఇచ్చారు.

స్ర్కీనింగ్ కమిటీ ఆమోదం ఉందా?

పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ ఈ జీవోల ప్రతిపాదనలను స్ర్కీనింగ్ కమిటీకి పంపిందా? లేదా? ఎందుకంటే.. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఏ ప్రతిపాదనకైనా కమిటీ ఆమోదం ఉండాలి. కానీ, ఈ ఫైళ్లు నేరుగా సీఎస్ నుంచి ఆర్థిక శాఖకు వెళ్తున్నాయని సమాచారం. కమిటీలో సభ్యులైన జీఏడీ సెక్రటరీ దృష్టికి వెళ్లడం లేదని తెలుస్తోంది. మార్చి 16వ తేదీ నుంచి ఆర్థిక శాఖ 'ఫిఫో' నిబంధన ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా బిల్లులు చెల్లిస్తుంటే ఎన్నికల కమిషన్ ఏం చేస్తోంది? ఆర్థిక శాఖ కేవలం ఒక్క రోజులో 13 ప్రతిపాదనలకు ఓకే చెప్పడం అత్యంత అసాధారణం. దీనిపై ఎన్నికల కమిషన్ విచారణ చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, కేవలం ఒక్క పార్టీకి మేలు చేసేలా ఖజానా నుంచి డబ్బులు పందేరం చేయడం కోడ్‌ను ఉల్లంఘించడమే!



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

MA & UD Department – Mangalagiri-Tadepalli Municipal Corporation - Release of an amount of Rs.74,06,70,000/- (Rupees Seventy four crore six lakh seventy thousand only) as additional funds in relaxation of treasury control and quarterly regulation orders subject to adjust the additional funds within overall savings of grant of B.E 2023-24 towards payment to the completed works/to be completed works taken up in Mangalagiri-Tadepalli Municipal Corporation - Administrative Sanction – Accorded - Orders - Issued.

MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT (BUDGET) DEPARTMENT

G.O.Rt.No.345 Dated.24.03.2024.
Read the following:

1. G.O.Rt.No.695, MA&UD Department, dated 16-09-2022.
2. From the Commissioner, Mangalagiri-Tadepalli Municipal Corporation, Lr.Roc.No.2595/E1/2022, Dt.27.10.2022.
3. G.O.Rt.No.919, MA & UD (Bud) Department, dated 28-10-2022

టీడీపీ నేత నారా లోకేశ్ పోటీ చేస్తున్న మంగళగిరి మున్సిపాలిటీలో 'పూర్తి కాబోతున్న' పనులకూ బిల్లులు మంజూరు చేస్తూ విడుదల చేసిన జీవో.

కోడ్ రోజున ఆమోదం...

ఈనెల 23, 24 తేదీల్లో దాదాపు రూ.1000 కోట్ల చెల్లింపులు చేస్తూ మొత్తం 13 జీవోలిచ్చారు. అయితే, ఈ ప్రతిపాదనలను కోడ్ అమల్లోకి వచ్చిన రోజునే, అంటే మార్చి 16వ తేదీనే ఆమోదించింది. ఎలాంటి కొర్రీలు వేయకుండా, పూర్తికాని పనులకు బిల్లులేంటి అని అడగకుండా, కేవలం ఈ మునిసిపాలిటీలకే ఎందుకు అని ప్రశ్నించకుండా ఒకే ఒక్కరోజులో 13 ప్రతిపాదనలను ఆర్థిక శాఖ ఎలా ఆమోదించిందన్నదే ప్రశ్న! ఇలా మార్చి 16వ తేదీన ఆర్థిక శాఖ ఆమోదం పొందిన ప్రతిపాదనలు ఇంకో 20 ఉన్నాయని సమాచారం. ఈ ప్రతిపాదనలను పాత తేదీలతో కొత్తగా ఆమోదించారనే అనుమానాలూ ఉన్నాయి. జీవోల వెబ్‌సైట్‌ను జగన్ సర్కారు మూసేయడంతో అసలు తేదీ తెలిసే అవకాశమే లేదు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. గత 10 రోజుల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి చాలా పథకాలకు సంబంధించిన నిధులు వచ్చాయి. వాటికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా మ్యాచింగ్ గ్రాంట్ కలిపి సింగిల్ నోడల్ అకౌంట్లకు బదిలీ చేయాలి. కానీ, వాటిని ఖజానాలోనే ఉంచి ఇలా కావాల్సిన చోట బిల్లుల పందేరాలకు వాడుతున్నట్టుగా అనుమానాలు వస్తున్నాయి.



1.శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ ఎన్వీ రమణ,
2. జస్టిస్ హృషికేశ్ రాయ్, 3. జస్టిస్ దుప్పల వెంకటరమణ

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని పలువురు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. వీరిలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హృషికేశ్ రాయ్,మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకటరమణ ఉన్నారు. ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, సినీ నటుడు రామ్‌చరణ్, హీరో కృష్ణ కుమార్తెలు గల్లా పద్మావతి, ప్రియదర్శిని కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు



కర్నూలు(హాస్పిటల్), మార్చి 26: కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ మహిళకు ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు జన్మించారు. కర్నూలు జిల్లా కల్లూరు మండలం సల్కాపురం గ్రామానికి చెందిన సుష్మారాణి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పని చేస్తోంది. ఆమె పురిటి నొప్పులతో ఈ నెల 6వ తేదీన కర్నూలు జీజీహెచ్‌లో చేరింది.యూనిట్ చీఫ్ డా.సావిత్రి సుధాకర్ పరీక్షలు నిర్వహించి, బీపీ ఎక్కువ కావడంతో 15 రోజులుగా వార్డులోనే ఉంచి చికిత్స అందించారు. ఈ నెల 19వ తేదీ వైద్య బృందం సుష్మారాణికి సిజేరియన్ చేశారు. ముగ్గురు శిశువుల్లో ఆడ శిశువు 1.9 కిలోలు, మగపిల్లల్లో ఒకరు 1.5 కిలోలు, మరొకరు 1.9 కిలోలు ఉన్నారు.

అమరనాథ్ రెడ్డి హత్య కేసు దర్యాప్తు వేగవంతం

- పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు

నల్లమాడ, మార్చి 26: టీడీపీ నాయకుడు దుద్దుకుంట అమరనాథ్‌రెడ్డి హత్య కేసులో పోలీసులు ముగ్గురు అనుమానితులను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం కుటాలపల్లిలో పొలం వద్ద ఉన్న అమరనాథ్ రెడ్డిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ హత్య కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. అమరనాథ్‌రెడ్డి అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. గ్రామంలో పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.

ప్రైవేటుకు మేళ్లు!

బెనిఫిసియేషన్ పేరిట నాడు తండ్రి.. నేడు కొడుకు

- బెరైటీస్, ఐరన్‌వోర్, బొగ్గులో ప్రైవేటు సంస్థలకు పెద్దపీట
- ఎండీసీని నిండా ముంచి ప్రైవేటుకు లాభాల సిరులు
- జాయింట్ వెంచర్ పేరిట సింహభాగం ప్రైవేటుకు వాటా
- ప్రజా ప్రయోజనం బుట్టదాఖలు
- 11:89 వాటా వెనుక భారీ వ్యూహం

ప్రజల సొమ్ముకు కాపలా వహించాల్సిన వైసీపీ ప్రభుత్వం.. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్.. 'బెనిఫిసియేషన్' పేరుతో రాయితీలు, సబ్సిడీలు, రూ.వేల కోట్ల విలువైన భూములను ప్రైవేటుకు కట్టబెట్టేందుకు సర్వం సిద్ధం చేశారు. తన తండ్రి, అప్పటి సీఎం వైఎస్ హయాంలో **2008**లో కుదిరిన ఒప్పందాలు నేటికీ అమలు కాకున్నా.. వాటిని రద్దుచేయకుండా ప్రైవేటు మైనింగ్ కంపెనీలకు లబ్ధి చేకూర్చే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. ఫలితంగా సర్కారుకు సిరులు కురిపించే మైనింగ్ కార్పొరేషన్ నిండామునిగిపోతోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వం గనులు సహా ఇతర సహజవనరులతో వ్యాపారం చేయాలనుకుంటే లాభాలు ఆశిస్తుంది. ప్రైవేటు కంపెనీలతో కలిసి కంపెనీలు పెట్టి వ్యాపారం చేయాలనుకుంటే తను లాభం పొందాలని భావిస్తుంది. ఇలా వచ్చిన సొమ్మును ప్రజా సంక్షేమంతోపాటు రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడేలా చేస్తుంది. అదే ప్రజాప్రభుత్వ లక్ష్యం. కానీ, అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు, నేటి సీఎం జగన్ మాత్రం సర్కారు ఖజానాకు చిల్లుపెట్టి కార్పొరేట్, ప్రైవేటు మైనింగ్ కంపెనీల జేబులు నింపారు. జాయింట్ వెంచర్, బెనిఫిసియేషన్ ప్లాంట్ల ఏర్పాటు పేరిట కార్పొరేట్ గనులను ప్రైవేటుకు ఒక సంక్షేమ పథకంలా అమలు చేశారు. గనుల లీజులున్న ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ)ని నిండా ముంచేసేలా ఒప్పందాలు చేసుకున్నారు. బొగ్గు, ఐరన్‌వోర్‌తోపాటు ఇప్పుడు సర్కారు ఖజానాకు భారీ లాభాలు తీసుకొస్తున్న బెరైటీస్‌లోనూ ప్రైవేటుకు రూ.వేల కోట్ల కనకవర్షం కురిపించేలా వాటాలు ఇచ్చారు. బొగ్గు, బెరైటీస్‌లో జగన్ అచ్చం తన తండ్రి మాదిరిగా అదే పని చేస్తున్నారు. రాష్ట్రంలో ఐరన్‌వోర్, బాక్సైట్, లాటరైట్, బెరైటీస్, క్వార్ట్జ్ వంటి ఖనిజాల లీజులు ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీఎండీసీ పేరిట ఉన్నాయి. ఎండీసీకి ఏపీలోని ప్రకాశం జిల్లా కొణిజేడు-మర్లపాడుతోపాటు, మధ్యప్రదేశ్‌లోని సులెయారి, ఛత్తీస్‌గఢ్‌లో బొగ్గు గనుల లీజులున్నాయి. ఇక, రాష్ట్రంలో బాక్సైట్, లాటరైట్‌తోపాటు మంగంపేట బెరైటీస్, బీచ్‌శాండ్, క్వార్ట్జ్ గనుల లీజులున్నాయి. గనుల లీజులు ఎండీసీ పేరిట ఉన్నా సొంతంగా మైనింగ్ చేసే శక్తి లేదు కాబట్టి ప్రైవేటు కంపెనీలకు టెండర్లు ఇచ్చి మైనింగ్ చేయించవచ్చు. 2007కు ముందు ఇదే జరిగేది. అయితే, ఉమ్మడి ఏపీలో రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు లీజుల కాంట్రాక్టు స్థానంలో 'బెనిఫిసియేషన్' అనే కొత్త విధానం తీసుకొచ్చారు. అంటే, ఒక ప్రైవేటు కంపెనీతో జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటుచేసి, దానికే మైనింగ్, బెనిఫిసియేషన్ ప్లాంటు ఏర్పాటు, అమ్మకం వంటి బాధ్యతలు అప్పగిస్తారు. వైఎస్ తీసుకున్న నిర్ణయం మేరకు బెనిఫిసియేషన్‌లో ఎండీసీకి కేవలం 11శాతం వాటా చాలని నిర్దేశించారు. జింపెక్స్ కంపెనీకి 89శాతం ఇస్తూ 2008లో ఒప్పందం కుదుర్చుకున్నారు.

బెనిఫిసియేషన్ మహామోసం

సర్కార్ ఒప్పందాన్ని పరిశీలిస్తే ప్రైవేటు 'లోగుట్టు' కనిపిస్తుంది. ఎండీసీకి 11 శాతం వాటా. జింపెక్స్‌కు 89 శాతం వాటా. దీని ప్రకారం 100 టన్నుల బెరైటీస్‌ను బెనిఫిసియేషన్ చేస్తే అందులో 30 శాతమే నాణ్యమైన సరుకు బయటకు వస్తుంది. మిగిలిన 70 శాతం వృథా కింద పోయినట్లుగా పరిగణిస్తారు. ఇక, 30 శాతం నాణ్యమైన సరుకును అమ్మగా వచ్చిన దాంట్లో 11 శాతం ఎండీసీకి ఇస్తారు. మిగిలినది ప్రైవేటుకు వెళ్లేలా ఒప్పందం చేసుకున్నారు. 'ఇది పెద్ద మోసం' అని గనుల శాఖ నిపుణులు చెబుతున్నారు. నిజానికి సీ-గ్రేడ్ బెరైటీస్ టన్ను ధర రూ.2,100 ఉంటుంది. దాన్ని నేరుగా ప్రైవేటు కొనుగోలుదారుకు ఇస్తే ఆ మొత్తం సొమ్ము ఎండీసీకి వస్తుంది. దీనివల్ల ఎండీసీకి లాభాలు వస్తాయి. కానీ, ప్రైవేటుకే లాభం రావాలనుకొని, బెరైటీస్‌ను నేరుగా అమ్మకుండా ప్రైవేటుతో బెనిఫిసియేషన్ అనే తతంగానికి తెరదీశారు. అంటే, టన్ను బెరైటీస్‌ను బెనిఫిసియేషన్ చేస్తే దానిలో 30శాతమే పనికొస్తుంది కాబట్టి అందులోనే ఎండీసీకి వాటా ఇస్తారు. మరి వృథాగా పోయిన 70 శాతం బెరైటీస్‌ను ఎంచేస్తారు? ఇదే అసలు ట్విస్ట్. దాన్ని ప్రైవేటు కంపెనీ అమ్ముకోవచ్చు. దానిపై వచ్చే సొమ్ములో రూపాయి కూడా ఎండీసీకి ఇవ్వాల్సిన అవసరం లేదు. బెనిఫిసియేషన్ అసలు లక్ష్యం అదే. నిజానికి బెనిఫిసియేషన్‌తో సంబంధం లేకుండా గ్రేడ్‌ల వారీగా బెరైటీస్‌ను ఎండీసీనే కొనుగోలుదారులకు అమ్మితే ప్రపంచం నలుమూలల నుంచి వచ్చి కొనుగోలు చేస్తారు. ధరను కూడా ఎండీసీ శాసించే అవకాశం ఉంటుంది. ఇంతగా లాభాలు పొందే అవకాశం ఉన్నా సర్కారు వదులుకొని బెనిఫిసియేషన్ పేరిట ప్రైవేటు బాట పట్టారు. మొత్తం సరఫరా చేసిన బెరైటీస్‌లో 11 శాతం వాటా ఎండీసీకి దక్కదు. కేవలం అప్‌గ్రేడ్ అయిన బెరైటీస్‌లోనే 11 శాతం వాటా వస్తుంది. అలా అప్‌గ్రేడ్ అయ్యే బెరైటీస్ అంతా కలిపితే తక్కువ మొత్తంలోనే ఉంటుంది. ఇక, వృథా పేరిట పడేసే బెరైటీస్‌ను అమ్ముకుంటే ప్రైవేటుకు వచ్చే లాభం భారీగా ఉంటుంది. నేరుగా ఎండీసీకే లాభాలు వచ్చేలా బెరైటీస్‌ను అమ్ముకుని వేలకోట్ల లాభం పొందే అవకాశం ఉన్నా దాన్ని దెబ్బతీసి బెనిఫిసియేషన్ వెంటపడటంలోని అసలు అంతర్యం ఇదే. ఈ ప్లాంటును ఏర్పాటు చేసే జింపెక్స్‌కు కారు చౌకగా 100 ఎకరాలు ఇచ్చారు. ప్లాంటు ఏర్పాటుకు 2008లో ఒప్పందం కుదిరింది. ఇప్పుడు 2024. ఇంత వరకు అతీగతీలేదు. అయినా ఆ ఒప్పందాన్ని గనుల శాఖ రద్దుచేయలేదు. తండ్రి హయాంలో జరిగిన ఒప్పందాన్ని కొడుకు జగన్ కొనసాగిస్తున్నారు.

అదే దారి

ఎండీసీకి ప్రకాశం జిల్లా కొణిజేడు-మర్లపాడు బ్లాక్‌లో 1,300 ఎకరాల్లో బొగ్గు నిక్షేపాలున్నాయి. అక్కడ మైనింగ్, బెనిఫిసియేషన్ ప్లాంటుకోసం ఇటీవల టెండర్లు పిలిచారు. సేమ్ టు సేమ్. తండ్రిబాటలోనే తనయుడు. లీజులున్న ఎండీసీకి 11 శాతం వాటా ఇస్తే, టెండర్ దక్కించుకునే ప్రైవేటు సంస్థకు 89 శాతం వాటా అని నిర్దేశించారు. ఇక్కడి బొగ్గులో అయస్కాంత శక్తి ఎక్కువగా ఉంటుంది. బెనిఫిసియేషన్ ప్లాంటు ద్వారా బొగ్గును ప్రాసెస్‌చేసి అమ్మిపెట్టే బాధ్యత ప్రైవేటు సంస్థది. టెండర్ జిందాల్ సంస్థ దక్కించుకుంది. నేరుగా బొగ్గును తవ్వితీసే కాంట్రాక్ట్ ప్రైవేటుకు ఇవ్వొచ్చు. ఆ తర్వాత ఆ ముడిబొగ్గును ప్రైవేటు కొనుగోలుదారులకు అమ్మవచ్చు. దీనివల్ల ఎండీసీకి లాభాలు వస్తాయి. అందుకు భిన్నంగా బొగ్గు తవ్వడంతోపాటు, ప్రాసెస్‌చేసి, అమ్మిపెట్టే బాధ్యతను కూడా జిందాల్‌కే ఇచ్చారు.

ఏమిటీ.. బెనిఫిసియేషన్?

బెనిఫిసియేషన్ అంటే.. తవ్వితీసిన ఖనిజాన్ని ప్రాసెస్‌చేసి మరింత నాణ్యమైన ఖనిజంగా మార్చే ప్రక్రియ. తొలుత బెరైటీస్‌లోనే ఈ విధానం తీసుకొచ్చారు. ఎంఎండీఆర్ చట్టం-1956 ప్రకారం ఎండీసీ ప్రైవేటుతో జాయింట్ వెంచర్‌కు వెళ్లాలనుకుంటే, అందులో ఎండీసీకి కనీసం 75 శాతం వాటా ఉండాలి. కానీ, నాటి వైఎస్ ప్రభుత్వం ఈ నిబంధనను పక్కనపెట్టింది.

వృథా కూడా ప్రైవేటు పాలే!

100 టన్నుల ముడిబొగ్గును అప్‌గ్రేడ్ చేస్తే 30 శాతం అంటే 30 టన్నుల మేర నాణ్యమైన సరుకు వస్తుంది. అలా వచ్చిన దానిపై 11 శాతం ఎండీసీకి వాటా కింద ఇస్తారు. మిగిలిన 89 శాతం జిందాల్ తీసుకుంటుంది. మరి, వృథా కింద లెక్క చూపే 70 టన్నుల బొగ్గును ఏం చేస్తారు? అంటే.. ప్రైవేటు సంస్థే అమ్ముకుంటుంది. దాన్ని కొనుగోలుచేసే బయ్యర్లు కూడా ఉంటారు. బెనిఫిసియేషన్ అంటేనే కంటికి కనిపించిన ప్రైవేటు మేళ్లు దాగి ఉన్నాయని అంటున్నారు నిపుణులు.

'లా'పై యువత ఆసక్తి శుభపరిణామం

- సామాజిక రుగ్మతలు రూపుమాపేందుకు న్యాయవిభాగం కృషి
- స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో న్యాయవాదులు పాల్గొన్నారు: సీజేఐ



జస్టిస్ డీవై చంద్రచూడ్

తిరుపతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వైద్యులు, ఇంజనీర్లు, ఐటీ నిపుణులతోపాటు న్యాయవాదులు కూడా ప్రాధాన్యం కలిగిన వారేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం లా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా కోర్సు దశాబ్ది ఉత్సవాల్లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ..తాను లా చదవాలనుకున్న సమయంలో చాలావరకు వైద్య, ఇంజనీరింగ్ విద్యలో సీటు రాని వారు మాత్రమే లా కోర్సులో చేరడానికి ఆసక్తి చూపేవారన్నారు. అయితే నేడు న్యాయవాద వృత్తిని ఎన్నుకోవడానికి యువత ముందుకొందని, యువతులు కూడా లా చదవడానికి ప్రాముఖ్యత ఇస్తున్నారని, ఇది మంచి పరిణామమని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో న్యాయవాదులు పాల్గొన్నారని, సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి న్యాయవిభాగం పనిచేస్తోందని తెలిపారు. కక్షిదారులు, న్యాయమూర్తులు చెప్పేది యువ న్యాయవాదులు జాగ్రత్తగా వినాలని సూచించారు. వాదన ఎంత నాణ్యంగా వినిపిస్తారనే దానిపై తీర్పు ఆధారపడి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు, ఎస్వీయూ వైస్ చాన్సలర్ వి.శ్రీకాంత్ రెడ్డి, రిజిస్ట్రార్ ఓ.మహ్మద్ హుసేన్, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.పద్మనాభం, డీన్ కృష్ణయ్య, లా విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలన పోవాలి

- రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచకాలే
- వేల మంది మహిళలు అదృశ్యం: నారా భువనేశ్వరి
- ఏలూరు జిల్లాలో 'నిజం గెలవాలి' పర్యటన



ఎర్రంపేటలో చంద్ర చిన కన్నయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి

ఏలూరు/కొయ్యలగూడెం/జంగారెడ్డిగూడెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దుర్మార్గపు పాలన పోయి చంద్రబాబు పాలన వచ్చేలా రానున్న ఎన్నికల్లో అందరూ సహకరించాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. అప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మరణించినవారి కుటుంబాలను పరామర్శించేందుకు ఆమె చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర మంగళవారం ఏలూరు జిల్లాలో కొనసాగింది. కొయ్యలగూడెం మండలం కన్నాయిగూడెంలో దిర్శిపోం వెంకటలక్ష్మి, ఎర్రంపేటలో చంద్ర చిన కన్నయ్య, జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటలో భీమడోలు వెంకయ్య, జంగారెడ్డిగూడెంలో నల్లజర్ల కృష్ణ కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. ఆ కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అరాచకాల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అక్రమ కేసులతో చంద్రబాబు సహా అనేకమందిని జైలు పాల్జేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎటు చూసినా అరాచకం రాజ్యమేలుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు మొదటి నుంచి ఒక శాశ్వత ప్రణాళికతో పనిచేసేవారని, బాబు హయాంలో పోలవరం ప్రాజక్టు నిర్మాణం 80 శాతం పూర్తయితే, గత ఐదేళ్లలో మిగతా పనులన్నీ పడకేశాయని దుయ్యబట్టారు. పట్టిసీమ ఎత్తిపోతల, రాయలసీమకు నీరందించే విషయంలోనూ ఆయన దూరదృష్టి పని చేసిందన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా గంజాయి, మాదకద్రవ్యాలు అందుబాటులో ఉండడం అత్యంత దారుణమన్నారు. ఆఖరుకు మహిళలకు గంజాయి అలవాటు చేసే దుర్భరపరిస్థితి రాష్ట్రంలో అడుగడుగునా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 33 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని, దీనికి కారణాలేమిటో ఆలోచిస్తేనే భయం వేస్తోందని చెప్పారు. మహిళలకు రక్షణ లేని పరిస్థితులకు రాష్ట్రం ఆలవాలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశాన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



ప్రజలారా మీ భూములు జాగ్రత్త

- నెల్లూరు వాసులకు హెచ్చరిక
- బ్రెజిల్‌లో వైసీపీకి లావాదేవీలు: ఆనం రమణారెడ్డి

నెల్లూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): 'నెల్లూరు ప్రజలారా రోజూ మీ భూములను జాగ్రత్తగా చూసుకోండి. రికార్డులు చూసుకుంటూ ఉండండి. వైజాగ్ మొత్తాన్ని కబ్జా చేసిన విజయసాయిరెడ్డి ఇప్పుడు నెల్లూరు మీదకు వచ్చారు. రిషికొండ లాంటి పెద్ద కొండలనే మింగేశారు. ఇక సామాన్యుల భూములను లాగేయడం పెద్ద విషయం కాదు' అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. మంగళవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'బ్రెజిల్ ప్రెసిడెంట్ ఒక్కరికే వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఎందుకు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు? ప్రపంచంలో ఆ తర్వాత, అంతకుముందు అనేక మంది ప్రెసిడెంట్‌లు అయ్యారు కదా..! మరి వారికి ఎందుకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టింగ్‌లు పెట్టలేదు? ఎందుకంటే బ్రెజిల్‌లో వారికి లావాదేవీలు ఉన్నాయి. డ్రగ్స్‌ను తీసుకొచ్చిన కంటైనర్ కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారిది కాబట్టి చంద్రబాబుకు సంబంధం ఉందంటూ వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. తనకు వ్యాపారాలే లేవంటూ విజయసాయిరెడ్డి పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. జగన్మోహన్‌రెడ్డి కంపెనీల్లో ఆయనకు వాటాలు లేవా? దొంగ కంపెనీలు పెట్టి రూ.వేల కోట్లు దోచుకున్న వ్యవహారాల్లో సీబీఐ పెట్టిన 13 కేసుల్లో 16 నెలలు విజయసాయిరెడ్డి జైల్లో ఉన్న మాట వాస్తవం కాదా? ఈ సందర్భంగా ఆనం... తన ఎంపీ ల్యాడ్స్ నుంచి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఖర్చు చేస్తున్న నిధుల వివరాలను విపులీకరించారు. కుల, మతాలకు అతీతంగా తన స్వంత నిధులనూ ఖర్చు పెడుతున్న తీరును సోదాహరణంగా పేర్కొన్నారు. విజయసాయిరెడ్డి గడిచిన పదేళ్లలో రూ.50 కోట్ల ఎంపీ ల్యాడ్స్‌లో నెల్లూరుకు ఎంత ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ పాఠశాలల్లోనూ విలీనం

- జీవోలు 117, 128, 60 అమలుకు చర్యలు
- 1, 2 క్లాసులకే ప్రాథమిక స్కూళ్లు పరిమితం
- సమీప హైస్కూళ్లలోకి 3, 4, 5 తరగతులు
- దీంతో మరింత తగ్గనున్న ఉపాధ్యాయులు
- గతంలోనే వ్యతిరేకించిన తల్లిదండ్రులు
- కోడ్ ఉన్నా పట్టించుకోని జగన్ ప్రభుత్వం
- వివరాలు పంపాలని విద్యా శాఖ ఆదేశాలు

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ.. జిల్లా, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో తరగతులు విలీనం చేసిన జగన్ ప్రభుత్వం.. ఇప్పుడు మున్సిపల్ పాఠశాలల్లోనూ అదే మొండి వైఖరిని ప్రదర్శిస్తోంది. తరగతుల విలీనం, రేషనలైజేషన్ కోసం 2022లో జారీ చేసిన జీవోలు 117, 128, 60లను మున్సిపల్ పాఠశాలల్లో అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు మున్సిపాలిటీల్లో పాఠశాలల మ్యాపింగ్, పోస్టుల అప్‌గ్రెడేషన్ వివరాలను పంపాలని పాఠశాల విద్యాశాఖ తాజాగా డీఈవోలకు ఆదేశాలు జారీ చేసింది. మున్సిపల్ పాఠశాలలు.. మున్సిపల్ శాఖ పరిధిలో ఉన్నందున గతంలో చేసిన విలీనం, రేషనలైజేషన్ ప్రక్రియ ఈ పాఠశాలల్లో అమలు చేయలేదు. గత నెలలో ప్రభుత్వం మున్సిపల్ పాఠశాలలను పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి తెచ్చింది. దీంతో వెంటనే రేషనలైజేషన్ ప్రక్రియ ప్రారంభించింది. మున్సిపాలిటీల్లో 2,115 పాఠశాలలు ఉన్నాయి. 4.25 లక్షల మంది విద్యార్థులు వాటిలో చదువుతున్నారు. పై జీవోల ప్రకారం ఒక కిలోమీటరు పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సమీపంలోని హైస్కూల్‌లో విలీనం చేస్తారు. దీంతో ప్రాథమిక పాఠశాలల్లో ఇక 1, 2 తరగతులు మాత్రమే మిగులుతాయి. గతంలో జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో ఈ జీవోలు అమలు చేయడంతో 4,250 ప్రాథమిక పాఠశాలలు విలీనమయ్యాయి. వాటిలో కేవలం రెండే తరగతులు మిగిలాయి. ఈ ప్రక్రియను అప్పట్లో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించినా ప్రభుత్వం మొండిగా అమలు చేసింది. 60 మంది విద్యార్థులకు ఇద్దరే టీచర్లు ఉంటారని, విద్యార్థుల సంఖ్య ఆధారంగా హెచ్‌ఎం, పీఈటీ పోస్టులుంటాయని స్పష్టం చేసింది. ఇప్పుడు ఇదే విధానం మున్సిపల్ పాఠశాలల్లో అమలు చేయడం ద్వారా టీచర్ల సంఖ్య తగ్గిపోయే అవకాశముంది. కాగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఇలాంటి విధానపరమైన నిర్ణయాలు ఎలా తీసుకుంటారని టీచర్లు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇచ్చిన జీవోలు కేవలం జిల్లా, మండల పరిషత్, ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తిస్తాయని, మున్సిపల్ పాఠశాలలకు ఆ జీవోలు వర్తించవనే వాదన వినిపిస్తోంది. కాగా, ఇది ప్రతిపాదన దశలోనే ఉందని పాఠశాల విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి.

టెట్ ఫలితాలకు ఈసీ అనుమతి రాలేదు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి పాఠశాల విద్యాశాఖ వివరణ

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫలితాల అంశాన్ని ఈసీ దృష్టికి తీసుకెళ్లామని, ఇంకా అనుమతి రానందున ఫలితాలు విడుదల చేయలేదని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ తెలిపారు. 'టెట్ ఫలితాల్లో నాటకం' శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి వివరణ ఇచ్చారు. టెట్ ఫలితాల విడుదలకు తొలుత నార్మలైజేషన్ ప్రక్రియ చేపట్టామని, కోర్టు ఆదేశాలతో అభ్యంతరాలకు గడువు పెంచామని వివరించారు. ఆ తర్వాత ఈ నెల 20న ఫలితాలు విడుదల చేయాలని నిర్ణయించగా, ఈ లోపు ఎన్నికల షెడ్యూలు విడుదలైందన్నారు. హైకోర్టు ఆదేశాలతో 51 మంది బీఈడీ అభ్యర్థులు ఎస్జీటీ పోస్టులకు అనర్హులయ్యారని, వారు చెల్లించిన ఫీజులు వెనక్కి ఇస్తామన్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్‌కు ఎస్జీటీలు

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో అధికంగా ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్లను స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లుగా వినియోగించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. టీచర్ల అంగీకారం తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది.

ఏయూలో వైసీపీ పాటలు.. విద్యార్థుల డ్యాన్సులు

- హోలీ వేడుకల పేరుతో విద్యార్థుల రచ్చ
- అభ్యంతరం వ్యక్తం చేసిన మిగిలిన విద్యార్థులు

విశాఖపట్నం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని న్యాయ కళాశాల విద్యార్థులు హోలీ వేడుకల పేరుతో రెచ్చిపోయారు. క్యాంపస్‌లోనే వైసీపీ పాటలకు డ్యాన్సులు వేశారు. సోమవారం ఉదయం న్యాయ కళాశాల విద్యార్థులు హోలీ వేడుకలు జరుపుకున్నారు. ఇందులో వైసీపీ విద్యార్థి విభాగానికి చెందిన పలువురు పాల్గొన్నారు. వారంతా వైసీపీ పాటలు పెట్టి.. డ్యాన్స్ చేస్తూ రచ్చ చేశారు. దీనిపై మరికొందరు విద్యార్థులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. వర్సిటీలో, అదీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా రాజకీయ పార్టీకి చెందిన పాటలు, డ్యాన్స్ ఏమిటంటూ నిలదీశారు. వారితో డ్యాన్స్ చేసిన విద్యార్థులు వాగ్వాదానికి దిగారు. సెక్యూరిటీ ఇబ్బంది వచ్చి ఇరువర్గాలకు సర్ది చెప్పారు. ఈ వ్యవహారం వర్సిటీలో పెద్ద చర్చకు దారితీసింది. వర్సిటీని పాలకులు వైసీపీ కార్యాలయంగా మార్చారంటూ ఇప్పటికే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చోటుచేసుకున్న ఘటనపై సీనియర్ ప్రొఫెసర్లు, విద్యార్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ కూటమిని గెలిపించాలి: ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ



చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సుబ్బరాయన్ తదితరులు

విజయవాడ(ధర్నాచౌక్), మార్చి 26: పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన టీడీపీ కూటమిని రాబోయే ఎన్నికల్లో గెలిపించేందుకు కృషి చేయాలని ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బరాయన్, పెద్దన్న గౌడ్ రాష్ట్రవ్యాప్తంగా పెన్షనర్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, నిరుద్యోగం పెరిగిందని.. యువత గంజాయి మత్తులోపడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర భవిష్యత్‌ను మళ్లీ గాడిలో పెట్టాలని, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. పెన్షనర్లకు ప్రతీ నెలా ఒకటవ తేదీన పెన్షన్లు అందించాలని, క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పాత పద్ధతిలో అమలు చేయాలని, బకాయిలు చెల్లించాలని, పెన్షనర్ల సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లను వినతిపత్రంలో పొందిపరిచినట్టు చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

లద్దాఖ్ ప్రాంతానికి రాష్ట్రహోదా కల్పించడం, దానిని రాజ్యాంగంలోని ఆరవషెడ్యూల్‌లో చేర్చడం ఇత్యాది డిమాండ్లతో ఇరవై ఒక్కరోజుల నిరాహారదీక్షకు దిగిన ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ మంగళవారం తన దీక్ష ముగించారు. మార్చి 6నుంచి అత్యంత కఠినమైన వాతావరణంలో కొనసాగిన ఆయన దీక్షకు దేశవ్యాప్తంగా మద్దతు లభించింది. దీక్షవిరమణ రోజున సినీనటుడు ప్రకాష్ రాజ్ తన పుట్టినరోజును దీక్షాస్థలిలోనే జరుపుకొని లద్దాఖ్ ప్రజల ఉద్యమానికి తన సంఘీభావం ప్రకటించారు. తాను దీక్షవిరమించినప్పటికీ లద్దాఖ్ ప్రజల హక్కుల కోసం సాగుతున్న ఈ పోరాటం ఆగదని ప్రకటించిన సోనమ్, ఒక వీడియోలో ప్రధాని, హోంమంత్రిని ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. మైనస్ పదిడిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో తనతోపాటు 350మంది దీక్షలో కూచుంటే పాలకులు ఏమాత్రం స్పందించపోవడంమీద ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మోదీ, అమిత్‌షాలు రాజకీయనాయకుల్లాగా కాక, రాజనీతిజ్ఞుల్లాగా వ్యవహరించాలని తామంతా కోరుకుంటున్నామని, అందుకు వారిద్దరూ కాస్తంత ఔన్నత్యాన్ని, దూరదృష్టిని ప్రదర్శించాలని వ్యాఖ్యానించాడు. ఆయన దీక్ష ముగిసినప్పటికీ, ఇప్పుడు లద్దాఖ్‌లోని మహిళాసంఘాలు అవే డిమాండ్లతో నిరాహారదీక్ష ఆరంభించాయి.

లద్దాఖ్ ప్రజల డిమాండ్ల మీద నెలల్రకితమే ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించి, ఉద్యమకారులతోనూ, ప్రతినిధులతోనూ పలుమార్లు చర్చోపచర్చలు సాగించింది కేంద్రప్రభుత్వం. మార్చి 4వతేదీన తనను కలిసిన లద్దాఖ్ నాయకులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కఠినంగా మాట్లాడుతూ వారి డిమాండ్లకు ఏమాత్రం తలొగ్గేది లేదని తేల్చేయడంతో సోనమ్ వాంగ్‌చుక్ ఈ దీక్షకు పూనుకున్నట్టు వార్తలు వచ్చాయి. పర్యావరణ ఉద్యమకారుడు, సృజనాత్మక విద్యావేత్త, ఇంజనీర్ అయిన సోనమ్ జీవితం ఆధారంగానే హిందీచిత్రం 'త్రీ ఇడియట్స్' నిర్మితమైన విషయం తెలిసిందే. లద్దాఖ్ పర్యావరణం, గిరిజన సంస్కృతి పరిరక్షణల కోసం ఈ రామన్‌మెగసెసే అవార్డు గ్రహీత పడుతున్న ఆవేదనను కానీ,

లద్దాఖ్ బతుకుపోరు


భూమి, ఉపాధి ఇత్యాది విషయాల్లో స్థానికుల భయాందోళనలను కానీ పాలకులు లెక్కచేయడం లేదు.

జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేసి, ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా కుదించిన ఏడాదిలోనే లద్దాఖ్‌వాసులకు తమకు జరిగిన, జరగబోతున్న అన్యాయం అర్థమైంది. లద్దాఖ్ ప్రధానంగా బౌద్ధమతాన్ని ఆచరించే వివిధ ఆదివాసీ తెగల ప్రాంతం. రాష్ట్రంగా లేకపోవడం, ప్రత్యేకరక్షణలు తొలగిపోవడంతో భూమిపై వస్తున్న సంప్రదాయహక్కులకు హామీలేకుండా పోయింది. డెబ్బయ్యేళ్ళలో ఎన్నడూ లేనంత అభద్రతలోకి వారు జారిపోయారు. తమ సర్వహక్కులను, రక్షణలను ఆర్టికల్ 370 మింగేసిన నేపథ్యంలో, వాటిని తిరిగి సాధించడానికి పోరాటం తప్పదని వారు గ్రహించారు. వివిధ ప్రజాసంఘాలతో కూడిన లేహ్ అపెక్స్ బాడీ నాలుగేళ్ళుగా లద్దాఖ్‌ను ఆరోషెడ్యూల్ కింద చేర్చాలని పోరాటం చేస్తున్నది. లద్దాఖ్‌తో బలవంతంగా కలిపిన కార్గిల్ ప్రాంతవాసులు తమను తిరిగి కశ్మీర్‌తో కలపమని మరోపక్క ఉద్యమిస్తున్నారు. లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, రాజ్యాంగంలోని ఆరోషెడ్యూల్‌లో చేర్చడం ద్వారా ఆదివాసీ తెగల స్థానిక స్వయంపాలనకు అవకాశం, స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను రిజర్వుచేస్తూ ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు ఇత్యాదివి వారి డిమాండ్లలో ప్రధానమైనవి.

లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాన్ని ఆరోషెడ్యూల్‌లో చేర్చడం స్థానిక ప్రజల ప్రయోజనాల పరిరక్షణరీత్యా అవశ్యకమంటూ షెడ్యూల్ తెగల జాతీయ కమిషన్ నాలుగేళ్ళక్రితం కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేసిందని అంటారు. అయితే, కేంద్రప్రభుత్వం స్థానిక ప్రజల ఉద్యమాలకు స్పందిస్తున్నట్టు కనిపిస్తూనే వారి డిమాండ్లకు ఏమాత్రం లొంగదల్చుకోలేదని అర్థమవుతోంది. తమ వనరులు ఇతరులు దోచుకుంటారన్న లద్దాఖ్‌వాసుల భయం కూడా క్రమంగా నిజమవుతోంది. బయటివ్యక్తులు వారి భూములను కొనుగోలు చేయడం, అభివృద్ధి పేరిట సాగే విధ్వంసం కూడా ఆరంభమైంది. అస్మదీయ కార్పొరేట్ సంస్థలకు వేలాది ఎకరాల భూమిని అప్పగించడం మొదలైంది. ఆరవషెడ్యూల్‌లో చేర్చినపక్షంలో ఈ భారీ భూ సంతర్పణలు, వనరుల అప్పగింత సులభం కాదు కనుక, కేంద్రప్రభుత్వం ఆ ఊసు ఎత్తడం లేదు. చైనా, పాకిస్థాన్‌లతో సరిహద్దులు పంచుకుంటున్న లద్దాఖ్ వ్యూహాత్మకంగా, భద్రతాపరంగా ఎంతో కీలకమైనది. కశ్మీర్ ఉగ్రవాదం పతాకస్థాయిలో ఉన్నప్పుడు కూడా అది లద్దాఖ్‌ను తాకలేదు. కార్గిల్ యుద్ధ సమయంలో లద్దాఖ్‌వాసులు భారతసైన్యానికి అందించిన సేవలు విలువకట్టలేనివి. గాల్వాన్ ఘటన, చైనా వరుస చొరబాట్లు లద్దాఖ్ విషయంలో మనం అతి జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. గడ్డకట్టే చలిలో వేలాదిమంది చేస్తున్న ఆ ఉద్యమాన్ని నిర్లక్ష్యం చేయడం మంచిదికాదు.

ఆ లక్ష్యాన్ని బీజేపీ సాధించగలదా?

'జూన్ 4, 400 సీట్లు' — లక్ష్యం పెట్టుకున్న భారతీయ జనతా పార్టీ తన ప్రచార వెల్లువలో తానే కొట్టుకుపోతున్నట్లు కనిపిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ప్రచారం ప్రారంభించిన తర్వాత దాన్ని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేదు. 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' (ఈసారి 400 దాటుతాం) అన్న నినాద హోరులో బీజేపీ కార్యకర్తలు మోదీ సునామీ దేశాన్ని ముంచేస్తోందా అన్న స్థాయిలో ప్రచారం సాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాల్లో జరిగిన సభల్లో మోదీ స్వయంగా ఎన్డీఏ 400 సీట్లకు పైగా సాధిస్తుందని ప్రకటించారు. ఇక, బీజేపీ ఒక్కటే 370 సీట్లు గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. బీజేపీ పోటీ చేస్తున్న 450 సీట్లలో 370 సీట్లు అంటే 82 శాతం సీట్లు గెలుచుకోవాలన్న మాట. ఇప్పటివరకూ బీజేపీ పోటీ చేసిన సీట్లలో అత్యధికంగా 70 శాతం సీట్లు 2019లోనే సాధించింది. అప్పుడు 436 సీట్లకు పోటీ చేసి 303 గెలుచుకుంది. ఎన్డీఏ 400 సీట్లు దాటడం మాట అటుంచితే, ఇప్పుడు బీజేపీ 82 శాతం సీట్లు ఎలా సాధించగలుగుతుంది అన్నది మిలియన్ డాలర్ ప్రశ్న. ఈ ప్రశ్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా వేసుకుని ఉంటారు. మెజారిటీ రాష్ట్రాల్లో బీజేపీకి అత్యధిక సీట్లు నాడు లభించాయి. ఈసారి అంతకంటే ఎక్కువ లభిస్తే కాని బీజేపీ తన లక్ష్యాన్ని చేరుకోలేదు.



సాధారణంగా రాజకీయ నాయకులు అరచేతిలో స్వర్గం చూపించేందుకు అందమైన అబద్ధాలు చెబుతూ ఉంటారు. మోదీ ప్రకటన కార్యకర్తల్లోనూ, ప్రజల్లోనూ ఒక ఊపు తెచ్చేందుకో, ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసి మీడియాను కూడా భ్రమల్లో ముంచేందుకో చేసిందని చెప్పడానికి వీల్లేదు. అన్ని వ్యవస్థల్నీ అదుపులో పెట్టుకుని, ప్రతి చర్యా పకడ్బందీగా తీసుకుంటూ, ప్రతిపక్షాల్ని అణిచివేయడం ద్వారా తాననుకున్నది సాధించగలననే ధీమా ఆయనలో కనిపిస్తున్నది.

మోదీ ప్రతి ఒక్క లెక్కా ప్రణాళికాబద్ధంగా వేసుకున్నదే. ఫిబ్రవరి 18న ఆయన బీజేపీ జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ప్రసంగిస్తూ వచ్చే 100 రోజులు పార్టీకి కీలకమని, క్షణం కూడా వృధా చేయకుండా మళ్లీ అధికారంలోకి బ్రహ్మాండమైన మెజారిటీతో తిరిగి రావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అంటే వంద రోజులలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి కాదని ఫిబ్రవరి 18నే మోదీకి తెలుసని అర్థం. నిజానికి గత మూడు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మే రెండో వారంలోనో, మూడో వారంలోనో వచ్చాయి. కాని ఈ సారి ఉద్దేశపూర్వకంగా జూన్ మొదటి వారంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే విధంగా ఎన్నికల కమిషన్ షెడ్యూలు ప్రకటించింది. మోదీ అధికారిక పర్యటనలన్నీ ముగించుకున్న తర్వాత ఆయన వ్యూహరచనకు అనుగుణంగా, ఇక పొడిగించడం అసాధ్యమని అనుకున్నప్పుడే ఎన్నికల ప్రక్రియను ప్రకటించారనుకోవచ్చు.

ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం వల్ల ప్రయోజనం ఉంటుందా అన్న అనుమానాలు చాలామందికి ఉన్నాయి. తెలంగాణలో మోదీ పర్యటించిన రోజే కేసీఆర్ కుమార్తె కవితను ఢిల్లీ మద్యం కేసులో అరెస్టు చేశారు. సరిగ్గా వారం రోజులకు ప్రధాని భూటాన్‌లో ఉన్నప్పుడు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. బహుశా కవిత అరెస్టు మూలంగా పెద్దగా సానుభూతి వచ్చే అవకాశాలు లేవని, కేసీఆర్ ఆత్మరక్షణలో పడినందువల్ల బీజేపీ బలోపేతం అవుతుందని ఆయనకు సమాచారం వచ్చే ఉంటుంది. ఇక కేజ్రీవాల్ అరెస్టు వల్ల వచ్చే రాజకీయ పర్యవసానాలను ఎదుర్కోవడానికి కూడా ముందే సిద్ధమై ఉంటారు. 2014లో ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 10న జరిగితే, 2019లో మే 12న జరిగాయి. ఈసారి ఢిల్లీ ఎన్నికలను ఆశ్చర్యకరంగా ఆరవ దశలో మే 25న నిర్ణయించారు. అంటే కేజ్రీవాల్ అరెస్టు జరిగిన రెండు నెలలకు ఢిల్లీలో ఎన్నికలు జరుగుతున్నాయన్నమాట. ఢిల్లీలో పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి ఈ మాత్రం సమయం చాలునని నరేంద్రమోదీ అనుకుని ఉంటారు. ఢిల్లీలో గత ఎన్నికల్లో ఏడుకు ఏడుసీట్లు గెలిచిన బీజేపీ ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ చేతులు కలపడంతో కలవరానికి గురయినట్లుంది. కేజ్రీవాల్‌ను అరెస్టుచేయడం ద్వారా ఆప్‌ను చితక్కొట్టడానికి, కనీసం ఇతర రాష్ట్రాల్లో ఆప్ ప్రభావాన్ని అడ్డుకోవడానికి వ్యూహరచన జరిగి ఉంటుంది. ఢిల్లీ ఎన్నికల షెడ్యూలే కాదు, ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల తేదీలు కూడా బీజేపీ వ్యూహరచనకు అనుగుణంగా ఉన్నాయి. బీజేపీ పెద్దగా ప్రభావం చూపలేని తమిళనాడు, కేరళ ఎన్నికలు మొదటి రెండు దశల్లోనే పూర్తి కాగా బీజేపీ పోరాడగలిగే రాష్ట్రాల్లో ఎన్నికలను వివిధ దశల్లో చివరి వరకూ నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో భౌగోళిక సామీప్యతను అంతగా పట్టించుకోలేదు.

దక్షిణాది రాష్ట్రాల్లో ఆశించినన్ని ఫలితాలు వస్తాయా అన్న చర్చ బీజేపీలో జరుగుతోంది. కాంగ్రెస్‌కూ, బీజేపీకీ మధ్య ముఖాముఖి పోటీ జరిగితే బీజేపీదే పై చేయి అవుతుందని మోదీ భావన. ఇది ఇతర రాష్ట్రాలలో వర్తిస్తుందేమో కాని తెలంగాణలో మాత్రం సాధ్యం కాదు. తెలంగాణలో ఇటీవలే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దూకుడును తట్టుకొని బీజేపీ ప్రభంజనం వీచేలా చూడడం అంత సులువు కాదు. మోదీ ఎంత బలవంతుడైనా స్థానిక నేతలు బలంగా లేకపోతే విజయం సాధించడం కష్టం. అందుకే చివరి నిమిషంలో ఇతర పార్టీ నేతల్ని, వ్యాపారస్తుల్ని లాగి వారికి అప్పటికప్పుడే సీట్లు ఇస్తున్నారు. ఆ నేతల విశ్వసనీయత, బీజేపీ సిద్ధాంతాల పట్ల వారి చిత్తశుద్ధి దేవుడెరుగు. కాని వారు బీజేపీని ఆదుకుంటారన్న ఆశ మోదీలో బాగా ఉన్నట్లు కనపడుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఆరు సీట్లకు పోటీ చేస్తున్న బీజేపీ తెలుగుదేశం గెలిపిస్తే కాని స్వంతంగా ఒక్కసీటు కూడా గెలిచే అవకాశాలు లేవు. కేరళలో కేంద్ర మంత్రులతో పోటీ చేయించినా ఖాతా తెరుస్తుందా అన్నది అనుమానమే. కర్ణాటకలో కూడా బీజేపీ గత ఎన్నికల్లో 28కి 26 సీట్లు గెలిచినా ఈసారి అన్నిసీట్లు గెలవడం సాధ్యపడదని బీజేపీకి సమాచారం వచ్చినట్లుంది. అందువల్లే అక్కడ యడ్యూరప్పకు మళ్లీ ప్రాధాన్యత పెంచారు. అక్కడ బీజేపీలో అంతర్గత తగాదాలు, జేడీ(ఎస్) సీట్ల పంపిణీ వల్ల ఏర్పడిన అసంతృప్తి గురించి ఢిల్లీకి సమాచారం అందుతూనే ఉన్నది. ఈ క్రమంలో మైనింగ్ వ్యాపారి గాలి జనార్దన రెడ్డి పార్టీని కూడా బీజేపీలో విలీనం చేసుకోవాల్సి వచ్చింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కల్యాణ కర్ణాటక ప్రాంతంలో గాలి జనార్దన్ రెడ్డి స్థాపించిన 'కల్యాణ రాజ్య ప్రగతి పక్ష' పార్టీ వల్ల బీజేపీకి వచ్చిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయనను బీజేపీలో చేర్చుకోవల్సివచ్చిందని అంటున్నారు. గాలి అప్పుడు గంగావతి నుంచి విజయం సాధించారు. 'నీ రాజకీయ భవిష్యత్ బీజేపీలోనే ప్రారంభమైంది. నీవు వెంటనే పార్టీలో చేరిపో' అని హోంమంత్రి అమిత్ షా చెప్పడంతో తాను తన పార్టీని బీజేపీలో విలీనం చేశానని గాలి జనార్దన్ రెడ్డి చెప్పారు. గాలి జనార్దన్ రెడ్డి అక్రమ మైనింగ్ గురించి, చేసిన దారుణాల గురించి 2011లో అప్పటి లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే ఇచ్చిన నివేదికతో గాలి పతనం ప్రారంభమైంది. బళ్లారి గనుల నుంచి చైనాకు టన్నుకు రూ. 6500 నుంచి రూ. 7000 చొప్పున ధరకు ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేశారని, రాష్ట్రానికి రూ. 27 మాత్రమే రాయల్టీగా చెల్లించారని హెగ్డే వెల్లడించారు. గాలి జరిపిన 35 వేల కోట్ల అక్రమ మైనింగ్ గురించి, ఆయనపై సీబీఐ చేసిన ఆరోపణల గురించి, సాక్షులకు బెదిరింపులు, న్యాయమూర్తులకు ప్రలోభాల గురించి పత్రికల్లో నాడు వందలాది పేజీల కథనాలు వస్తే మాత్రం ఏమి జరిగింది? ఆయనపై విచారణ ముగించమని సుప్రీంకోర్టు పలుసార్లు ఆదేశించినప్పటికీ ఫలితం లేకపోయింది. 'ఇది న్యాయవ్యవస్థకే అవమానం' అని కూడా సుప్రీం ఒక సందర్భంలో పేర్కొంది. ఎవర్ని ఎప్పుడు చేర్చుకోవాలో, వారి వల్ల ఎలా ప్రయోజనం పొందాలో బీజేపీకి తెలుసు కనుకే ఇప్పుడు కర్ణాటక ఎన్నికల సమయంలో గాలిని అక్కున చేర్చుకున్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం తర్వాత తన నియోజకవర్గంలో హనుమంతుడి జన్మస్థలమైన అంజనాద్రి పర్వతాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తానని గాలి జనార్దన రెడ్డి ప్రకటించారు. ఆయనపై కేసులు కూడా ఇక గాలిలో కలిసిపోతాయనడంలో అతిశయోక్తి లేదు. కాని గాలి లాంటి శక్తుల తోడ్పాటు మూలంగా బీజేపీ మళ్లీ కర్ణాటకలో 26 సీట్లు గెలుచుకుంటుందా అన్నది చర్చనీయాంశం.

కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడం, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను, పార్టీ నేతలను అరెస్టు చేయడం, ప్రత్యర్థులపై ఏజెన్సీలను ప్రయోగించడం, గాలి జనార్దన్ రెడ్డి, నవీన్ జిందాల్ వంటి నేతలను ఆగమేఘాలపై చేర్చుకోవడం ద్వారా తమ పార్టీ బలం పెంచుకోగలమని బీజేపీ నేతలు అనుకుంటున్నారు. 'మాకు రైలు టిక్కెట్లు కొనడానికి కూడా డబ్బులు లేవు.' అని రాహుల్ గాంధీ అంటున్నప్పుడు ప్రతిపక్ష పార్టీల్లో నిస్పృహ కొట్టొచ్చినట్లు కనపడుతోంది. విజయం సాధించడమే తమ ఏకైక లక్ష్యమని రాజకీయ పార్టీలు భావిస్తున్నప్పుడు విలువల గురించి చర్చించి పెద్దగా ప్రయోజనం లేదు.

గాలి జనార్దన రెడ్డి జరిపిన 35 వేల కోట్ల అక్రమ మైనింగ్ గురించి, సీబీఐ ఆరోపణల గురించి పత్రికల్లో నాడు వందలాది పేజీల కథనాలు ఎన్ని వస్తే మాత్రం ఏమి జరిగింది? ఆయనపై విచారణ ముగించమని సుప్రీంకోర్టు పలుసార్లు ఆదేశించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఎవరివల్ల ఎప్పుడు ఎలా ప్రయోజనం పొందాలో బీజేపీకి బాగా తెలుసు కనుకనే ఈ ఎన్నికల సమయంలో గాలిని అక్కున చేర్చుకున్నారు.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ప్రపంచీకరణకు మార్క్స్ వ్యతిరేకమా?

ప్రపంచీకరణకు పునాది వేసిన స్వేచ్ఛ వాణిజ్య సిద్ధాంతం 18వ శతాబ్దంలో వెలుగులోకి వచ్చింది. దీన్ని ఫ్రాన్సుకు చెందిన 'ప్రకృతి ధర్మవాదులు', తర్వాత సాంప్రదాయ ఆర్థికవేత్తలైన ఆడమ్ స్మిత్, జె.బి.సే అభివృద్ధి చేశారు. ఈ సిద్ధాంతం 'ఆర్థిక వ్యవహారాలలో ప్రభుత్వ జోక్యం అవసరం లేదని, దాన్ని ప్రైవేట్ వ్యక్తులకు వదిలివేయాలని చెబుతుంది. కానీ అందుకు భిన్నంగా నాటి స్వేచ్ఛ వాణిజ్య పోటీ మార్కెట్ నుంచి గుత్త పెట్టుబడిగా తరువాత నేటి కార్పొరేటీకరణ వరకు ప్రభుత్వ మద్దతుతోనే పెట్టుబడిదారీ వ్యవస్థగా అభివృద్ధి చెందుతూ, విస్తరిస్తూ ఉన్నది. కాబట్టే మార్క్స్ 'ప్రభుత్వం అంటే పాలకవర్గాల వ్యవహారాలను సక్కబెట్టే యంత్రం' అని అంటాడు.

ఇక మన దేశానికి సంబంధించినంత వరకు మౌలిక పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడి పెట్టే సామర్థ్యం ప్రైవేట్ రంగానికి లేకపోవడం వల్ల ప్రభుత్వ సహకారంతోనే వాటిని ఏర్పాటు చేశారు. ప్రైవేట్ వ్యక్తులకు ఆ శక్తి రాగానే నూతన ఆర్థిక సంస్కరణల పేరుతో ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరించే విధానానికి ఈ సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వల్ల ప్రజా సంక్షేమంపై కోతలు విధించబడతాయని మొత్తంగా మన దేశ సార్వభౌమత్వమే ప్రమాదములో పడుతుందనీ వామపక్షాలు విస్తృతంగా సాహిత్యాన్ని తెచ్చారు. తెలుగు సాహిత్యకారులు కూడా 'పడమటి గాలి', 'గ్లోబలి' తదితర పుస్తకాలను తెచ్చారు. ఇక అత్యంత ప్రజాదరణ పొందిన 'పల్లె కన్నీరు పెడుతుందో' అనే గోరటి వెంకన్న పాట తెలిసిందే.

వామపక్షాలు చెప్పినట్లే అన్ని రంగాలలో ప్రైవేటీకరణను చూస్తున్నాం. అదే సమయంలో రాజకీయ పార్టీలు పోటీలు పడి సంక్షేమ పథకాలను ప్రకటించడం కూడా చూస్తున్నాం. మరీ కమ్యూనిస్టులు చెబుతున్న స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా వ్యాప్తి చెందుతున్న ప్రపంచీకరణను వ్యతిరేకించాలా? ఈ విషయంలో శాస్త్రీయ కమ్యూనిజం సిద్ధాంత మూలకర్తలైన మార్క్స్, ఏంగెల్స్ అంచనా ఏమిటనే విషయాన్ని ఈ వ్యాసం పరిశీలించే ప్రయత్నం చేస్తున్నది.



వామపక్షాలు చెప్పినట్లే అన్ని రంగాలలో ప్రైవేటీకరణను చూస్తున్నాం. అదే సమయంలో రాజకీయ పార్టీలు పోటీలు పడి సంక్షేమ పథకాలను ప్రకటించడం కూడా చూస్తున్నాం. మరి కమ్యూనిస్టులు చెబుతున్న స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా వ్యాప్తి చెందుతున్న ప్రపంచీకరణను వ్యతిరేకించాలా? ఈ విషయంలో శాస్త్రీయ కమ్యూనిజం సిద్ధాంత మూలకర్తలైన మార్క్స్, ఏంగేల్స్ అంచనా ఏమిటి?

1848 సెప్టెంబర్ 15, 16, 17 తేదీల్లో స్వేచ్ఛా వాణిజ్యంపై జరిగిన అంతర్జాతీయ వాణిజ్య సదస్సు సందర్భంగా మార్క్స్ ఏంగెల్స్ 'వాస్తవములో కార్మికులకు ఈ స్వేచ్ఛ వాణిజ్యం వరగబెట్టేది ఏం ఉండదు. అలాగని మేము స్వేచ్ఛ వాణిజ్యానికి వ్యతిరేకమా? కాదు. అనుకూలం. ఎందుకంటే ఈ విధానాల వల్ల ఉనికిలోకి వచ్చే వైరుధ్యాలు విశాల భూభాగంలోకి విస్తరిస్తాయి. ఇందువలన బహుముఖ వైరుధ్యాల నుంచి ఒకే ఒక్క గొప్ప వైరుధ్యం తలెత్తుతుంది. ఈ వైరుధ్యంతో ఆ సమూహాలు ముఖాముఖి తలపడతాయి. ఆ రకంగా కార్మిక వర్గానికి విముక్తిని కలిగిస్తుంది.' ఇదీ వారి అంచనా. అంటే పెట్టుబడిదారీ పూర్వ అస్తిత్వాలైన జాతి, మతం, ప్రాంతం, దేశం తదితర బహుముఖ వైరుధ్యాలు రద్దు కాబడి, కార్మికులు — పెట్టుబడిదారులనే గొప్ప వైరుధ్యంగా ఏర్పడి కార్మిక వర్గ విముక్తి జరుగుతుందని వారు చెప్పారు.

ఇంకా, 'కమ్యూనిస్టు మానిఫెస్టో'లో, 'పెట్టుబడిదారీ వర్గం ప్రపంచమంతటినీ తన మార్కెట్టుగా చేసుకోవడం ద్వారా ప్రతి దేశంలోనూ సరుకుల ఉత్పత్తికి, సరుకుల వినియోగానికి జాతి, మతాతీత స్వభావాన్ని కల్పించింది. పరిశ్రమల జాతీయ పునాదిని కూడా తొలగించి వేసింది. ఇందువలన స్థానిక పరిశ్రమలన్నీ నాశనమైనాయి. ఇంకా ఏమైనా మిగిలి ఉంటే అవి రోజురోజుకు నాశనం అవుతూ ఉన్నాయి. ఈ పరిణామం సకల నాగరిక జాతులకు జీవన్మరణ సమస్యగా ఉంది. స్థానిక, జాతీయ ఒంటరితనాలు, ఇంకా స్వయంసమృద్ధి స్థితి పోయి నలువైపులా ఇచ్చిపుచ్చుకోవడమూ వివిధ జాతులు ఒకదానిపై ఒకటి ఆధారపడటమూ జరుగుతున్నది. అన్ని దేశాల మేధోపరమైన ఆవిష్కరణలు యావత్తు ప్రపంచ సమిష్టి ఆస్తి అవుతున్నాయి. జాతీయ, ప్రాంతీయ సంకుచితత్వం రాను రాను తగ్గిపోతాయి. ప్రాంతీయ సాహిత్యాల నుంచి విశ్వసాహిత్యం ఉద్భవిస్తున్నది'. ఈ రకంగా పెట్టుబడిదారీ విస్తరణ వల్ల జరిగే మార్పుల పట్ల ఆశావాద దృక్పథం వారిలో కనబడుతుంది. ఒక మాటలో చెప్పాలంటే ప్రపంచ కార్మికులు ఏకం కావటానికి కావలసిన భౌతిక పరిస్థితులను ఇది సృష్టిస్తున్నది.

అయితే సోషలిస్టు విప్లవాలకు అనువైన వాతావరణం నెలకొన్నదని అనుకోవచ్చా? వారు అవుననే అంటారు. అదే కమ్యూనిస్టు మానిఫెస్టోలో, 'ఐరోపాను కమ్యూనిజమనే భూతం ఆవరించి'నట్లు చెప్పుకొచ్చారు. అంటే అక్కడ సోషలిస్టు విప్లవానికి అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయన్న అంచనాకు వచ్చారు. వారు బ్రతికుండగానే ప్యారిస్ కమ్యూన్ వైఫల్యాన్ని కూడా చూశారు. కానీ సోవియట్ యూనియన్‌లో లెనిన్ నాయకత్వంలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. అయితే అన్ని దేశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థలు ఏర్పడుతున్నప్పుడు ఒక దేశంలో సోషలిస్టు విప్లవం తేవటం, దాన్ని నిలబెట్టుకోవటం అసాధ్యమనే చర్చ కూడా నడిచింది. ఆ తరువాత 1929లో కోమింటర్న్ ఐరోపా దేశాలలో పెట్టుబడిదారీ విధానం పతనం కాబోతున్నదని అంచనా వేసింది. అది జరగలేదు. కానీ 1950లో చైనాలో రైతాంగ విప్లవం విజయవంతమైంది. ఆ స్ఫూర్తితో నక్సలైట్లు భారతదేశంలో 1970 నాటికే విప్లవానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని అంచనా వేశారు. వారి అంచనాలు అటుంచితే, యూరప్‌లో సోషలిస్టు విప్లవాలు రాకపోగా సోవియట్ యూనియన్ కూలిపోయింది, చైనా మార్కెట్ సోషలిజంలో పయనిస్తున్నది.

మొత్తంగా మన అనుభవాలు ఏం చెబుతున్నాయి? అంటే, ప్రపంచమంతటా పెట్టుబడిదారీ ఉత్పత్తి శక్తులు గుణాత్మక స్థాయికి చేరకుండా సోషలిస్టు విప్లవాలు సంభవిస్తాయా? అనే సందేహాలు, వాదనలు ఉన్నాయి. కాబట్టి కమ్యూనిస్టు మానిఫెస్టోలో వివరించిన విధంగా భౌతిక పరిస్థితులు పరిపక్వం చెందకుండా కూడా సోషలిస్టు విప్లవాలు సంభవించవేమో? దీనికి కూడా మార్క్స్ నుండే సమాధానం పొందవచ్చు. 'మనుషులు చరిత్ర సృష్టిస్తారు. అయితే దాన్ని తాము కోరుకున్న ఇష్టానుసారం సృష్టించలేరు. అలాకాకుండా గతం నుంచి సంక్రమించిన వాటి ద్వారా తారసపడే పరిస్థితులను మాత్రమే మార్చగలరు'. దీనికి భిన్నంగా ఉన్న అంచనాలు, పోరాట నిర్మాణాలు జరిగితే అవి వైఫల్యాలను మిగులుస్తాయనీ ప్రపంచ అనుభవాలు మన ముందు ఉంచాయి. ఇటువంటప్పుడు కార్మిక వర్గ కర్తవ్యాలు, పోరాటాలు ఎలా ఉండాలి? అన్న ప్రశ్న ఉదయిస్తున్నది.

■ డాక్టర్ పట్టా వెంకటేశ్వర్లు

సేవాశీలి, సౌజన్యమూర్తి

ఆయనో గతానుభూతుల జ్ఞాన శిఖరం. పదవులు ఆశించని పనితనం ఆయన సొంతం. నిరంతర అక్షరాన్వేషి. వ్యాపార, సామాజిక సేవా వర్గాల పాలిట పెన్నిధి. ఋజువర్తనకు నిలువెత్తు సాక్ష్యం. నిత్యం సామాజికసేవలో తరించే సామాజిక సేవాపరాయణుడు. స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది. ఆయనే కోన వెంకటచలమయ్య. మార్చి 23వ తేదీన ఆయన అస్తమయంతో నెల్లూరు ఒక్కసారిగా వెలితిపడ్డది. ప్రజలు, ప్రభుత్వాలు కీర్తించి సత్కరించిన తొంభైఏళ్ళ కురువృద్ధుడు, నెల్లూరు ప్రముఖుడు చలమయ్య అలసి సొలసి ఇక సెలవంటూ వెళ్ళిపోయారు.

పొట్టి శ్రీరాములు అనుయాయిగా తోటి హరిజన దేవాలయ ప్రవేశంలో పాల్గొన్న సంస్కరణాభిలాషి చలమయ్య. పొట్టి శ్రీరాములుతో సాన్నిహిత్యంతో ఆయన భావపరంపరలోనే జీవించారు. పొట్టి శ్రీరాములు ప్రత్యేకాంధ్ర ఉద్యమదీక్ష కోసం మద్రాసుకు వెళ్ళే సమయంలో సైతం చెంతనున్నారు.



నెల్లూరుకు పొట్టి శ్రీరాములు పేర నామకరణం కోసం జరిగిన పోరాటాల్లో చలమయ్య పాల్గొన్నారు. ఆ పోరాటం సఫలమయ్యే వరకూ ఎన్నో సభలు, సమావేశాలు, ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపారు. పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలనేది ఆయన చిరకాల కోరిక. అందుకోసం ప్రతి వేదికలోను ఆ ఆకాంక్షను వెలిబుచ్చేవారు. కేంద్ర ప్రభుత్వానికి ఎన్నో విజ్ఞాపనలు పంపారు.

తెలుగుపట్ల చలమయ్యకు అంతులేని అభిమానం, అవ్యాజానురాగం. ఎక్కడ తెలుగు మహాసభలు జరిగినా పనిగట్టుకొని వెళ్ళే వ్యక్తిత్వం, మూర్తిమత్వం చలమయ్యది. తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు, హైదరాబాదులో జరిగిన సభలకు హాజరయ్యారు. ఆ సభల్లో ఎన్నో పుస్తకాలు కొనుగోలు చేశారు కూడా! చలమయ్యకు సాహిత్యం పట్ల మిక్కిలి ఆరాధన. ఇంటిని ఒక గ్రంథాలయంగా తీర్చిదిద్దారు. నడిచే నిఘంటువుగా ప్రసిద్ధికెక్కారు. స్వాతంత్ర్య సమరం నాటి గాథలు, పొట్టి శ్రీరాములు ఆమరణదీక్ష నాటి ఉద్దీపనలు నిర్విరామంగా తారీఖులు, దస్తావేజులతో చెప్పగలిగేవారు.

మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యతో చలమయ్యకు ఎంతో సాన్నిహిత్యం, స్నేహం ఉండేది. ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా రోశయ్య ఎప్పుడు నెల్లూరు వచ్చినా చలమయ్య ఇంటి సందర్శన ఒక భాగమయ్యేది. రోశయ్య రాకతో కుచేలుడింటికి శ్రీకృష్ణుడు వచ్చాడని మురిసిపోయే చలమయ్యను రోశయ్య మరణం చాలా కృంగదీసింది.

రొటేరియన్‌గా రోటరీ క్లబ్ సభ్యునిగా వివిధ హోదాలలో సామాజిక సేవాంశాల్లో పాల్గొన్నారు. ఆ పాత్రల్లో లీనమై తనదైన ముద్రవేశారు. నెల్లూరులో రోటరీ క్లబ్ నిర్మించిన స్మశాన వాటికకు విరాళమిచ్చి దాత కూడా అనిపించుకొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్యుల అన్నదాన సత్రాలకు, వాసవీ మాత దేవాలయాలకు కొన్నింటికి కార్యదర్శిగాను, మరికొన్నింటికి కార్యవర్గ సభ్యులుగాను, లేదంటే సలహాదారులుగానైనా నియమించి ఆయన పట్ల తమ గౌరవాన్ని చాటుకొన్నాయి ఆర్యవైశ్య సంఘాలు, మహాసభలు సైతం. వరల్డ్ ఆర్యవైశ్య మహాసభలో ఆయనది కీలకపాత్ర. ఎంతోమందిని సభ్యులుగా చేర్పించి ఆ సంస్థ అభివృద్ధికి కృషి సల్పిన వ్యక్తిత్వం ఆయనది. వయసురీత్యా, అనుభవం రీత్యా పెద్దరికం ఉన్నా, అందరితో కలిసిపోయే స్నేహశీలి, సౌజన్యమూర్తి చలమయ్య. ఆయనో వటవృక్షం. ఆ నీడన ఎందరో స్ఫూర్తిని పొందారు. పనిలో తరించే తపన, తపస్సు చలమయ్యది. తాను సభ్యుడిగానున్న హార్డ్‌వేర్ మర్చెంట్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి 'రాళ్ళెత్తిన' చలమయ్య మరణం తీరనిలోటు. ఆ మహోన్నతుడికి అక్షర నివాళి.

– చిన్ని నారాయణరావు

ఈ దానవ పాలన అంతానికి సహకరిద్దాం కామ్రేడ్స్!

ఒక వ్యక్తి ఊళ్లో ఉన్న కొండని మోస్తానని చెపితే దాన్ని నమ్మిన ఊరి జనమంతా అతనితో కల్సి ఊరి బయట కొండ దగ్గరకు వెళ్లారు. ఎంత సమయం గడుస్తున్నా అతనట్లా నిలబడి ఉంటే జనం అడిగారట. దాంతో అతను సరే అలాగే మోస్తాను, మీరంతా కల్సి కొండను ఎత్తి నా తలపై పెట్టమన్నాడట. సరిగ్గా అలాంటి మనిషే మన ఆంధ్రప్రదేశ్‌ని పాలిస్తున్న జగన్మోహన్‌రెడ్డి.

మొత్తం పార్లమెంటు స్థానాల్లో గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని పోయిన ఎన్నికల ముందు మైకు విరగగొట్టిన జగన్మోహన్‌రెడ్డిని నమ్మి ప్రజలు 23 లోక్‌సభ సీట్లలో గెలిపించారు. తర్వాత వారే నివ్వెరపోయే విధంగా 'బీజేపీకి మ్యాజిక్ ఫిగర్‌కి 20 సీట్లు తగ్గి మన మద్దతుపై ఆధారపడితే అప్పుడు సాధించగలం కాని వారికే సరిపడా ఎంపీ సీట్లు వస్తే మనమేం చేయగలం' అన్నాడు. అతని నోటికి నరం లేదు, ఎవరేమనుకుంటారో అనే బిడియం లేదు. మాట తప్పటం మంచినీళ్ల ప్రాయం.

అతనిలా కపటం లేని మనుషులే గాని ఆచరణాత్మకమైన ఎత్తుగడలు లేని మంచివాళ్లు మన కామ్రేడ్స్. వ్యూహం — ఎత్తుగడలు అనేవి మన డాక్యుమెంటుకే పరిమితం. 1967 నుంచి అనుసరిస్తున్న ఐక్య సంఘటన ఎత్తుగడలు అప్పుడప్పుడూ మర్చిపోతుంటారు. సువిశాలమూ, భిన్నభిన్న రాజకీయ పరిస్థితులూ ఉన్న 29 రాష్ట్రాల సమాహారమైన దేశంలో రాష్ట్రానికీ రాష్ట్రానికీ మధ్య రాజకీయాల్లో తేడాలు వుంటాయనే ఉద్దేశంతోనే కదా కేరళలో మతతత్వ పార్టీ అని తెల్సినా ముస్లిం లీగుతో జత కట్టింది. దేశమంతా 'ఇండియా' కూటమిగా కాంగ్రెస్‌తో కల్సి ఊరేగుతున్నా కేరళలో దానికి ప్రత్యర్థిగా నిలబడింది.

కామ్రేడ్స్‌కు జగన్ అరాచకాలు ఎలా ఉన్నాయో సర్వమూ తెలుసు. ఆ దాష్టీకాల్ని సంపూర్ణంగా చవిచూశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఎన్నికల్లో అక్రమాలు ఏ స్థాయిలో వెల్లువెత్తాయో చూశారు. అలాంటప్పుడు బీజేపీనీ వైసీపీనీ రెంటినీ ఓడించమని పిలుపునివ్వటంతోపాటు, అది సాధ్యమయ్యే రీతిలో తెలుగుదేశం — జనసేన లాంటి బలమైన పార్టీలకు ఒక రూట్‌మ్యాప్ అందించాలి, అంతేతప్ప 'మీరు బీజేపీ బుట్టలో పడ్డారు, మోదీకి లొంగిపోయారు' అని శాపనార్థాలు పెట్టటం సరైనదేనా?

ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రత్యేక పరిస్థితిని బట్టేకదా 1985 ఎన్నికల్లో ఎన్టీఆర్‌తో — ఆయన ఒక పక్క బీజేపీని మరోపక్క మనల్ని పెట్టుకొని ఎన్నికలకు వెళ్తే — మనమూ కలిసి నడిచాం. మరి ఈనాడు అంతకంటే దారుణ స్థితిలో రాష్ట్రం ఉంటే చంద్రబాబుని ఎందుకు తప్పు పట్టటం. బీజేపీతో కలిస్తే చాలా ఓట్లు పోతాయని, వారి వలన వచ్చేది కేవలం ఒక శాతం ఓట్లేనని చంద్రబాబుకు తెలియదా? మరి ఎందుకు వారికి 6 లోక్‌సభ, 10 శాసనసభ స్థానాలు ఇవ్వటం. చంద్రబాబేమన్నా అమాయకుడా? ఒంటరిగా పోటీ చేసినా తెలుగుదేశం గెలుస్తుందనీ, బీజేపీ జైలుకు పంపుతామని భయపెట్టి బలవంతంగా పొత్తుపెట్టుకుందని సీపీఎం వాళ్ల ప్రకటన చేశారు. ఓట్లు ఉండటం కాదు కామ్రేడ్స్ అవి పోల్ చేసుకొనే పరిస్థితులు పోలింగ్ బూతుల వద్ద ఉండాలి కదా. ఆ పరిస్థితిలో ఎన్నికల కమీషన్ సహకారం కోసమే కదా చంద్రబాబు వెంపర్లాట. అది అర్థం చేసుకొనే పాటి రాజకీయ పరిణతి మనకు లేదా?

మన దినపత్రికల మొదటి పేజీల్లో వికసిత్ భారత్ ప్రకటనలను మోదీ బొమ్మలతో ముస్తాబు చేసి ఆయన విజయాలను శ్లాఘిస్తూ ప్రజలకు చేర్చటంలో తప్పు లేదు గాని చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం మోదీతో కలుస్తానంటే మాత్రం దిగజారుడా కామ్రేడ్స్?



మనకు పోయేదేమీ లేదు. ఒక జోగి మరొక జోగే కాదు కాంగ్రెసును కలుపుకుని ఎందరు జోగులు రాసుకున్నా రాలేది బూడిదే. కాని తెలుగుదేశం — జనసేనలకు అలా కాదు. వారిది జీవన్మరణ పోరాటం. జగన్ మరోసారి గెలవటమంటే రాష్ట్రం నాశనమవ్వటమే కాదు జనసేన — తెలుగుదేశం పార్టీలు నామరూపాలు లేకుండా పోతాయి. వాళ్లే పోతారని గమ్మునుంటే తర్వాత మనమేమైనా మిగులుతామా? అంగన్‌వాడీ ఆందోళన సమయంలోనూ, ఉపాధ్యాయుల నిరసనలోనూ రాజ్యం రాష్ట్ర ప్రభుత్వ రూపంలో ఎలా ప్రవర్తిస్తుందో చూశాం కదా! మనమూ, మన ప్రజా సంఘాలు ఎలా మనుగడ సాగిస్తాయో ఆలోచించాలి కదా!

జగన్ ప్రభుత్వం చేసిన రూ.8,10,000 కోట్ల అప్పు తీర్చాలి. అమరావతి, పోలవరం నిర్మించాలి. గుంతలమయమైన రోడ్లు వేయాలి. అసంపూర్ణంగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలి. ఉద్యోగుల సమస్యలు తీర్చాలి. ఉద్యోగాలు కల్పించాలి. పెట్టుబడులు సమీకరించాలి. పారిపోయిన పారిశ్రామికవేత్తల్ని తిరిగి రప్పించాలి. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుండా జరుగుతాయా? ఎన్డీఏ కాకుండా ఇండియా గెలుస్తుందనే నమ్మకం మీరు కల్గించగలిగారా? ఒకవేళ ఎప్పుడైనా అవసరమైతే ఎన్డీఏని జగన్ ఎదిరించగలడా? కుప్పలు తెప్పలుగా కేసులుండి భవిష్యత్తులో మరిన్ని కేసులు ఎదుర్కొనే జగన్‌కి అది సాధ్యమా? ఎన్డీఏని ఎదిరించిన చరిత్ర చంద్రబాబుకి ఉంది కదా! అలాంటి నాయకుడికి అవకాశమొస్తే మనం అడ్డుపడే ఎత్తుగడ సమంజసం కాదు కదా!

మన దినపత్రికల మొదటి పేజీల్లో వికసిత్ భారత్ ప్రకటనలను మోదీ బొమ్మలతో ముస్తాబు చేసి ఆయన విజయాలను శ్లాఘిస్తూ ప్రజలకు చేర్చటంలో తప్పు లేదు గాని చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం మోదీతో కలుస్తానంటే మాత్రం దిగజారుడా కామ్రేడ్స్? ఇంతెందుకు ఒకసారి చరిత్ర గుర్తు చేసుకుందామా? తొలిసారి ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీని ఓడించి ఏడు రాష్ట్రాలలో ప్రతిపక్ష పార్టీలు అధికారంలోకి వచ్చిన సందర్భంలో మనం జతకట్టిన పార్టీల సమూహంలో జనసంఘం కూడా వుంది గుర్తుందా? అది బీజేపీ పూర్వనామం అదే అనే విషయం గుర్తుందా? సీపీఎం వాళ్ల ఎన్నికల పొత్తుకే పరిమితమైతే సీపీఐ వాళ్ల యూపీ, బిహార్ మంత్రివర్గాల్లో కూడా పదవులు వెలగబెట్టారు కదా!

ఇదే పత్రికలో ఒకసారి చెరుకూరి సత్యనారాయణ చెప్పినట్లు మన నాయకత్వం పార్టీని పార్లమెంటరీ పంథాలో నడిపించటంలోనూ, విప్లవోద్యమంగా మల్చటంలోనూ విఫలమైందన్నది నిజం. కాని కాంగ్రెస్ వ్యతిరేకతతో పుట్టి పెరిగిన మనం ఇప్పుడు కాంగ్రెసుతోనే జతకడుతున్నాం. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని మనస్ఫూర్తిగానే కోరుకున్నాం. వారి దయాదాక్షిణ్యాలతో తెలంగాణ శాసన సభలోకి అడుగుపెట్టాం. ఏపీ శాసన సభలోకి ఇప్పుడప్పుడే అడుగు పెట్టదల్చుకోలేదు. దేశంలో బీజేపీని ఎదుర్కోగలమో లేదో గాని రాష్ట్రంలో ఈ దానవ పరిపాలన సాగనంపే అవకాశం వచ్చింది. దాన్ని అందిపుచ్చుకోనివ్వండి. అడ్డం పడకండి. ఒకేసారి ఇద్దరు రాక్షసులతో పోరాడే శక్తి తెలుగు ప్రజలకు లేదు. ఒకరినైనా అంతం చేయనీయండి కామ్రేడ్స్!



పడిపోయిన నీటిమట్టం

ప్రాణనది కొన ఊపిరితో కనిపిస్తోంది. జీవనది జలకళను కోల్పోతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజల దాహార్తిని, సాగునీటి కష్టాలను తీర్చే కృష్ణమ్మ ఇప్పుడు కన్నీరు పెడుతోంది. ప్రజల గొంతును తడిపే జలదేవతకు గొంతు ఎండిపోతోంది. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. పదిహేనేళ్ల కిందటి గడ్డు పరిస్థితికి మళ్లీ చేరింది.



ప్రకాశం బ్యారేజీ వద్ద పైకి తేలుతున్న ఇసుక (సర్కిల్‌లో)

తగ్గిన నది

పదిహేనేళ్ల తర్వాత కృష్ణానదికి గడ్డు పరిస్థితి

ప్రకాశం బ్యారేజీ వద్ద పైకి తేలిన ఇసుక

- 6.1 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- 1.68 టీఎంసీలకు తగ్గిన నీటి నిల్వలు
- 2015 తర్వాత మళ్లీ ఇప్పుడే..
- పులిచింతలలోనూ అదే పరిస్థితి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ నిపుణులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ప్రకాశం బ్యారేజీ వద్ద సరిగ్గా ఏడేళ్ల క్రితం ఉన్న పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. మార్చిలోనే నది నీటిమట్టం దారుణంగా పడిపోతోంది. ప్రస్తుతం నది పరిస్థితిపై జలవనరుల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే నదీజలాలు అడుగంటిపోతుంటే, రాబోయే రెండు నెలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌నినో ప్రభావమే..

ప్రకాశం బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం 12.0 అడుగులు, నీటిసామర్థ్యం 3.07 టీఎంసీలు. ప్రస్తుతం ఇక్కడ 6.1 అడుగుల వద్ద నీటిమట్టం కొనసాగుతోంది. నీటినిల్వలు 1.68 టీఎంసీలు ఉన్నాయి. ఈ ఏడాది ఇది దయనీయమైన పరిస్థితి. నీటిమట్టంతో పాటు నిల్వలు అడుగంటిపోతున్నాయి. బ్యారేజీ గేట్లకు వెనుక వైపున ఉన్న కాంక్రీట్ దిమ్మల వద్ద ఇసుక పైకి కనిపిస్తోంది. సరిగ్గా ఇదే పరిస్థితి 2015లో కనిపించింది. ఆ సంవత్సరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.1 అడుగులుగా నమోదైంది. నాడు 1.68 టీఎంసీల నీటి నిల్వలు రికార్డయ్యాయి. కాగా, జూలై నుంచి అక్టోబరు, నవంబరు వరకు కురిసే వర్షాలకు బ్యారేజీకి వరదలు వస్తాయి. ఆ సమయంలో గేట్లను పైకెత్తి లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేసేవారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా ఆ పరిస్థితి కనిపించలేదు. ఆగస్టు, సెప్టెంబరుల్లో ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ఈ వర్షాలు వాగులు, వంకల్లో కురవడంతో వేల క్యూసెక్కుల్లోనే ఇన్‌ఫ్లో నమోదైంది. ఈ సమయంలో నీటిని సముద్రంలోకి విడుదల చేశారు.

చింత తీర్చని పులిచింతల

బ్యారేజీకి ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టులోనూ నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ఇలాంటి సమయంలో పులిచింతల నుంచి నీటిని ఉపయోగించుకునే అవకాశం ఉండేది. అటువంటిది ఈ ఏడాది ప్రకాశం బ్యారేజీ వద్ద ఎటువంటి పరిస్థితి ఉందో పులిచింతల ప్రాజెక్టు దగ్గరా అదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు. నీటినిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు. ప్రస్తుతం నీటిమట్టం 123.489 అడుగులు, నీటినిల్వలు 4.6844 టీఎంసీలు ఉన్నాయి. గడిచిన ఏడాది ఇదే సమయానికి నీటిమట్టం 173.75 అడుగులు ఉండగా, నీటినిల్వలు 43.8 టీంఎసీలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో లేకపోగా, అవుట్‌ఫ్లో ఇవ్వలేని పరిస్థితి దాపురించింది. ప్రస్తుతం ఉన్న నీటిలో 200 క్యూసెక్కులు ఆవిరిరూపంలో పోతోంది. ఇదిపోగా, మిగిలిన నీటిని తిరిగి వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండుకుండలా తయారయ్యే వరకు పొదుపుగా ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.



ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి సామర్థ్యం ఇలా..

ముడి చమురే మసి చేసింది..!



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కొత్త ఆటోనగర్ క్రూడ్ ఆయిల్ కంపెనీలో అగ్నిప్రమాదం

- రీసైక్లింగ్ చేస్తుండగా షార్ట్ సర్క్యూట్.. ఎగసిన మంటలు
- నిమిషాల్లో కంపెనీ మొత్తం బుగ్గిపాలు
- 5 గంటలు సాగిన రెస్క్యూ ఆపరేషన్
- కంపెనీకి అనుమతి లేదు : అగ్నిమాపక శాఖ

విజయవాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కొత్త ఆటోనగర్‌లోని క్రూడ్ ఆయిల్ రీ సైక్లింగ్ కంపెనీలో మంగళవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కంపెనీలోని బాయిలర్లు పనిచేయడం మొదలుపెట్టిన కాసేపటికే ఈ ప్రమాదం జరిగింది. పెనమలూరు మండలం కానూరులోని కొత్త ఆటోనగర్‌లో శ్రీనివాసరావు అనే వ్యక్తి వాహనాల్లో వాడేసిన ఇంజన్ ఆయిల్‌ను కొనుగోలు చేస్తుంటాడు. దీన్ని రీసైక్లింగ్ చేసి మార్కెట్లో వి క్రయించడానికి బాయిలర్లను ఏర్పాటు చేసుకున్నాడు. మొత్తం నాలుగు బాయిలర్లలో శుద్ధి చేసిన ఆయిల్‌ను ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నింపి డీలర్లకు సరఫరా చేస్తుంటాడు. ఆయిల్ రీసైక్లింగ్ అయ్యాక దానిలో శుద్ధి శాతాన్ని తెలుసుకునేందుకు శాంపిల్స్ తీస్తుంటారు. మంగవారం ఉదయం శాంపిల్స్ తీస్తుండగా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినట్టు నిర్వాహకులు చెబుతున్నారు. ఆయిల్ పరిశ్రమ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి మొత్తం పరిశ్రమకు వ్యాపించాయి. ఈ ఘటనలో బాయిలర్లు పూర్తిగా కాలిపోయాయి. ఆటోనగర్, ఉయ్యూరు, గన్నవరం, కొత్తపేట అగ్నిమాపక కేంద్రాల నుంచి ఐదు వాహనాలు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ఈ పరిశ్రమకు ఎలాంటి అనుమతులు లేవని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. మిగిలిన శాఖల అనుమతులు ఉన్నాయో లేదో పరిశీలించాలన్నారు. మంటలను అదుపు చేసే ఆపరేషన్ దాదాపు ఐదు గంటలపాటు సాగింది.

ఐలా.. పర్యవేక్షణ డీలా..

కొత్త ఆటోనగర్‌పై కొరవడిన నిఘా

- ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న కంపెనీలు
- అనుమతులు లేకుండానే నిర్వహణ
- వసూళ్లలో ముగిపోతున్న 'ఐలా'
- ఎక్కడా కనిపించని ఫైర్ సేఫ్టీ

దేశంలోనే అతిపెద్ద ఆటోనగర్‌గా పేరొందిన ఆటోనగర్‌లో భద్రతకు గ్యారెంటీ ఉందా? విజయవాడ నుంచి కానూరులో ఉన్న కొత్త ఆటోనగర్ వరకు ఉన్న గ్యారేజీలు, వర్క్‌షాపుల్లో కార్మికుల ముందు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయా? విస్తరించిన కొత్త ఆటోనగర్‌లో అనుమతులతో సంబంధం లేకుండా రీసైక్లింగ్ యూనిట్లు వెలుస్తున్నాయా? అంటే అవుననే సమాధానం వస్తోంది.

విజయవాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు నగరం నుంచి కొత్త ఆటోనగర్ వరకు ఒకే క్లస్టర్ ఉండేది. జిల్లాల విభజన జరిగాక ఆటోనగర్‌లూ వేరయ్యాయి. ఆటోనగర్‌లో వెలిసే గ్యారేజీలు, వర్క్‌షాపులపై పర్యవేక్షణ, అక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు ఐలా (ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ) ఉంటుంది. దీనికి పాలకవర్గాలు ఉంటాయి. ఇప్పుడు ఈ ఐలాలు అచేతన స్థితిలోకి వెళ్లిపోయాయి. ఆటోనగర్‌లో ఎలాంటి వర్క్‌షాపులు, గ్యారేజీలు కొత్తగా వస్తున్నాయో తెలియడం లేదు. కొత్తగా వస్తున్న రీసైక్లింగ్ యూనిట్ల కారణంగా అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆటోనగర్‌లో వర్క్‌షాపులు, యూనిట్లపై పర్యవేక్షణ ఉంచాల్సిన ఐలాలు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నాయి. ఇక్కడ ఏ యూనిట్ ఏర్పాటవుతుందో తెలుసుకోలేని దుస్థితిలో పనిచేస్తున్నాయి. ఐలాలో ఉన్నవారు పదవులను అడ్డుపెట్టుకుని లక్షలాది రూపాయలను వెనుకేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జవహర్ ఆటోనగర్, జేఆర్డీ టాటా ఆటోనగర్, కొత్త ఆటోనగర్. ఈ మూడింటిలో జవహర్ ఆటోనగర్‌కు ఉన్న ఐలా పాలకవర్గ కాలపరిమితి కొద్దినెలల క్రితం ముగిసింది. జేఆర్డీ టాటా ఆటోనగర్‌కు ఐలా పాలకవర్గం ఉంది. కొత్త ఆటోనగర్‌కు ఇంకా ఏర్పాటు కాలేదు. వీటంతటికీ కలిపి ఒక కార్యవర్గం కనుసన్నల్లో ఆటోనగర్‌లోని అన్ని కార్యకలాపాలు సాగుతున్నాయి. జవహర్ ఆటోనగర్‌లో ఆయిల్ రీసైక్లింగ్ యూనిట్లు ఉండేవి. వాటి కారణంగా ప్రమాదం పొంచి ఉందని తీయించేశారు. ఇప్పుడు ఈ రీసైక్లింగ్ యూనిట్లు కొత్త ఆటోనగర్ కేంద్రంగా ఏర్పాటవుతున్నాయి.

అనుమతులు ఉంటున్నాయా?

ఆటోనగర్‌లో ఏర్పాటైన వర్క్‌షాపులు, రీసైక్లింగ్ యూనిట్లలో భద్రత ఎంతవరకు ఉందన్న అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొత్త ఆటోనగర్‌లోని క్రూడ్ ఆయిల్ రీసైక్లింగ్ యూనిట్‌లో జరిగిన అగ్నిప్రమాదంతో ఈ ప్రశ్న ఉత్పన్నమవుతోంది. లోగడ ఇదే ప్రాంతంలో పాత ప్లాస్టిక్ వస్తువులు రీసైక్లింగ్ యూనిట్‌లో భారీ ప్రమాదం జరిగింది. తాజాగా క్రూడ్ ఆయిల్ రీసైక్లింగ్ యూనిట్‌లో జరిగింది. ఘటనాస్థలంలో రెస్క్యూ ఆపరేషన్ చేసిన అగ్నిమాపక శాఖ అధికారులు.. ఈ యూనిట్‌కు ఎలాంటి అనుమతులు లేవని ప్రకటించారు. ఇలాగే చాలా యూనిట్లు అనుమతులు తీసుకోకుండా కార్యకలాపాలు సాగిస్తున్నాయని బహిరంగంగానే చెప్పుకొంటున్నారు. తనిఖీలకు వెళ్లినప్పుడు అధికారులను ముడుపులతో ప్రసన్నం చేసుకుంటున్నారు.



క్రూడ్ ఆయిల్ కంపెనీలో ఎగసిపడుతున్న మంటలు

అడ్డదిడ్డంగా వాహనాలు

ఆటోనగర్‌లో రిపేర్ల కోసం భారీ వాహనాలు వస్తుంటాయి. కొన్ని వాహనాలు ఉపయోగంలో లేకపోవడంతో పక్కన పడి ఉంటాయి. ఈ వర్క్‌షాపులకు వచ్చే వాహనాలను లోపల ప్రాంగణంలో కాకుండా నడిరోడ్డుపై నిలుపుతున్నారు. స్క్రాబ్‌ను రహదారుల పక్కన పడేస్తున్నారు. రాత్రివేళ వీటిని ఢీకొని ద్విచక్రవాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆరు నెలల కాలంలో ఇలాంటి ఘటనలు పదుల సంఖ్యలో జరిగాయి.

పోస్టుమాస్టర్‌పై విచారణ

జగ్గయ్యపేటలో రహస్యంగా అధికారుల ఆరా

- చర్యల కోసం కలెక్టర్‌కు సిఫార్సు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జగ్గయ్యపేట, మార్చి 26 : విధులకు డుమ్మాకొట్టి అధికార పార్టీ సేవలో తరిస్తున్న జగ్గయ్యపేట డాంగేనగర్ ఏరియా పోస్టుమాస్టర్ వసంతరావుపై శాఖాపరమైన విచారణ ప్రారంభమైంది. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో స్పందించిన తిరువూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మంగళవారం పట్టణంలో రహస్యంగా వి చారణ చేపట్టారు. వసంతరావు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడని రుజువు కావటంతో చర్యల కోసం కలెక్టర్ ఢిల్లీరావుకు సిఫార్సు చేశారు. కాగా, వసంతరావు విధులకు రావట్లేదని, ఆయన బదులు వేరే వ్యక్తి ఉత్తరాలు బట్వాడా చేస్తున్నాడని, రాజకీయ ప్రచారంలో పాల్గొంటున్నాడని కొందరు సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. తిరుమలగిరిలో అధికార పార్టీ ఫ్లెక్సీల్లో వసంతరావు పేరు, ఫొటోలను చూపించారు. ఈ ఫిర్యాదులన్నింటిపై పోస్టల్ శాఖ విచారణ చేస్తున్నట్టు తెలుస్తోంది. వసంతరావు రాష్ట్రస్థాయి పోస్టల్ ఉద్యోగుల సంఘంలో ఉండటం వల్ల అతడ్ని కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. వసంతరావు సెలవు లేఖ ఇచ్చినట్టు స్థానిక అధికారులు చెబుతున్నారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా సరే.. సెలవు పెట్టి ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనరాదని జగ్గయ్యపేట ఈఆర్వో వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.



తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన వైసీపీ ఫ్లెక్సీలో పోస్టుమాస్టర్ వసంతరావు (ఫైల్)

వైసీపీ భజనలో వలంటీర్లు

వైసీపీ మీడియా సమావేశంలో పాల్గొన్న చిరిచింతల వలంటీర్

- నీలిపూడిలో ప్రజాదీవెనలో పాల్గొన్న ఇద్దరు వలంటీర్లు, ఐదుగురు బుక్ కీపర్లు
- విధుల నుంచి తొలగింపు

గుడివాడ/కృత్తివెన్ను, మార్చి 26 : అధికార వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో వలంటీర్లు యథేచ్ఛగా పాల్గొంటున్నారు. ఇటీవల స్థానిక 24వ వార్డులో ఇద్దరు వలంటీర్లు వైసీపీ నాయకుడితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. అయినా అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోలేదు. దీనిని అలుసుగా తీసుకుని మరికొంత మంది వలంటీర్లు బహిరంగంగానే వైసీపీ ప్రచార కార్యక్రమాలు, పత్రికా సమావేశాల్లో పాల్గొంటున్నారు. గుడివాడ రూరల్ మండలం చిరిచింతలకు చెందిన కల్లేపల్లి పవన్‌కుమార్ వలంటీరుగా, వైసీపీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం స్థానిక వైసీపీ ఎన్నికల కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో అతను పాల్గొనడంపై సర్వత్రా వి మర్శలు వ్యక్తమయ్యాయి. కాగా, వైసీపీ సమావేశంలో పాల్గొన్న వలంటీర్ కల్లేపల్లి పవన్‌కుమార్‌పై అధికారులు చర్యలు తీసుకున్నారు. అతడిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు గుడివాడ ఎంపీడీవో జ్యోతి తెలిపారు.

- కృత్తివెన్ను మండల పరిధిలోని నీలిపూడి గ్రామంలో పెడన వైసీపీ అభ్యర్థి ఉప్పాల రాము నిర్వహించిన ప్రజాదీవెన కార్యక్రమంలో ఇద్దరు వలంటీర్లు, ఐదుగురు బుక్ కీపర్లు పాల్గొన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ పార్టీ ప్రచారంలో పాల్గొనటం, అభ్యర్థులతో కలిసి ఫొటోలు దిగటం చేశారు. ఈ వి షయంపై ఫిర్యాదు వెల్లువెత్తడంతో అధికారులు విచారణ జరిపి విధుల నుంచి సస్పెండ్ చేశారు.

బిళ్లనపల్లిలో నేడు భువనేశ్వరి పర్యటన



హనుమాన్ జంక్షన్ రూరల్, మార్చి 26 : టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి బుధవారం బాపులపాడు మండలంలోని బిళ్లనపల్లి గ్రామంలో పర్యటించనున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి గురై ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆమె పరామర్శిస్తారు. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు భువనేశ్వరి బిళ్లనపల్లికి చేరుకుంటారు. కాగా, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎదురువాడ కిరణ్ (48), ఎదురువాడ బసవరావు (85) కుటుంబాలను పరామర్శించేందుకు ఏర్పాట్లు చేశారు.

కూలిన బతుకులు

- వీరపనేనిగూడెం వద్ద కూలీలు వెళ్తున్న ఆటో బోల్తా
- ఇద్దరు మహిళలు మృతి.. 21 మందికి గాయాలు

ఉంగుటూరు, మార్చి 26 : ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. 23 మందితో వెళ్తున్న ఓ ఆటో బోల్తా కొట్టిన ఘటనలో ఇద్దరు మహిళలు మృతిచెందారు. మృతులు ఏరోజుకారోజు కూలిపని చేసుకునేవారు. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ సహా 13 మందికి తీవ్రగాయాలు కాగా, మరో 8 మందికి స్వల్పగాయాలయ్యాయి. ఆత్కూరు ఎస్సై ఏ.ఫైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం చినఆగిరిపల్లి శివారు గొల్లగూడేనికి చెందిన కొంతమంది మహిళా కూలీలు రోజూ ఉదయం 6 గంటలకు ఆటోలో గన్నవరం మండలం తెంపల్లి గ్రామానికి కూలి పనుల కోసం వెళ్తుంటారు. తిరిగి మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇళ్లకు చేరుతుంటారు. ఈ క్రమంలో తోటపల్లికి చెందిన చాగంటిపాటి శివరామ కృష్ణకు చెందిన ఆటోలో 23 మంది (డ్రైవర్ సహా) మహిళా కూలీలు ఎక్కారు. మంగళవారం ఉదయం 6.30 గంటలకు చిన ఆగిరిపల్లి నుంచి తెంపల్లి గ్రామానికి బయల్దేరిన ఆటో మార్గం మధ్యలో వీరపనేనిగూడెం ప్రభుత్వ వైన్‌షాపు దగ్గర కొచ్చేసరికి ఎదురుగా వేగంగా వస్తున్న బైకును తప్పించే క్రమంలో ఆటోడ్రైవర్ హఠాత్తుగా సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. కూలీలందరూ రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో వీర్ల కృష్ణకుమారి (45), వీర్ల సుజాత (30) సంఘటనాస్థలంలోనే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన బడుగు శివనాగేంద్రమ్మ (35), జువ్వనబోయిన లక్ష్మీపార్వతి (33), జువ్వనబోయిన నిర్మల (40), గుంట్రు ధనలక్ష్మి (45), జువ్వనబోయిన ప్రభావతి (44), చెన్ను వీరమ్మ (65), ఢిల్లీ నవ్య (19), వీర్ల సుజాత (35), జువ్వనబోయిన వాణిశ్రీ ((30)ను చినఅవుటపల్లిలోని పిన్నమనేని ఆసుపత్రికి, సాకిరి నాగమణి (50), గుంట్రు పద్మావతి (40)ని విజయవాడ జీజీహెచ్‌కు, వీర్ల సుజాత(38)ను గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆటోడ్రైవర్ శివరామకృష్ణ నూజివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సామర్థ్యానికి మించి ఆటోలో కూలీలు ప్రయాణించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారకుడైన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో



మృతులు వీర్ల కృష్ణకుమారి, సుజాత (ఫైల్)

క్షతగాత్రులను పరామర్శించిన కొలుసు పార్థసారథి

వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టీడీపీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి కొలుసు పార్థసారథి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యాధికారులను ఆరా తీసిన ఆయన మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యంచెప్పి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. క్షతగాత్రులను నూజివీడు అసెంబ్లీ స్వతంత్ర అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కూడా పరామర్శించారు.

యాక్షన్ ప్లాన్

ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం 'పంచతంత్రం'

- సూర్యాపేట, ఖమ్మం, ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లా సరిహద్దులే టార్గెట్

- 6లో..



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-21 (బుధ)

సహర్ (ఉదయం) : 4-54 (గురు)



రాజీనామా ప్రతులు చూపుతున్న టీడీపీ నాయకులు

అవనిగడ్డ సీటుపై నిరసన సెగలు!

▸ పలువురు టీడీపీ నేతల రాజీనామా

అవనిగడ్డ, మార్చి 26 : పొత్తులో భాగంగా అవనిగడ్డ సీటు జనసేనకు కేటాయించటంపై రెండ్రోజులుగా తెలుగుదేశం పార్టీలో నెలకొన్న అసంతృప్తి జ్వాలలు చల్లారలేదు. సోమవారం కార్యకర్తల సమావేశంలో సామూహిక రాజీనామాలు చేస్తామని హెచ్చరించిన నేతలు మంగళవారం ఉదయం సమావేశమై పార్టీకి తమ రాజీనామాలను సమర్పించారు. నియోజకవర్గం నుంచి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ గెలిచే అభ్యర్థి అని, కనీస సంప్రదింపులు లేకుండా జనసేన పార్టీకి సీటు కేటాయించటం పట్ల వారు నిరసన తెలియజేస్తూ రాజీనామా ప్రతులను పార్టీ కార్యాలయానికి పంపించారు. జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు నేతృత్వం వహించగా, నిరసన కార్యక్రమంలో టీడీపీ నేతలు యాసం చిట్టిబాబు, కర్రా సుధాకర్, పంద్రాజు లంకమ్మ ప్రసాద్, బండే కనకదుర్గ, మాదివాడ లక్ష్మీ తులసి, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, ఘంటసాల రాజమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బీఫామ్ ఇచ్చిన వారికే మద్దతు : బొమ్మసాని



జి.కొండూరు : చంద్రబాబు నాయుడు మైలవరం నుంచి ఎవరికి బీఫామ్ ఇస్తే వారికి తన పూర్తి మద్దతు ఉంటుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావు స్పష్టం చేశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను మంగళవారం ఆయన కలిశారు. అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమన్నారు. పార్టీ విజయానికి కృషి చేస్తానని లోకేశ్‌కు వివరించినట్టు సుబ్బారావు తెలిపారు.

బాబుతోనే ప్రజారంజక పాలన

▸ వైసీపీ నుంచి టీడీపీలోకి కొనసాగుతున్న చేరికలు



ఉంగుటూరు/గుణదల, మార్చి 26 : విధ్వంసమైన వ్యవస్థలను, పతనమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టగల సత్తా, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రజారంజకపాలన అందించగల పరిపాలనాదక్షత చంద్రబాబుకు మాత్రమే సాధ్యమని గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడలో మంగళవారం ఉంగుటూరు మండలం, వెల్దిపాడు గ్రామానికిచెందిన గన్నవరం మార్కెట్‌యార్డ్ డైరెక్టర్, వైసీపీ బూత్ కన్వీనర్ బొకినాల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బూత్ మెంబర్లు మట్టా మునిస్వామి తదితరులు 50మంది టీడీపీలో చేరారు. వీరికి యార్లగడ్డ వెంకట్రావు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలనతో విసుగుచెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామాధ్యక్షుడు బొకినాల నాగేశ్వరరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మన్నార్ తదితరులు పాల్గొన్నారు.



సూరాయిపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెనిగండ్ల రాము

టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి : వెనిగండ్ల

నందివాడ (ఏబి నగర్), మార్చి 26 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని గుడివాడ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం తమిరిశ శివారు ఏ.బి.నగర్, సూరాయిపాలెం, నక్కవారిపాలెం-తమిరిశ గ్రామాలలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాగంటి శ్రీనివాసరావు, పిన్నమనేని పూర్ణ వీరయ్య (బాబ్జీ), పిన్నమనేని వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ నాయకులచే వెనిగండ్ల రాము 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని, మరో 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రావి మాట్లాడుతూ, వైసీపీ పాలనలో మోసాలను ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో సన్యాసిరావు, సాయి గంగరాజు, అర్జునరావు, కొల్లి బ్రదర్స్, సాల్మన్, వెంకట్రావు, నాగరాజు, కరుణకరావు, రవి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంధకారంలో పెదకళ్లేపల్లి పంచాయతీ

▸ బిల్లులు చెల్లించలేదని వీధి దీపాల నిలిపివేత

▸ పంచాయతీ నిధులు పక్కదారిన తరలించేశారు : సర్పంచ్ ఆక్రోశం



మోపిదేవి, మార్చి 26 : పెదకళ్లేపల్లి గ్రామపంచాయతీలో వీధి దీపాల సరఫరా నిలిపివేయటంతో అంధకారం అలుముకుంది. మండలంలో అతిపెద్దదైన పెదకళ్లేపల్లి గ్రామపంచాయతీలో వీధి దీపాలకు సంబంధించి విద్యుత్ బిల్లులు చెల్లించని కారణంగా విద్యుత్ శాఖాధికారులు మంగళవారం సరఫరా నిలిపివేశారు. పంచాయతీ పరిధిలోని వీధిదీపాలు, మంచినీటి సరఫరా వంటి ఇతరత్రా అవసరాలకుగానూ రూ.14 లక్షలు బకాయి ఉన్నట్టు సంబంధిత శాఖాధికారులు తెలియజేశారు. 2021 ఏప్రిల్ నుంచి గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన రూ.56 లక్షల నిధులు కనీస సమాచారం లేకుండా ప్రభుత్వం మినహాయించుకున్నట్టు సర్పంచ్ అరజా సంధ్యారాణి తెలిపారు. ఎప్పటివరకు బకాయిలు చెల్లించారో తెలియజేయకుండా ప్రస్తుతం 14 లక్షల బకాయి ఉందని సరఫరా నిలిపివేయటంపై ప్రభుత్వ తీరును తీవ్ర స్థాయిలో సర్పంచ్ ఆరోపించారు. వీధి దీపాలు నిలిపివేయటంపై సర్పంచ్, ప్రజలు ధ్వజమెత్తారు. రాత్రి సమయంలో ఏమైనా హాని జరిగితే రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ శాఖ బాధ్యత వహిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 14 లక్షల బకాయిలు దఫాలు వారీగా చెల్లిస్తామని, ప్రస్తుతం ఒక లక్ష చెల్లిస్తామని చెప్పినా సరఫరా నిలిపివేశామని ఆరోపించారు.

ఎట్టకేలకు స్పందించారు

▸ అనధికార పార్టీ దిమ్మను తొలగించిన అధికారులు



దిమ్మను తొలగిస్తున్న అధికారులు

గుడివాడ : పార్టీలకతీతంగా నిరసనలు వెల్లువెత్తడంతో అధికారుల్లో ఎట్టకేలకు చలనం వచ్చింది. రహదారికి మధ్యలో అడ్డంగా ఉన్న విగ్రహ ఏర్పాటు దిమ్మను మంగళవారం తొలగించారు. ఎన్నికల కోడ్ ముందు 4 రోజులు ముందు అధికార వైసిపి పార్టీ నాయకులు బలవంతంగా కొత్త మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళే రహదారి మధ్యలో విగ్రహ ఏర్పాటకు దిమ్మను ఏర్పాటు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా దిమ్మను ఏర్పాటు చేయడం పట్ల సొంత పార్టీ నుండే కాకుండా ప్రతిపక్షాలు, స్వచ్ఛంద సంస్థలు, పట్టణ ప్రజలు నుండి కూడా వ్యతిరేకత ఎదురైంది. ఈ విషయమై భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి మురళీకృష్ణ సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేశారు. ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం ఏర్పడుతుందని పట్టణ ప్రజల నుండి తీవ్ర స్థాయిలో నిరసనలు వెల్లువెత్తడంతో మున్సిపల్ అధికారులు మంగళవారం దిమ్మను తొలగించారు. మున్సిపల్ కమీషనర్ బాలసుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమీషనర్ కృష్ణారావుల ఆదేశాలతో దిమ్మను పూర్తిగా తొలగించారు.






ఉయ్యూరు, కంకిపాడు సెంటర్లలో జగన్మోహన్‌రెడ్డి బ్యానర్లు

నిబంధనలకు నీళ్లు..

కంకిపాడు/ఉయ్యూరు, మార్చి 26 : ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కంకిపాడు బస్టాండ్ సెంటర్, ఉయ్యూరు సెంటర్‌లోని భవనాలపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫొటో, ఫ్యాన్ గుర్తుతో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిపై పెనమలూరు రిటర్నింగ్ అధికారి డి.రాజును వివరణ కోరగా మండలానికి ఓ బ్యానర్ ఏర్పాటుకు కలెక్టర్ నుంచి వైసీపీ నాయకులు అనుమతి పొందారని చెప్పారు.

పంచాయతీ కార్యాలయంలో ప్రచార బోర్డులు

వీరులపాడు : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా కొందరు అధికారులు జగన్ ప్రభుత్వంపై స్వామిభక్తిని చాటుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరులపాడు మండలం వెల్లంకి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రభుత్వ పథకాల ప్రచార పోస్టర్లు జగన్ బొమ్మతో దర్శనం ఇస్తూనే ఉన్నాయి.



వెల్లంకి పంచాయతీ కార్యాలయంలో పోస్టర్లు



యాక్షన్ ప్లాన్

▸ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం 'పంచతంత్రం'


▸ సూర్యాపేట, ఖమ్మం, ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లా సరిహద్దులే టార్గెట్


▸ ఓటర్లను ప్రలోభపెట్టే డబ్బు, మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక దృష్టి

▸ పోలీసు, రెవెన్యూ, ట్రెజరీ, సెబ్, ఎక్సైజ్ శాఖలతో నజర్

▸ పొరుగు జిల్లాలతో మైత్రీ సంబంధాలకు శ్రీకారం

▸ ఎన్నికల ప్రక్రియపై కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ కాంతి రాణాల ఫోకస్





ఎన్నికల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు వీలుగా ఓటర్లను ప్రలోభపెట్టే అంశాలపై జిల్లా ఎన్నికల యంత్రాంగం 'పంచ' తంత్రం విధానాన్ని అవలంబిస్తోంది. ఎన్టీఆర్ జిల్లా సరిహద్దున సూర్యాపేట, ఖమ్మం, ఏలూరు, కృష్ణా, గుంటూరు వంటి ఐదు జిల్లాలపై దృష్టి సారించింది. బోర్డర్ చెక్‌పోస్టుల వద్ద పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలైన రెవెన్యూ, ట్రెజరీ, సెబ్, ఎక్సైజ్ శాఖలతో కలిసి అడ్డుకట్టవేసే అంశాలపై దృష్టి సారించింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికల తరుణంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు భారీగా డబ్బు, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు జిల్లా యంత్రాంగం సరిహద్దు జిల్లాలపై దృష్టి సారించింది. ఇప్పటికే వీటికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్న జిల్లా అధికారులు తాజాగా పొరుగు జిల్లాలతో మైత్రీ సంబంధాలను కొనసాగించాలని నిర్ణయించారు. మంగళవారం తెలంగాణా రాష్ట్రం సూర్యాపేట జిల్లా యంత్రాంగంతో చిల్లకల్లులో మైత్రీ సమావేశం జరిగింది. ముమ్ముందు తెలంగాణా రాష్ట్రంలోని ఖమ్మం, ఏపీలోని ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లా యంత్రాంగాలతో కూడా సమావేశాలను నిర్వహించనున్నారు.

ప్రలోభాల కట్టడికి చర్యలు

ఎన్నికలకు డబ్బు పంపిణీపై దృష్టి సారించిన జిల్లా యంత్రాంగం ఇప్పటికే బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి వారికి మార్గదర్శనం చేసింది. వివిధ వ్యక్తుల నుంచి ఒకే వ్యక్తికి జమ అవుతున్న డబ్బుల లావాదేవీలకు సంబంధించి అలాగే అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించి నిఘా కొనసాగుతోంది. ఆన్‌లైన్ డబ్బు పంపిణీని నిరోధించే వ్యవస్థలు ఇప్పటికే తమ పని ప్రారంభించాయి. ఇదే సందర్భంలో బయటి నుంచి వచ్చే డబ్బుపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే జిల్లా నలుమూలల సీఆర్‌పీఎఫ్ పోలీసులతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను జల్లెడ పడుతున్నారు. తెలంగాణా రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా, ఏలూరు జిల్లా, కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లాలు ఐదు అత్యంత కీలకంగా గుర్తించి ఆపరేషన్స్ ప్రారంభించటానికి వీలుగా ఆయా జిల్లా యంత్రాంగాలతో మైత్రీ సంబంధాలకు తెర తీసింది. దీనిలో భాగంగా జిల్లాలోకి నగదు, ఉచిత బహుమతులు, మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలను తేలిగ్గా సరిహద్దులను దాటించగలిగే అంశాలపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుంది. సూర్యాపేట జిల్లాలో గరికపాడు చెక్‌పోస్టు, ముక్త్యేశ్వరపురం నుంచి ఎన్‌హెచ్-65 ఇబ్రహీంపట్నం మీదుగా విజయవాడకు చేరుకునే అవకాశం ఉంది. ఖమ్మం జిల్లా నుంచి గంపలగూడెం గండ్రాయి, పోలంపల్లి, నెమలి, ఊటుకూరు, జొన్నలగడ్డ పెద్దాపురం, మైలవరం, మొర్సుమల్లి, రాజవరం ప్రాంతాల నుంచి, ఏలూరు జిల్లా నుంచి విస్సన్నపేట, తిరువూరుల మీదుగా రెడ్డిగూడెం చేరుకోవటానికి అక్కడి నుంచి మైలవరం మీదుగా విజయవాడకు చేరుకోవటానికి అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. కృష్ణా జిల్లా నుంచి నేరుగా విజయవాడలోకి, గుంటూరు జిల్లా నుంచి తాడేపల్లి రవాణా చేయటానికి అవకాశం ఉందని గుర్తించారు. దీనికి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. ఏ మార్గంలో నుంచి వచ్చినా ఈ ప్రాంతాలకు అనుసంధానం కావాల్సిందే. ఈ రూట్ మ్యాప్‌ల ప్రకారం ఆయా ప్రాంతాలను జల్లెడ పట్టగలిగితే అక్రమ రవాణాను అరికట్టవచ్చని జిల్లా ఎన్నికల యంత్రాంగం భావిస్తోంది.

ఎన్నికల ఏర్పాట్లలో ఇరు రాష్ట్రాల అధికారులు

▸ సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది పెంపు

▸ సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ల నిర్ణయం



గరికపాడు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ కాంతి రాణా

జగ్గయ్యపేట రూరల్, మార్చి 26 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అంతర్రాష్ట్ర సరిహద్దు జిల్లాల అధికారులు పరస్పరం సమాచారంతో ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ కాంతిరాణా, సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డేలు సూచించారు. మంగళవారం ధర్మవరప్పాడు తండా సమీపంలోని ఒక కర్మాగార సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆంధ్రా, తెలంగాణా సరిహద్దు సూర్యాపేట, ఎన్టీఆర్ జిల్లా అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో సిబ్బందిని పెంచటంతో పాటు ఆయా శాఖలకు చెందిన 10మంది అధికారులు మూడు షిఫ్టుల్లో పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ముఖ్యంగా మద్యం, బంగారం, వెండి, పెద్ద మొత్తంలో పంపిణీకి తరలించే గిఫ్టులు, తదితర సామగ్రిపై దృష్టి సారించాలన్నారు. సీపీ మాట్లాడుతూ, తొమ్మిది చెక్‌పోస్టులు పని చేస్తున్నాయని ఇప్పటికే రూ. 3.6లక్షల నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నామని, 30 నుంచి 40 తనిఖీ బృందాలు పనిచేస్తున్నాయని చెప్పారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ, రెండు జిల్లాల శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ, జీఎస్టీ, ఎక్సైజ్, రవాణా, కస్టమ్స్, కమర్షియల్, ఇన్‌కంట్యాక్స్, ఏసీబీ, అధికారులు పాల్గొన్నారు. నందిగామ ఏసీపీ రవికిరణ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గరికపాడు, ముక్త్యాల, గండ్రాయి, వత్సవాయి చెక్‌పోస్టుతో పాటు సూర్యాపేట జిల్లా రామాపురం చెక్‌పోస్టును అధికారులు పరిశీలించారు. వాహనాల తనిఖీలకు ఇబ్బంది లేకుండా రెండు మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీకి సూచించారు. 'ప్రహసనంగా వాహనాల తనిఖీ' ఆంధ్రజ్యోతిలో దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ కాంతి రాణా స్పందించారు. అధికసంఖ్యలో వాహనాల తనిఖీల్లో కొంత ఇబ్బంది తలెత్తే అవకాశం ఉండటంతో దానికి అనుగుణంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. తక్షణం రక్షణ కోసం తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నందిగామ ఆర్డీవో రవీంద్ర, ఏసీపీ రవికిరణ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కమనీయం వేణుగోపాలుని కల్యాణం

గంపలగూడెం : నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి వేలాది మంది భక్తుల సమక్షంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుని కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. పరాశరం వెంకట రమణాచార్యుల ఆధ్వర్యంలో రుత్వికులు స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపేందుకు కన్యాదానం పీటలపై కూర్చున్న 200మంది దంపతుల గోత్ర నామాలు చదివారు. స్వామి అమ్మవార్లకు నూతన వస్త్రాలు బోయినపల్లి వెంకట కృష్ణారావు సమర్పించారు. వేద మంత్రాల నడుమ అమ్మవార్లకు మాంగల్యధారణ చేయించారు. అనంతరం గరుడవాహనంలో స్వామిని ఆలయ ప్రవేశం చేయించారు. ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ, అసిస్టెంట్ కమిషనర్ ఎన్వీ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



నెమలిలో వేణుగోపాలస్వామి కల్యాణం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం

తప్పుడు ప్రచారాలపై కఠిన చర్యలు : ఎస్పీ

మచిలీపట్నం టౌన్, మార్చి 26 : ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారాలను ట్రోలింగ్ చేస్తే తీవ్రంగా పరిగణిస్తామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. మంగళవారం ఎస్పీ ఛాంబర్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వాట్సాప్, టెలిగ్రాం, ఫేస్‌బుక్ గ్రూపుల్లో తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే గ్రూపు అడ్మిన్లదే బాధ్యత అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సామాజిక మాధ్యమాలలో వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్‌లు చేయకూడదన్నారు. వీటిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. సామాజిక మాధ్యమాలలో వస్తున్న అసభ్యకర, రెచ్చగొట్టే పోస్టింగ్‌ల సమాచారాన్ని 9490617672కు ఫోన్ చేసి తెలపవచ్చుని, ఈ సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వసంత

రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తుంటే ఎలా..!

▸ పరిశ్రమలు రాకుండా ప్రజల జీవన ప్రమాణాలు ఎలా పెరుగుతాయి

▸ చింతలపూడికి నిధులు అడిగినా ఇవ్వలేదు

▸ వసంత కృష్ణ ప్రసాద్ సంచలన వ్యాఖ్యలు

జి.కొండూరు, మార్చి 26 : సీఎం జగన్మోహన్ రెడ్డి రాజధాని అమరావతి అభివృద్ధి చెందకుండా అడ్డుపడటమే కాక మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తుంటే ఊరుకోవాలా.. అని మైలవరం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రశ్నించారు. చిన్ననందిగామ గ్రామంలో మంగళవారం రాత్రి ఆయన ఆత్మీయ సమావేశంలో ఏపీ సీఎంపై సంచలన, ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి ఆదాయం లేకుండా ప్రశ్నిమలు రాకుండా ప్రజల జీవన ప్రమాణాలు ఎలా మెరుగుపడతాయన్నారు. రైతుల సాగునీటి అవసరాల కోసం చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి, నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావుతో కలిసి తాను జగన్‌కు విజ్ఞాపన పత్రం ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. యువతకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు అమలు చేయని కారణంగా ఎస్సీ సోదరుల జీవనోపాధి దెబ్బతిందన్నారు. విదేశీ విద్య రుణాలు కూడా అనేక ఆంక్షలతో కోతలు పెట్టిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రభుత్వం నుంచి ఒక్క పైసా సాధించలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వల్ల పనులు మధ్యలోనే ఆగిపోయాయన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన నేతృత్వంలో త్వరలోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. అభివృద్ధితో కూడిన సంక్షేమ పాలనకు ప్రజలందరూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ధనేకుల సాంబశివరావు (బుల్లిబాబు), ధనేకుల శ్రీకాంత్, రాయల బసవేశ్వరరావు, మన్నం వెంకట్రావ్, జంపాల సీతారామయ్య, ఉయ్యూరు వెంకట నరసింహారావు, పజ్జూరు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోండి

▸ కృష్ణా కలెక్టర్ రాజాబాబు



మచిలీపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల, విద్యుత్, పంచాయతీరాజ్, తదితరవిభాగాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 266 తాగునీటి చెరువులున్నాయని, వాటిలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలపై నివేదిక ఇవ్వాలన్నారు. బంటుమిల్లి, కోడూరు, నాగాయలంక, కృత్తివెన్ను, పెడన మండలాల్లోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, ట్యాంకర్లద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో తాగునీటి చెరువులను నింపేందుకు కాలువలకు నీటిని విడుదల చేయాలని నీటిపారుదలశాఖ అధికారులతో ఇప్పటికే మాట్లాడటం జరిగిందన్నారు. ఏప్రిల్ మొదటివారంలో కాలువలకు నీటిని విడుదల చేస్తారని తెలిపారు. కాలువల ద్వారా విడుదలైన నీటిని శివారు ప్రాంతాల్లో తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులలో నీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి పథకాలకు సంబంధించి ఫిల్టర్‌బెడ్‌లు, పనిచేయని మోటార్లకు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. పశువులకు వేసవిలో తాగునీరు అందించాల్సి ఉందని, ఊరచెరువులను నింపాలన్నారు. జిల్లాలో తాగునీటి చెరువుల పూర్తిస్థాయి నివేదికను అందించాలని డీపీవో నాగేశ్వరనాయక్‌ను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి టి.శివప్రసాద్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనంద్ కుమార్, మచిలీపట్నం, గుడివాడ, పెడన ఉయ్యూరు మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సీ-విజిల్ ద్వారా ఫిర్యాదుల పరిష్కారం

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సీ-విజిల్ ద్వారా 160ఫిర్యాదులను ఇప్పటివరకు పరిష్కరించినట్టు కలెక్టర్ రాజాబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకులు పార్టీరంగులతో ఉన్నాయని, రేషన్ బియ్యం పంపిణీచేసే ఎండీయూ వాహనాలపై రాజకీయ నాయకుల ఫొటోలు ఉన్నట్టు ఫిర్యాదులు అందాయన్నారు.ఎన్నికల నేపథ్యంలో సీ-విజిల్‌ద్వారా వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ తెలిపారు.

అనధికార పైపుల తొలగింపులో ఉద్రిక్తత

▸ ప్రత్యామ్నాయం చూపాలని అధికారులను అడ్డుకున్న ప్రజలు

▸ పోలీసుల సాయంతో వెళ్లిపోయిన అధికారులు

కృత్తివెన్ను, మార్చి 26 : అనధికార పైపుల తొలగింపులో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కృత్తివెన్ను మండల పరిధిలోని చినపాండ్రాక గ్రామంలో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావు అనధికార పైపుల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. పైపులను తొలగిస్తుండగా గ్రామస్థులంతా తమకు తాగునీరు అందించేందుకు ఎటువంటి ప్రత్యామ్నాయం చూపకుండ పైపులను ఏలా తొలగిస్తారని ఎదురు తిరిగారు. అధికారులను నిలదీసారు. ఇంతేరు, రామాపురం గ్రామాలకు వెళ్లే పైప్‌లైన్‌కు నీరు రావటం లేదని, దీనికి అనధికార పైపులే కారణమని వాటిని తొలగించి, తమకు నీరివ్వాలని కోరుతూ, ఆయా గ్రామాల వారు ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకే వారిచ్చిన ఆదేశాలతోనే పైపులను తొలగిస్తున్నామని ఏఈ ప్రజలకు వివరించారు. అయితే ఆ కాపీని చూపాలని ప్రజలు పట్టుబట్టారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక ప్రజలంతా గ్రామ సచివాలయ భవనం వద్ద రోడ్డుపై బైటాయించి ధర్నాకు దిగారు. అధికారులు సచివాలయం వద్దకు చేరుకుగా, జనం సచివాలయాన్ని ముట్టడించి, వాగ్వాదానికి దిగారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకోగా, అధికారులు పోలీసుల సాయంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. గ్రామం చుట్టూ పదుల సంఖ్యలో ఓఎన్‌జీసీ రిగ్గులు ఉన్నప్పటికీ గ్రామాభివృద్ధికి ఏ మాత్రం సాయం చేయటం లేదని గ్రామస్థులు ఆరోపించారు. తమకు తాగునీటి ప్రత్యామ్నాయం చూపకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఘనంగా ముగిసిన కూచిపూడి నాట్యాంశాలు

కూచిపూడి, మార్చి 26 : బాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా వారంరోజులపాటు సాగిన కూచిపూడి నాట్యాంశాలు మంగళవారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. అరుణ్ రాజ్ కుమార్ (వరంగల్) శిష్య బృందం థిల్లానా, హనుమాన్ చాలీసా, శివాష్టకం అంశాలు ప్రదర్శించగా.. సీతాలక్ష్మి ప్రసాద్ (కొత్తగూడెం) శిష్యబృందం శ్రీనివాస నృత్యరూపకంతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని గావించారు. సీతారత్న లలితా కళానృత్యనికేతన్ (కాకినాడకు) చెందిన విజయలక్ష్మీ శిష్యబృందం గంగం గణపతి, పుష్పాంజలి, చక్కని తల్లికి చాంగుభళా, నాట్యాంజలి అంశాలు ప్రదర్శించగా, కూచిపూడి నృత్యాలయ, త్రినాథాచారి శిష్యబృందం (విజయవాడ) కొలువైతివా రంగసాయి, ఆనంద తాండవమాడె అంశాలు ప్రదర్శించారు. రమణకుమారి శిష్యురాలు పుణ్యకీర్తి (విజయనగరం)కు చెందిన కొలువై ఉన్నాడే దేవదేవుడు, శంకరాభరణం తదితర అంశాలతో రంజింపచేశారు. నిర్వాహకులు, కళాకారులకు మెమెంటోలు అందించి ఘనంగా సత్కరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యామ్, కావూరి భానుమూర్తి, వై.ఫణికుమార్, దేవాలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



శ్రీనివాస కళ్యాణం నృత్య రూపం

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.00

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

వన్‌టౌన్, మార్చి 26: ఎన్నికలలో ప్రజలకు భరోసా కల్పిస్తూ, శాంతి, భద్రతల పరిరక్షణకు తామున్నామని చెబుతూ మంగళవారం కృష్ణలంకలో సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో 50 మంది సివిల్, ఏఆర్, పారా మిలటరీ విభాగాల ఫ్లాగ్‌మార్చ్ జరిగింది. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసులు అండగా ఉంటారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పించాల్సిన బాధ్యత కూడా పోలీసులదేనని తెలిపారు.



చంద్రబాబు పాలనలో యువతలో నైపుణ్యం పెంపుదలకు కృషి

గుణదల, మార్చి 26: చంద్రబాబు పాలనలో యువతలో నైపుణ్యత పెరిగేందుకు విశేష కృషి జరిగిందని, జగన్మోహనరెడ్డి పాలనలో యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా తయారయ్యారని గద్దె రాజేష్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 5వ డివిజన్లోని జయప్రకాష్ నగర్ 2, 3 రోడ్లలో మంగళవారం ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను గద్దే రాజేష్ పంపిణీ చేశారు. చంద్రబాబు మరోమారు ముఖ్యమంత్రి కావడం అనేది ఏపీకి చారిత్రాత్మక అవసరం అని అన్నారు. తూర్పులో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న గద్దె రామ్మోహన్‌ను మరోమారు సైకిల్ గుర్తుపై ఓట్లువేసి గెలిపించాలని కోరారు. గద్దే క్రాంతి, డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, ఎ. రామకృష్ణ, యలమంచలి రాజేష్, కట్టా జనార్ధన్, దోమకొండ రవి, కోడూరు సుబ్రహ్మణ్యం, షేక్ షరీఫ్, రాచమళ్ల ఆంజనేయులు, నర్రా సుబ్బారావు, పాలవలస కోటి, సిద్దెల ప్రభాకర్, వై.మోజెస్ పాల్గొన్నారు.



జయప్రకాష్ నగర్ 2, 3 రోడ్లలో ఎన్నికల ప్రచారంలో గద్దె రాజేష్, గద్దె క్రాంతి

మొగల్రాజపురం: గద్దె రామ్మోహన్ కుమారుడు గద్దె క్రాంతి బీజేపీ, జనసేన బలపరిచిన తూర్పు ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ల విజయాన్ని కాంక్షిస్తు 8వ డివిజన్ గాయత్రీనగర్ కంచుకోట వారి వీధిలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి చెబుతూ సైకిల్ గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేశారు. కార్పొరేటర్ సీహెచ్, ఉషారాణి, జె. లక్ష్మీపతి, ఎం. రామకృష్ణ, జి. వెంకటేశ్వర్లు, కె. రమేష్, రమణి , ఎన్.రామారావు, బి.భవానీ, కె.సురేష్, ఎస్. శివకుమార్ పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ

వన్‌టౌన్, మార్చి 26: క్షయవ్యాధి నిర్మూలన దినం పురస్కరించుకుని స్థానిక పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జున రావు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు, రోటరాక్ట్ క్లబ్, సైన్స్, హ్యూమానిటీస్, ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ఏడాది ప్రకటించిన థీమ్ మేరకు 'అవును మేము క్షయవ్యాధిని నివారించగలం' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. రోటరాక్ట్ క్లబ్ ఫ్యాకల్టీ కో -ఆర్డినేటర్ డాక్టర్ పి.నరేష్, సైన్స్ హ్యూమానిటీస్ హెడ్ ఏ.రమాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీకాంతరెడ్డి, కో -ఆర్డినేటర్ బి.నవీన్‌కుమార్, రోటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ కే.సాకేత్, కార్యదర్శి ఉమామహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ ఆశ్రిత్, సార్జంట్ మనోజ్, కమ్యూనిటీ సర్వీసెస్ డైరెక్టర్ శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు

బాలికను వేధిస్తున్న వ్యక్తిపై పోక్సో కేసు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 26 : బాలికను వేధిస్తున్న ఓ వ్యక్తిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతానికి చెందిన బాలిక(15)ను అనుసరిస్తూ సోమవారం ఓ వ్యక్తి ఇంటి వరకు వెళ్లాడు. బాలిక ఇంట్లోకి వెళ్లి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. బాలిక తండ్రి సదరు వ్యక్తిని ప్రశ్నించగా దాడికి పాల్పడ్డాడు. బాధితుడు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో కేసులో

అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన బాలిక(16)స్కూల్‌కి వెళ్లి వస్తుండగా మార్గ మధ్యంలో ఓ యువకుడు ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడుతున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్: ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం ఎక్సెల్‌ప్లాంట్ జీ ప్లస్ త్రీ అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న యువతి(18) బీటెక్ చదువుతుంది. సోమ వారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని మృతి చెందింది. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారాచ్యూట్‌లలో దిగే నాయకులు పశ్చిమకు వద్దు

● బీసీ నాయకుడు బుద్దా దివాకర్‌బాబు

వన్‌టౌన్, మార్చి 26: పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు పారాచ్యూట్‌లలో దిగే నాయకులు వద్దని, పోతిన మహేశ్‌కు సీటు ఇస్తే తప్పక గెలుస్తాడని వేరేవారికి ఎవ్వరికి ఇచ్చినా ఓడిపోతారని బీసీ నాయకుడు బుద్దా దివాకర్‌బాబు అన్నారు. కొత్తపేటలోని జనసేన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనసేన నగర సంయుక్త కార్యదర్శి గన్ను శంకర్, ఆకారపు విజయకుమారిలతో కలిసి ఆయన మాట్లాడారు. నియోజకవర్గ సరిహద్దులు కూడా తెలియని వారికి సీటు కేటాయిస్తే గెలుస్తారో లేదో కూడా తెలియదన్నారు. అటువంటి నాయకులు పశ్చిమకు వద్దని స్పష్టం చేశారు. న్యాయం, ధర్మం గెలవాలంటే పోతిన మహేశ్‌కు సీటు కేటాయించాలని తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. సోమి గోవింద్, సిగనంశెట్టి రాము, అడ్డూరి తమ్మారావు, షేక్ షర్మిల, తమ్మిన రఘు, మోబీనా, పులిచేరి రమేష్, కార్తీక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడికి పాల్పడ్డ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

● గార్లపాటి విజయకుమార్

సత్యనారాయణపురం, మార్చి 26: కాకినాడలోని దేవాలయంలో అర్చకులపై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్రబ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు గార్లపాటి విజయకుమార్ అన్నారు. 33వ డివిజన్ సత్యనారాయణపురం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకినాడ శివాలయంలో అర్చకులుగా పని చేస్తున్న సాయి శర్మ, విజయకుమార్ శర్మలపై ఆలయంలో దాడికి పాల్పడటం దుర్మార్గం అన్నారు. అర్చకులను కాళ్లతో తన్ని భౌతిక దాడికి దిగిన మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రశేఖర్ పై కేసు నమోదు చేసి తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడికి మద్దతు ఇస్తున్న ఈవో, కాకినాడ జిల్లా దేవదాయ శాఖ అధికారుల పై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. శంకర మనోజ్, కాశీనాథుని సుధాకర్, సుబ్రహ్మణ్య శర్మ, శంకరసాయి, రవి పాల్గొన్నారు.



సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల తనిఖీ

వన్‌టౌన్, మార్చి 26: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్‌బూత్‌లను మంగళవారం వెస్ట్ డివిజన్ ఏసీపీ పి.మురళీకృష్ణారెడ్డి, వన్‌టౌన్ సీఐ దుర్గాశేఖర్‌రెడ్డి, ఎస్ఐ వి.రమ్యశ్రీ సత్యలు ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పోలింగ్‌కు అవరోధాలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఏసీపీ తగు సూచనలు చేశారు.

అక్రమ అంతస్థు నిర్మాణం తొలగింపు



భవానీపురం, మార్చి 26 : 43వ డివిజన్ ఊర్మిళానగర్ బ్రహ్మంగారి గుడి సమీపంలో అనుమతి లేకుండా అక్రమంగా ఓ అంతస్థు నిర్మాణ పనులపై టౌన్‌ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాసరావుకు అందిన ఫిర్యాదు మేరకు ఆయన సిబ్బందిని పంపించి అక్రమంగా నాలుగో అంతస్థు నిర్మాణం కోసం పెట్టిన కర్రలను కూల్చేయించారు. అనుమతి లేకుండా అదనంగా ఎవరైనా ఫ్లోర్‌లను వేస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

శాంతిభద్రతల రక్షణ కమ్యూనిస్టులకే సాధ్యం

మార్పు కోసం సీపీఎం పాదయాత్ర కార్యక్రమంలో సీహెచ్ బాబూరావు

సత్యనారాయణపురం, మార్చి 26: నగరంలో శాంతిభద్రతలు కాపాడి రౌడీయిజాన్ని ఎదుర్కోవడం కమ్యూనిస్టులకే సాధ్యం అని సీపీఎం రాష్ట్రకార్యవర్గదర్శి సభ్యులు సీహెచ్ బాబూరావు అన్నారు. 27వ డివిజన్ దుర్గాపురం, బావాజీపేటలో మంగళవారం మార్పు కోసం సీపీఎం పాదయాత్ర జరిగింది. ఈ సందర్భంగా బాబూరావు ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధికి కేంద్రంగా మారుస్తామని చెప్పి నేడు గంజాయి, మత్తు పదార్థాల కేంద్రంగా ప్రభుత్వం మార్చిందన్నారు. మద్యాన్ని దశలవారీగా నిషేధిస్తామని హామీ ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజలకు రక్షణగా నిలిచే సీపీఎంను సెంట్రల్‌లో గెలిపించాలన్నారు. సీపీఎం నేతలు బి. రమణారావు, ఎన్.శ్రీనివాస్, ప్రవీణ్, శివ, బాలాజీ స్వామి ఆశా, షకీలా పాల్గొన్నారు.



సీపీఎం పాదయాత్రలో సీహెచ్ బాబూరావు

బీజేపీ అభ్యర్థుల విజయం కోరుతూ పూజలు



దుర్గమ్మకు కొబ్బరికాయలు కొట్టిన బీజేపీ మహిళా మోర్చా సభ్యులు

వన్‌టౌన్, మార్చి 26: రానున్న ఎన్నికల్లో బీజేపీ-టీడీపీ-జనసేన ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలలో గెలవాలంటూ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఎర్ర సునీత ఆధ్వర్యంలో మంగళవారం దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద 108 టెంకాయలను సమర్పించారు. మూడవ సారి బీజేపీ అధికారంలోకి వచ్చి నరేంద్రమోదీ ప్రధాని కావాలని ఆకాంక్షిస్తూ కొబ్బరికాయలు కొట్టినట్లు నాయకులు పేర్కొన్నారు. ఉమ్మి అన్నపూర్ణ, చింతా రమాదేవి, ఇమ్మడిశెట్టి సుమతి, కోలపల్లి గణేష్, అవ్వారు శ్రీనివాసరావు (బుల్లబ్బాయ్), నున్న కృష్ణ, పచ్చిపులుసు ప్రసాద్, రఘురాములు, పొట్నూరు దుర్గాప్రసాద్, ఎర్ర రవి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రైమ్స్ అండ్ స్టోరీ టెల్లింగ్ పోటీలు

భారతీనగర్, మార్చి 26: కొరెస్సీనగర్ కాలనీలోని నారాయణ స్కూల్‌లో కిడ్స్ విభాగంలో (నర్సరీ, ఎల్‌కేజి, యూకేజి) చిన్నారులకు రైమ్స్ అండ్ స్టోరీ టెల్లింగ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో నగరంలోని ఆరు బ్రాంచీల చిన్నారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా నారాయణ స్కూల్స్ ఏజీఎం మురళీకిషోర్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్ఐలు, ప్రిన్సిపాల్స్, కిడ్స్ కో ఆర్డినేటర్లు, వైస్ ప్రిన్సిపాల్స్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, మార్చి 26: రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వహక ఇంజనీర్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరనగర్ (1,2,3) రోడ్లు, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, స్పెన్సర్ సర్వీస్ రోడ్డు, సెంటీని హాస్పిటల్ ఏరియా, ఓల్డ్ వినాయక సినిమాహాల్ ఏరియా, ఒయాసిస్ హాస్పిటల్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



సత్యనారాయణపురం, మార్చి 26: శ్రీనగర్ కాలనీ రెండవలైన్‌లో మ్యాన్‌హోల్ మూత లేక పోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎవరూ పట్టించుకోక పోవడంతో స్థానికులు దానికి అడ్డంగా దుంగలు పెట్టారు. రాత్రి సమయంలో లైటు వెలుతురు సరిగా లేక పోవడంతో వాహనదారులకు మ్యాన్‌హోల్‌కు అడ్డంగా ఉన్న దుంగలు కనిపించక తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. కార్లు, ఆటోలు వెళ్లాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తోందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శంకుస్థాపన చేసి వదిలేసిన రోడ్డు


శంకుస్థాపన చేశారు...మరిచారు

సత్యనారాయణపురం, మార్చి 26: వారంలో రోడ్డు రూపు రేఖలు మారుస్తామన్నారు. మళ్లా కనిపించ లేదు. వివరాలలోకి వెళితే 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్ మెయిన్ రోడ్డు, పలు అంతర్గత రోడ్లకు ఎన్నికల కోడ్‌కు రెండు రోజుల ముందు స్థానిక కార్పొరేటర్ జానారెడ్డితో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు శంకుస్థాపన చేశారు. వారం రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని, ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రగల్భాలు పలికారు. ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడలేదు. గద్దే వెంకట్రామయ్య నగర్ మెయిన్ రోడ్డులో వాహనాలు వెళుతుంటే దుమ్ము ధూళి పెద్దెత్తున లేస్తోందని, ఒక్కొక్కసారి ముందు వెళ్లే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు, పాదచారులు ముక్కులకు గుడ్డలు కట్టుకుని ఆ రోడ్డులో వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఉచిత శిక్షణ


భారతీనగర్, మార్చి 26: 2024-25 విద్యాసంవత్సరానికి పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశించేదుకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 24 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతుల నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఒకటో తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్షలు రాసి పాలిటెక్నిక్ కోర్సులలో చేరే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాల ప్రధాన కార్యాలయం, 9492685021 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని అన్నారు.

రాముడి కోసం రెడీ అవుతున్న రణ్‌బీర్



బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి పాత్ర కోసం మానసికంగా, శారీరకంగా సిద్ధమవుతున్నారు. శ్రీరాముడు బాణం వేసి శత్రువుల్ని మట్టుపెట్టడంలో ఆరితేరిన వ్యక్తి కనుక రణ్‌బీర్ ఇప్పుడు విలువిద్య మీద దృష్టి పెట్టారు. విలువిద్యలో ఆయన శిక్షణ పొందుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అలాగే శారీరకంగా మరింత ధృడంగా కనిపించడం కోసం ఎక్కువ సమయం జిమ్‌లోనే గడుపుతున్నారు. 'రామాయణ్' షూటింగ్ ఎప్పుడు మొదలవుతుంది, ఎవరెవరు ఏ ఏ పాత్రలు పోషిస్తున్నారనే అధికారిక సమాచారాన్ని శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 17న దర్శకుడు నితిశ్ తివారి వెల్లడించనున్నారు. ఒక అద్భుతమైన దృశ్య కావ్యంగా ఈ చిత్రాన్ని రూపొందించడం కోసం నితిశ్, ఆయన టీమ్ ఐదేళ్లగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేస్తోంది. ఎటువంటి విమర్శలకు తావు లేకుండా స్ర్కిప్ట్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే విజువల్ ఎఫెక్ట్స్ అత్యద్భుతంగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. సీతగా సాయిపల్లవి, రావణునిగా యశ్ నటించే 'రామాయణ్' చిత్రం 2025 దీపావళికి విడుదల అవుతుంది.

150 థియేటర్లలో జరగండి పాట



రామ్‌చరణ్, తమిళ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్‌రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని అనౌన్స్ చేసిన రోజు నుంచే భారీ అంచనాలు ఏర్పడి, రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూస్తామా అనే ఆసక్తి చాలా మందిలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా రామ్‌చరణ్‌కు ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని 'గేమ్ ఛేంజర్' చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకనిర్మాతలు. బుధవారం రామ్‌చరణ్ పుట్టిన రోజు కావడంతో ఈ సినిమా నుంచి 'జరగండి' అనే పాటను విడుదల చేస్తున్నారు. 150 థియేటర్లలో ఈ పాటను ప్రత్యేకంగా ప్రదర్శిస్తుండడం విశేషం. సంగీత దర్శకుడు తమన్ ఈ సినిమాకు సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. కియారా అద్వాణి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కార్తిక్ సుబ్బరాజు అందించిన కథకు సాయిమాధవ్ బుర్రా మాటలు రాశారు. తిరుణ్ణావుక్కరసు ఛాయాగ్రాహకుడు.

యాక్షన్ ప్యాక్డ్ షెడ్యూల్‌లో మిస్టర్ బచ్చన్



రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో తెరకెక్కుతోన్న మూడో చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్‌తో సునా హోగా' అనేది ఉపశీర్షిక. భాగ్యశ్రీ బోర్సే ఇందులో హీరోయిన్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా యాక్షన్ ప్యాక్డ్ షెడ్యూల్ లక్నోలో మొదలైంది. ఈ కీలక షెడ్యూల్‌లో పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించనున్నారు. ఈ యాక్షన్ బ్లాక్స్ చిత్రానికే హైలెట్‌గా ఉండబోతున్నాయి. మునుపెన్నడూ చూడని సరికొత్త రవితేజను ఇందులో చూపించబోతున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. ఈ చిత్రానికి నిర్మాత: టీజీ విశ్వ ప్రసాద్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎడిటింగ్: ఉజ్వల్ కులకర్ణి, డీఓపీ: అయనంక బోస్, సంగీతం: మిక్కీ జే మేయర్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాశ్ కొల్లా.



హాట్‌గా కనిపించడం కష్టమే!

'ప్రేమం'తో కుర్రకారు మతిపోగొట్టి.. గర్ల్ నెక్స్ట్ డోర్ పాత్రలతో మెప్పించారు క్యూట్ బ్యూటీ అనుపమా పరమేశ్వరన్. ప్రస్తుతం ఆమె 'టిల్లు స్క్వేర్' చిత్రంలో హాట్‌హాట్‌గా కనిపించడం టాక్ ఆఫ్ ది టౌన్ అయ్యింది. ఈ నెల 29న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆమె ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో లిల్లీ పాత్ర గురించి మాట్లాడారు. లిల్లీ పాత్రలో చాలా లేయర్స్ ఉంటాయి. ఈ సినిమాలో నేను వేసుకున్న డ్రెస్సులు రియల్ లైఫ్‌లో అస్సలు వేసుకోలేను. స్ర్కీన్‌పైన హాట్‌గా కనిపించాలంటే ఎంత కష్టమో ఈ చిత్రంతోనే తెలిసొచ్చింది. ఇప్పటివరకూ పక్కింటి అమ్మాయి పాత్రలు చేసే నేను ఒక్కసారిగా ఇలా గ్లామరస్ రోల్ చేయడంతో చాలా మంది ఆశ్చర్యపోయారు. నిజానికి ఇలా గ్లామరస్ రోల్స్ చేసే సమయంలో వేసుకునే డ్రెస్సులు అసౌకర్యంగానే ఉంటాయి. ఇప్పటివరకూ ఇలాంటి రోల్స్ చేసిన హీరోయిన్స్‌ను మెచ్చుకోవాల్సిందే. ఇందులో నా బాడీ లాంగ్వేజ్ మునుపటి చిత్రాలతో పోలిస్తే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. లిల్లీ పాత్రలో సరికొత్త అనుపమను చూస్తారు" అని చెప్పారు.

పిల్లల్ని ఎలా పెంచాలో చూపించాం

'అల్లంత దూరాన', 'కళా పోషకులు', 'జై సేన' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు చేరువయ్యారు యంగ్ హీరో విశ్వ కార్తికేయ. ప్రస్తుతం ఆయన నటించిన 'కలియుగం పట్టణంలో' చిత్రం ఈ నెల 29న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా విశ్వ కార్తికేయ, మంగళవారం మీడియాతో ఈ చిత్రం గురించి పలు ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు.



"ప్రతీ ఒక్కరిలో వివిధ రకాల షేడ్స్ ఉంటాయి. వాటిని చూపించేలా ఈ చిత్రం ఉంటుంది. ఛాలెంజింగ్ రోల్స్ చేయాలని అనుకుంటున్న సమయంలోనే నేను ఈ కథ విన్నాను. దర్శకుడు రమాకాంత్ రెడ్డి ఈ కథ చెప్పిన విధానానికి ఆశ్చర్యపోయాను. క్లైమాక్స్ వరకు ఏం జరుగుతుందో కనిపెట్టలేకపోయాను. అందుకే సెకండ్ థాట్ లేకుండా ఈ చిత్రంలో నటించడానికి ఒప్పేసుకున్నా. ఈ సినిమాలో ప్రతీ పాత్రను దర్శకుడు చక్కగా మలిచారు. అన్ని క్యారెక్టర్లకు టూ షేడ్స్ ఉంటాయి. ఈ చిత్రం సస్పెన్స్ థ్రిల్లర్. ఇందులో ఉన్న మదర్ సెంటిమెంట్ ప్రేక్షకుల్ని భావోద్వేగానికి గురిచేస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఎలిమెంట్స్ ఉన్నాయి. ఈ చిత్రం నా కెరీర్‌లోనే ఎంతో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ సినిమాలో సమాజంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, పిల్లల్ని తల్లిదండ్రులు సరిగ్గా పెంచకపోతే ఎలా ఉంటుందో చూపించాం. ఇందులో క్రైమ్ సీన్లను కూడా సరికొత్తగా ప్రజంట్ చేశాం. 'కలియుగం పట్టణంలో' టెక్నికల్‌గా ఎంతో బాగుంటుంది. కెమెరా వర్క్‌కు అందరూ ఆశ్చర్యపోతారు. పాటలు, రీ రికార్డింగ్ అద్భుతంగా వచ్చాయి. అజయ్ మాకు మంచి సంగీతాన్ని ఇచ్చారు. ప్రస్తుతం ఇండోనేషియన్ సినిమాలో నటిస్తున్నాను. మంత్ర, తంత్రాలు, చేతబడుల నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది" అని చెప్పారు.

లవ్ గురు ప్రేమ పాట్లు



వైవిధ్యమైన సినిమాలను ప్రేక్షకులకు అందిస్తున్న తమిళ నటుడు విజయ్ ఆంటోని తాజా చిత్రం 'లవ్ గురు'. తొలిసారిగా రొమాంటిక్ ఎంటర్‌టైనర్ జానర్‌లో ఆయన చేసిన సినిమా ఇది. దీనికి నిర్మాత కూడా ఆయనే. మృణాలిని రవి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వం వహించారు. రంజాన్ పండగ సందర్భంగా ఏప్రిల్ 11న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా విడుదల చేస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. పెళ్లి అంటే ఇష్టం లేకపోయినా తండ్రి మాట కాదనలేక పెళ్లికి అంగీకరిస్తుంది ప్రియ. కానీ కాబోయే భర్తకు కొన్ని కండిషన్స్ పెడుతుంది. ఆమె అంటే ఇష్టం ఉన్న లవ్ గురు ఆ షరతులకు అంగీకరిస్తాడు. కానీ పెళ్లయ్యాక కానీ వాటిలో ఉన్న ఇబ్బందులు అర్థం కావు. ఆ సమస్యల నుంచి హీరో ఎలా బయట పడ్డాడు, భార్య ప్రేమను ఎలా పొందగలిగాడు.. అనే అంశాల్ని ఈ ట్రైలర్‌లో వినోదాత్మకంగా చూపించారు. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే విధంగా సినిమాను తీర్చిదిదినట్లు దర్శకనిర్మాతలు చెప్పారు.

మళ్లీ రావాలనుకుంటున్నా

'పెళ్లాం ఊరెళితే', 'ఇంద్ర' వంటి చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించిన ప్రశాంతి హారతి ఆ తర్వాత పెళ్లి చేసుకుని అమెరికాలో స్థిరపడ్డారు. ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టడానికి సిద్ధమవుతున్న ప్రశాంతి హారతి మీడియాతో ముచ్చటించారు.



"నాకు చిన్నప్పటి నుంచి ఆర్ట్స్ అంటే ఇష్టం. కూచిపూడి నేర్చుకున్నాను. కొన్ని ఫొటోషూట్స్ చేశాను. అవి చూసి కొన్ని సినిమాల్లో అవకాశాలు ఇచ్చారు. అలా శ్రీనివాసరెడ్డి డైరెక్ట్ చేసిన 'ఫిబ్రవరి 14 నెక్లెస్ రోడ్' సినిమాతో హీరోయిన్‌గా అడుగుపెట్టాను. ఆ తర్వాత మణిశర్మ నిర్మించిన 'రూపాయి' చిత్రంలోనూ నటించాను. 'ఇంద్ర', 'పెళ్లాం ఊరెళితే' చిత్రాలు నటిగా నాకు మంచి గుర్తింపు ఇచ్చాయి. పెళ్లయ్యాక మా వారితో యూఎస్ వెళ్లాను. అక్కడ ఓంకార అనే కూచిపూడి డ్యాన్స్ స్కూల్ ప్రారంభించాను. మన నృత్యరూపకాలు రేపటి తరానికి కూడా అందాలనేది నా కోరిక. మా పాప తాన్యతో 'తెలుగింటి సంస్కృతి' మ్యూజిక్ వీడియో రూపొందించాం. తాన్యకు ఇప్పుడు 16 ఏళ్లు. తన ఏజ్ కు తగిన మంచి అవకాశం వస్తే తనను కూడా సినిమా ఇండస్ట్రీకి పంపేందుకు మా ఫ్యామిలీకి అభ్యంతరం లేదు. నేను యాక్టింగ్ కోర్సులు నేర్చుకోలేదు. అయితే క్లాసికల్ డ్యాన్సర్‌ను కాబట్టి నటిగా భావోద్వేగాలు పలికించడం తేలికయ్యేది. ఈ ఆత్మవిశ్వాసంతోనే సినిమాలు, సీరియల్స్ చేశాను. వెబ్ సిరీస్‌లు, ఓటీటీల వల్ల ఎంతో మంది నటీనటులకు చాలా మంచి అవకాశాలు వస్తున్నాయి. ఈ అవకాశాలు చూసే మళ్లీ టాలీవుడ్‌కు రావాలనుకుంటున్నా" అని చెప్పారు.



యథార్థ సంఘటన ఆధారంగా

ఒక యథార్థ సంఘటన స్ఫూర్తితో రూపుదిద్దుకొన్న మలయాళ చిత్రం 'మంజుమ్మెల్ బాయ్స్' సంచలన విజయం సాధించింది. ప్రపంచ మార్కెట్‌లో రూ. 200 కోట్లు సంపాదించిన తొలి మలయాళ చిత్రంగా చరిత్ర సృష్టించింది. సౌబిన్ షాహిర్, గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్ బాసి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి చిదంబరం ఎస్ పొదువల్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా హక్కుల్ని కొన్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 6న తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. 2006లో కొడైకెనాల్‌లోని గుణ కేవ్‌లో చిక్కుకున్న తమ స్నేహితుడిని రక్షించిన ఎర్నాకులం మంజుమ్మెల్ యువకుల అనుభవాల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి ఈ చిత్రాన్ని అదే టైటిల్‌తో తెలుగులో అందిస్తున్నారు.

అభిరుచి



మనసంతా భారతీయ చిత్రమే

ఇది ఒక 'చిత్ర'మైన కథ. భారతీయ సినిమా ప్రచారానికి జపాన్‌లో అనధికారిక రాయబారిగా వ్యవహరిస్తున్న ఓ మహిళ కథ. సంజీవ్‌కుమార్, ముంతాజ్‌ల 'ఖిలోనా'తో మొదలైన ఈ అనుబంధం... ఐదు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికి యాభైసార్లకు పైగా భారత్‌కు వచ్చి... మన చిత్రానికి తన దేశంలో పట్టం కడుతున్న జపాన్ సినీ ప్రేమికురాలు టమకి మత్సువోక కథ ఇది...

సగటు సినీ ప్రియులకు భిన్నం టమకి మత్సువోక. ఆమె దృష్టిలో సినిమా అంటే థియేటర్ బయటకు రాగానే మరిచిపోయే ఒక వినోద సాధనం మాత్రమే కాదు... ఎన్నో భావోద్వేగాలతో ముడిపడిన బంధం. మల్టీప్లెక్స్‌లు విస్తరించిన యుగంలోనూ సంప్రదాయ సింగిల్ స్క్రీన్ థియేటర్ల వైపు చూసే ఆమెకు... భారతీయ చిత్రాలు అంటే ఎనలేని మక్కువ... ప్రేమ. అంతేకాదు... భారతీయ సంస్కృతి, సంప్రదాయాలన్నా టమకికి గౌరవం. ఆ ఇష్టంతోనే ఇప్పటికి యాభైసార్లకు పైగా భారత్‌కు వచ్చి వెళ్లారు. ఒలింపస్ కెమెరా ఒకటి ఎప్పుడూ ఆమె చేతిలో ఉంటుంది. 'సినీ' విశేషాలన్నిటినీ ఆ లెన్స్‌లో బంధించడం ఆమెకు అలవాటు. ఇటీవల ముంబయికి వచ్చిన ఆమె... నగరమంతా తిరుగుతూ చాలా బిజీగా కనిపించారు. ప్రతి కార్యక్రమంలోనూ చక్కని చీర కట్టులో ఆకట్టుకున్నారు.

కథ మార్చిన కథలు...

ఇంతకీ మన చలన చిత్రాలంటే అంతటి ఇష్టం ఆమెకు ఎందుకు కలిగింది? దీని వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. అది తెలియాలంటే... ఒకసారి టమకి యుక్త వయసులోకి వెళ్లాలి. అది 1967. జపాన్ 'ఒసాకా యూనివర్సిటీ ఆఫ్ ఫారిన్ స్టడీస్' (ఓయూఎఫ్ఎస్)లో చదివే రోజులు. ఒక రోజు ప్రొఫెసర్ రెండు దిన పత్రికలు తీసుకువచ్చి విద్యార్థుల ముందు పెట్టారు. 'ఈ రెండిటిలో మీరు ఏ భాష చదవాలనుకొంటున్నారు' అని ప్రొఫెసర్ అడిగారు. వాటిల్లో ఒకటి హిందీ పత్రిక కాగా, రెండోది ఉర్దూ. 'చూడ్డానికి కాస్త సులువుగా అనిపించి హిందీని ఎంచుకున్నా. తరువాత ప్రేమ్‌చంద్ కథలు చదవమని మా ప్రొఫెసర్ చెప్పారు. ఆ కథలే నా కథను మార్చేశాయి. భారతీయ సంస్కృతిపై మక్కువ, ఆసక్తి కలిగించాయి' అంటూ గతాన్ని గుర్తు చేసుకున్నారు టమకి.

మరో మలుపు...

అంతటితో అయిపోలేదు. ఎంఏ హిందీ లిటరేచర్ కోసం 1971లో 'టోక్యో యూనివర్సిటీ ఆఫ్ ఫారిన్ స్టడీస్' (టీయూఎఫ్ఎస్)లో చేరారు టమకి. అక్కడ ఆమెకు మరో కొత్త సమస్య వచ్చి పడింది. "నువ్వు హిందీ బాగా చదువుతున్నావు. రాస్తున్నావు. కానీ స్పష్టంగా మాట్లాడలేకపోతున్నావు. విన్నది సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నావు. భాషలో మెరుగవ్వాలంటే థియేటర్‌కు వెళ్లి హిందీ చిత్రాలు చూడు' అని ప్రొఫెసర్ సూచించారు. అప్పట్లో భారత ఎంబసీ జపాన్‌లోని భారతీయుల కోసం ఏడాదికి ఒకసారి హిందీ చిత్రాలు ప్రదర్శించేది. అలా 'ఖిలోనా' చూశాను. అందులో సంజీవ్‌కుమార్ నటన నన్ను విపరీతంగా ఆకట్టుకుంది. మొత్తంగా కథ, కథనం బాగా నచ్చాయి. అది మొదలు... భారతీయ చిత్రాలే కాదు, సంస్కృతి, సంప్రదాయాల గురించి కూడా తెలుసుకోవాలన్న ఆసక్తి అధికమైంది" అంటూ నాటి సంగతులు చెప్పుకొచ్చారు టమకి.

ఇక్కడి చిత్రం... అక్కడ ఉత్సవం...

ఎప్పుడు భారత్ వచ్చినా సింగిల్‌స్క్రీన్ థియేటర్‌లో సినిమా వీక్షించడానికే అధిక ప్రాధాన్యం ఇస్తారు టమకి. వాటిల్లో చూసిన అనుభూతి మల్టీప్లెక్స్‌ల్లో రాదంటారు. ఈ యాభై ఏళ్ల భారత ప్రయాణంలో రెండొందలకు పైగా సినీ పాటల పుస్తకాలు, స్క్రిప్ట్స్, పోస్టర్లు, ప్రమోషనల్ బుక్‌లెట్స్ ఎన్నో సేకరించి భద్రపరుచుకున్నారు. కొన్నిటిని 'ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్' (ఎఫ్‌హెచ్ఎఫ్)కు విరాళంగా ఇచ్చారు. అన్నిటికంటే ముఖ్యంగా కొన్నేళ్లుగా జపాన్‌లో భారతీయ చిత్రోత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు టమకి. వాటిల్లో ఒక్క హిందీనే కాకుండా ఇతర భారతీయ భాషా చిత్రాలు కూడా ఉన్నాయి.

'గతంలో సత్యజిత్‌రే చిత్రాలను ఆదరించిన జపాన్‌వాసులు ప్రస్తుతం దక్షిణభారత సినిమాలపై మక్కువ చూపుతున్నారు. వాటిల్లో 'బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ ప్రముఖంగా ఉన్నాయి' అంటారామె. జపాన్ ప్రేక్షకులకు, భారతీయ ప్రేక్షకులకు ఉన్న ప్రధాన వ్యత్యాసం ఏంటని అడిగితే... 'సినిమాను వీక్షించే విధానం' అంటారు టమకి. 'భారతీయ ప్రేక్షకులు సినిమాను ఆసాంతం ఆస్వాదిస్తారు. నవ్వుతారు. బాధపడతారు. ఈలలు వేస్తారు. చప్పట్లు కొడతారు. పూర్తి స్థాయిలో ఆస్వాదిస్తారు. కానీ జపాన్‌లో ప్రేక్షకులు నిశ్శబ్దంగా చూసి బయటకు వస్తారు' అంటూ చెప్పుకొచ్చారు టమకి. ఆమెకు బాగా ఇష్టమైన డైలాగ్ 'అచ్ఛా తో హమ్ చల్‌తీ హై'. దీన్ని ఆమె 'గుడ్‌బై గ్రీటింగ్‌'గా ఉపయోగిస్తారు.

'షోలే'కు అభిమాని...



టమకి ఆసక్తి భారతీయత వైపు మళ్లిన సమయంలోనే... టీయూఎఫ్ఎస్‌లో కోర్సును అర్థంతరంగా ఆపేశారు. అదే వర్సిటీకి అనుబంధంగా ఉన్న 'ఇనిస్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ లాంగ్వేజస్ అండ్ కల్చర్ ఆఫ్ ఆసియా అండ్ ఆఫ్రికా' (ఐఎల్‌సీఏఏ)లో చేరి, పరిశోధన మొదలుపెట్టారు. అందులో భాగంగానే 1975లో తొలిసారి ఆమె ముంబయికి వచ్చారు. లిబర్టీ థియేటర్‌లో రాజ్‌కపూర్, సులోచనా చటర్జీ నటించిన 'జాగ్తే రహో' చూశారు. అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లి ఆరు హిందీ చిత్రాలు వీక్షించారు. వాటిల్లో అమితాబ్ 'జంజీర్', 'షోలే' కూడా ఉన్నాయి. నాటి నుంచి టమకి యాభైసార్లకు పైగా భారత్‌కు వచ్చారు. '1980లో నా అభిమాన నటుడు అమితాబ్ బచ్చన్‌ను ఇంటర్వ్యూ చేసే అవకాశం లభించింది. మేమిద్దరం హిందీలోనే మాట్లాడుకున్నాం' అంటున్న టమకి ఆల్‌టైమ్ ఫేవరెట్ చిత్రం 'షోలే'.


కేన్సర్‌ను జయించిన విజేతలు

మార్చి 22న కెన్సింగ్టన్ ప్యాలెస్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్... కేట్ మిడిల్‌టన్ తనకు కేన్సర్ సోకినట్టు వీడియో పోస్ట్ చేయడంతో ప్రపంచమంతా ఒక్కసారిగా ఉలిక్కి పడింది. కేన్సర్ వ్యాధికి సెలబ్రిటీలు కూడా వినహాయింపు కాదని మరోసారి రుజువైంది. ఈ సందర్భంగా ఆ వ్యాధి మీద విజయం సాధించిన భారతీయ తారలను ఒకసారి గుర్తు చేసుకుందాం.

"గత రెండు నెలలుగా మా కుటుంబం మొత్తం గడ్డు రోజులను గడిపింది. అయితే అదృష్టవశాత్తూ, నా దగ్గరొక అద్భుతమైన వైద్య బృందం ఉంది. నా ఆరోగ్యం పట్ల కనబరిచిన శ్రద్ధకు వాళ్లకు నేనెంతో రుణపడి ఉంటాను. జనవరిలో లండన్‌లో నాకు పొత్తికడుపు ఆపరేషన్ జరిగింది. ఆ సమయంలో నాకున్న ఆరోగ్య సమస్యకూ కేన్సర్‌కూ సంబంధం లేదని వైద్యులు భావించారు. ఆ సర్జరీ విజయవంతమైంది. అయితే ఆపరేషన్ తర్వాత చేపట్టిన పరీక్షల్లో నాకు కేన్సర్ ఉందని తేలింది. దాంతో వైద్య బృందం నాకు ప్రివెంటివ్ కీమోథెరపీని సూచించింది. ప్రస్తుతం నేను చికిత్స ప్రథమ దశలో ఉన్నాను" అంటూ ఇన్‌స్టా వీడియోలో వివరించింది కేట్ మిడిల్‌టన్. 2024లోకి అడుగుపెట్టిన మూడు నెలల్లోపే రాయల్ ఫ్యామిలీకి చెందిన ముగ్గురు సభ్యులు కేన్సర్ బారిన పడ్డారు. ఇంగ్లండ్ రాజు మూడవ ఛార్లెస్‌కు కేన్సర్ సోకినట్టు బకింగ్‌హ్యామ్ ప్యాలెస్ ఫిబ్రవరి ఐదున ప్రకటించింది. అంతకు ముందు డచెస్ ఆఫ్ యార్క్, శారా ఫెర్గుసన్‌కు చర్మ కేన్సర్ సోకింది. ఈ ఏడాదిలో ఆవిడకు సోకిన రెండవ కేన్సర్ ఇది.



సోనాలి బింద్రే



2018లో బాలీవుడ్ తార సోనాలి బింద్రేకు స్టేజ్4 మెటాస్టాటిక్ కేన్సర్ నిర్ధారణ అయింది. ఆవిడ బ్రతికే అవకాశాలు కేవలం 30 శాతమే ఉన్నాయని కూడా వైద్యులు తేల్చేశారు. అయినా ఆ తార ఏమాత్రం కుంగిపోకుండా, థెరపీ సాగినంత కాలం తన ఫొటోలను షేర్ చేస్తూ ఉల్లాసంగా కనిపించింది. ప్రపంచ కేన్సర్ దినం సందర్భంగా మాట్లాడుతూ.... "కేన్సర్ ప్రయాణం కష్టతరమైనదే! అయితే ఆశావహ దృక్పథంతో ఆ వ్యాధితో పోరాడి, విజయం సాధించాలి" అంటూ కేన్సర్ రోగులను ప్రేరేపించింది. కేన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్న సోనాలి, చికిత్స కొనసాగినంత కాలం అంతులేని మనోధైర్యాన్ని ప్రదర్శించడం విశేషం.

మనీషా కొయిరాలా

"కేన్సర్ అనేది డెత్ సెంటెన్స్ కాదు". 2012లో నాల్గవ దశ ఒవేరియన్ కేన్సర్ నిర్ధారణ అయిన భారతీయ అగ్ర సినీ తార మనీషా కొయిరాలా మాటలివి. వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే అమెరికాలోని న్యూయార్క్ హాస్పిటల్‌లో ఏడాది పాటు చికిత్స తీసుకుని పూర్తిగా కోలుకున్నప్పటికీ ఆరేళ్ల పాటు వెండి తెరకు దూరంగా ఉండిపోయింది మనీషా. ఆ తర్వాత "హీల్డ్: హౌ కేన్సర్ గేవ్ మి ఎ న్యూ లైఫ్" అనే ఆటోబయాగ్రఫీ పుస్తకాన్ని రాసి, దాన్లో తన కేన్సర్ ప్రయాణాన్ని వివరించిందామె. కేన్సర్ నుంచి పూర్తిగా బయటపడిన మనీషా, భారతదేశంలో స్థానికంగా తయారైన మొట్టమొదటి సర్వైకల్ వ్యాక్సీన్‌ను లాంచ్ చేసిన సందర్భంగా ప్రసంగిస్తూ 'ఇదెంత క్లిష్టమైన ప్రయాణమో నాకు తెలుసు. కానీ మీరు అంతకు మించిన క్లిష్టమైన వ్యక్తులు" అని చెప్పి, కేన్సర్ రోగుల్లో ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేసింది.

లీసా రే

బొంబే డైయింగ్ మోడల్ లీసా రేకు అరుదైన, ప్రాణాంతకమైన మల్టిపుల్ మైలోమా అనే రక్త కేన్సర్ సోకింది. నాలుగు నెలల పాటు కీమో థెరపీ తీసుకున్న తర్వాత, మూల కణ మార్పిడి కూడా చేయించుకుందామె. 'క్లోజ్ టు బోన్' అనే తన ఆటోగ్రఫీలో ఆ వ్యాధి మీద తాను సాగించిన విజయవంతమైన పోరాటం గురించి వివరించిందామె. ది ఎల్లో డైరీస్ అనే తన వ్యక్తిగత బ్లాగ్‌లో మల్టిపుల్ మైలోమా అనుభవాల్ని స్పష్టంగా వివరించిందామె. కేన్సర్ నుంచి తాను పూర్తిగా కోలుకోవడానికి పోషకాహారంతో పాటు, ఆయుర్వేదం, ధ్యానం, కౌన్సెలింగ్‌లు ఎలా తోడ్పడ్డాయో కూడా బ్లాగ్‌లో వివరించింది లీసా రే!

తాహిరా కాశ్యప్

ప్రముఖ బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా సతీమణి తాహిరా కాశ్యప్ రొమ్ము కేన్సర్‌తో పోరాడిందనే విషయం అందరికీ తెలిసిందే! ఆవిడెప్పుడూ తన వ్యాధి గురించి దాచలేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలు ప్రేరణ పొందేలా తన కేన్సర్ ప్రయాణాన్ని డాక్యుమెంట్ చేసింది. 2019 జనవరిలో కేన్సర్ చికిత్సను ముగించుకున్న తాహిరా ప్రస్తుతం ఆ వ్యాధి నుంచి పూర్తిగా విముక్తి పొందింది. కీమోథెరపీ చికిత్స ప్రభావంతో తల వెంట్రుకలు రాలిపోయినప్పటికీ, ఏమాత్రం వెరవకుండా ఫొటోలు షేర్ చేసిన తాహిరా, తనకు కేన్సర్ సోకినప్పటి నుంచి, ఎర్లీ డిటెక్షన్ గురించి మహిళల్లో అవగాహన పెంచే ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

ఫ్యాషన్



పాత చీరలతో కొత్త డ్రస్సులు

వేలకు వేలు పోసి కొన్ని ఖరీదైన చీరలు ఫ్యాషన్‌కు కాలం చెల్లి, బీరవాలకే పరిమితమైపోతూ ఉంటాయి. మహిళలందరూ ఎదుర్కొనే బాధే ఇది. అయితే వాటిని కట్టుకోలేకపోతున్నామని బాధ పడకుండా, ఇదిగో పాత చీరలతో కొత్త డ్రస్సులు కుట్టించుకోండి.

శారీ డ్రస్

అటు చీరనూ, ఇటు డ్రస్సునూ తలపించే శారీ డ్రస్ లేటెస్ట్ ఫ్యాషన్. చీర లుక్ చెదరకుండా ఆధునికత ఉట్టిపడేలా ఇలా శారీ డ్రస్ కుట్టించుకుంటే ఈవినింగ్ పార్టీల్లో రెట్టింపు మోడర్న్‌గా కనిపించవచ్చు. సింథటిక్, కాటన్ చీరలను ఈ శారీ డ్రస్‌గా ఎంచుకోవచ్చు.



శారీ గౌన్

నారాయణ్‌పేట్ శారీలతో లాంగ్ అండ్ షార్ట్ గౌన్స్ కుట్టించుకోవడం ఇప్పుడు ఫ్యాషన్‌గా మారింది. జరీ అంచున్న చీరలను ఇందుకోసం ఎంచుకోవాలి. చేతులు, గౌను అంచులకు, ఛాతీ దగ్గర జరీ డిజైన్ వచ్చేలా కుట్టించుకోవాలి. సంప్రదాయ వేడుకల్లో ధరించడానికి ఈ కాటన్ శారీ గౌన్లు చాలా బాగుంటాయి.

వెల్వెట్ గౌన్

వెల్వెట్ మెటీరియల్ ఫ్యాన్సీ చీరలతో మోడర్న్ డ్రస్‌లు కుట్టించుకోవచ్చు. రబ్బర్ సిల్క్ మెటీరియల్ కూడా ఈ డ్రస్‌లకు చక్కగా నప్పుతుంది. కుచ్చులు, సెక్విన్లు, డోరీలు జోడిస్తే వెల్వెట్ గౌన్లతో ఆధునికంగా కనిపించవచ్చు. సింపుల్ జ్యువెలరీ, హైహీల్స్ జోడించి మరింత రిచ్ లుక్ తెప్పించవచ్చు.



పిల్లల్లో ఆత్మవిశ్వాసం...

చిన్నపిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించటం.. వారిలోని అతి భయాలను పోగొట్టే పని చేయాల్సింది పేరెంట్స్. ముఖ్యంగా పిల్లల్లో ఆత్మన్యూనత భావాన్ని పోగొట్టి.. ఆత్మవిశ్వాసం రెట్టింపు చేయాలంటే చిన్న టిప్స్ పాటించాల్సిందే.

- పిల్లలను నలుగురిలో అరవటం, కొట్టడం.. లాంటివి చేయటం వల్ల షేమ్‌గా ఫీలవుతారు. ఆ తర్వాత తోటి స్నేహితులతో మాట్లాడటానికి ఇష్టపడరు. అందుకే ఇలాంటివి చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కోప్పడకుండా.. పర్సనల్‌గా ఇది మంచి, చెడు అని చెప్పాలి. అప్పుడే పిల్లలు అర్థం చేసుకోగలరు.



- మీ పిల్లలో బలాలు, బలహీనతలు మీకు మాత్రమే తెలుసు. ఇతరుల పిల్లలతో పోల్చటం, మార్కులు విషయంలో తిట్టడంతో పాటు వారిలా ఉండాలని చెప్పటం చేయకూడదు. ఇలా చేస్తే పిల్లల్లో వారిపట్ల తక్కువ భావం కలుగుతుంది. కోపం పెరుగుతుంది. తద్వారా ఇతర ఇబ్బందులు వస్తాయి. వారిలో కాన్ఫిడెన్స్ పోకుండా ఉండాలంటే.. చిన్న పనులైనా మెచ్చుకోవాలి. వారి బలహీనతలు మీద మాట్లాడకుండా.. వారి బలాలను, వారి ప్రతిభను మనసారా మెచ్చుకోండి. అప్పుడే పిల్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
- కొన్ని వస్తువులు ఇవ్వకున్నా, ఇష్టమైన ఆహారం చేసిపెట్టకున్నా పిల్లలు అలుగుతారు. విషయం స్పష్టంగా నచ్చచెప్పాలి.
- పిల్లల మాటలను బాగా వినాలి. వారి మంచి పనులను ఎంకరేజ్ చేయాలి. అప్పుడే పిల్లలు మరింత ఆసక్తితో పని చేయగలరు. వారిలో ఆత్మవిశ్వాసం అధికమవుతుంది.

ఉదయం ఒక ఈవెంట్‌లో బంగారు పతకం... సాయంత్రం మరో ఈవెంట్‌లో స్వర్ణంతో పాటు జాతీయ రికార్డ్... లఖనవూలో ఇటీవల జరిగిన నేషనల్ జూనియర్ ఫెడరేషన్ కప్ పోటీల్లో ఏక్తా ప్రదీప్ డే సాధించిన ఘనతలివి. అడుగడుగునా అవరోధాలు ఎదురైనా... దృఢసంకల్పంతో వాటిని ఎదుర్కొన్న ఏక్తా ఇప్పుడు అథ్లెటిక్స్‌లో భారత్‌కు సరికొత్త ఆశాకిరణంగా ప్రశంసలందుకుంటోంది.



సవాళ్లకు ఎదురొడ్డి పతకాలు పట్టి

భోపాల్‌లోని మధ్యప్రదేశ్ రాష్ట్ర అథ్లెటిక్స్ అకాడమీ. కొన్ని నెలల క్రితం జరిగిన ట్రయల్స్‌లో పాల్గొనడానికి రాష్ట్రస్థాయి క్రీడాకారులు సిద్ధమయ్యారు. వారిలో ఒకరైన ఏక్తా ప్రదీప్ డే తన కాళ్లవైపు చూసుకుంది. ఆమె వేసుకున్న షూస్ చిరిగిపోయి, అడుగు భాగం ఊడి వచ్చేలా ఉన్నాయి. 'అలాంటి షూస్‌తో... తోటి అథ్లెట్లను అధిగమించి పరిగెత్తగలనా?' అనే సందేహం ఆమెకు లేదు. 'ఎంత వేగంగా లక్ష్యాన్ని చేరుకోగలను?' అనేదే ఆమె ఆలోచనంతా. ఎందుకంటే ఇంట్లో ఆర్థిక సమస్యలు మొదలు, వీధిలో అవహేళనల వరకూ ఎన్నో అనుభవాలను ఎదుర్కొంది. కానీ ఆమెలో ఆత్మవిశ్వాసం ఎప్పుడూ చెక్కుచెదరలేదు.

ప్రతి వస్తువూ తాకట్టు పెట్టి...

ఏక్తాది భోపాల్‌లో స్థిరపడిన బెంగాలీ కుటుంబం. రెండు గదుల ఇంట్లో... తల్లి, తండ్రి, తోబుట్టువులతో నివాసం. రెండు పూటలా తిండి కూడా గగనం. "అలాంటి పరిస్థితుల్లో అథ్లెట్ కావాలని నేను కన్న కలను నెరవేర్చుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాను" అంటుంది ఏక్తా. వారు నివసించే పంచశీల్‌నగర్ ప్రాంతం దొంగ సారా, మాదక ద్రవ్యాలకు, అసాంఘిక శక్తులకు అడ్డాగా పేరుపొందింది. ఆమె ప్రాక్టీస్‌కు వెళ్తుంటే... పోకిరీలు అభ్యంతకరమైన వ్యాఖ్యలు చేసేవారు.



"అన్నిటినీ సహనంతో దిగమింగుకొనేదాన్ని. పాఠశాల, జిల్లా స్థాయిలో సాధించిన విజయాలు ఎప్పటికప్పుడు నాకు ఉత్తేజం కలిగించేవి. పరిగెత్తడానికి సరైన షూస్ ఉండేవి కావు. సెకెండ్ హ్యాండ్ షూస్ కొనడం కూడా కష్టమయ్యేది. కానీ నా కుటుంబం నా మీద ఎంతో నమ్మకం ఉంచింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యానని తెలిసినప్పుడు... మా నాన్న మా ఇంట్లో కాస్త విలువైన ప్రతి వస్తువూ తాకట్టు పెట్టి డబ్బు తెచ్చారు. అప్పుడు నాకు కన్నీళ్లు ఆగలేదు" అంటుంది ఏక్తా.

ఇది ఎప్పటికీ ప్రత్యేకం...

కష్టాలు ఆమెను మరింత రాటుదేల్చాయి. భావోద్వేగాలను నియంత్రించుకోవడం, ప్రతికూలతలు ఎదురైనప్పుడు పట్టుదలగా ఎదురు నిలవడం తన తత్వంగా మార్చుకుంది. కోచ్ శివకుమార్ ప్రసాద్ ఆమె నైపుణ్యానికి మెరుగులు దిద్దారు. పోటీలకు సిద్ధం చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన ప్రోత్సాహంతో ట్రయల్స్‌లో సెలక్టయిన ఏక్తా... ఈ నెల 10న లక్నోలో జరిగిన నేషనల్ జూనియర్ ఫెడరేషన్ కప్ పోటీల్లో పాల్గొంది. "ఒకే రోజు రెండు పెద్ద ఈవెంట్లలో ఆమె రాణించగలదా? అని అనుకున్నాను. కానీ ఆమె అంకితభావం గొప్పది" అంటారు శివకుమార్. ఆ రోజు ఉదయం జరిగిన 5000 మీటర్ల ఈవెంట్‌లో ఏక్తా బంగారు పతకం గెలుచుకుంది. సాయంత్రం అండర్-20 గర్ల్స్ 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లోనూ గోల్డ్‌మెడల్ సాధించడమే కాదు... జాతీయ రికార్డ్ నెలకొల్పింది. పతకాలు గెలుస్తాననే ధీమా ఉంది. కానీ రెండు స్వర్ణాల్ని గెలవడం, ఒక జాతీయ రికార్డు సాధించడం... ఇవన్నీ ఒకే రోజు జరగడం నమ్మశక్యంగా అనిపించలేదు" అంటోంది ఏక్తా. "పోటీలు ముగిసి ఇంటికి వెళ్ళినప్పుడు స్థానికులు ఆహ్వానించిన తీరు నా కష్టాలన్నిటినీ మరపించింది. నన్ను ఆటపట్టించినవారు ఇప్పుడు ఎంతో మర్యాదగా చూస్తున్నారు. ఇక మా అమ్మా, నాన్న సంతోషాన్ని వర్ణించడానికి నా దగ్గర మాటలు లేవు" అని ఆమె చెబుతోంది. భారత అథ్లెటిక్స్ ఆశాకిరణంగా ప్రశంసలందుకుంటున్న ఏక్తా దుబాయ్‌లో జరగబోయే అండర్-20 ఏషియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్, పెరూ రాజధాని లిమాలో జరగనున్న అండర్-20 వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మన దేశానికి ప్రాతినిధ్యం వహించనుంది. "దేశం తరఫున ఆడి, పతకాలు సాధించాలనేది నా లక్ష్యం" అంటుంది ఏక్తా.

హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్‌లోని తెలుగు సంపన్నులు

గ్లోబల్ ర్యాంక్	పేరు	కంపెనీ	ఆస్తి (బిలియన్ డాలర్లు)
381	మురళి దివి, కుటుంబం	దివీస్ ల్యాబొరేటరీస్	7
536	పీ పిచ్చి రెడ్డి	మేఘా ఇంజనీరింగ్	6
561	పీవీ కృష్ణా రెడ్డి	మేఘా ఇంజనీరింగ్	6
942	జూపల్లి రామేశ్వర్ రావు కుటుంబం	మై హోమ్ ఇండస్ట్రీస్	4
1024	పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి కుటుంబం	అరబిందో ఫార్మా	3
1024	బీ పార్థసారథి రెడ్డి కుటుంబం	హెటిరో ల్యాబ్స్	3
1855	కే సతీశ్ రెడ్డి కుటుంబం	డాక్టర్ రెడ్డీస్	2
1855	జీ అమరేందర్ రెడ్డి కుటుంబం	జీఏఆర్	2
2038	వెంకటేశ్వర్లు జాస్తి కుటుంబం	సువెన్ ఫార్మా	2
2038	ఎం సత్యనారాయణ రెడ్డి కుటుంబం	ఎంఎస్ఎన్ ల్యాబ్స్	2
2418	జీవీ ప్రసాద్ కుటుంబం	డాక్టర్ రెడ్డీస్	1
2750	జీఎస్ రాజు కుటుంబం	---------	1
2750	ఆళ్ల అయోధ్య రామి రెడ్డి	రాంకీ గ్రూప్	1
2895	సీ వెంకటేశ్వర రెడ్డి	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్	1
2895	ఎస్ సుబ్రమణ్యం రెడ్డి	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్	1
3058	జగదీశ్ ప్రసాద్ ఆలూరు కుటుంబం	హెచ్‌బీఎల్ పవర్	1
3058	వీసీ నన్నపనేని	నాట్కో ఫార్మా	1

ఆసియా కుబేరుల అడ్డా ముంబై



HURUN

రెండో స్థానానికి జారిన బీజింగ్ ● ప్రపంచ టాప్-10 బిలియనీర్లలోని ఏకైక భారతీయుడు ముకేశ్ అంబానీ

- భారత్‌లో 271 మంది బిలియనీర్లు
- హైదరాబాద్ నుంచి 17 మందికి చోటు
- మురళి దివికి అగ్రస్థానం
- హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ విడుదల

ముంబై: ఆసియాలో అత్యధిక మంది కుబేరులు నివసిస్తున్న నగరాల్లో బీజింగ్‌ను వెనక్కి నెట్టి ముంబై అగ్రస్థానంలో నిలిచింది. మంగళవారం విడుదలైన హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ ప్రకారం.. ముంబైలో 92 మంది బిలియనీర్లుండగా, బీజింగ్‌లోని బిలియనీర్ల సంఖ్య 91గా నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే, ముంబై బిలియనీర్ల లిస్ట్‌లోకి మరో 27 మంది చేరగా.. బీజింగ్ బిలియనీర్ల పెరుగుదల 6కే పరిమితమైంది. ముంబై బిలియనీర్ల మొత్తం సంపద గడిచిన ఏడాది కాలంలో 47 శాతం వృద్ధి చెందగా.. బీజింగ్ కుబేరుల మొత్తం సంపద 28 శాతం తగ్గింది. అంతేకాదు, ప్రపంచంలో అత్యధిక మంది బిలియనీర్లు నివసిస్తున్న నగరాల్లో న్యూయార్క్ (119 మంది), లండన్ (97 మంది) తర్వాత ముంబై 3వ స్థానంలో నిలిచింది. 57 మందితో ఢిల్లీ 9వ స్థానంలో ఉండగా 27 మంది బిలియనీర్లతో బెంగళూరు 23వ స్థానంలో ఉంది. కనీసం 100 కోట్ల డాలర్ల (మన కరెన్సీలో రూ.8,300 కోట్ల పైమాటే) వ్యక్తిగత సంపద కలిగిన వారిని బిలియనీర్‌గా పరిగణిస్తారు.

రిపోర్టులోని మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈసారి జాబితా ప్రపంచ బిలియనీర్ల జాబితాలో మొత్తం 3,279 మందికి చోటు దక్కింది. 167 మందికి కొత్తగా స్థానం లభించింది. ఈసారి భారత బిలియనీర్ల జాబితాలో మరో 84 మంది చేరారు. చైనా జాబితాలో కొత్తగా చేరిన వారి సంఖ్య 55కు పరిమితమైంది.
- భారత కుబేరుల్లో ముకేశ్ అంబానీ 11,500 కోట్ల డాలర్ల సంపదతో తన అగ్రస్థానాన్ని కొనసాగించారు. గడిచిన ఏడాది కాలంలో అంబానీ ఆస్తి 40 శాతం (3,300 కోట్ల డాలర్లు) పెరిగింది. అంతేకాదు, ప్రపంచ టాప్-10 కుబేరుల్లోని ఏకైక భారతీయుడు కూడా ఆయనే.
- భారత సంపన్నుల్లో గౌతమ్ అదానీ 8,600 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో రెండో స్థానంలో నిలిచారు. హిండెన్‌బర్గ్ నివేదికతో భారీగా తరిగిపోయిన అదానీ ఆస్తి పుంజుకుని గడిచిన ఏడాది కాలంలో 62 శాతం పెరిగింది. ప్రపంచ సంపన్నుల్లో ఆయనకు 15వ స్థానం దక్కింది.
- హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్ నాడార్ 3,700 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో మూడో స్థానంలో నిలిచారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆయన 34వ స్థానంలో ఉన్నారు. సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైరస్ పూనావాలా (2,500 కోట్ల డాలర్లు) 55వ స్థానంలో, సన్‌ఫార్మా చైర్మన్ దిలీప్ సంఘ్వీ (2,400 కోట్ల డాలర్లు) 61వ స్థానంలో, కుమార మంగళం బిర్లా(1,800 కోట్ల డాలర్లు) వందో స్థానంలో ఉన్నారు. అనగా.. ప్రపంచ టాప్-100 బిలియనీర్లలో భారత్ నుంచి కేవలం ఆరుగురు చోటు సంపాదించుకోగలిగారు.
- ఈసారి జాబితాలోని భారత బిలియనీర్ల మొత్తం సంపద లక్ష కోట్ల డాలర్లుగా (రూ.83 లక్షల కోట్లు) నమోదైంది. గడిచిన ఏడాది కాలంలో భారత బిలియనీర్లలో కేవలం 24 మంది సంపద మాత్రమే తగ్గింది. కాగా, చైనా బిలియనీర్లలో 573 మంది సంపద క్షీణించింది.

ఎలాన్ మస్క్ ప్రపంచ నం.1

టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్ (గతంలో ట్విటర్) సంస్థల అధిపతి ఎలాన్ మస్క్ 23,100 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో ప్రపంచంలో అత్యంత సంపన్నుడిగా నిలిచారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ (18,500 కోట్ల డాలర్లు), ఫ్రెంచ్ లగ్జరీ బ్రాండ్ల గ్రూప్ ఎల్‌వీఎంహెచ్ అధిపతి బెర్నార్డ్ అర్నో (17,500 కోట్ల డాలర్లు) వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్నారు.

మార్కెట్ లాభాలకు బ్రేక్

ముంబై: మూడు రోజుల స్టాక్ మార్కెట్ లాభాలకు మంగళవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 361.64 పాయింట్ల నష్టంతో 72,470.30 వద్ద ముగియగా నిఫ్టీ 92.05 పాయింట్ల నష్టంతో 22,004.70 వద్ద క్లోజయింది. సెన్సెక్స్ హెవీవెయిట్స్ రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐటీ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. దీంతో సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 20 నష్టాలతో క్లోజయ్యాయి. ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, ఎఫ్‌పీఐల అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

అదానీల చేతికి ల్యాంకో అమర్‌కంటక్ ప్లాంట్

న్యూఢిల్లీ: దివాలా ప్రక్రియలో ఉన్న ల్యాంకో అమర్‌కంటక్ పవర్ ప్లాంట్ కథ కంచికి చేరింది. ఈ ప్లాంట్ కొనుగోలు కోసం అదానీ పవర్ వేసిన బిడ్‌కు కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది. ఈ నెల 5న ల్యాంకో అమర్‌కంటక్ పవర్ రుణదాతలూ ఇందుకు ఆమోదం తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో ల్యాంకో గ్రూపు ఈ 600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,710 ▼	61,150 ▼	80,500 ▲
ముంబై	66,720 ▲	61,110 ▲	74,052 ▼

అదానీ చేతికి గోపాల్‌పూర్ పోర్టు

95 శాతం వాటా రూ.1,349 కోట్లకు కొనుగోలు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ తాజాగా మరో నౌకాశ్రయాన్ని సొంతం చేసుకుంది. ఒడిశాలోని గంజాం జిల్లాలో ఉన్న గోపాల్‌పూర్ పోర్ట్‌లో 95 శాతం ఈక్విటీ వాటాను రూ.1,349 కోట్లకు కొనుగోలు చేసినట్లు అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్ మంగళవారం ప్రకటించింది. షాపూర్జీ పల్లోంజీ (ఎస్‌పీ) గ్రూప్, ఒరిస్సా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్ (ఓఎస్ఎల్) నుంచి ఈ వాటాను చేజిక్కించుకుంది. 2 కోట్ల టన్నుల వార్షిక సామర్థ్యంతో కూడిన డీప్ వాటర్ బెర్తింగ్ పోర్ట్ అయిన గోపాల్‌పూర్ పోర్ట్‌లో ఎస్‌పీ గ్రూప్‌నకు చెందిన ఎస్‌పీ పోర్ట్ మెయింటెనెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ 56 శాతం వాటా, ఓఎస్ఎల్ 44 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఈ పోర్ట్‌లో ఎస్‌పీ గ్రూప్ నుంచి 56 శాతం వాటా, ఓఎస్ఎల్ నుంచి 39 శాతం వాటాను (మొత్తం 95 శాతం వాటా) కొనుగోలుకు విధిగా కట్టుబడి ఉండే ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు అదానీ పోర్ట్స్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది. ఈ డీల్ తర్వాత 5 శాతం వాటాతో ఓఎస్ఎల్ తమ భాగస్వామిగా కొనసాగనుందని స్పష్టం చేసింది. ఈ డీల్‌లో భాగంగా పోర్ట్ ఎంటర్‌ప్రైస్ విలువను రూ.3,080 కోట్లుగా లెక్కగట్టినట్లు తెలిపింది. ఎంటర్‌ప్రైస్ విలువకు అదనంగా రూ.270 కోట్లను ఐదున్నరేళ్ల తర్వాత చెల్లించనున్నట్లు, దీంతో కలిపి పోర్ట్ మొత్తం ఎంటర్‌ప్రైస్ విలువ రూ.3,350 కోట్లకు చేరుకోనుందని అదానీ పోర్ట్స్ పేర్కొంది. తూర్పు తీరంలో అదానీ పోర్ట్స్ మరింత బలపడేందుకు ఈ డీల్ దోహదపడనుందని అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ అన్నారు. ఆస్తుల నగదీకరణ ప్రణాళికలో భాగంగా ఒడిశాలోని గోపాల్‌పూర్ పోర్ట్‌ను అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌కు రూ.3,350 కోట్ల ఎంటర్‌ప్రైస్ విలువకు విక్రయిస్తున్నట్లు ఎస్‌పీ గ్రూప్ విడిగా ప్రకటించింది.

ప్రపంచంలో శక్తిమంతమైన బీమా బ్రాండ్ ఎల్ఐసీ

బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ రిపోర్టు విడుదల



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ).. ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన బీమా బ్రాండ్‌గా నిలిచింది. ఈ ఏడాదికిగాను విడుదల చేసిన 'బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ 100' రిపోర్టులో ఈ విషయం వెల్లడించారు. 980 కోట్ల డాలర్ల బ్రాండ్ విలువతో పాటు బ్రాండ్ శక్తి సూచీలో 88.3 పాయింట్లు, ట్రిపుల్ ఏ బ్రాండ్ రేటింగ్‌తో ఎల్ఐసీ అగ్రస్థానంలో నిలిచిందని నివేదిక పేర్కొంది. కాగా, తైవాన్‌కు చెందిన క్యాథే లైఫ్ ఇన్సూరెన్స్, ఆస్ట్రేలియాకు చెందిన ఎన్ఆర్ఎంఏ ఇన్సూరెన్స్ వరుసగా ఈ జాబితాలో 2, 3 స్థానాల్లో నిలిచాయి. ఈ ఏడాది క్యాథే లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాండ్ విలువ 9 శాతం పెరిగి 490 కోట్ల డాలర్లకు చేరుకోగా.. ఎన్ఆర్ఎంఏ బ్రాండ్ వేల్యూ 82 శాతం వృద్ధితో 130 కోట్ల డాలర్లుగా నమోదైంది. కాగా, ప్రపంచంలోని అత్యంత విలువైన బీమా బ్రాండ్లలో చైనా ఆధిపత్యం కొనసాగింది. పింగ్ యాన్ (3,360 కోట్ల డాలర్లు) ప్రపంచంలో అత్యంత విలువైన ఇన్సూరెన్స్ బ్రాండ్‌గా నిలిచింది. చైనా లైఫ్ ఇన్సూరెన్స్, సీపీఐసీ 3, 5 స్థానాల్లో ఉన్నాయి. జర్మనీకి చెందిన అలియాన్జ్, ఫ్రాన్స్‌కు చెందిన ఆక్సా ఇన్సూరెన్స్ కంపెనీలు ఈ విషయంలో 2, 4 స్థానాల్లో కొనసాగాయి.

"స్టోరబుల్" కొత్త కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్: సెల్ఫ్ స్టోరేజి టెక్నాలజీ సొల్యూషన్స్ అందించే అమెరికాకు చెందిన స్టోరబుల్ హైదరాబాద్‌లోని నాలెడ్జ్ సిటీలో కొత్త కార్యాలయం ప్రారంభించింది. ఆసియాలో తొలి జీసీసీని గత ఏప్రిల్‌లో ప్రారంభించిన స్టోరబుల్ ఆర్ అండ్ డీ కార్యకలాపాలు మరింత విస్తరించనుంది. ఇందులో భాగంగా ఉద్యోగుల సంఖ్యను 60 నుంచి 120కి పెంచుకోవాలని నిర్ణయించినట్టు కంపెనీ ప్రెసిడెంట్ చార్లీ మారియట్ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	395	విజయవాడ	400
27వ తేదీ		విశాఖపట్నం	415
చిత్తూరు	458	వరంగల్	397
గోదావరి	400	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	గోదావరి	116
వరంగల్	118	విజయవాడ	116
కరీంనగర్	118	గుంటూరు	117
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	117
కర్నూలు	118	చిత్తూరు	130
విశాఖపట్నం	115		

ఇండోసోల్ సోలార్ మాడ్యూల్ ప్లాంట్‌లో ఈ నెల 31 నుంచి ఉత్పత్తి

హైదరాబాద్: నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం వద్ద భారీ సోలార్ మాడ్యూల్స్ తయారీ ప్లాంట్ ఏర్పాటవుతోంది. షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కేంద్రప్రభుత్వం అందించే ఉత్పత్తి ఆదారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం కింద ఈ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 31న ఉత్పత్తి ప్రారంభమయ్యే ఈ ప్లాంట్ తొలి దశలో 5,000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన మాడ్యూల్స్ తయారవుతాయని కంపెనీ సీఈఓ శరత్ చంద్ర చెప్పారు. రెండో దశలో మరో 5,000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన మాడ్యూల్స్ తయారవుతాయన్నారు. రెండో దశ ప్లాంట్ నిర్మాణం కూడా ఏడాదిన్నర నుంచి రెండేళ్లలో పూర్తవుతుందని చెప్పారు.

సన్‌రైజర్స్ బోణీ చేసేనా?



కమిన్స్



హార్దిక్

- నేడు ముంబైతో హైదరాబాద్ ఢీ
- రాత్రి 7.30 నుంచి జియో సినిమా, స్టార్‌స్పోర్ట్స్‌లో..

హైదరాబాద్: కోల్‌కతాతో తొలి మ్యాచ్‌లో త్రుటిలో గెలుపును చేజార్చుకొన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంతగడ్డపై బోణీ చేయాలన్న కసితో ఉంది. బుధవారం ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో కమిన్స్ సేన తలపడనుంది. ముంబై కూడా గుజరాత్ చేతిలో అనూహ్యంగా పరాజయం పాలైంది. ఇరుజట్లూ విజయం కోసం పట్టుదలగా ఉన్న నేపథ్యంలో ఈ మ్యాచ్ హోరాహోరీగా సాగే అవకాశాలున్నాయి. సన్‌రైజర్స్ బ్యాటర్ క్లాసెన్ పవర్‌హిట్టింగ్‌తో కోల్‌కతా వెన్నులో వణుకు పుట్టించాడు. గెలుపు అసాధ్యం అని భావించిన తరుణంలో భారీ సిక్సర్లతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కానీ, అతడు అవుట్ కావడంతో హైదరాబాద్ గెలుపు గీత దాటలేక పోయింది. అయితే, అతడి నుంచి జట్టు మరోసారి అదే తరహా ప్రదర్శనను ఆశిస్తోంది. మయాంక్ ఫర్వాలేదనిపించినా..మిగతా బ్యాటర్లు పుంజుకోవాల్సి ఉంది. పేస్ విభాగంలో నటరాజన్ ఆరంభంలో వికెట్లు తీసినా.. కమిన్స్, భువనేశ్వర్ నుంచి అతడికి సహకారం అందలేదు. మరోవైపు ముంబై బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. రోహిత్ శర్మ, బ్రెవిస్ మంచి టచ్‌లో కనిపిస్తున్నారు. అయితే, ఓపెనర్ ఇషాన్ డకౌట్ కాగా.. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన హార్దిక్ బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందకు జరగడం విమర్శలకు దారి తీసింది. పేసర్ బుమ్రా తొలిమ్యాచ్‌లోనే సత్తాచాటడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే.

చెన్నై.. అదిరెన్!

వరుసగా రెండో గెలుపు ● గుజరాత్ చిత్తు ● శివమ్ దూబే హాఫ్ సెంచరీ



శివమ్ దూబే (23 బంతుల్లో 51)



రచిన్ రవీంద్ర (20 బంతుల్లో 46)

చెన్నై: గతేడాది ఫైనలిస్టుల మధ్య జరిగిన మ్యాచ్ ఏకపక్షంగా ముగిసింది. చెన్నై సూపర్ కింగ్స్ అన్ని విభాగాల్లో రాణిస్తూ కలిసికట్టుగా కదం తొక్కింది. బ్యాటింగ్‌లో శివమ్ దూబే (23 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 51), రచిన్ రవీంద్ర (20 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 46) మెరుపు ఆటతీరును ప్రదర్శించారు. అటు పేసర్లు పదునైన బంతులతో కట్టడి చేయగా, ఫీల్డింగ్‌లోనూ సూపర్ అనిపించుకుంది. దీంతో మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే 63 రన్స్‌తో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్లకు 206 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ (36 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 46) ఆకట్టుకున్నాడు. రషీద్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 143 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (37), మిల్లర్ (21), సాహా (21) ఫర్వాలేదనిపించారు. తుషార్ దేశ్‌పాండే, దీపక్ చాహర్, ముస్తాఫిజుర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా దూబే నిలిచాడు.

పోరాటమే లేదు..: భారీ ఛేదనలో గుజరాత్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. పవర్‌ప్లేలోనే ఓపెనర్లు గిల్ (8), సాహా వికెట్లను కోల్పోయింది. తన వరుస ఓవర్లలో పేసర్ చాహర్ వీరిని పెవిలియన్‌కు చేర్చాడు. విజయ్ శంకర్ (12).. ధోనీ సూపర్ క్యాచ్‌తో స్వల్ప స్కోరుకే వెనుదిరగ్గా, సాయి సుదర్శన్ కాసేపు క్రీజులో నిలదొక్కుకున్నాడు. కానీ అతడి ఆటలో ఛేదనకు తగ్గ వేగం లేకపోయింది. దీంతో ఏ దశలోనూ జట్టు ప్రమాదకరంగా కనిపించలేదు. అటు మూడు ఫోర్లతో మిల్లర్ కాస్త జోరు చూపినా రహానె అద్భుత క్యాచ్‌తో అవుటయ్యాడు. నాలుగో వికెట్‌కు సాయి, మిల్లర్ 41 పరుగులు జోడించారు. దీనికి తోడు వరుస ఓవర్లలో సాయి, అజ్మతుల్లా (11), రషీద్ ఖాన్ (1) వెనుదిరగడంతో టైటాన్స్ చేసేదేమీ లేకపోయింది.

కలిసికట్టుగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు సమష్టి ఆటతీరును కనబరిచారు. ముందుగా ఓపెనర్లు రచిన్, రుతురాజ్ మెరుపు ఆరంభాన్ని అందివ్వగా.. ఆ తర్వాత శివమ్ దూబే శివాలెత్తాడు. ఓపెనర్ల ధాటికి పవర్‌ప్లేలోనే 69 పరుగులు సాధించింది. తొలి ఓవర్‌లోనే గైక్వాడ్ క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్నా.. మరో ఎండ్‌లో రచిన్ బాదుడుకు ఓవర్‌కు పదకొండు పరుగుల రన్‌రేట్‌తో స్కోరుబోర్డు దూసుకెళ్లింది. రెండో ఓవర్‌లో 6,4తో బ్యాట్‌కు పనిజెప్పిన తను ఎక్కడా ఆగలేదు. మూడో ఓవర్‌లో రెండు ఫోర్లతో 12, నాలుగో ఓవర్‌లో 6,4తో 16, ఐదో ఓవర్‌లో 4,6తో 17 ఇలా ఎదురుదాడే లక్ష్యంగా అలరించాడు. అటు రుతురాజ్ సైతం అడపాదడపా ఫోర్లతో ఆకట్టుకున్నాడు. అయితే రషీద్ ఓవర్‌లో రచిన్ ఓ ఫోర్ కొట్టాక స్టంపౌటయ్యాడు. కానీ అప్పటికే తొలి వికెట్‌కు 32 బంతుల్లోనే 62 పరుగుల భాగస్వామ్యం సమకూరింది. పదో ఓవర్‌లో రుతురాజ్ 6,4 బాది స్కోరును వంద దాటించాడు. ఇక రహానె (12)ను సాయికిశోర్ అవుట్ చేశాక బరిలోకి దిగిన దూబే ఎదుర్కొన్న తొలి రెండు బంతులనే సిక్సర్లుగా మలిచి జోష్ తెచ్చాడు. పేసర్ మోహిత్ మాత్రం 12వ ఓవర్‌లో కట్టడి చేయగా.. తర్వాతి ఓవర్‌లోనే రుతురాజ్ వికెట్ తీసిన పేసర్ జాన్సన్ 2 పరుగులే ఇచ్చాడు. ఈ దశలో దూబే రన్‌రేట్ పెంచే బాధ్యతను తీసుకుంటూ రషీద్ ఓవర్‌లో సిక్సర్, జాన్సన్ ఓవర్‌లో 4,6తో జట్టు స్కోరును ట్రాక్ మీదికి తెచ్చాడు. అతడి ధాటికి 16 ఓవర్లలో చెన్నై 165/3తో నిలిచింది. ఇక 22 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన దూబేను 19వ ఓవర్‌లో రషీద్ అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు మిచెల్ (24 నాటౌట్)తో జత పరిచిన 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన సమీర్ రిజ్వీ (14) అదే ఓవర్‌లో రెండు సిక్సర్లతో 15 రన్స్ అందించాడు. ఆఖరి ఓవర్‌లో మోహిత్ 8 పరుగులే ఇచ్చి రిజ్వీ వికెట్ తీయగా.. జడేజా (7) రనౌటయ్యాడు.

1
ఐపీఎల్‌లో పరుగుల పరంగా గుజరాత్ టైటాన్స్‌కిదే అతి పెద్ద పరాజయం.

స్కోరుబోర్డు

చెన్నై: రుతురాజ్ (సి) సాహా (బి) జాన్సన్ 46, రచిన్ రవీంద్ర (స్టంప్డ్) సాహా (బి) రషీద్ 46, రహానె (స్టంప్డ్) సాహా (బి) కిషోర్ 12, శివమ్ దూబె (సి) శంకర్ (బి) రషీద్ 51, డారిల్ మిచెల్ (నాటౌట్) 24, రిజ్వీ (సి) విజ్లర్ (బి) మోహిత్ 14, జడేజా (రనౌట్) 7, ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 206/6; వికెట్ల పతనం: 1-62, 2-104, 3-127, 4-184, 5-199, 6-206; బౌలింగ్: ఒమర్జాయ్ 3-0-30-0, ఉమేశ్ 2-0-27-0, రషీద్ 4-0-49-2, సాయి కిషోర్ 3-0-28-1, జాన్సన్ 4-0-35-1, మోహిత్ శర్మ 4-0-36-1.

గుజరాత్: సాహా (సి) దేశ్‌పాండే (బి) చాహర్ 21, గిల్ (ఎల్బీ) చాహర్ 8, సాయి సుదర్శన్ (సి) రిజ్వీ (బి) పథిరన 37, విజయ్ శంకర్ (సి) ధోనీ (బి) మిచెల్ 12, మిల్లర్ (సి) రహానె (బి) దేశ్‌పాండే 21, ఒమర్జాయ్ (సి) రచిన్ (బి) దేశ్‌పాండే 11, తెవాటియా (సి) రచిన్ (బి) ముస్తాఫిజుర్ 6, రషీద్ (సి) రచిన్ (బి) ముస్తాఫిజుర్ 1, ఉమేశ్ (నాటౌట్) 10, స్పెన్సర్ జాన్సన్ (నాటౌట్) 5, ఎక్స్‌ట్రాలు: 11, మొత్తం: 20 ఓవర్లలో 143/8; వికెట్ల పతనం: 1-28, 2-34, 3-55, 4-96, 5-114, 6-118, 7-121, 8-129; బౌలింగ్: దీపక్ చాహర్ 4-0-28-2, ముస్తాఫిజుర్ 4-0-30-2, తుషార్ దేశ్‌పాండే 4-0-21-2, జడేజా 2-0-15-0, మిచెల్ 2-0-18-1, పథిరన 4-0-29-1.

ఈసారి పెర్త్‌లో తొలి టెస్టు

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ షెడ్యూల్

మెల్‌బోర్న్: భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈ ఏడాది నవంబరు-జనవరిలజరిగే ఐదు టెస్టుల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ షెడ్యూల్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) మంగళవారం విడుదల చేసింది. అయితే అడిలైడ్‌లో తొలి టెస్టు జరగడం ఆనవాయితీ కాగా.. ఈసారి మాత్రం పెర్త్‌లో సిరీస్‌ను ఆరంభించనున్నారు. నవంబరు 22 నుంచి 26 వరకు ఈ మ్యాచ్ జరుగుతుంది. డిసెంబరు 6-10న రెండో టెస్టు (డే/నైట్) అడిలైడ్‌లో, 14-18 మధ్య మూడో టెస్టు బ్రిస్బేన్‌లో, 26-30 మధ్య నాలుగో టెస్టు మెల్‌బోర్న్‌లో, జనవరి 3-7 తేదీల్లో ఆఖరి టెస్టు సిడ్నీ వేదికగా జరుగుతాయి.

ఎవరూ గుర్తుపట్టని చోట వీధుల్లో తిరుగుతూ!

రెండు నెలలు కుటుంబంతో గడిపా



బెంగళూరు: సుమారు రెండు నెలలపాటు ఆటకు దూరంగా.. కుటుంబంతో గడపడం సరి కొత్త అనుభూతి అని విరాట్ కోహ్లీ చెప్పాడు. విరాట్ భార్య అనుష్క కొద్ది రోజుల క్రితం ఓ బాబుకు జన్మనిచ్చింది. కూతురు వావికతో కలసి విరాట్ లండన్‌లోని ఓ రెస్టారెంట్‌లో కనిపించిన ఫొటోలు వైరలయ్యాయి. భార్యతో ఉండడం కోసం ఇంగ్లండ్‌తో 5 టెస్టుల సిరీస్‌కు కూడా దూరమైన కోహ్లీ.. సుదీర్ఘ విరామం తర్వాత ఐపీఎల్‌లో మళ్లీ కనిపించాడు. సోమవారం పంజాబ్‌పై మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ ఆ కొన్ని రోజులు తాను ఎక్కడ ఉన్నదీ చెప్పాడు. 'మేం భారత్‌లో లేం. మమ్మల్ని ఎవరూ గుర్తుపట్టని చోట రెండు నెలలపాటు సాధారణ జీవితం గడిపాం. నిజంగా అదో అనిర్వచనీయమైన అనుభూతి. రోడ్లపై తిరుగుతున్నా ఎవరూ గమనించకపోవడం కొత్తగా అనిపించిందని కోహ్లీ చెప్పాడు.

శ్రీజకు కెరీర్ బెస్ట్ ర్యాంక్



న్యూఢిల్లీ: గతవారం తన కెరీర్‌లో రెండో డబ్ల్యూటీటీ సింగిల్స్ టైటిల్ నెగ్గి రికార్డు సృష్టించిన తెలుగమ్మాయి ఆకుల శ్రీజ అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో ముందంజ వేసింది. మంగళవారం వెలువడిన తాజా ర్యాంకింగ్స్‌లో శ్రీజ మహిళల సింగిల్స్‌లో ఏడు స్థానాలు ఎగబాకి కెరీర్‌లోనే అత్యుత్తమంగా 40వ ర్యాంక్‌ను అందుకుంది. పురుషుల సింగిల్స్‌లో శరత్ కమల్ 35వ స్థానంలో ఉండగా, సాథియాన్ 43 స్థానాలు మెరుగై 60వ ర్యాంక్‌లో నిలిచాడు.

'అవును.. నేను నలుపే'!



శివరామకృష్ణన్

న్యూఢిల్లీ: సోషల్ మీడియాలో తనను కించపరిచే విధంగా వర్ణ వివక్ష కామెంట్లు చేసిన వారికి భారత మాజీ ఆటగాడు లక్ష్మణ్ శివరామకృష్ణన్ దిమ్మదిరిగే కౌంటర్ ఇచ్చాడు. చెన్నైలోని మహాలింగపురం అయ్యప్పన్ గుడిలో ఓ ఏనుగు ముందు నిలబడి దిగిన ఫొటోను శివరామకృష్ణన్ ఎక్స్‌లో పోస్టు చేశాడు. దీన్ని చూసిన ఓ వ్యక్తి 'రాత్రిపూట మీ కంటే..ఆ ఏనుగే బాగా కనిపిస్తుందేమో' అంటూ ఎగతాళిగా కామెంట్లు పెట్టాడు. దీనికి 'అవును. నేను నల్లవాణ్ణే' అని శివరామకృష్ణన్ ఘాటుగా సమాధానమిచ్చాడు. దిగజారి ప్రవర్తించవద్దని హితవు పలికాడు.

భారత్‌కు షాక్

- 1-2తో అఫ్ఘాన్ చేతిలో ఓటమి
- ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్



ఛెత్రి

గువాహటి: ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో భారత్‌కు షాక్ తగిలింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 1-2తో అఫ్ఘానిస్థాన్ చేతిలో ఓటమిపాలైంది. కెరీర్‌లో 150వ మ్యాచ్ ఆడిన కెప్టెన్ సునీల్ ఛెత్రి.. 37వ నిమిషంలో లభించిన పెనాల్టీని గోల్‌గా మలచడంతో భారత్ 1-0 ఆధిక్యం సాధించింది. కానీ, సెకండాఫ్‌లో రహ్మత్ (71వ నిమిషం) గోల్‌తో అఫ్ఘాన్ 1-1తో సమం చేసింది. 88వ నిమిషంలో కీపర్ గుర్‌ప్రీత్ సంధూ తప్పిదం కారణంగా అఫ్ఘాన్‌కు పెనాల్టీ లభించింది. దీన్ని షరీఫ్ గోల్‌లోకి పంపడంతో అఫ్ఘాన్ 2-1తో పైచేయి సాధించింది. కాగా, 150 మ్యాచ్‌ల్లో ఛెత్రి 94 గోల్స్ సాధించాడు.

క్వార్టర్స్‌లో బోపన్న జోడీ

న్యూఢిల్లీ: రోహన్ బోపన్న మియామి ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ దిశగా దూసుకెళ్తున్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి బోపన్న క్వార్టర్‌ఫైనల్ చేరాడు. డబుల్స్ రెండోరౌండ్లో టాప్‌సీడ్, ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ జంట బోపన్న/ఎబ్డెన్ 7-5, 7-6(3)తో మోనెగాస్కో (ఫ్రాన్స్)/జెలెన్‌స్కీ (పోలెండ్) జోడీపై విజయం సాధించింది.

శింగనమల అభ్యర్థిని మార్చాల్సిందే.. లేదంటే టీడీపీని గెలిపిస్తాం

జగన్‌కు వైసీపీ అసమ్మతి నేతల అల్టిమేటం

ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డికి వ్యతిరేకంగా భేటీ

శింగనమల, మార్చి 26: అనంతపురం జిల్లా శింగనమల (ఎస్సీ) నియోజకవర్గం వైసీపీలో అసమ్మతి తారస్థాయికి చేరుకుంది. సిటింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఆయన చెప్పిన అభ్యర్థి వీరాంజనేయులును మార్చి తీరాలని.. లేదంటే టీడీపీ అభ్యర్థిని బండారు శ్రావణిశ్రీని గెలిపిస్తామని సీఎం జగన్‌కు అల్టిమేటం ఇచ్చారు. ఈ నియోజకవర్గంలో సాంబశివారెడ్డి నాయకత్వాన్ని వైసీపీలోని మెజారిటీ వర్గం వ్యతిరేకిస్తోంది. ఈ కారణంగానే ఆయన భార్య పద్మావతికి వైసీపీ టికెట్ దక్కలేదు. అయితే సాంబశివారెడ్డి సొంత మనిషి అయిన వీరాంజనేయులుకు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేసినా నాయకత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో అనంతపురంలోని బళ్లా కన్వెన్షన్‌లో మంగళవారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాలని అసమ్మతి నాయకులు నిర్ణయించుకున్నారు. అయితే సాంబశివారెడ్డి అడ్డుకున్నారు. అనుమతి లేదని పోలీసులు బళ్లా కన్వెన్షన్‌ను ఉదయమే తమ అధీనంలోకి తీసుకున్నారు. దీనిని ముందే ఊహించిన అసమ్మతి నాయకులు.. శివపురం పెద్దమ్మ గుడి వద్ద సమావేశం నిర్వహించారు. అభ్యర్థిని ప్రకటించే ముందు పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్లు సత్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప, రాష్ట్ర కార్యదర్శి చాములూరి రాజుగోపాల్ తదితరులు ధ్వజమెత్తారు. 'వెంటనే అభ్యర్థిని మార్చి వేరే అభ్యర్థిని ప్రకటించండి. లేకపోతే పార్టీ అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కదు. పెద్దమ్మ సాక్షిగా చెబుతున్నాం..' అని హెచ్చరించారు.



శింగనమల మండలం శివపురం పెద్దమ్మ ఆలయం వద్ద సమావేశమైన వైసీపీ అసమ్మతి నాయకులు

పింఛను లేదు.. ఇంటి స్థలం ఇవ్వలేదు

ఓట్లు అడగడానికి వచ్చారా?.. పిఠాపురం వైసీపీ అభ్యర్థి వంగా గీతను నిలదీసిన మహిళ



వంగా గీతను ప్రశ్నిస్తున్న మహిళ

గొల్లప్రోలు రూరల్, మార్చి 26: కాకినాడ జిల్లా పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, కాకినాడ ఎంపీ వంగా గీతకు స్థానికుల నుంచి తీవ్ర సెగ తగిలింది. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఆమెను పలువురు మహిళలు తమ సమస్యలపై నిలదీశారు. "ఇంటి స్థలం ఇవ్వలేదు. ఒంటరి మహిళ పింఛను ఇస్తామన్నారు అదీ లేదు. ఇప్పుడు మాత్రం ఓట్లు అడగడానికి వచ్చారా?" అని ఓ మహిళ వంగా గీతను నిలదీశారు. గొల్లప్రోలు మండలం ఎ. విజయనగరంలో మంగళవారం సాయంత్రం గీత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దెయ్యాల వీరగనిలక్ష్మి అనే మహిళ తనకు పింఛను, ఇంటి స్థలం ఇవ్వకుండా ఇప్పుడు ఓట్ల కోసం వస్తారా? అని గీతను నిలదీశారు. ఈ సందర్భంగా వైసీపీ అభ్యర్థి మాట్లాడుతూ.. ఎన్నికలైన వెంటనే పంచను, ఇంటి స్థలం మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు.

ధనుంజయ్‌రెడ్డి, సత్యనారాయణపై చర్యలు తీసుకోండి

ఈసీకి టీడీపీ ఫిర్యాదు

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయంలో ఓఎస్డీగా పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి సత్యనారాయణపై టీడీపీ మంగళవారం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ నిధులను నిబంధనల ప్రకారం కాకుండా తమకు కావాల్సిన వారికివ్వడంలో ఈ ఇద్దరూ కీలక పాత్ర పోషిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కోడ్ అమల్లోకి వచ్చినా సీఎం అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఇంకా జగన్ ఫొటో ఉంచడంపై మరో లేఖలో అచ్చెన్న అభ్యంతరం వ్యక్తం చేశారు.



పార్టీ కోశాధికారి ఏవీ రత్నంకు మంగళవారం 10 కోట్ల చెక్కును అందజేస్తున్న పవన్ కల్యాణ్

జనసేనకు పవన్ 10 కోట్ల విరాళం

ఈ డబ్బు తన స్వార్జితమని ప్రకటన

ఎన్నికల ప్రచారానికి వినియోగించనున్నట్టు వెల్లడి

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తును సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జనసేన సాగిస్తున్న రాజకీయ ప్రయాణానికి తన వంతుగా రూ.10 కోట్లు ఇస్తున్నానని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు సమక్షంలో పార్టీ కోశాధికారి ఏవీ రత్నంకు మంగళవారం ఆ చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచార ఖర్చుల నిమిత్తం ఈ డబ్బు ఇస్తున్నానని తెలిపారు. స్వతంత్ర సంగ్రామాన్ని ముందుకు నడిపించడానికి మోతీలాల్ నెహ్రూ వంటి గొప్ప నాయకులు తమ స్వార్జితాన్ని విరాళంగా ఇచ్చేవారని గుర్తుచేశారు. ఆ రోజుల్లో తమ సొంత డబ్బును వెచ్చించిన తీరు గొప్పదని, ఓ సదాశయం కోసం తాను రూ.10 కోట్లు అందిస్తున్నానని తెలిపారు. జనసేన పార్టీ ప్రయాణానికి సగటు కూలి తన చిన్నపాటి సంపాదనలో రూ.100 పక్కన పెట్టి ఇవ్వడం.. పార్టీ ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు. ఓ బేల్దారీ మేస్త్రీ రూ.లక్ష విరాళం అందించారని, అలాగే తమకు అందుతున్న పింఛన్ సొమ్ములో కొంత భాగం పార్టీకి పంపుతున్న సగటు మనుషులెందరో ఉన్నారని పవన్ వెల్లడించారు. వారంతా ఎన్నో ఆశలతో, ఆశయాలతో నిర్మించిన పార్టీ కోసం తమ వంతు సాయం అందిస్తున్నారని వివరించారు. అలాంటి వారి స్ఫూర్తితో తాను సినిమాల ద్వారా వచ్చిన తన కష్టార్జితాన్ని, ప్రభుత్వానికి పన్నులు కట్టిన తర్వాత పార్టీ కోసం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత ఐదేళ్లలో 40 నుంచి 50 కోట్లు పన్నులు కట్టానన్నారు. ఎన్నికల వేళ ఈ డబ్బు పార్టీకి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేందర్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు దన్ను టీడీపీనే: వెంకటరాముడు

అమరావతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బీసీలకు దన్నుగా నిలిచే పార్టీ తెలుగుదేశం అని మరోసారి రుజువైందని హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయదుందుభి మోగించడానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. సాధారణ బీసీ కుటుంబంలో పుట్టిన తనను అత్యంత కీలకమైన హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడిగా నియమించిన చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడుకు మంగళవారం ఓ ప్రకటనలో ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఉత్తుత్తి జీవోలు.. డమ్మీ బటన్లే!

- ఇన్నాళ్లూ జగన్ ఫ్లైట్లలో ప్రయాణిస్తుంటే భూమ్మీది చెట్లను నరికేశారు. ఇక బస్సు యాత్ర పేరుతో ప్రయాణించనున్నాడు.. ఈ లెక్కన ఇళ్లను కూల్చేస్తారేమో?
- అమరావతిని నాశనం చేశారు. ఎక్కడి వరకు కట్టానో మళ్లీ అక్కడి నుంచి ప్రారంభించే పరిస్థితి లేదు. మరింత వెనక్కి నెట్టేశారు. రాజధానిని పునర్నిర్మించుకోవాలి.
- ఈసారి కరుడుగట్టిన వైసీపీ కార్యకర్తలు కూడా జగన్‌కు ఓటెయ్యరు. 2019లో ఒక్క చాన్స్ అనడంతో ప్రజలు ఐస్ అయ్యారు. గద్దెనెక్కాక నిజస్వరూపం చూపించాడు.

\- చంద్రబాబు



కుప్పంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా వృద్ధురాలితో మాట్లాడుతున్న చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ కార్యాలయంలో జరిగిన యువత సమావేశంలో మాట్లాడారు. ఇటీవల రామకుప్పం మండలం రాజుపేట వద్ద సీఎం జగన్ కుప్పం బ్రాంచి కెనాల్ గేటు బటన్ నొక్కి నీళ్లను వదిలిన విషయం తెలిసిందే. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కుప్పానికి నీరిచ్చానని డప్పు కొట్టుకున్న మరుసటి రోజే కాలువలో నీళ్లు ఇంకిపోయాయి. నీళ్లు లేని ఆ కాలువలోకి బాబు స్వయంగా దిగి పరిశీలించారు. అక్కడే మీడియాతో మాట్లాడారు. జగన్‌పై విరుచుకుపడ్డారు. ట్యాంకర్లో నీళ్లు తెచ్చి పోసి సినిమా సెట్టింగులా గేటు పెట్టి బటన్ నొక్కి వెళ్లిపోయాడని.. తెచ్చిపోసిన నీళ్లు తెల్లారే సరికి ఇంకిపోయాయని.. అద్దెకు తెచ్చిన గేట్లను సాయంత్రానికి అధికారులు తీసుకెళ్లిపోయారని.. ఇలాంటి సినిమా సెట్టింగుల సీఎం వస్తాడని డైరెక్టర్లు, నిర్మాతలు కూడా అనుకుని ఉండరని వ్యాఖ్యానించారు. ఐదేళ్లు నడిపిన వైసీపీ డ్రామా కంపెనీని శాశ్వతంగా మూసేయబోతున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా కుప్పానికి నీళ్లు తెస్తానని హామీఇచ్చారు. వలంటీర్లకు తాము వ్యతిరేకం కాదని.. వారి జీవితాలు మారుస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ఇంత విధ్వంసాన్ని తన జీవితంలో చూడలేదన్నారు. కేంద్రం సాయం లేకుంటే రాష్ట్రాభివృద్ధి కష్టమవుతుందని.. అన్నిటినీ సరిచేయడానికే ఎన్డీయేలో చేరామని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

25 వేల కిలోల డ్రగ్స్‌పై స్పందనేదీ?

జే బ్రాండ్స్ మద్యం గురించి మాట్లాడితే మాపై దాడులకు దిగారు. జగన్ సరసమైన ధరలకే గంజాయి తెచ్చాడు. ఎక్కడ చూసినా లభిస్తోంది. దీని గురించి చెబితే టీడీపీ కార్యాలయంపై దాడి చేశారు. బ్రెజిల్ నుంచి 25 వేల కిలోల డ్రగ్స్ వైజాగ్‌కు తెచ్చాడు. దీనిపై ఇప్పటికీ స్పందన లేదు. ఇలాంటి నేర సామ్రాజ్యానికి విజయసాయిరెడ్డి వరల్డ్ ఫిగర్. ప్రజలు తిరుగుబాటు చేయనంతవరకూ వీళ్లు అరాచకాలు చేస్తూనే ఉంటారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ఓటేస్తే వారి కుటుంబాలకు వారు అన్యాయం చేసుకున్నట్లే.

వలంటీర్లు ప్రచారంలో పాల్గొనొద్దు

వైసీపీ ప్రచారాల్లో పాల్గొంటున్న వలంటీర్లను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. కానీ వారి వద్ద 50-100 ఇళ్లకు సంబంధించిన డేటా ఉంది. ఉద్యోగాలు పోయిన వలంటీర్ల నుంచి మొబైల్, సిమ్, డేటా అన్నీ స్వాధీనం చేసుకోవాలి. వారు మళ్లీ ప్రచారంలో పాల్గొనకుండా చేయాలి. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం. వలంటీర్లకు మనం వ్యతిరేకం కాదు. వారు కూడా సమాజంలో భాగం. కానీ వైసీపీ నేతలు చేయించే తప్పులకు వారు జైలుకు వెళ్లకూడదు. వారు రాజకీయ జోక్యం చేసుకోకూడదు.

ఇంటింటి ప్రచారం

'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ'లో భాగంగా కుప్పంలోని బాబు నగర్‌లో చంద్రబాబు ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ అధికారంలోకొచ్చాక అమలు చేసే సూపర్ సిక్స్ పథకాల గురించి మహిళలకు వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో పడుతున్న ఇబ్బందుల గురించి మహిళలు ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. టీడీపీకి అనుకూలమంటూ పెన్షన్లు ఆపేశారని పలువురు వృద్ధులు చెప్పారు. రెండు నెలలు ఓపిక పడితే అందరి సమస్యలూ తీరుస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కుప్పం కేవీఆర్ కల్యాణ మండపంలో ఆయన సమక్షంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సుమారు వెయ్యి మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. మంగళవారంతో రెండ్రోజుల కుప్పం పర్యటన ముగిసింది. బుధవారం ఉదయం పలమనేరు నుంచి ప్రజాగళం యాత్ర చేపట్టనున్నారు.

అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే మెగా డీఎస్సీ

టీడీపీ కూటమి అధికారంలోకొచ్చాక 60 రోజుల్లోనే మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం పెడతా. ఇప్పుడు వదిలిన డీఎస్సీని కొనసాగిస్తే ఈ దుర్మార్గులు మళ్లీ మేనేజ్ చేసి వారికి అనుకూలమైనవారిని నియమించుకునే ప్రమాదముంది. ఎన్నికల కమిషన్ కూడా దీనిపై నిర్ణయం తీసుకోవాలి. వైసీపీని యువత భూస్థాపితం చేయాలి. గతంలో ఏపీకి రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాను. ఈ ఐదేళ్లలో రాష్ట్రానికి రూపాయి పెట్టుబడి రాలేదు. ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. మీరెంతో కష్టపడి చదువుకుని ముందుకెళ్తే ఈ ప్రభుత్వం పోస్టులను అమ్ముకుంది. రాష్ట్రంలో భూమి రికార్డులను తారుమారు చేస్తున్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు, సర్టిఫికెట్లు, సర్వే రాళ్ల మీద జగన్ తన ఫొటో పెట్టుకుంటున్నాడు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నాడు.

ముస్లిం మహిళపై చెప్పుతో దాడి

వైసీపీ కదిరి అభ్యర్థి బంధువు దారుణం



వహీద

కదిరి, మార్చి 26: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో వైసీపీ అభ్యర్థి మగ్బూల్ బంధువు, మాజీ కౌన్సిలర్ పరికి షామీర్.. వహీద అనే ముస్లిం మహిళను మంగళవారం చెప్పుతో కొట్టారు. దీంతో బాధితురాలు తనకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసు స్టేషన్ వద్ద బైఠాయించారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు, వైసీపీ కదిరి అభ్యర్థి మగ్బూల్ అహ్మద్ బంధువైన పరికి షామీర్.. పట్టణంలోని మశానంపేటకు చెందిన వహీదాను పదిమందితో ప్రచారానికి రావాలని పిలిచారు. ఒక్కో మహిళకు రూ.300 ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. వహీదా 15మందిని ప్రచారానికి తీసుకెళ్లారు. ప్రచారం పూర్తయ్యాక అందరూ అభ్యర్థి మగ్బూల్ ఇంటికి చేరుకున్నారు. దీంతో ఆగ్రహించిన షామీర్, తాను పది మందిని తీసుకురమ్మని చెబితే 15మందిని తీసుకొస్తావా? అంటూ బూతులు తిట్టారు. పదిమందికే డబ్బులు ఇవ్వాలని కోరినా పట్టించుకోకుండా రంజాన్ వేళ బూతులు తిట్టారని బాధితురాలు వాపోయారు. అంతటితో ఆగకుండా చెప్పు తీసుకుని తన తలపై కొట్టారని కన్నీరు పెట్టుకున్నారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లి తనకు న్యాయం చేయాలని కోరుతూ నిరసనకు దిగారు. వైసీపీ అభ్యర్థి గెలవక ముందే దౌర్జన్యాలు చేస్తున్నారని, గెలిస్తే పరిస్థితి ఇంకెలా ఉంటుందో అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు ఆమె ఫిర్యాదు స్వీకరించారు.

ఘనంగా అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలను మంగళవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీనియర్ నేతలు ఎంఏ షరీఫ్, వర్ల రామయ్య, దువ్వారపు రామారావు, గురుమూర్తి, సాహెబ్, హసన్‌బాషా తదితరులు భారీ కేక్‌ను చేశారు. కార్యాలయం హౌస్ కీపింగ్ మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు.

టీడీపీ సీనియర్ నేతలకు ముఖ్య పదవులు

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యం, కేఎస్ జవహర్‌కు ఆ పార్టీలో ముఖ్య పదవులు లభించాయి. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా బీసీ నేత రెడ్డి సుబ్రహ్మణ్యంను పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగానూ, దళిత నేత జవహర్‌ను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగానూ నియమించారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీని విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడిగా, బి.వి.వెంకటరాముడును హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడిగా నియమించారు. సి.ఎం.సురేష్, మన్నే సుబ్బారెడ్డి, కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడును పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులుగా, ముదునూరి మురళీకృష్ణంరాజు, వాసురెడ్డి ఏసుదాసును పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమించారు.

అక్రమాలకు పాల్పడిన వారు బీజేపీలో చేరగానే శుద్ధులైపోతారా..!: రామకృష్ణ

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): భారీస్థాయిలో అవినీతి, అక్రమాలకు పాల్పడినవారు బీజేపీలో చేరగానే శుద్ధులైపోతారా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ప్రశ్నించారు. 'బీజేపీ ప్రభుత్వం లిక్కర్ స్కాం పేరుతో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను జైలుకు పంపింది. భారీ మైనింగ్ అక్రమాలకు పాల్పడి, జైలుకెళ్లి, ఇప్పటికీ కేసులు ఎదుర్కొంటున్న గాలి జనార్దనరెడ్డిని తమ పార్టీలో చేర్చుకుంటోంది. మద్యం అమ్మకాల్లో రూ.వేల కోట్ల అక్రమాలకు పాల్పడిన సీఎం జగన్‌పై చర్యలు తీసుకోవాలని సాక్షాత్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కేంద్ర హోం మంత్రికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఇవేనా బీజేపీ చెబుతున్న నీతి రాజకీయాలు?' అని రామకృష్ణ నిలదీశారు.

తప్పుడు వార్తలు రాస్తోంది

జగన్ పత్రికపై ఈసీకి సీఎం రమేశ్ ఫిర్యాదు

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ సొంత పత్రిక తప్పుడు వార్తలు రాస్తోందంటూ రాజ్యసభ సభ్యుడు, బీజేపీ అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేశ్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. మూడు దశాబ్దాల తన రాజకీయ జీవితంపై బురద జల్లేందుకు 'దేశముదుర్లు' అంటూ కల్పిత కథనాన్ని ప్రచురించి ప్రజల్లో తన పరపతిని తగ్గించే కుట్ర జగన్ పత్రిక ఉద్దేశపూర్వకంగా చేసిందన్నారు. జగన్ పత్రికపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బలవంతపు రాజీ!

వైసీపీ నేత చేతిలో దెబ్బలు తిన్న అర్చకులతో దేవదాయ శాఖ అధికారుల పంచాయితీ

దాడికి పాల్పడిన వ్యక్తితో వారికి క్షమాపణలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ భీమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడిపై ఓ వైసీపీ నేత దాడికి పాల్పడిన ఘటనను నీరుగార్చేందుకు ఆ పార్టీ పెద్దలు రంగంలోకి దిగారు. అధికారులతో కుమ్మక్కై.. గొడవేమీ జరగలేదన్నట్లుగా సీన్ మార్చేశారు. నిందితుడైన వైసీపీ నేతను ఆలయం వద్దకు పిలిపించి అర్చకులకు క్షమాపణలు చెప్పించారు. ఈ తతంగం మొత్తం కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కనుసన్నల్లో సాగింది. మీడియా సమావేశం జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు కూడా అక్కడే ఉండటం విశేషం. కాకినాడ బాలాత్రిపురసుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఇద్దరు అర్చకులపై వైసీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రరావు దాడికి పాల్పడ్డారు. గర్భగుడిలోకి వచ్చిన సదరు నేత ఇచ్చిన పూజాసామగ్రిని తీసుకుని అర్చకుడు సాయి పూజ చేశారు. అయితే తాను తెచ్చిన పాలు శివలింగంపై సరిగ్గా పోయలేదని, వైసీపీ నేతకు ఇచ్చే విలువ ఇదేనా అంటూ చంద్రరావు ఆగ్రహంతో ఊగిపోయారు. సహాయ అర్చకుడు సత్యసాయి ప్రసాదం ఇస్తుండగా, ఆయన చెంపపై కొట్టారు. తనేం తప్పు చేశానని ప్రశ్నించిన అర్చకుడిని 'నాకే ఎదురు సమాధానం చెబుతావా' అంటూ అసభ్య పదజాలంతో దూషిస్తూ కాలితో తన్నారు. ఉపాలయంలో పూజలు చేస్తున్న మరో అర్చకుడు మద్దిరాల విజయకుమార్ వచ్చి అడ్డుకోగా ఆయన చెంపపైనా కొట్టడంతో పాటు అంతుచూస్తానని బెదిరించారు. చంద్రరావు తీరుపై దేవదాయశాఖ ఉన్నతాధికారులు, పోలీసులకు అర్చకులు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపడంతో వైసీపీ పెద్దలు రంగంలోకి దిగారు. వివాదం సద్దుమణిగేలా చేసేపనిని ఎమ్మెల్యే ద్వారంపూడికి అప్పగించారు. ఆయన ఆదేశాలతో దేవదాయ శాఖ అధికారులు శివాలయం వద్ద మంగళవారం విచారణ చేపట్టారు. దాడికి పాల్పడిన చంద్రరావును పిలిపించి, క్షమాపణలు చెప్పాలని ఆదేశించారు. అయితే తాను దాడి చేయలేదని, కానీ అందరూ అడుగుతున్నారు కాబట్టి క్షమాపణలు చెబుతున్నట్లు పేర్కొంటూ అర్చకుల భుజాన్ని అలా పైపైన తాకారు. దీంతో వివాదం ముగిసిందని దేవదాయశాఖ డీసీ ప్రకటించారు. ఇకపై ఏం మాట్లాడొద్దంటూ బలవంతపు రాజీ పంచాయితీ ముగించారు. అయితే తర్వాత ఆలయం బయటకు వచ్చిన సదరు వైసీపీ నేత మీడియాతో మాట్లాడుతూ అర్చకులపై తాను దాడిచేయలేదని, క్షమాపణలు కూడా అడగలేదని బుకాయించారు. అనంతరం డీసీ విజయరామారావు మీడియాతో మాట్లాడుతూ అర్చకులపై జరిగిన దాడి ఘటనపై న్యాయపరంగా ముందుకు వెళ్తామని చెప్పారు.

ఒత్తిడి తెచ్చి చెప్పించేశారు

ఆలయంలో పైపై రాజీ ఎలా జరగాలో అధికారులకు ముందుగానే నిర్దేశించిన ఎమ్మెల్యే ద్వారంపూడి... చివరకు బాధిత అర్చకులపైనా బలవంతంగా ఒత్తిడి తెచ్చి అసలు వివాదం ఏమీ లేదని వారితోనే చెప్పించారు. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం వారితో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయించారు. జరిగిన ఘటన పూజారికి, భక్తుడికి మధ్య చోటుచేసుకున్న చిన్న వివాదంగానే చూడాలని చెప్పించారు. ఒకరకంగా చెప్పాలంటే బాధితులైన అర్చకులకు న్యాయం జరగకుండానే... వివాదం ఏం లేదని, అంతా చక్కబడినట్లేనని అధికార పార్టీ నేతలు తిరిగి వారితోనే బలవంతంగా చెప్పించారు. అధికారులు సైతం వైసీపీ నేతలకు కొమ్ముకాశారనే విమర్శలు వస్తున్నాయి. దాడి చేసిన వైసీపీ నేత చంద్రరావును అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ చెప్పారు. కానీ ఆ తర్వాత ఆయన బయటే తిరుగుతుండటం ఉత్తుత్తి రాజీకి నిదర్శనంగా నిలిచింది.



రాజమహేంద్రవరంలో ఎస్పీ కార్యాలయం వద్ద బాధితులతో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు

వైసీపీనే అంటార్రా.. వ్యాన్‌తో తొక్కించేస్తాం!

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): 'మేం రెడ్డిగారి అబ్బాయిలం. మాకు కోపమెక్కువ. ప్రభుత్వం మాది. నేను జగన్మోహన్‌రెడ్డికి ప్రియ శిష్యుడిని. నా పేరు రాంరెడ్డి. మా ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేలను రకరకాలుగా మాట్లాడుతున్నారట. జగన్మోహన్‌రెడ్డిని అంటార్రా.. ఏ...(బూతులు). సీఎంకి వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడుతున్నార్రా. మా సీఎం ఓడిపోవాలని అంటున్నారంట నా....(బూతులు). రోడ్లమీద వ్యాన్‌తో తొక్కించేస్తాం. స్పాట్‌లోనే చచ్చిపోతారు' అని పేద బ్రాహ్మణ కుటుంబంపై ఓ వైసీపీ నాయకుడు రెచ్చిపోయాడు. మహిళ అనే విచక్షణ లేకుండా అసభ్య పదజాలంతో చెలరేగిపోయాడు. ఒడిశాకు చెందిన మహాపాత్ర శివ కుటుంబం రాజమహేంద్రవరంలో వంటబ్రాహ్మణ వృత్తితో జీవనోపాధి పొందుతోంది. సోమవారం రాత్రి శివ భార్య ఫోన్‌కి 9133638139 నుంచి కాల్ వచ్చింది. వైసీపీకి వ్యతిరేకంగా మాట్లాడితే చంపేస్తామంటూ ఫోన్ చేసిన వ్యక్తి ఇద్దరినీ తీవ్రంగా హెచ్చరించాడు. దీంతో బాధితులు సిటీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు)ను ఆశ్రయించారు. మంగళవారం బాధితులతో కలిసి ఎస్పీ జగదీశ్‌ని కలిసిన వాసు... బెదిరింపులకు దిగినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు.

వైసీపీ నేతల అధికార మదానికి నిదర్శనం

అర్చకులపై దాడిని తీవ్రంగా ఖండించిన చంద్రబాబు, లోకేశ్

అమరావతి(ఆంధ్రజ్యోతి), మంగళగిరి, మార్చి 26: కాకినాడలో అర్చకులపై వైసీపీ నేత దాడి ఆ పార్టీ నేతల అధికార మదానికి నిదర్శనమని టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'అర్చకుడు అంటే దేముడికి, భక్తుడికి మధ్య అనుసంధానకర్తగా భావించి కాళ్లకు మొక్కే సంప్రదాయం మనది. అటువంటి పూజారులను భక్తుల సమక్షంలోనే కాలితో తన్నడం, కొట్టడం హేయమైన రాక్షస చర్య. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. నిందితుడిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి' అని ఆయన 'ఎక్స్'లో డిమాండ్ చేశారు. కాగా, ఇదే అంశంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఓ ప్రకటన చేస్తూ... వైసీపీ నేత చంద్రరావు గర్భగుడిలో స్వైరవిహారం చేసి పూజారులపై దాడికి పాల్పడడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. భగవంతుడికి సేవ చేయడం తప్ప మరో ధ్యాసలేని అర్చకులపైనా ప్రతాపం చూపడం సిగ్గుచేటని విమర్శించారు. కాగా, అర్చకులు, బ్రాహ్మణులపై వైసీపీ నేతలు దాడిచేస్తే సహించేది లేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్ సూర్య అన్నారు. హిందూ మతాన్ని నాశనం చేయాలని జగన్‌రెడ్డి కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు.



విజయవాడలో జరిగిన సమావేశంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో బీజేపీ రాష్ట్ర ఇంచార్జ్ విజయ సంకేతం

> "రాష్ట్రంలో నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలంటే పొత్తు అనివార్యమని బీజేపీ అగ్రనాయకత్వం గుర్తించడంతోనే త్రివేణి సంగమం (బీజేపీ, టీడీపీ, జనసేన) ఉద్భవించింది. అన్ని రంగాలను నాశనం చేసిన జగన్‌ను ఇంటికి పంపించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే ఎన్డీఏ కూటమి లక్ష్యం. రాష్ట్రంలో రామరాజ్యం కోసం మూడు పార్టీల కూటమి అభ్యర్థుల్ని భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించుకోవాలి"
>
> \- పురందేశ్వరి

అరాచక వైసీపీని కూకటివేళ్లతో పెకలిద్దాం

మూడు పార్టీల అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి: పురందేశ్వరి

అమరావతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరాచక, అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో సహా పెకలించివేయాలని బీజేపీ శ్రేణులకు ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. బీజేపీ, టీడీపీ, జనసేనల ఎన్డీయే కూటమిని ఆమె త్రివేణి సంగమంగా అభివర్ణించారు. ఎన్నికల్లో గెలిచేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు విజయవాడలో జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో పురందేశ్వరి పాల్గొన్నారు. మహిళల పుస్తెలు తెగినా మద్యం తాగిస్తాం.. రాష్ట్రానికి రాజధాని లేకున్నా సెక్రటేరియట్‌ను తాకట్టు పెట్టేస్తాం.. అంటూ వ్యవస్థల్ని చేతుల్లోకి తీసుకుని జగన్ ప్రభుత్వం అరాచకాలు చేస్తోందని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో చేసింది ఏదైనా ఉందంటే దొంగ ఓట్లు చేర్పించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం, లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రానికి భవిష్యత్తు లేకుండా చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.

సమావేశంలో అభ్యర్థుల పరిచయం

రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అరుణ్ సింగ్, సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ హాజరైన పదాధికారుల సమావేశంలో బీజేపీ పార్లమెంటు అభ్యర్థులుగా పోటీచేస్తున్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి(రాజంపేట), వరప్రసాద్(తిరుపతి), పురందేశ్వరి(రాజమండ్రి), భూపతిరాజు వర్మ(నరసాపురం), సీఎం రమేశ్(అనకాపల్లి), కొత్తపల్లి గీతను(అరకు) పరిచయం చేశారు. అభ్యర్థుల విజయానికి ఎలా కృషి చేయాలి.? ఇంటింటికీ వెళ్లి మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, దేశం పదేళ్లలో ఎంత ప్రగతి సాధించి ముందుకెళ్లిందీ, మరో ఐదేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం ఏమి చేయబోతోందనే విషయాలు ఓటర్లకు వివరించాలని అరుణ్‌సింగ్... పార్టీ నేతలు, శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇదిలా ఉండగా, పార్టీ సమావేశానికి కొందరు సీనియర్లు గైర్హాజరయ్యారంటూ వార్తలు రావడంతో జాతీయ కార్యదర్శిగా పనిచేస్తున్న తనకు ఇతర రాష్ట్రాల్లో పార్టీ పని ఉన్నందుకు అనుమతి తీసుకునే వెళ్లానంటూ సత్యకుమార్ ఎక్స్ ద్వారా వివరించారు. టీడీపీ, జనసేనతో సమన్వయం చేసుకోవాలని, ఎన్డీఏ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నేతలకు సిద్ధార్థనాథ్ సింగ్ దిశానిర్దేశం చేశారు.

చర్చనీయాంశంగా 'పదకొండు'

ఈ సమావేశంలో అరుణ్‌సింగ్ చేసిన 11 అసెంబ్లీ స్థానాల వ్యాఖ్య చర్చనీయాంశమైంది. పొత్తులో భాగంగా ఢిల్లీలో జేపీ నడ్డా, చంద్రబాబు, పవన్ మధ్య జరిగిన చర్చల్లో 6 పార్లమెంటు, 6 అసెంబ్లీ స్థానాలు బీజేపీకి దక్కాయి. రాష్ట్రానికి చర్చల ప్రతినిధిగా వచ్చిన కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మరిన్ని అసెంబ్లీ స్థానాలు కోరడంతో జనసేన నుంచి 3, టీడీపీ నుంచి 1 చేర్చి మొత్తం 10 కేటాయించారు. ఆ స్థానాలకు అభ్యర్థులూ ఖరారయ్యారు. అయితే మంగళవారం అరుణ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. ఇంకొకటి పెరిగిందా.? ఎక్కడ.? ఎవరికి.? అంటూ పార్టీ నేతలు చర్చించుకున్నారు. రాష్ట్ర పార్టీ పెద్దలు సైతం ఈ విషయం తమకు కూడా తెలీదని చెప్పడంతో ఆ వ్యాఖ్య ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది.



వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు గజమాల వేస్తున్న వారిలో వలంటీర్

కోడ్‌ను లెక్కచేయని వలంటీర్లు

తెనాలి, మార్చి 26: ఎన్నికల కమిషన్ ఆదేశాలను వలంటీర్లు పట్టించుకోవడం లేదు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆదివారం వైసీపీ ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే శివకుమార్ ఎన్నికల ప్రచారంలో వలంటీర్ కేతావత్ అలహాద్ మనోజ్‌బాబి పాల్గొన్నారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు.



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పీఆర్కే వెంట ఔట్ సోర్సింగ్ ఉద్యోగి శ్రీనివాసరావు

వైసీపీ ప్రచారంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి

మాచర్ల టౌన్, మార్చి 26: పల్నాడు జిల్లా మాచర్ల పురపాలక సంఘం ఎలక్ట్రికల్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న జి.శ్రీనివాసరావు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోమవారం రాత్రి 31వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా ఆయన వెంట శ్రీనివాసరావు ఉన్నారు. రాజకీయ పార్టీల ప్రచారంలో ఉద్యోగులు పాల్గొనడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

వైసీపీ సమావేశంలో ఉపాధ్యాయుడు

పలాస, మార్చి 26: శ్రీకాకుళం జిల్లా పలాసలో ఓ ఉపాధ్యాయుడు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ వైసీపీ సమావేశంలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. పలాసలోని 20వ వార్డులో మంగళవారం వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. దీనిలో భాగా శివాజీనగర్ మదర్‌థెరిస్సా విద్యాలయం వెనుకవీధిలోని పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలాస మండలం పెదంచల పాఠశాల ఉపాధ్యాయుడు మాధవబెహరా కూడా పాల్గొన్నట్టు స్థానికులు గుర్తించి, ఆ ఉపాధ్యాయుడి ఫొటోలను ఎన్నికల అధికారులకు పంపించారు.

ఇద్దరు వలంటీర్ల తొలగింపు

పెద్దాపురం, మార్చి 26: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం మర్లావ గ్రామ సచివాలయంలో వలంటీర్లుగా పనిచేస్తున్న ప్రత్తి సూరిబాబు, పెద్ది సూర్యవీరస్వామిలను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించినట్టు ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. ఈ నెల 23న తిరుపతి గ్రామంలో జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో వారిద్దరూ పాల్గొన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వలంటీర్లు ఇద్దరూ ప్రచారంలో పాల్గొన్నట్టు నిర్ధారణ కావడంతో వారిని విధుల నుంచి తొలగించినట్టు చెప్పారు.

కోడ్ ఉన్నా 'బొమ్మల' కొలువే

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శించారు. అయితే, ఆయన మాటలు విని జేసీలు, రెవెన్యూ సిబ్బంది అవాక్కయ్యారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున దాని ప్రకారం పనిచేయాలని ఇటీవల ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. వీటిని ఉటంకిస్తూ ఈసీ ఆదేశాలను ప్రతీ అధికారి పాటించాలని భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) సాయిప్రసాద్ ఇటీవల కలెక్టర్లు, రెవెన్యూ యంత్రాంగానికి మార్గదర్శకాలు పంపించారు. ఏం చేయాలో, ఏం చేయకూడదో అందులో సవివరంగా తెలిపినట్లు తెలిసింది. ఈ ఉత్తర్వులు సర్వేలోని ఓ ఉన్నతాధికారికి కూడా వర్తిస్తాయి. అయినా వాటిని లక్ష్యపెట్టకుండా జేసీలతో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో జగన్ బొమ్మలను కొనసాగించాల్సిందేనంటూ హుకుం జారీ చేయడం ఇప్పుడు అధికారవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జగన్ పట్ల ఆయనకు ఉన్న వీరభక్తితో తమను ఈసీ చర్యలకు బలి చేస్తారేమోనని జేసీలు, రెవెన్యూ అధికారులు భయపడిపోతున్నారు.

కోడ్ కాదంటున్నా... రాష్ట్రంలో జరుగుతున్న భూముల సర్వేకు 'జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష' అని పేరు పెట్టారు. నవరత్నాల్లో భాగంగా దీన్ని ఓ స్కీమ్‌గా పరిగణిస్తున్నారు. భూముల సర్వే అనంతరం రైతులకు ఇస్తున్న భూమి పాస్ పుస్తకాలు, సరికొత్తగా తయారుచేస్తున్న భూమి పత్రాలు, ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎమ్), ఇతర రికార్డుల్లో జగన్, ఆయన తండ్రి రాజశేఖరరెడ్డితోపాటు, నవరత్నాల లోగోలు ముద్రిస్తున్నారు. నవరత్నాల లోగో మధ్యలో జగన్ ఫొటో ప్రత్యేకంగా ఉంటుంది. ఇది కాకుండా పాస్‌పుస్తకంలోని ప్రతి పేజీలో జగన్ బొమ్మలు ముద్రించారు. వీటిపై రైతులు చిరాకు పడుతున్నారు. తమ భూమి పత్రాల్లో జగన్ ఫొటోలెందుకంటూ రైతులు నిరసన తెలిపారు. కొందరయితే జగన్ ఫొటో ఉన్న పాస్‌పుస్తకాలను ప్రభుత్వ వేదికలపైనే చించివేశారు. ఇదంతా గతం. ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చింది. కాబట్టి ప్రభుత్వం అమలు చేసే స్కీమ్‌లు, కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి జగన్ ఫొటోలు కొనసాగించడానికి వీల్లేదు. భూమి పత్రాల్లో ఆయన ఫొటోలు ముద్రించడం నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుంది. అలాగే, జగన్ పేరుతో సర్వేరాళ్లను ఏర్పాటు చేయడం కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి పూర్తి విరుద్ధం. కాబట్టి, రైతులకు కొత్తగా ఇచ్చే పాస్ పుస్తకాలు, ల్యాండ్ పార్సిల్‌మ్యాప్, ఇతర డాక్యుమెంట్లపై జగన్ ఫొటోలు ముద్రించకూడదు. జగన్ ఫొటో ఉన్న నవరత్నాల లోగోలను కూడా ముద్రించకూడదు. రీ సర్వే పత్రాల్లో జగనన్న పేరు తొలగించి శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష అన్న పదాలే కొనసాగించాలి. ఈసీ ఆదేశాలను పాటించాలని లోగడ సీసీఎల్ఏ... జిల్లా కలెక్టర్లు, జేసీలు, రెవెన్యూ యంత్రాంగానికి ఇచ్చిన మార్గదర్శకాల పరమార్థం కూడా ఇదే. ఓ సీనియర్ అధికారికి ఈ మాత్రం తెలియదా? గతంలో అనేక రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో పరిశీలకుడుగా, ఇతర విధుల్లో పాల్గొన్న ఆ ఉన్నతాధికారికి ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఎన్నికల కోడ్ అమలు ఎలా ఉంటుందో తెలియని విషయమా? అన్నీ తెలిసి కూడా మరోసారి జగన్ దృష్టిలో పడాలని, తనను మించిన వీర విధేయుడు, భజనపరుడు మరొకరు లేరని చాటింపు వేసుకునేందుకే అన్నట్లుగా జగన్ ఫొటోల కొనసాగింపు అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చినట్లు అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది.

అధికారిక వాట్సప్ గ్రూపుల్లో ఆదేశాలు

భూముల సర్వే ఫేజ్2, ఫేజ్ 3 ఎప్పుడు జరిగినా వాటికి సంబంధించిన పాస్‌పుస్తకాలు, ఎల్‌పీఎమ్‌లు ఇప్పుడు ముద్రిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా వాటిపై జగన్ ఫొటోలు ముద్రించకూడదు. అయినాసరే వీడియోకాన్ఫరెన్స్ వేదికగా ఆ ఫొటోలు తొలగించవద్దంటూ జేసీలను ఆదేశించారు. దీనిపై పలువురు జేసీలు భిన్నాభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎన్నికల నియమావళి ప్రకారం ఇప్పుడు ముద్రించే పాస్‌పుస్తకాలు, రికార్డులు, ఎల్‌పీఎమ్‌లపై ఫొటోలు ఉండటానికి వీల్లేదని ఆ ఉన్నతాధికారికి స్పష్టం చేశారు. తన మాటకు ఎదురు చెప్పవద్దని, ఫొటోలు కొనసాగించాల్సిందేనని ఆయన గట్టిగా హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఓ జేసీ మాట్లాడుతూ...ఆ పనిచేస్తే తామందరం ఎన్నికల కమిషన్ చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఆ రిస్క్ తాము తీసుకోలేమని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ సమావేశం తర్వాత కూడా ఆ ఉన్నతాధికారి వెనక్కి తగ్గలేదు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆ ఉన్నతాధికారి ఆదేశాలంటూ అధికారిక వాట్సప్ గ్రూప్‌లకు ఆయన ఆదేశాలను పంపించారు. వాటి సారాంశం, రీ సర్వే కార్యక్రమాలు, పాస్‌పుస్తకాల్లో జగన్, నవరత్నాల లోగోలను తొలగించకూడదనేనని చెబుతున్నారు..

జగన్ ఫొటోలకు ఆద్యుడే ఆయన

భూముల సర్వే పత్రాలు, రాళ్లపై జగన్ ఫొటోలు ముద్రించాలన్న ఆలోచన ఈ ఉన్నతాధికారిదే. జగన్ పట్ల తనకున్న విధేయత, భక్తిని చాటుకునేందుకు తొలుత సర్వే రాళ్లపై జగన్ ఫొటోలు చెక్కించాలని చూశారు. శాంపిల్‌గా కొన్ని రాళ్లు తెప్పించారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురాగా, ఆయన చర్యపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో సర్వేరాళ్లపై జగన్ బొమ్మలు వద్దని సీఎంవో కోరింది. దీంతో ఆ ఉన్నతాధికారి కాస్త వెనక్కి తగ్గారు. అయితేనేం, రైతులకు ఇచ్చే పాసు పుస్తకాలు, గ్రామాల రెవెన్యూ రికార్డులను తెలియజేసే ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌లపై ప్రతీ పేజీలో జగన్ బొమ్మలు ఉండేలా ప్లాన్ చేశారు. ఈ భక్తి సరిపోదని, జగన్ ఫొటో ఉండే నవరత్నాల లోగోను కూడా వాటిపై ముద్రించారు. ఈ ఫొటోలను చూసి జగన్ అచ్చెరువొందారు. కానీ ఈ ఫొటోలను చూసి రైతులు, ప్రజాసంఘాల నేతలు చిరాకుపడ్డారు.



పప్పుబెల్లాల్లా టీటీడీ డబ్బు!

- విరజిమ్ముతున్న చైర్మన్ భూమన
- వివరాలను దాచిపెడుతున్నారు: టీడీపీ ధ్వజం

అమరావతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకటేశ్వర స్వామికి భక్తులు సమర్పిస్తున్న కానుకల ఆదాయాన్ని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పప్పు బెల్లాల మాదిరిగా విరజిమ్ముతున్నారని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఐదు నెలల్లో రూ.1,500 కోట్ల విలువైన పనులను మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారని ఆ పార్టీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ తెలిపారు. టీటీడీ ఇంజనీరింగ్ విభాగానికి రూ.300 కోట్ల బడ్జెట్ ఉంటే, దానికి ఐదు వందల రెట్లు అదనంగా పనులు మంజూరు చేశారన్నారు. ఆ వివరాలను టీటీడీ వెబ్‌సైట్‌లో పెట్టకుండా దాచిపెడుతున్నారని, పనులు విరజిమ్మి పది శాతం కమీషన్ నొక్కుతున్నారని విమర్శించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ- 'పోయిన ఏడాది సెప్టెంబరులో భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఆ తర్వాత మూడే మూడు నెలల్లో రూ.1,300 వందల కోట్ల విలువైన కాంట్రాక్టులు ఇచ్చారు. ఇప్పటికి ఇలా మంజూరైన పనుల విలువ రూ.1,500 కోట్లు దాటిపోయింది. ఇంతకు ముందు టీటీడీ పాలకమండలి సమావేశం నెలకోసారి జరిగేది. ఇప్పుడు ప్రతి 15 రోజులకో సారి పెట్టి కావాల్సిన పనులు మంజూరు చేయించుకొంటున్నారు. మంజూరు చేసిన పనులు ఏమిటో బయటకు చెప్పరు. వెబ్‌సైట్లో పెట్టరు. ఏమీ లేకపోతే ఎందుకీ రహస్యం? టీటీడీ ఈవోగా జవహర్ రెడ్డి ఉన్న సమయంలో మంజూరైన పనుల వివరాలన్నీ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. ధర్మారెడ్డి ఈవోగా వచ్చిన తర్వాత వాటిని పెట్టడం మానేశారు. భూమన చైర్మన్ అయిన తర్వాత దాపరికం మరీ పెరిగిపోయింది. వారిద్దరి ప్రైవేటు ఆస్తిగా టీటీడీ మారిపోయింది. కాంట్రాక్టులు వారి మనుషులకే ఇప్పించుకొంటున్నారు. పోస్టులూ వాళ్ల మనుషులకే వస్తున్నాయి' అని విమర్శించారు. అదనపు బడ్జెట్ మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని, అది కూడా లేకుండానే పనులు కేటాయించుకొంటున్నారని ఆరోపించారు. తిరుపతిలో శుభ్రంగా ఉన్న సత్రాలు రెంటిని కూల్చివేసి వాటి స్థానంలో కొత్తగా రూ.300 కోట్లతో కొత్తవి కట్టాలని నిర్ణయం తీసుకొన్నారని చెప్పారు. సత్రాలు కూల్చడంతో పేద భక్తులు అలిపిరి గేటు వద్ద చెట్ల కింద పడుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ధర్మారెడ్డిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ఆయన పదవీకాలం పొడిగించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లేఖ రాశారని, వారి బంధం ఏమిటో దీనిని బట్టి తెలుస్తోందని వ్యాఖ్యానించారు.

గొడుగులు, బొట్టుబిళ్లలు, రిస్ట్‌వాచీలు!

- తిరుపతి విమానాశ్రయం సమీపంలోని గోదాముల్లో దాచి పెట్టిన వైసీపీ కానుకలు
- తనిఖీల్లో బయటపడిన సామగ్రి

తిరుపతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముంగిట వైసీపీ నేతలు ఓటర్లను ప్రభావితం చేసేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. తిరుపతి విమానాశ్రయ సమీపంలోని ప్రైవేట్ గోదాముల్లో పెద్దఎత్తున కానుకలు, ఎన్నికల ప్రచార సామగ్రిని నిల్వ చేశారు. ఇవి మంగళవారం బయటపడ్డాయి. వీటిలో గొడుగులు, కండువాలు, బొట్టు బిళ్లలు, సీఎం జగన్, వైఎస్ చిత్రాలతో కూడిన రిస్ట్‌వాచీలు గుట్టలు గుట్టలుగా ఉండడంతో అధికారులు సైతం ఆశ్చర్యపోయారు. 'గోదాముల్లో వైసీపీ ప్రచార సామాగ్రి నిల్వ' శీర్షికన



తిరుపతి విమానాశ్రయం సమీపంలోని గోదాములో దొరికిన బొట్టు బిళ్లల ప్యాకెట్లు

మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై టీడీపీ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల అధికారులు గోదాములను పరిశీలించేందుకు వెళ్లారు. వీరి రాకను గమనించిన గోదాములోని సిబ్బంది వెనుక నుంచి తాళాలు వేసుకొని పరారయ్యారు. దీంతో బయట నిలిపి ఉంచిన వైసీపీ సామాగ్రితో కూడిన వాహనాన్ని సీజ్ చేశారు. అయితే గోదాము లోపల ఏముందో తెలియాల్సిందేనని టీడీపీ నాయకులు నిరసనకు దిగారు. నగదు ఉండొచ్చన్న అనుమానాలను లేవనెత్తారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. మరోవైపు ఇక్కడి ఘటనలను ఫొటోలు తీసి సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న సీఐ, తహసీల్దారు మీడియా సమక్షంలో వాహనంలోని మూటలను తెరిపించారు. ఓటర్లకు పంచిపెట్టేందుకు గొడుగులు, బొట్టు బిళ్లలు, రిస్ట్‌వాచీలు, ఈవీఎం నమూనాలు, టోపీలు, బ్యాడ్జీలు, వైసీపీ జెండాలు తదితర వస్తువులు బయటపడ్డాయి.

ఇంటింటి ప్రచారానికీ అనుమతి తీసుకోవాలా?

- గతంలో ఎప్పుడూ ఈ నిబంధన లేదు
- పార్టీ కార్యాలయాల వద్ద జెండాలూ తొలగిస్తారా?
- రాజకీయ పార్టీల అభ్యంతరం
- సీఈవోతో భేటీలో తేల్చి చెప్పిన పార్టీలు
- ఈసీ దృష్టికి తీసుకెళతానన్న సీఈవో

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): 'ఇంటింటి ప్రచారానికీ అనుమతి తీసుకోవాలా?. కరపత్రాలు పంపిణీ చేసేందుకు కార్యకర్తలకు అనుమతి ఉండాలా?. పార్టీ కార్యాలయాల వద్ద ఎప్పటి నుంచో ఉంటున్న జెండాలు, బ్యానర్లను తొలగించాలా?.. ఏమిటీ నిబంధనలు. గతంలో ఎప్పుడూ లేవు. ఇటీవలే జరిగిన తెలంగాణ ఎన్నికల్లోనూ లేవు. వీటిని అమలు చేయడం సాధ్యంకాదు' అని రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో)కు తేల్చి చెప్పాయి. మీ అభ్యంతరాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళతానని సీఈవో వారికి హామీ ఇచ్చారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సీఈవో ముకేశ్‌కుమార్ మీనా మంగళవారం అమరావతి సచివాలయంలో సమావేశం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, వైసీపీ, బీఎస్పీ, సీపీఎం పార్టీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ తదితర ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై అన్ని రాజకీయ పార్టీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. తమ అభ్యంతరాలను సీఈవో దృష్టికి తీసుకెళ్లిన పార్టీల నాయకులు, ఆ తర్వాత మీడియా సమావేశంలోనూ వాటిని తెలిపారు.

అభ్యంతరం తెలిపాం: టీడీపీ

ఇంటింటికీ ప్రచారానికీ అనుమతి తీసుకోవాలనే నిబంధనపై టీడీపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఈసీ ఇచ్చిన దాంట్లో ఈ నిబంధన లేదని తెలిపింది. సీఈవో దృష్టికి తీసుకెళ్లిన అంశాలను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మీడియాకు వివరించారు. 'అడుగడుగునా అవినీతి, అధికార పార్టీ ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. ఫిర్యాదులు చేస్తూనే ఉన్నాం. మీరు చర్యలు తీసుకోవడం లేదు. మీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలు జరుగుతాయా?' అని సీఈవోను టీడీపీ ప్రశ్నించింది. ఎన్నికల నిబంధనలన్నీ టీడీపీకే వర్తిస్తాయా.. వైసీపీకి వర్తించవా? అని నిలదీసింది. 'అభ్యర్థులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారానికీ అనుమతి పొందాలనే నిబంధన పెట్టారు. కరపత్రాలు పంచేందుకూ అనుమతి తీసుకోవాలన్నారు. గతంలో ఎప్పుడూ ఈ తరహా నిబంధనలు లేవు. 2023 డిసెంబరులో జరిగిన తెలంగాణ ఎన్నికల్లోనూ ఈ నిబంధనలు లేవు. ఇంటింటి ప్రచారానికి అనుమతి తీసుకోవాలనడం అభ్యంతరకరం. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల్లోనూ ఈ నిబంధనలు లేవు. ఈ నిబంధనపై కేంద్ర ఎన్నికల సంఘానికి తెలియజేస్తాం' అని వర్ల చెప్పారు.



33 విభాగాల వారికి పోస్టల్ బ్యాలెట్: మీనా

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): 33 అత్యవసర సేవలు అందించే శాఖలకు చెందిన వారికి కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించిందని సీఈవో ముకేశ్‌కుమార్ మీనా తెలిపారు. మెట్రో, రైల్వే రవాణా(ప్రయాణికులు, సరుకు రవాణా) సేవలు, పోలింగ్‌ను కవర్ చేసే మీడియా వ్యక్తులు, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ టెలిగ్రామ్, దూరదర్శన్, ఆలిండియా రేడియో, మిల్క్ యూనియన్, మిల్క్ సొసైటీలు, ఆరోగ్యశాఖ, ఫుడ్ కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్, విమానయానం, రోడ్డు రవాణా సంస్థ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీస్, అంబులెన్స్ సేవలు, షిప్పింగ్, ఫైర్ ఫోర్స్, జైళ్లు, ఎక్సైజ్‌శాఖ, వాటర్ అథారిటీ, ట్రెజరీస్ శాఖ, అటవీశాఖ, సమాచార, ప్రజా సంబంధాలశాఖ, పోలీసు, పౌర రక్షణ, హోంగార్డులు, ఆహార పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, పవర్, ఎయిర్‌పోర్ట్ అథారిటీస్ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పీడబ్ల్యూడీ, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్స్, విపత్తు నిర్వహణ తదితర అత్యవసర సేవల విభాగాల్లో పని చేసే వారు పోలింగ్ రోజున విధుల్లో ఉండాల్సి వస్తే పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించనున్నట్లు స్పష్టం చేసింది.

ఇంటింటి ప్రచారానికీ అనుమతులా?: సీపీఎం

రాజకీయ పార్టీలు ఇంటింటికి ప్రచారం చేసేందుకు అనుమతి తీసుకోవాలని సీఈవో నిబంధనల్లో చెప్పారని దీన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు చెప్పారు. దీనివల్ల అన్ని పార్టీలు ఇబ్బందులు ఎదుర్కొంటాయన్నారు.

ఈ నిబంధనలు గతంలో లేవు: వైసీపీ

ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతారు. కరపత్రాలు పంపిణీ చేస్తారు. ఇందుకు అనుమతి తీసుకోవాలని సీఈవో చెప్పారు. దీనిపై అభ్యంతరం తెలిపామని వైసీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చెప్పారు. 'నియోజవర్గంలో తిరగడానికి అభ్యర్థి అనుమతి తీసుకుంటారు. పార్టీ యంత్రాంగం అంతా ప్రతి డివిజనల్‌లో తిరగడానికి అనుమతి తీసుకోవాలంటే కష్టం' అని విష్ణు అన్నారు. ఎన్నికల్లో ఇంటింటి ప్రచారానికి అనుమతి తీసుకోవాలంటే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రాష్ట్ర పార్టీ కార్యాలయాలు, అభ్యర్థుల కార్యాలయాల్లో కూడా బ్యానర్లు, హోర్డింగ్‌లు పెట్టుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరామని, జిల్లా అధికారులకు ఆదేశాలు ఇస్తామని సీఈవో చెప్పారన్నారు.

బరితెగించిన ఉద్యోగుల సలహాదారు

- కోడ్‌ను విస్మరించి మరీ ఉద్యోగులపై ఒత్తిడి
- చంద్రశేఖర్‌రెడ్డి తీరుపై సర్వత్రా విమర్శలు



అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సలహాదారు ఎన్. చంద్రశేఖర్ రెడ్డి ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కారు. కోడ్‌ను ఉల్లంఘించి తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగుల సంఘం నాయకుడిగా ఉన్న సమయంలోనే వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన ఆయన ఇప్పుడు పూర్తిగా ముసుగు తొలగించేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న విషయాన్ని ఉద్దేశ పూర్వకంగానే విస్మరించి.. వైసీపీకి ఓటు వేయాలంటూ ఉద్యోగులపై పరోక్షంగా ఒత్తిడి తేవడం ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ జగన్ సర్కార్‌కు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. మే 13న జరిగే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఉద్యోగులంతా ఓటు వేసి, జగన్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఇదే సమయంలో తాము అధికారంలోకి వచ్చాక తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామంటున్న విపక్ష నేతలకు సైతం హెచ్చరికలు చేశారు. "ఉద్యోగులు ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా.. ప్రతిపక్షాల మాట వింటారా? రూల్స్ అనేవి ప్రభుత్వం పెడుతుందా? ప్రతిపక్షాలు రూపొందిస్తాయా? ఉద్యోగుల జోలికి వస్తే.. సహించేది లేదు" అని తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో తన చాంబర్‌లో మీడియా సమావేశం నిర్వహించి, ప్రతిపక్ష పార్టీల నేతలకు తీవ్ర హెచ్చరికలు చేయడం గమనార్హం. ఇదేసమయంలో కోడ్‌ను ఉల్లంఘించి ప్రభుత్వ కార్యాలయంలో కూర్చుని ఉద్యోగులు ప్రభుత్వానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని బాగు చేయాలనే ఉద్దేశంతో ప్రస్తుత సీఎం వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థ తెచ్చారని తెలిపారు. దీనికి మంచి పేరు రావడంతో ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. ప్రభుత్వాన్ని తప్పు పట్టడం ఫ్యాషన్ అయిపోయిందన్నారు. కాగా, చంద్రశేఖరరెడ్డి వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సలహాదారుగా ఉన్న ఆయన వైసీపీ నాయకుడిగా మారి ఇలా ప్రచారం చేయడం ఏంటని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

అనకాపల్లి లోక్‌సభ బరిలో.. ముత్యాలనాయుడు

అమరావతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి లోక్‌సభ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పోటీచేయనున్నారు. సీఎం వైఎస్ జగన్ మంగళవారం ఓ ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఇప్పటివరకు ఆయన ప్రాతినిధ్యం వహించిన మాడుగుల అసెంబ్లీ స్థానంలో ఆయన కుమార్తె ఈర్లి అనురాధను నిలుపుతున్నట్లు వెల్లడించారు. ఆయన బుధవారం నుంచి 'మేమంతా సిద్ధం' పేరిట బస్సు యాత్రకు బయల్దేరుతున్న నేపథ్యంలో ఇప్పుడు ముత్యాలనాయుడు అభ్యర్థిత్వాన్ని అక్కడ ఖరారుచేశారు.

వేడెక్కుతున్న రాజకీయం!

- రాష్ట్రంలో పార్టీల ప్రచార సంరంభం
- జనంలోకి అధినేతలు
- నేటి నుంచి జగన్ 'మేమంతా సిద్ధం'
- 21 రోజుల పాటు బస్సు యాత్ర
- నేటి నుంచే బాబు ప్రజాగళం
- పలమనేరు, పుత్తూరు, మదనపల్లెల్లో బహిరంగసభలు
- 30న పిఠాపురం నుంచి పవన్

అమరావతి/తిరుపతి/కడప, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. ప్రధాన రాజకీయ పార్టీలు వైసీపీ, తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రచార రంగంలోకి దూకుతున్నాయి. ఆయా పార్టీల అధ్యక్షులు సుడిగాలి పర్యటనలకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా సీఎం జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం రాష్ట్రవ్యాప్త ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. ఇడుపులపాయలో వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులు అర్పించాక.. 'మేమంతా సిద్ధం' పేరిట జగన్ బస్సుయాత్రను ప్రారంభిస్తారు. 21 రోజుల పాటు ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ స్థానాల గుండా ఈ యాత్ర సాగుతుంది. చంద్రబాబు ప్రధాని మోదీ, జనసేనాని పవన్ కల్యాణ్‌తో కలిసి ఈ నెల 17న చిలకలూరిపేటలో ప్రజాగళం పేరిట ఉమ్మడి సభతో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. బుధవారం ప్రజాగళం పేరిటే చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో పర్యటించనుండగా.. పవన్ 30న పిఠాపురం నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు.

నేడు ప్రొద్దుటూరులో జగన్ సభ




సీఎం జగన్ బుధవారం సొంత జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.56 గంటలకు తాడేపల్లి నుంచి కడపకు ప్రత్యేక విమానంలో బయల్దేరతారు. మధ్యాహ్నం 12.20 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు. ఇక్కడ నుంచి హెలికాప్టర్లో 12.45కు ఇడుపులపాయ వెళ్తారు. మధ్యాహ్నం 1.20 వరకు వైఎస్ ఘాట్ వద్ద ప్రార్థనలు నిర్వహించి 1.30 గంటలకు బస్సులో బయలుదేరి వేంపల్లె, ఎర్రగుంట్ల మీదుగా ప్రొద్దుటూరు చేరుకుంటారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం దువ్వూరు మీదుగా ఆళ్లగడ్డ వెళ్లి రాత్రికి అక్కడ బసచేస్తారు. గురువారం నంద్యాల సభలో పాల్గొంటారు. కాగా.. ప్రొద్దుటూరు సభకు డ్వాక్రా మహిళలను తరలించాలని మెప్మాలో పనిచేస్తున్న సీవోలు, ఆర్పీలు వాట్సాప్ మెసేజ్‌లు పంపించారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేసి, సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చి మహిళలను జగనన్న ఆదుకున్నారని.. ఆ రుణం తీర్చుకునేందుకు ఈ సభలో డ్వాక్రా మహిళలు పాల్గొనాలని పేర్కొన్నారు.

రోజుకు 3 నియోజకవర్గాల్లో బాబు పర్యటన



చంద్రబాబు ప్రజాగళం పర్యటనకు బుధవారం శ్రీకారం చుడుతున్నారు. రోజుకు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. ఉదయం కుప్పం నుంచి పలమనేరు చేరుకుని అక్కడ ప్రజాగళం తొలి బహిరంగసభలో పాల్గొంటారు. తర్వాత నగరి నియోజకవర్గం పుత్తూరు, అన్నమయ్య జిల్లా మదనపల్లె సభల్లోనూ మాట్లాడతారు.

30 నుంచి 3 రోజులు పిఠాపురంలోనే పవన్..



పవన్ 30వ తేదీ నుంచి పిఠాపురంలో ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. నియోజకవర్గంలో మూడ్రోజులు పర్యటిస్తారు. పురూహూతిక అమ్మవారిని దర్శించుకుంటారు. వారాహి వాహనానికి పూజలు చేయిస్తారు. దత్తపీఠాన్ని సందర్శిస్తారు. బంగారుపాప దర్గాకు వెళ్తారు. క్రైస్తవ పెద్దలతో భేటీ అవుతారు.

కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి హత్య కేసు ఇద్దరికి యావజ్జీవ కారాగారం

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విశాఖలో సంచలనం రేపిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు భోగసముద్రం విజయారెడ్డి (53) హత్య కేసులో రౌడీషీటర్ కోలా వెంకట హేమంత్‌కుమార్, ఎన్.రాధికాదేవికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. దీనితోపాటు రూ.12 వేలు జరిమానా విధిస్తూ ఆరో ఏడీజే జిల్లా కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. గాజువాక మున్సిపాలిటీగా ఉన్నప్పుడు కౌన్సిలర్‌గా పనిచేసిన కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి అక్కయ్యపాలెం ఎన్‌జీజీవో కాలనీలోని పద్మభాస్కరప్రకాష్ రెసిడెన్సీ (ఫ్లాట్ నంబర్ 502)లో నివాసం ఉండేవారు. ఆమె భర్త బీవీ నారాయణరెడ్డి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి. కుమార్తెకు వివాహం చేయడంతో హైదరాబాద్‌లో ఉంటోంది. విజయారెడ్డి దంపతులు తమ ఫ్లాట్‌ను విక్రయించే ప్రయత్నంలో ఉండగా కోలా వెంకట హేమంత్‌కుమార్‌తోపాటు రాధికాదేవి తాము కొనుగోలు చేస్తామంటూ వెళ్లి ఆమెతో పరిచయం పెంచుకున్నారు. 2019 ఫిబ్రవరి 25న ఇంట్లో ఒంటరిగా ఉన్న విజయారెడ్డిని ఇద్దరూ కలిసి హత్యచేసి ఆమె శరీరంపై, ఇంట్లో ఉన్న బంగారాన్ని అపహరించారు. తర్వాత ఇంటికి బయట నుంచి తాళం వేసి సెల్లార్‌లో ఉన్న ఆమె కారు తీసుకుని పరారయ్యారు.



హేమంత్(ఫైల్)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

వ్యాన్ ఢీకొని వాచ్‌మెన్ మృతి

విద్యాధరపురం: జాతీయ రహదారి స్వర్ణగార్డెన్ సమీపంలో టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై ప్రయాణిస్తున్న భార్యభర్తలను వెనుక నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో వాచ్‌మెన్ తలారి అంథోని (54) మృతి చెందినట్టు మంగళవారం భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కంచికచర్ల మండలం చెవుటికల్లు మెయిన్‌రోడ్డులో నివాసం ఉండే తలారి అంథోని సుమారు నాలుగేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం భార్య లక్ష్మితో కలిసి దేసు సుబ్బారావు నగర్‌లోని నరేంద్ర కుమార్ గుప్తా వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తూ వారింట్లోనే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం అంథోని భార్యతో కలిసి తన వాహనం టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై విజయవాడ వైపునకు బయలుదేరాడు. స్వర్ణగార్డెన్ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి అతివేగంగా ప్రయాణించిన వ్యాన్ అంథోనిని ఢీకొంది. ఈఘటనలో భార్యభర్తలు రోడ్డుపై పడ్డారు. వీరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు అంథోనిని పరీక్షించి అప్పటికే మరణించినట్టు నిర్ధారించారు. లక్ష్మి చికిత్స పొందుతోంది. సమాచారం తెలుసుకున్న చెవిటికల్లులోని అంథోని సోదరుడు బాలశౌరి ఆసుపత్రికి వచ్చి ఘటన వివరాలు తెలుసుకున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు

విద్యార్థి అనుమానాస్పద మృతి

కంకిపాడు: ఓ కార్పొరేట్ కళాశాలలో విద్యార్థి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని పునాదిపాడు గ్రామ పరిధిలోని (గోసాల) కార్పొరేట్ కళాశాలలో త్రిపురకు చెందిన విద్యార్థిని నీట్ కోచింగ్ తీసుకుంటుంది. ఈ నెల 25న హాస్టల్ నుంచి క్లాస్ రూంకు నడుచుకుంటూ వెళ్తుండగా విద్యార్థిని ఆకస్మికంగా కింద పడిపోయింది. హుటాహుటిన తాడిగడపలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ పరీక్షించి మృతి చెందినట్టు తెలిపారు. విద్యార్థిని తండ్రి దీపక్ ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ఎస్సై సందీప్ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో దిగి తప్పిపోయిన జార్ఖండ్ వృద్ధుడు



రైల్వేస్టేషన్: గత ఏడాది నవంబర్ 19న నగరం లోని రైల్వేస్టేషన్‌లో రాత్రి 11.40 నిముషాలకు జేఎస్ ఎంత ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న వృద్ధుడు దిగి తప్పిపోయిన వైనంపై రైల్వే పోలీసులకు బెంగుళూరు బైసాన్‌హళ్లీ రైల్వే పోలీస్‌స్టేషన్ నుంచి ఫిర్యాదు రిఫ ర్ అయింది. జేఎస్‌ఎంత రైలు వెస్ట్‌కోచ్‌లో జైనుల్ మియాన్ (71) తన భార్యతో ప్రయాణించాడు. బెం గుళూరు నుంచి జార్ఖండ్‌లోని జాసిదిహ్ స్టేషన్‌లో దిగేందుకు వీరు ప్రయాణిస్తున్నారు. గతేడాది నవంబర్ 19న రాత్రి రైలు నగరం చేరగానే జైనుల్ రైలు దిగాడు. తరువాత రైలు ఎక్కలేదు. ఆ సమయంలో రైలులో ఉన్న అతడి భార్య నిద్రపోతోంది. తరువాత లేచి చూడగా భర్త కనిపించలేదు. అప్పటి నుంచి ఎంతవెదికినా ఆచూకీ కనిపించలేదు. దీంతో అతడి కుమారుడు మొహమ్మద్ జహంగీర్ బెంగుళూరులో ని బైసానహళ్లీ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 23న ఫిర్యా దు చేశారు. రైల్వేస్టేషన్‌లోనే తన తండ్రి దిగాడని చెబుతున్నందున కేసును ఇక్కడికి బదిలీ చేశారు.

జిల్లా ఎన్నికల మీడియా సెంటర్ రేపు ప్రారంభం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమస్త సమాచారాన్ని అందించేందుకు జిల్లా పౌరసంబంధాల శాఖ నేతృత్వంలో గురువారం మీడియా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. నగరంలోని ప్రభుత్వ అతిథి గృహం ప్రాంగణంలోని ప్రభుత్వ కాంప్లెక్స్‌లో సమాచారశాఖ కార్యాలయానికి అత్యంత సమీపంలో ఏర్పాటు కాబోతోంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమస్త సమాచారాన్ని మీడియా ప్రతినిధులకు అందుబాటులో ఉంచనున్నారు. ఈ సెంటర్‌ను రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ దిల్లీరావు, విజయవాడ పోలీసు కమిషన ర్ కాంతిరాణా సంయుక్తంగా ప్రారంభించనున్నారు.

ఫ్యామిలీ బ్యూటీ సెలూన్ ముసుగులో వ్యభిచారం

● ఇద్దరు నిర్వాహకులు, విటుడి అరెస్టు

విద్యాధరపురం: పోలీస్ కమిషనర్ కాంతిరాణా ఆదేశాలతో డీసీపీ అజిత్‌రాణా ఆధ్వర్యంలో సౌత్ ఏసీపీ రత్నరాజు, సూర్యారావు పేట సీఐ దుర్గారావు తన సిబ్బందితో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో స్పా ముసుగులో వ్యభిచార గృహాన్ని నడుపుతున్న వైనం బట్టబయలైంది. కస్తూరీబాయిపేట గాంధీబొమ్మల సెంటర్ వద్ద హేవెన్ ఫ్యామిలీ బ్యూటీ సెలూన్ పేరుతో వ్యభిచార గృహాన్ని నడుపుతున్నారు. పోలీసులు సమాచారం తెలుసుకుని సోమవారం రాత్రి ఆకస్మిక దాడి నిర్వహించి ఇద్దరు నిర్వాహకులను, ఒక విటుడిని అరెస్ట్ చేసిన మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. ఇదే సమయంలో ముగ్గురు బాధిత మహిళలను హోంకు చేర్చారు.

రైల్వే డివిజన్ ఉద్యోగులకు ఏఐఎస్‌టీపీ డబుల్ విన్నర్ ట్రోఫీ

రైల్వేస్టేషన్: భీమవరంలో ఈ నెల 20 నుంచి 24 వరకు జరిగిన 54ఏళ్ల డబుల్స్ గ్రూప్ ఈవెంట్ 45వ ఆలిండియా సీనియర్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (ఏఐఎస్‌టీపీ) పోటీల్లో డివిజన్‌కు చెందిన ట్రైన్ లైటింగ్ సీనియర్ టెక్నీషియన్ ఏ శ్రీనివాసరావు, మార్షలింగ్ యార్డ్ గ్రేడ్-1 టెక్నీషియన్ కె.సంపత్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలిచారు. డబుల్స్ ఓపెన్ టోర్నమెంట్‌లో వారిద్దరు పాల్గొని ఫైనల్స్‌లో టాప్ సీడ్ తమిళనాడుకు చెందిన మణికందన్, తెలంగాణకు చెందిన కేవీఎస్ మూర్తిపై విజయం సాధించారు. సెమీఫైనల్స్‌లో సుబ్రహ్మణ్య గోపాలకృష్ణన్, సంజయ్ దర్బాను ఓడించి ఫైనల్స్‌కు చేరుకున్నారు. వీరిని డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్, ఏడీఆర్‌ఎంలు పి.ఈ. ఎడ్విన్, ఎం.శ్రీకాంత్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ మల్లేశ్వర బి తోకల అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

బస్టేషన్: విధుల్లో ఉండే ఆర్టీసీ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కలగజేసినందుకు ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ) నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై శ్రీనివాసరావు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో ముఖ్య ఎన్నికల కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. పోలింగ్ రోజు విధుల్లో ఉండే ఆర్టీసీ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని కలెక్టర్లకు ఉత్తర్వులు ఇచ్చినందుక వారు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీకే ఓట్లేయాలి

● టీడీపీ అభ్యర్థులు కేశినేని చిన్ని, గద్దె, కొలుసు, యార్లగడ్డ



సమావేశంలో పాల్గొన్న కేశినేని చిన్ని, గద్దె రామ్మోహన్, పార్థసారథి, యార్లగడ్డ వెంకట్రావు, బొప్పన భవకుమార్

భారతీనగర్, మార్చి 26: మన రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, యువత భవిష్యత్తు బాగుండాలన్నా వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేయాలని కేశినేని చిన్ని, గద్దె రామ్మోహన్, పార్థసారథి, యార్లగడ్డ వెంకట్రావు, బొప్పన భవకుమార్ అన్నారు. మంగళవారం తూర్పునియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్‌లో నాగార్జున నగర్‌లో కాలనీ పెద్దలు భాస్కరరావు, యలమంచిలి రాజా నేతృత్వంలో ఆత్మీయ సమావేశం జరిగింది. జనసేన, బీజేపీ బలపరిచిన టీడీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, నూజివీడు అభ్యర్థి కొలుసు పార్థసారథి, గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం రాబోతుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మా కుటుంబానికి చెందిన వ్యక్తికి 2 సార్లు ఎంపి టికెట్ ఇస్తే నమ్మకద్రోహం చేశాడని, అతడిలా నాకు అహంకారపూరిత భావజాలం లేదన్నారు. గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని డ్రగ్స్ మాఫియాగా మార్చారన్నారు. వైవీ సుబ్బారావు ఇటీవల బ్రెజిల్ వెళ్లాడని, ఎందుకు వెళ్లాడో అప్పుడు అర్థం కాలేదని, ఇప్పుడు విశాఖలో కంటైనర్‌లో అధిక మొత్తంలో డ్రగ్స్ బయటపడిందన్నారు. దేశంలో ఎక్కడ మత్తుపదార్థాలు దొరికినా వాటి మూలాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. 010 పద్దు కింద కార్పొరేషన్ ఉద్యోగుల జీతాలు, కృష్ణానదికి రూ. 450 కోట్ల నిధుల మంజూరు, టవల్ లైన్ నిర్మాణం, మహానాడు రోడ్డు నిర్మాణం, కరెన్సీనగర్, రామవరప్పాడు మధ్య అనేక రోడ్ల నిర్మాణం టీడీపీ ప్రభుత్వంలోనే చేశారన్నారు. మాజీమంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రం ఏమైపోతుందోననే భయంతో ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే చంద్రబాబు బీజేపితో కలిసి వెళుతున్నారన్నారు. గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన తాను, పార్థసారథి, భవకుమార్ ఇప్పుడు టీడీపీలో ఉన్నామని, మార్పు అనేది తమతోనే మొదలైందనడానికి ఇదే నిదర్శనమన్నారు. బొప్పన భవకుమార్ మాట్లాడుతూ తూర్పులో గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలోనే అభివృద్ధి ప నులు జరిగాయన్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీ ఇన్‌చార్జ్ పోతంశెట్టి నాగేశ్వరరావు, టీడీపీ నేతలు పండు, కార్పొరేటర్లు ఉషారాణి, దేవినేని అపర్ణ, కాలనీవాసులు, పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి..

అజిత్‌సింగ్‌నగర్: సెంట్రల్ నియోజకవర్గ నేతల ఆత్మీయ సమావేశం మంగళవారం జరిగింది. స్థానిక షాదీ ఖానా కల్యాణ మండపంలో జరిగిన సమావేశానికి తెలుగుదేశం పార్టీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీ, జనసేన, బీజేపీ పనిచేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నాయన్నారు. జగన్ నరకాసుర పాలన నుంచి రాష్ట్ర ప్రజలను విముక్తి చేసేందుకే పొత్తు పెట్టుకున్నట్టు చెప్పారు. నగరంలోని మూడు నియోజకవర్గాల్లో సీట్లను బీజేపీ, జనసేన, టీడీపీలే కైవసం చేసుకుంటాయని వైసీపీకి అంతం తప్పదన్నారు. ముందుగా ఎన్టీఆర్, వంగవీటి మోహన రంగా విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించిన ఈ కార్యక్రమంలో బొండా ఉమా, వీరమాచనేని లలిత, ఎరుబోతు రమణ, కంచి ధన, కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దె బకాయిల షాపులపై చర్యలేవీ?

● అధికారుల నిర్లక్ష్యమే కారణం!

వన్‌టౌన్, మార్చి 26: కనకదుర్గనగర్‌లోని దుకాణాదారులు అద్దె బకాయిలపై చర్యలు తీసుకోవడంలో దుర్గగుడి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. మొత్తం 24 షాపులకు గాను 21 షాపులు అద్దెదారులు సుమారు రూ.2కోట్ల 30లక్షలు, మహామండపం 5వ అంతస్తులోని 3 షాపుల నిర్వాహకులు రూ.20లక్షలు బకాయి పడ్డారు. అద్దె వసూలులో అధికారుల నిర్లక్ష్యంతో తనకు సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దుర్గగుడి అభివృద్ధిలో భాగంగా పెర్గోలాను తొలగించి అభివృద్ధి చేస్తున్నారు. మిగిలిన పనులు జరగాలంటే మొత్తం 24 షాపులు తొలగించాలి. అధికారులు షాపులు ఖాళీ చేయాలని దుకాణదారులకు నోటీసులు ఇచ్చారు. కానీ వారు షాపులు ఖాళీ చేయకుండా బకాయిలు చెల్లించకుండా అధికారపార్టీ నేతలతో అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. అధికారులు కూడా తూతూమంత్రంగా షాపులు ఖాళీ చేయాలంటూ నాలుగు మాటలు చెప్పి వెళ్లిపోతున్నారని విమర్శలు వస్తున్నాయి. రూ.10 నుంచి రూ.25 లక్షల వరకు అద్దె బకాయి పడ్డ దుకాణాదారులు అద్దె చెల్లించకుండా ఎగ్గొటేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఈవో రామారావు వీరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

గిరిప్రదక్షిణ కిట్లు అమ్మిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

దుర్గగుడిలో పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న గిరిప్రదక్షణను సొమ్ము చేసుకోవాలనుకున్న ఓ ప్రబుద్ధుడు కనకదుర్గ అమ్మవారి గిరిప్రదక్షిణ సంస్థాన్ పేరిట కిట్లు అమ్మిన వైనంపై వన్‌టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసినట్టు ఈవో రామారావు తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో భక్తులను బురిడీ కొట్టిస్తున్న సంస్థాన్ కథనంపై ఈవో స్పందించారు. దుర్గగుడి గిరిప్రదక్షణకు ఎలాంటి కిట్లను తీసుకురాలేదన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు కూడా అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. దుర్గగుడి పేరును ఉపయోగించి కిట్లు అమ్ముతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఈవో తెలిపారు.

ఆస్తికోసం అన్నాచెల్లెళ్ల వివాదం

● ఇంటిని సొంతం చేసుకునేందుకు యత్నాలు

● ఇరువర్గాలు పరస్పర దాడులు ● నలుగురికి కత్తిపోట్లు

చిట్టినగర్, మార్చి 26: తండ్రి నిర్మించిన ఇంటిలో నివాసముంటున్న అన్నచెల్లెళ్ల మధ్య వివాదం రేగింది. ఆ ఇంటిని సొంతం చేసుకునేందుకు గొడవలు పడి కత్తులతో దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారంరాత్రి వించిపేటలో జరిగింది. స్థానిక రామాలయం వీధిలో తుపాకుల వెంకట దుర్గారావు, వడ్డాది గౌరి అన్న చెల్లెలు. ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో ఉంటున్నారు. వడ్డాది గౌరికి ఇద్దరు కుమారులు చరణ్ రాజ్ (28), కిరణ్‌కుమార్ (35) ఇద్దరికీ వివాహం కాలేదు. తుపాకుల వెంకట దుర్గారావుకు ఒక కుమారుడు దుర్గాసాయి ప్రశాంత్. అతడికి వివాహమైంది. ఈ ఇంటిని 2016లో గౌరి తల్లి ఆమెకు రాసిచ్చింది. దీనిపై గౌరి అన్న వెంకట దుర్గారావు అదే ఏడాది కోర్టును ఆశ్రయించడంతో ప్రస్తుతం ఉన్నట్టుగా ఎవరింట్లో వాళ్లు ఉండమని స్టే ఇచ్చింది. అప్పటి నుంచి గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి అనారోగ్యంతో మంచంపై ఉన్న వెంకట దుర్గారావును భార్య లక్ష్మి నీ కారణంగానే మాకీ పరిస్థితి అని తిట్టింది. దీంతో గౌరి చిన్న కొడుకు చరణ్‌రాజ్ వచ్చి అత్తకు సర్ది చెప్పబోయాడు. దీంతో ఆమె నీకేందుకు పో అని తిట్టడంతో అతడి అన్న కిరణ్‌కుమార్ తిరిగి వచ్చి ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించగా ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. దీంతో కోపంతో కిరణ్‌కుమార్ తాను ముందుగా తెచ్చుకున్న కత్తితో అ త్త లక్ష్మిని ఆమె కోడలు సోనిని దాడిచేసి గాయపర్చాడు.

పక్కనే ఉన్న లక్ష్మి కుమారుడు దుర్గాసాయి ప్రశాంత్ కత్తిపీట తీసుకొని బావలైన చరణ్, కిరణ్‌పై దాడి చేసి గాయపర్చాడు. దీంతో అత్తకోడళ్లకు ఒకరి చేయి, ఒకరికి వెనుక భాగంలో తీవ్ర కత్తిపోట్లు, కిరణ్, చరణ్‌కు తలపై తీవ్ర గాయాలయ్యాయి. కొత్తపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గగుడి అభివృద్ధి పనులపై సమీక్ష



క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న ఈవో

వన్‌టౌన్, మార్చి 26: దుర్గగుడిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై ఈవో కేఎస్ రామారావు మంగళవారం ఈఈ రమాదేవి, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో సమీక్షించారు. అన్నదాన భవన నిర్మాణం, ప్రసాదం పోటు, ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, కనకదుర్గానగర్‌లో పార్కింగ్ ప్రదేశం, యాగశాల మెటీరీయల్‌ను తరలించడం, శివాలయం కింద ఖాళీ ప్రదేశం నుంచి కనకదుర్గానగర్ వరకు రోడ్డు అభివృద్ధి ంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వేసవి సందర్భంగా భక్తులకు ఎండ తగులకుండా ఏర్పాట్లు, మంచినీటి సౌకర్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

దుర్గగుడిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి నగరం సమీపంలోని గొల్లపూడికి చెందిన బూర్లె వెంకటరావు మంగళవారం ఆలయానికి విచ్చేసి రూ.1,01,116 చెక్కురూపంలో విరాళంగా అందజేశారు. సికింద్రాబాద్ బ్రాహ్మణబస్తీకి చెందిన ఎం.సూర్యనారాయణ దంపతులు రూ.లక్ష విరాళాన్ని అధికారులకు అందజేశారు. దుర్గమ్మ దర్శనానంతరం దాతలకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో దేవదాయ కమిషనర్

దుర్గమ్మను దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మంగళవారం దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఈఈ కోటేశ్వరరావు దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేయగా, వేద పండితులు వేదాశీర్వచనం ఇచ్చారు.

దళితులపై దాడిచేసిన నిందితులను అరెస్టు చేయాలి

● దళిత, ప్రజా సంఘాల డిమాండ్

ధర్నాచౌక్, మార్చి 26: ప్రకాశం జిల్లా ఎండూరివారిపాలెం గ్రామానికి చెందిన దళితుడు ఆంజనేయులుపై దాడిచేసిన అగ్రకుల దురంహకారులను వెంటనే అరెస్టు చేయాలని, ఆంజనేయులుపై పెట్టిన అక్రమ కౌంటర్ కేసును ఎత్తివేయాలని దళిత, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయా సంఘాల నేతలు మాట్లాడారు. నేటికి కుల రాక్షసి కరాళ నృత్యం చేస్తుందనడానికి ఆంజనేయులుపై జరిగిన దాడే నిదర్శనమన్నారు. అతడిపై దాడిచేసిన బాసిపోయిన పేరయ్య గోవర్ధన్‌ను వెంటనే అరెస్టు చేయాలని, ఎండూరివారిపాలెం దళిత పేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అంద్ర మాల్యాద్రి, మాల యువత కన్వీనర్ దాసరి రంగయ్య, బీఎస్పీ నేత పెగ్గెం ప్రసాద్, రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సుహాస్‌లాల్, లిబరేషన్ ఫ్రంట్ నేత మందా ప్రసాద్, తుమ్మల ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

లెక్చరర్‌ను కఠినంగా శిక్షించాలి

బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీలో డిప్లొమో చదువుతున్న బొనిగల నవదీప్‌పై విచక్షణరహితంగా దాడి చేసిన లెక్చరర్ బాలాజీని కఠినంగా శిక్షించాలని దళిత, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ ఘటను పక్కదోవ పట్టిస్తున్న పోలీసులపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కళాశాల యాజమాన్యంపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గంజాయి, బ్లేడ్‌బ్యాచ్ సభ్యుల హల్‌చల్

● టీడీపీ నేత మల్లెపు రాజుపై దాడి

● తీవ్ర గాయాలైనా పట్టించుకోని కొత్తపేట పోలీసులు

చిట్టినగర్, మార్చి 26: కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బ్లేడ్, గంజాయి బాబులు ప్రజలను హడలెత్తిస్తున్నారు. రాత్రీ, పగలు అనే తేడా లేకుండా రోడ్డు పక్కనే ఆపి ఉన్న ఆటోల్లో వీరు గంజాయి తాగుతూ ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం 47వ డివిజన్‌కు చెందిన టీడీపీ నేత మల్లెపు రాజు తన నివాసం టేనర్‌పేట అడ్డరోడ్డులో ఇంటికి వెళుతుండగా ఇంటికెదురుగా రోడ్డు పక్కనే ఉన్న ఆటోలో ముగ్గురు యువకులు గంజాయి తాగుతూ కనిపించారు. ఎవర్రా మీరు ఇక్కడేం చేస్తున్నారని అడగటంతో వారు వెళ్లిపోయి మరో ముగుర్ని తీసుకొచ్చారు. ఇంట్లో ఉన్న మల్లెపు రాజును బయటికి పిలిచి దాడి చేసి గాయపర్చారు. వారిలో ఒక వ్యక్తి పక్కనే ఉన్న రాయి తీసుకొని ముఖంపై కొట్టడంతో తీవ్రగాయమైంది. ఇంతలో చుట్టు పక్కల వారు రావడంతో వారు పారిపోయారు. బాధితుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కానీ పోలీసులు మాత్రం ఎన్నికల విధుల పేరుతో చేయాల్సిన పనులను పక్కనపెట్టి ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గస్తీ చేయకుండా గాలికొదిలేశారు. దీంతో బ్లేడ్, గంజాయి బాబుల ఆగడాలు పెరిగిపోయాయి. నగర పోలీస్ కమిషనర్ స్పందించి కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గస్తీ పెంచి బ్లేడ్, గంజాయి బాబుల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

బకాయిలు చెల్లించాలని రైతుల ఆందోళన



పెదపులిపాక పీఏసీఎస్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

పెనమలూరు, మార్చి 26: ధాన్యం అమ్మి 2 నెలలైనా తమకు రావాల్సిన ధాన్యం బకాయిలు ఇంత వరకు చెల్లించలేదంటూ పెద పులిపాక రైతులు ఆందోళన బాట పట్టారు. మంగళవారం పెదపులిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయం వద్ద వారు నిరసన వ్యక్తం చేసి మీడియాతో మాట్లాడారు. గ్రామంలోని 135 మంది రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన రూ.2కోట్ల 6లక్షల సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన 3 వారాల్లోనే రైతులకు నగదు చెల్లించాల్సి ఉండగా గత జనవరి 20 వరకు సేకరించిన ధాన్యానికి మాత్రమే సొమ్ము చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకొందని విమర్శించారు. రైతుల తరపున టీడీపీ నేతలు మునునూరు శ్రీనివాసరావు, మునునూరు శ్రీధర్, గుజ్జర్లపూడి బాబూరావు మాట్లాడుతూ రెండున్నర నెలలుగా రైతులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ధాన్యం బకాయిలు ఆలస్యమవుతుండడంతో ఒక రైతు ఆత్మహత్యా ప్రయత్నం చేస్తుంటే తాము నివారించి బకాయిలిప్పించే ప్రయత్నం చేశామన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు డబ్బులు చెల్లించకుండా జగన్‌రెడ్డి ఉత్తుత్తి బటన్‌లు నొక్కి కాలం వెళ్లదీస్తున్నాడని విమర్శించారు. కుర్రా వీరయ్య, షేక్ నజీర్, షేక్ నాగూర్, మేడసాని శ్రీనివాసరావు, కొండపనేని విష్ణు, అట్లూరి శ్రీనివాస్, గంటా వెంకటేశ్వరరావు, అట్లూరి కేశవరావుపాల్గొన్నారు.



పతకాలను సాధించిన రాష్ట్ర క్రీడాకారులు

జాతీయ సిలంబమ్‌లో పలువురికి పతకాలు

విజయవాడ స్పోర్ట్సు, మా ర్చి 26: తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలో ఈ నెల 22 నుంచి 25 వరకు ఆలిండియా సిలంబమ్ ఫెడరేషన్ (ఏఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సిలంబమ్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా, ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల నుంచి బలదేవ్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ ద్వారా శిక్షణ పొందిన పలువురు క్రీడాకారులు మొత్తం 11 పతకాలతో సత్తా చాటారని కోచ్ బలగా కీర్తి తెలిపారు. మొత్తం 18 రాష్ట్రాల నుంచి 500 మందికి పైగా క్రీడాకారులు తలపడ్డారన్నారు. మినీ సబ్ జూనియర్స్, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఎం.నిఖిలేశ్వర్ స్వర్ణం సాధించగా, పుట్టం రాజు శ్రీ కారుణ్య రజతం, ఎన్.కశ్యప్ రజతం, జీఎస్‌కే శరణ్ రజతం, ఎన్.యశస్వి రెండు కాంస్యాలు, ఎస్.హిమగౌరీ కాంస్యం, కె. రుషికేశ్ కాంస్యం, ఎన్.వంశీరెడ్డి కాంస్యం, పి.దర్శిత్ కాంస్యం వశం చేసుకున్నారని ఆమె వివరించారు.



విద్యార్థినికి డిగ్రీ పట్టా అందజేస్తున్న ఆచార్య శోభన్‌బాబు

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

● ఆచార్య శోభన్‌బాబు

వన్‌టౌన్, మార్చి 26: విద్యార్థులు తమకు లభించిన అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలని కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కే శోభన్‌బాబు అన్నారు. కేబీఎన్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే (డిగ్రీ పట్టాల ప్రదానోత్సవం) మంగళవారం సాయంత్రం కళాశాల ప్రాంగణంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కే శోభన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు తమ రంగాల్లో చోటు చేసుకున్న మార్పులను గమనిస్తూ ఆయా అంశాలపై పట్టు సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ 2022-23 సంవత్సరం డిగ్రీ, పీజీ పూర్తిచేసిన 1024 మంది విద్యార్థులకు పట్టాలను అందించామన్నారు. శోభన్‌బాబు చేతులమీదుగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందించారు. కళాశాల సెక్రటరీ టి.శ్రీనివాస్, కమిటీ అధ్యక్షులు టి.శేషయ్య, కోశాధికారి అన్నం రామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కే రామకృష్ణ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మిక్సీలతో సీఐ వెంకట నారాయణ

బిల్లులు లేని 90 మిక్సీలు స్వాధీనం

సత్యనారాయణపురం, మార్చి 26: బిల్లులు లేకుండా ముంబాయి నుంచి రాజమండ్రికి వెళుతున్న మిక్సీలను సత్యనారాయణపురం, రైల్వే ఇంటిలిజెన్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణపురం సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రైల్వే పార్శిల్ వద్ద ముంబాయి నుంచి రాజమండ్రి వెళ్లేందుకు మిక్సీలున్నాయని వాటికి సరైన బిల్లులు లేవని సమాచారం అందింది. దీంతో రైల్వే ఇంటిలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ ఛటర్జీ, సత్యనారాయణపురం సీఐ వెంకటనారాయణ తనిఖీ చేశారు. ముంబయి నుంచి ట్రైన్‌లో వచ్చి ఇక్కడి నుంచి ట్రాన్స్‌పోర్టు ద్వారా వెహికిల్‌లో వెళ్లాల్సిన 90 మిక్సీలకు బిల్లులు సరిగా లేవు. రాజమండ్రిలోని గురురాజ్ స్పేర్స్ అడ్రస్‌కు ఈ మిక్సీలు వెళుతున్నట్టు గుర్తించారు. బిల్లులు సరిగా లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు.



టీడీపీ అమలు చేసే పథకాలు వివరిస్తున్న కేశినేని వెంకట్

రాష్ట్రంలో నిర్వీర్యమైన వ్యవస్థలు: కేశినేని వెంకట్

సత్యనారాయణపురం, మార్చి 26: వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని, ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించడానికి యువత కదలి రావాలని టీడీపీ పార్లమెంటు అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) తనయుడు కేశినేని వెంకట్ అన్నారు. 30వ డివిజన్ దేవినగర్‌లో కేశినేని వెంకట్ మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలు పడుతున్న కష్టాలు అడిగి తెలుసుకొని ప్రజల భవిష్యత్తుకు టీడీపీ గ్యారెంటీ అని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా చంద్రబాబును ముఖ్యమంత్రిగా, కేశినేని నానిని ఎంపీగా గెలిపించుకోవాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. బొండా సిద్ధార్థ , టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిత్ర బృందం

నగరంలో 'భరతనాట్యం' సందడి

లబ్బీపేట, మార్చి 26: నగరంలో 'భరతనాట్యం' చిత్ర బృందం సందడి చేసింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఓ హోటల్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో కథానాయకుడు సూర్యతేజ ఏలే మాట్లాడుతూ క్రైమ్, కామెడీ, ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం ఉంటుందన్నారు. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తుందని, ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. కథ తానే రాశానని, ఆ సమయంలో హీరోగా నటిస్తానని అనుకోలేదని, తప్పనిసరి పరిస్థితుల్లో నటించాల్సి వచ్చిందన్నారు. నిర్మాత పాయల్ సరఫ్ మాట్లాడుతూ ఈ చిత్రం తనకు మొదటిదని, అమ్మవారి ఆశీస్సులతో నగరం నుంచి ప్రమోషన్స్ ప్రారంభించామని, రాజమండ్రి, వైజాగ్, కాకినాడకు వెళ్తున్నామని, పీఆర్ బ్యానర్స్‌పై విడుదల చేస్తున్నామన్నారు. డైరెక్టర్ కేవీఆర్ మహేంద్ర మాట్లాడుతూ ఆనంద్ దేవరకొండతో తాను తీసిన తొలిచిత్రం దొరసాని పెద్ద హిట్ అయిందని, రెండో చిత్రం భరతనాట్యం చేశానని తెలిపారు. సీనియర్ నటులు అజయ్ గోష్, కమెడియన్ హర్ష, హర్షవర్ధన్ నటించారని, కంటెంట్ ఉంటే చిన్న చిత్రాలు కూడా విజయాన్ని సాధిస్తాయన్నారు. హీరోయిన్ మీనాక్షి గోస్వామి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టుకు చేరిన ఐఎంజీ భూముల రద్దు !

» సీబీఐ దర్యాప్తు పిటిషన్లపై.. హైకోర్టులో విచారణ వాయిదా

హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఐఎంజీ అకాడమీస్ భారత్‌కు 850 ఎకరాల భూకేటాయింపు రద్దు వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. సేల్ డీడ్‌ను రద్దు చేస్తూ అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం చేసిన చట్టాన్ని సమర్థిస్తూ ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఐఎంజీ సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. 2003లో ఐఎంజీకి భూకేటాయింపు చేసే విషయంలో అక్రమాలు జరిగాయని, వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ టీ శ్రీరంగారావు, ఏబీకే ప్రసాద్, విజయసాయిరెడ్డి తదితరులు అప్పటి ఉమ్మడి ఏపీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లు మంగళవారం మరోసారి చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ సుజయ్ పాల్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగానే ఐఎంజీ అకాడమీస్ భారత్ తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ తాము సుప్రీంకోర్టులో అప్పీలు చేసిన విషయాన్ని వెల్లడించారు. కేసు సుప్రీంకోర్టులో ఉండగా.. భూకేటాయింపు అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలన్న పిటిషన్‌లపై విచారణ చేపట్టడం సరికాదని పేర్కొన్నారు. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టులో ఉన్న అంశం, తాము కోరుతున్న విషయం వేరు వేరని చెప్పారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. సుప్రీంకోర్టులో ఏం జరుగుతుందో చూడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది.

లోకో క్యాబ్ పోటీల్లో దక్షిణ మధ్య రైల్వేకు మొదటి బహుమతి

హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి లోకో క్యాబ్ పోటీల్లో దక్షిణ మధ్య రైల్వేకు మొదటి బహుమతి లభించింది. పాటియాలా లోకో మోటివ్ వర్క్స్‌లో జరిగిన ఈ పోటీల్లో భారత రైల్వేకు చెందిన వివిధ రైల్వే జోన్‌ల నుంచి 13 లోకో మోటివ్‌లు పాల్గొన్నాయి. పోటీలో దక్షిణ మధ్య రైల్వేకు చెందిన లాలాగూడ ఎలక్ట్రిక్ లోకో షెడ్, పశ్చిమ రైల్వేకు చెందిన వటావాల డీజిల్ లోకో షెడ్‌లు సంయుక్తంగా మొదటి బహుమతిని అందుకున్నాయి. రైలు ఇంజిన్‌ను నడిపే సిబ్బంది అలసటను తగ్గించి ఎక్కువ గంటలు పని చేసే విధంగా ఎలక్ట్రిక్ లోకో క్యాబ్‌లను అభివృద్ధి చేయాలని రైల్వే బోర్డు జోనల్ రైల్వేలకు సూచించింది. లాలాగూడ ఎలక్ట్రిక్ లోకో షెడ్‌కు జాతీయ స్థాయిలో మొదటి బహుమతి లభించడం పట్ల రైల్వే సాంకేతిక నిపుణులు హర్షం వ్యక్తం చేశారు.

విశాఖ విమానాశ్రయం రన్‌వే రీ సర్ఫేసింగ్ పూర్తి

» ఏప్రిల్ 1 నుంచి 24 గంటలు రాకపోకలు

విశాఖపట్నం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయంలో రన్‌వే రీ సర్ఫేసింగ్ పనులు దాదాపు పూర్తయ్యాయి. గతేడాది నవంబరు 15న వీటిని ప్రారంభించారు. మార్చి 31తో పూర్తి చేయాల్సి ఉంది. అనుకున్న ప్రకారమే నేవీ వీటిని పూర్తిచేస్తోంది. ఈ పనుల కోసం విమానాశ్రయం పని వేళలను కుదించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే పౌర విమానాలను అనుమతిస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త రన్‌వే పూర్తిగా అందుబాటులోకి రానుంది. అప్పటి నుంచి విమానాల రాకపోకలు 24/7 ఉంటాయని నేవీ ప్రకటించింది.

టికెట్లపై తుది నిర్ణయం పవన్‌దే: నాగబాబు

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అభ్యర్థుల ఎంపికలో అధినేత పవన్‌కల్యాణ్ నిర్ణయమే అంతిమమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రధాన కార్యవర్గంతో చర్చించిన తర్వాత పార్టీ అధినేత తీసుకున్న నిర్ణయాన్ని అందరూ అర్థం చేసుకోవాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. అందుకు విరుద్ధంగా బహిరంగంగా మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

గిరిజాశంకర్‌కు వాణిజ్య పన్నుల కార్యదర్శిగా అదనపు బాధ్యతలు

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పన్నుల ముఖ్య కమిషనర్ ఎం.గిరిజాశంకర్‌కు వాణిజ్య పన్నులశాఖ కార్యదర్శిగా ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.గుల్జార్ అక్కడి నుంచి రిలీవ్ కావడంతో ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ సౌరభ్‌గౌర్‌కు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. అలాగే సౌరభ్‌గౌర్‌కు రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీగా కూడా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

కస్టడీ నుంచి కేజ్రీవాల్ రెండో ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తనను అరెస్టు చేస్తే జైలు నుంచే పరిపాలిస్తానని చెప్పిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ దాన్ని ఆచరించి చూపిస్తున్నారు. ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్న ఆయన... అక్కడి నుంచే రెండోసారి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న మొహల్లా క్లినిక్‌లలో ఉచిత మందుల కొరత లేకుండా చూడాలని, రోగ నిర్ధారణ పరీక్షలను సమర్థంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఢిల్లీలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదివారం లాకప్ నుంచి కేజ్రీవాల్ మొదటిసారి ఆదేశాలు పంపిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి సీఎం నుంచి ఆదేశాలు అందినట్లు ఢిల్లీ ఆరోగ్య మంత్రి సౌరభ్ భరద్వాజ్ మంగళవారం వెల్లడించారు. సీఎం ఆదేశాలు దేవుడి ఆదేశాల్లాంటివని అన్నారు. మరోవైపు, ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తనను అక్రమంగా అరెస్టు చేశారని, బెయిల్ మంజూరు చేయాలని కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో బుధవారం విచారణ జరగనుంది. కేజ్రీవాల్ 7 రోజుల ఈడీ కస్టడీ గురువారంతో ముగియనున్న నేపథ్యంలో ఆయన బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు ఎలా స్పందిస్తుందనేది ఆసక్తిగా మారింది.

పంజాబ్‌లో బీజేపీ ఒంటరి పోరాటం

న్యూఢిల్లీ, మార్చి 26: పంజాబ్‌లో ఒంటరి పోరాటానికి బీజేపీ సిద్ధమైంది. లోక్‌సభ ఎన్నికలకు పొత్తు కోసం శిరోమణి అకాలీదళ్(ఎస్ఏడీ) పార్టీతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో 20 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఎవరితో పొత్తు లేకుండా పంజాబ్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ బరిలోకి దిగుతుంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి ఒంటరిగా పోటీ చేస్తున్నామని బీజేపీ పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ జఖార్ మంగళవారం ప్రకటించారు. బీజేపీ ప్రకటనపై అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బదాల్ కూడా స్పందించారు. వందేళ్ల చరిత్ర కలిగిన అకాలీదళ్ సాధారణ రాజకీయ పార్టీ కాదని, తమ పార్టీకి కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయని అన్నారు. సీట్ల కంటే తాము నమ్మిన సిద్ధాంతాలే తమకు ముఖ్యమన్నారు. కాగా, పంజాబ్‌లోని 13 లోక్‌సభ స్థానాలకు జూన్ 1 పోలింగ్ జరగనుంది. ఇందులో 8 స్థానాలకు ఆప్ ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన పార్టీలేవీ ఇప్పటిదాకా తమ అభ్యర్థులను ప్రకటించలేదు.

రాజకీయాల్లో పాల్గొనవద్దని కోర్టులు అనలేవు

» బెయిల్ మంజూరుకు దాన్నో షరతుగా పెట్టలేవు: సుప్రీం

న్యూఢిల్లీ, మార్చి 26: ప్రజలు రాజకీయాల్లో పాల్గొనకుండా కోర్టులు నిరోధించలేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకూడదన్న షరతుతో బెయిల్ మంజూరు చేయలేవని కూడా తెలిపింది. అలాంటి షరతు పౌరుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందికే వస్తుందని పేర్కొంది. ఈ మేరకు ఒరిస్సా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ జస్టిస్ బీఆర్.గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం నిర్ణయాన్ని వెలువరించింది. ఒక కేసులో బరంపురం మాజీ మేయర్ శిబ శంకర్ దాస్‌కు 2022 ఆగస్టులో బెయిల్ ఇచ్చిన ఒరిస్సా హైకోర్టు..ప్రజాశాంతికి భంగం కలిగించే ఎలాంటి పరిస్థితులు కల్పించకూడదని, ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగాగానీ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకూడదని షరతులు విధించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు.

హిందూ మహాసముద్రంలో ఒకేసారి 11 సబ్‌మెరైన్లు

న్యూఢిల్లీ, మార్చి 26: భారత నౌకాదళం అతిపెద్ద ముందడుగు వేసింది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో రికార్డు స్థాయిలో 11 సబ్‌మెరైన్లను మోహరించింది. భారత నేవీ చరిత్రలో ఇలా సబ్‌మెరైన్లను మోహరించడం గత 30 ఏళ్లలో ఇదే తొలిసారి. హిందూ మహాసముద్ర ప్రాంతంలో పెరుగుతున్న చైనా కార్యకలాపాలను దృష్టిలో పెట్టుకుని భారత్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. దీనిపై నేవీ సీనియర్ అధికారి ఒకరు స్పందిస్తూ.. 'నేను నేవీలో చేరినప్పటి నుంచి ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో మోహరింపును చూడలేదు. మన దగ్గర సరిపడినన్ని జలాంతర్గాములు లేకపోవడమే దీనికి కారణం' అని అన్నారు. ప్రస్తుతం భారత్.. ఐదు స్కార్పీన్ క్లాస్ (ఫ్రెంచ్), నాలుగు హెచ్‌డీడబ్ల్యూలు (జర్మన్), ఏడు కిలో క్లాస్ (రష్యన్) సహా మొత్తం 16 సబ్‌మెరైన్లను నడుపుతోంది. మరో స్కార్పీన్ క్లాస్ జలాంతర్గామిని ప్రారంభించాల్సి ఉంది. ఇదికూడా అందుబాటులోకి వస్తే ఈ సంఖ్య 17కు పెరుగుతుంది.

తిహాడ్ జైలుకు కవిత

» ఏప్రిల్ 9 వరకు జ్యుడీషియల్ రిమాండ్

» ఢిల్లీ లిక్కర్ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు

» మధ్యంతర బెయిల్‌పై ఏప్రిల్ 1న విచారణ



న్యూఢిల్లీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. తన కుమారుడికి పరీక్షలు ఉన్నాయని, అతణ్ని సంరక్షించాల్సిన బాధ్యత తనపై ఉన్నందున బెయిల్ ఇవ్వాలంటూ కవిత చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. తిరిగి ఏప్రిల్ 9న కోర్టులో హాజరు పరచాలని పోలీసులను ఆదేశించింది. అయితే కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్ 1న విచారణ జరుపుతామని పేర్కొంది. దీంతో పోలీసులు ఆమెను తిహాడ్ జైలుకు తరలించారు. కవిత ఈడీ కస్టడీ ముగియడంతో మంగళవారం ఉదయం 11.40 గంటలకు ఆమెను రౌస్ అవెన్యూ కోర్టుకు తీసుకొచ్చారు. కేసుపై సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా విచారణ చేపట్టారు. ఈడీ తరఫున న్యాయవాది జోహెబ్ హుస్సేన్, కవిత తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి ఇద్దరూ ఆన్‌లైన్‌లోనే వాదనలు వినిపించారు. తొలుత జోహెబ్ హుస్సేన్ వాదనలు వినిపిస్తూ.. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కవితది కీలకపాత్ర అని ఆరోపించారు. కేసు దర్యాప్తులోనే ఉన్నదని, మరికొంత మందిని ప్రశ్నించాల్సి ఉందని తెలిపారు. కవిత సమాజంలో ఎంతో పలుకుబడి ఉన్న వ్యక్తి అని, రాజకీయంగా, ఆర్థికంగా ఆమె ప్రభావితం చేయగలరన్నారు. ఆమె బయట ఉంటే సాక్షులను బెదిరించే అవకాశం ఉందన్నారు. కేసులో కవిత పాత్రపై మరింత లోతైన దర్యాప్తు చేస్తున్నామని, మరిన్ని విషయాలు వెలుగులోకి రావాల్సి ఉందన్నారు. ఆర్థిక నేరాల దర్యాప్తు కఠినమైనదని, మొదటి నుంచీ కవిత ఎంతో ప్రణాళికతో నేరానికి పాల్పడ్డారని న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. పైగా గతంలోనే కొన్ని సాక్ష్యాలను ఆమె ధ్వంసం చేశారని, ఇప్పుడు విడుదల చేస్తే మిగిలిన సాక్ష్యాలను కూడా మాయం చేసే అవకాశం ఉందని చెప్పారు.

కుమారుడికి పరీక్షలు.. బెయిల్ ఇవ్వండి...

కవిత తరఫున న్యాయవాది విక్రమ చౌదరి వాదనలు వినిపిస్తూ.. కవిత చిన్న కుమారుడికి 11వ తరగతి పరీక్షలు ఉన్నాయని, ఈ సమయంలో ఆమె తన కుమారుడితో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కవిత జైలులో ఉంటే ఆ ప్రభావం కుమారుడి భవిష్యత్తుపై పడే అవకాశం ఉందని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. అందుకే ఆమెకు ఏప్రిల్ 16 వరకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో సాధారణ బెయిల్ పిటిషన్ విచారణకు కూడా అవకాశం ఇవ్వాలని కోరారు. మధ్యంతర బెయిల్‌తోపాటే ఈ నెల 30న(శనివారం) బెయిల్ పిటిషన్‌పై వాదనలకు అవకాశం ఇవ్వాలని విన్నవించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి.. కవితకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి ఏప్రిల్ 9వ తేదీ ఆమెను కోర్టులో హాజరు పరచాలని ఆదేశించారు. మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్ 1న వాదనలు వింటామన్నారు. అయితే.. ఏప్రిల్ 9వ తేదీ ఉగాది పండుగ కావడంతో ఆ రోజు కూడా కేసు విచారణ వాయిదా పడే అవకాశం ఉంది. దాంతో మరో 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అన్నారు.

కుటుంబ సభ్యులతో గంటసేపు..

కవిత కేసులో తీర్పును న్యాయమూర్తి రిజర్వ్ చేయగానే ఆమె తరఫున న్యాయవాది కుటుంబ సభ్యులతో మాట్లాడటానికి అనుమతి కోరారు. దీంతో.. ఎవరెవరు కలుస్తారు? వాళ్లిప్పుడు అందుబాటులో ఉన్నారా? అని న్యాయమూర్తి అడిగారు. అందరూ అందుబాటులోనే ఉన్నారని చెప్పగా.. కోర్టు హాల్లోనే కలవాలని, దీనికోసం పిటిషన్ ఫైల్ చేయాలని సూచించారు. అందులో ఎవరెవరు కలుస్తారో వారి పేర్లు స్పష్టంగా ఉండాలని చెప్పారు. ఆ నిబంధనల మేరకే పిటిషన్ దాఖలు చేసిన తర్వాత.. కుటుంబ సభ్యులు, ఆత్మీయులు కవితను కలిశారు. పిటిషన్‌లో పేర్కొన్న పేర్ల ప్రకారం ఒకరి తర్వాత ఒకరిని లోపలికి అనుమతించారు. కవిత భర్త అనిల్, తోటికోడలు ననిత, రాజశేఖర్‌తోపాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, వైరా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్, వ్యక్తిగత సహాయకుడు శరత్ తదితరులు కవితను కలిసిన వారిలో ఉన్నారు. మధ్యాహ్నం 12.05 నుంచి సుమారు గంటసేపు వారితో మాట్లాడటానికి అవకాశం కల్పించారు. కాగా, గత వాయిదా సందర్భంలో కొంత ముభావంగా ఉన్న కవిత.. ఈసారి మాత్రం హుషారుగా కనిపించారు. అందరితో నవ్వుతూ మాట్లాడారు.

కడిగిన ముత్యంలా బయటికి వస్తా: కవిత

కోర్టు హాల్లోకి వెళ్లే సమయంలో కవిత మీడియాతో మాట్లాడారు. "ఇదో రాజకీయ కుట్ర. ఎన్నికల్లో లబ్ధి కోసం జరిగే కుట్ర. ఇది మనీలాండరింగ్ కేసు కాదు.. పొలిటికల్ లాండరింగ్ కేసు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఒక నిందితుడు బీజేపీలో చేరాడు. మరో నిందితుడికి బీజేపీ కూటమి టికెట్ ఇస్తోంది. మూడో నిందితుడు ఎన్నికల బాండ్ల రూపంలో బీజేపీకి రూ.50 కోట్లు ఇచ్చాడు. ఇది ముమ్మాటికీ కేసుల పేరుతో లొంగదీసుకునేందుకు జరిగే కుట్ర. తాత్కాలికంగా నన్ను జైలులో పెట్టొచ్చు. కానీ, కడిగిన ముత్యంలా బయటికి వస్తా" అని కవిత అన్నారు. కాగా, ఎమ్మెల్సీ కవితపై ఈడీ తప్పుడు కేసు బనాయించిందని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు.

ఆ భూములు తెలంగాణకే చెందేలా..

» హౌసింగ్, దిల్ భూములపై ప్రభుత్వం ప్రణాళిక

» ప్రస్తుతం అందుబాటులో 1491 ఎకరాల భూమి!

» రాష్ట్ర విభజన సమయంలో షెడ్యూల్ 9లోకి భూములు

» క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ.. వివాదం తేల్చేయాలనే యోచన



హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డు, డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్ లిమిటెడ్(దిల్) భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టింది. రాష్ట్ర విభజన తర్వాత ఈ భూముల పరంగా ఏపీతో తలెత్తిన వివాదం నేపథ్యంలో భూములను రాష్ట్రానికే చెందేలా చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించే పనిలో పడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ భూములు షెడ్యూల్ 9లోకి వెళ్లాయి. అప్పటి నుంచి ఆ భూముల్లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు ఎంత మేర వాటా వస్తుందన్న విషయమ్మీద సందిగ్ధత నెలకొంది. తెలంగాణ పరిధిలో ఉన్న భూముల్లో తమకూ వాటా వస్తుందని ఏపీ వాదిస్తోంది. ఈ క్రమంలో అసలు హౌసింగ్ బోర్డు, దిల్ పరిధిలో ఉన్న భూముల చరిత్ర ఏవిటి? అసలు ఈ భూములు ప్రభుత్వ పరిధిలోకి ఎలా వచ్చాయి? అనే వివరాలను తేల్చి... ఆ ప్రకారం కేంద్రానికి సమగ్ర వివరాలతో నివేదిక ఇస్తే భూములను రాష్ట్ర ఖాతాలోకి వేసుకోవచ్చునని సంబంధిత శాఖ లో అంతర్గతంగా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఈ భూములు.. ఏపీ ఏర్పడక ముందే నిజాం అధీనంలో ఉన్నాయా? లేదంటే నిజాం ప్రభువుల వారసత్వంగా ప్రభుత్వానికి అందాయా? అనే వివరాలు తెలుసుకునే పనిలో ఉన్నట్లు సమాచారం. ఆ భూముల చరిత్ర గుర్తిస్తే, ఏపీకి వాటా ఉంటుందా? లేదా? అన్నదీ తేల్చడం తేలికవుతుందని అధికారులు భావిస్తున్నారు. వాస్తవానికి ఉమ్మడి ఏపీలో హౌసింగ్ బోర్డు కింద 5వేల ఎకరాలు, దిల్ కింద 1,800 ఎకరాలను అప్పటి ప్రభుత్వం సేకరించింది. వీటిలో ప్రస్తుతం హౌసింగ్ బోర్డు పరిధిలో 691 ఎకరాలు, దిల్ కింద 800ఎకరాలు ఉన్నాయి.

[illegible]

హైదరాబాద్ స్టేట్, ఆంధ్ర రాష్ట్రం కలిపి 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. అయితే ఏపీగా ఏర్పాటయ్యేనాటికే హైదరాబాద్ స్టేట్‌లో నిజాం రాజులు చాలా ప్రాంతాల్లో పలు నిర్మాణాలు చేపట్టారు. ఆయా అభివృద్ధి పనుల కోసం నిజాం ప్రభువులు భూములను సేకరించడంతో పాటు, వారి వారసత్వ భూములను కూడా ఇచ్చారనే ప్రచారం ఉంది. అయితే ప్రస్తుతం హౌసింగ్, దిల్ పరిధిలో ఉన్న భూములు కూడా నిజాం రాజులు ఇచ్చినవేనా? లేదంటే వారి వారసత్వ భూములను ప్రభుత్వానికి అందించారా? అన్నది తేలాల్సి ఉంది. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యేనాటికే అవి అప్పటి హైదరాబాద్ స్టేట్ పరిధిలో ఉంటే గనుక ఆ భూముల్లో ఏపీకి వాటా ఉండదని నిపుణులు భావిస్తున్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికే అవి తెలంగాణ పరిధిలో ఉన్నాయి కనుక ఆ భూములను ఏపీకి ఇవ్వాల్సిన అవసరం లేదంటున్నారు. భూములను పొందేందుకు సాంకేతికంగానూ ఇది కలిసివస్తుందని విశ్వసిస్తున్నారు. ప్రస్తుతం హౌసింగ్ బోర్డు, దిల్ కింద ఉన్న భూముల్లో కొన్నింటినే అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా భూ సేకరణ విధానంలో భాగంగా సేకరించిందని, మరికొన్ని భూములు మాత్రం గతం నుంచే ప్రభుత్వ ఆస్తుల్లో భాగంగానే వచ్చినట్లు తెలుస్తోంది.

ఎప్ సెట్.. ఏపీ విద్యార్థులు అప్‌సెట్

» ఆంధ్రప్రదేశ్‌లో భారీగా తగ్గిన పరీక్ష కేంద్రాలు

» ప్రస్తుతం హైదరాబాద్ ఆప్షన్ మాత్రమే దిక్కు

హైదరాబాద్ సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సర్కారు నిర్వహించే ఎప్ సెట్‌కు ఏపీలో పరీక్ష కేంద్రాలను తగ్గించడం అక్కడి విద్యార్థులను నిరుత్సాహానికి గురిచేసింది. అయితే, నిన్న మొన్నటి వరకు ఆన్‌లైన్‌లో కనిపించిన ఆ కొన్ని కేంద్రాలు కూడా ఇప్పుడు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తి కావడంతో ఈ ఏడాది తెలంగాణలో ఏపీ విద్యార్థులకు అడ్మిషన్లను కొనసాగించే అంశంపై అధికారుల్లో తర్జన భర్జన కొనసాగింది. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించడంతో వారికి కూడా టీఎస్ ఎప్‌సెట్ రాసేందుకు అర్హత లభించింది. అయితే ఎప్‌సెట్ అధికారులు ఇటీవల చేపట్టిన చర్యల ఫలితంగా ఏపీ విద్యార్థులు తమకు లభించిన అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. టీఎస్ ఎప్‌సెట్‌కు ఆంధ్రప్రదేశ్‌లో పరీక్ష కేంద్రాల సంఖ్యను సగానికి సగం తగ్గించడమే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది.

ఏపీలో సెంటర్లు దొరకట్లే(దా)..?

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకై నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్(గతంలో ఎంసెట్)కు గతేడాది ఏపీ నుంచి 51,470 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి కోసం విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను కేటాయించారు. అయితే ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో పరీక్ష కేంద్రాలను భారీగా తగ్గించడంతో ఇప్పటి వరకు 26,977 మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగలిగారు. ఏప్రిల్ 6 వరకు గడువు ఉంది.

ఉమెన్ ట్రాఫికింగ్ నిరోధానికి
ఏం చర్యలు తీసుకున్నారు?

» వారి పునరావాసానికి ఏం చేస్తున్నారు?

» పూర్తి వివరాలు కోర్టు ముందుంచండి

» విటులను నిందితులుగా చేర్చాలి

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాదారుల చెర నుంచి నిస్సహాయులైన బాలికలు, మహిళలను కాపాడేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో వివరిస్తూ నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బాలికలు, మహిళల అక్రమ రవాణాను అడ్డుకొనేందుకు డీజీపీ, జిల్లా ఎస్పీలకు తగిన సూచనలు చేయాలని స్పష్టం చేసింది. ట్రాఫికింగ్ నుంచి కాపాడిన మహిళలు, బాలికలకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంది. వారి పునరావాసం కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారో కూడా చెప్పాలంది. విటులను కూడా నిందితులుగా చేర్చాలని ఆదేశించింది. ఈ వ్యవహారంలో తాము గతంలో ఉత్తర్వులు జారీ చేశామని గుర్తు చేసింది. అడ్వకేట్ జనరల్(ఏజీ) ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ అన్ని వివరాలతో సమగ్ర నివేదికను సమర్పిస్తామన్నారు. ఇందుకు సమయం ఇవ్వాలని కోరారు. ధర్మాసనం అందుకు అంగీకరిస్తూ విచారణను ఏప్రిల్ 11కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం ఇటీవల ఆదేశాలిచ్చింది. డబ్బు సంపాదన కోసం స్నేహితురాలు తన కుమార్తెను వ్యభిచారంలో దించేందుకు ప్రయత్నిస్తోందని, ఆమె చెర నుంచి తన కుమార్తెను విడిపించి కోర్టు ముందు హాజరుపర్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ రాయలసీమ జిల్లాకు చెందిన ఓ మహిళ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం బాలికను కోర్టుముందు హాజరుపర్చాలని పోలీసులను ఆదేశించింది. ధర్మాసనం ఆదేశాలకు అనుగుణంగా పోలీసులు బాలికను హాజరుపర్చారు. బాలికతో వ్యక్తిగతంగా మాట్లాడిన న్యాయమూర్తులు.. ఆమెను గుంటూరు జిల్లా మంగళగిరి వద్ద ఉన్న ఉజ్వలా హోంకు తరలించాలని ఆదేశించారు. బాలికను వ్యభిచారంలోకి దింపేందుకు ప్రయత్నించిన వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై కేసు నమోదు చేయాలని పోలీసులను ధర్మాసనం ఆదేశించింది. బాలికను వ్యభిచారంలోకి దింపేందుకు ప్రయత్నించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళ న్యాయస్థానం ముందు హాజరై వివరణ ఇచ్చారు. బాలిక తల్లి, తాను స్నేహితురాళ్లమని, మూడు నెలలుగా బాలిక తన వద్ద టైలరింగ్ నేర్చుకుంటోందని వివరించింది. అక్రమ నిర్బంధంలో లేదని తెలిపింది. అయితే ఈ వ్యవహారంపై ఏజీ వాదనను వినాలని పేర్కొంటూ విచారణను ధర్మాసనం వాయిదా వేసింది. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా... అనంతపురం, సత్యసాయి జిల్లాల ఎస్పీలు ఘటనపై విచారణ జరిపి నివేదికను కోర్టు ముందుంచారు. ఈ సందర్భంగా అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ... ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారని చెప్పారు. బాలిక సంరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ దశలో ధర్మాసనం కలగజేసుకుంటూ... బాలికలు, మహిళల అక్రమ రవాణా విషయంలో కఠినంగా వ్యవహరించాలని పేర్కొంది. ఈ కేసుకే పరిమితం కాకుండా అక్రమ రవాణాను అడ్డుకొనేందుకు అన్ని జిల్లాల ఎస్పీలకు తగిన సూచనలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రస్తుత చట్టంలో విటులను బాధితులుగా పేర్కొన్నారని, వారిని నిందితులుగా చేర్చి కేసులు నమోదు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై గతంలో తాము తీర్పు ఇచ్చామని గుర్తు చేసింది. దానిని పరిశీలించాలని ఏజీకి సూచించింది. ఏజీ బదులిస్తూ మానవ అక్రమ రవాణాదారుల నుంచి బాలికలు, మహిళలను కాపాడడంతోపాటు వారికి పునరావాసం కల్పించే విషయంలో సమగ్ర నివేదికను కోర్టు ముందు ఉంచుతామని చెప్పారు.

బ్యాంకు ఖాతాల వివరాలు విదేశాలకు

» కమీషన్ల వల వేసి వివరాలు సేకరణ... విదేశాల్లో నేరగాళ్లకు విక్రయం

» చైనా, కంబోడియా నుంచి సైబర్ నేరాలు.. నలుగురి అరెస్టు

ఎండాడ(విశాఖపట్నం), మార్చి 26: సోషల్ మీడియాలో ఫేక్ మెసేజ్‌లు పెట్టి.. స్టాక్ ఎక్స్ఛేంజ్, ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లతో వల పన్నుతారు. మాయమాటలతో కమీషన్ల ఆశ చూపి బ్యాంకు ఖాతాల వివరాలు సేకరిస్తారు. ఆ వివరాలను విదేశాల్లోని సైబర్ నేరగాళ్లకు అమ్మేస్తారు. కొన్ని రోజులుగా ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న నలుగురిని సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన మాతంగి ప్రశాంత్(30), మాతంగి కుమార్(27), పెరుమండ్ల అశోక్(20) ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన త్రిపురామల్లు శ్రీనాగ రమేశ్(31).. వాట్సాప్, టెలిగ్రామ్‌తో పాటు పలు రకాల సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో స్టాక్ ఎక్ఛ్సేంజ్, ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లను పరిచయం చేస్తారు. వీటిలో జాయిన్ అయితే కమీషన్లు ఇస్తామని ఆశ చూపి వారి వారి బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించి.. వాటిని ఇతర దేశాల్లోని సైబర్ నేరగాళ్లకు అమ్ముకుంటున్నారు. దీనిపై పలు ఫిర్యాదులు అందడంతోపాటు, నగరంలోని కొంతమంది బాధితులు కూడా పోలీసులను ఆశ్రయించడంతో సైబర్‌క్రైమ్ పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. నిందితులు ఫేక్ నంబర్లతో సోషల్ మీడియా ద్వారా మెసేజ్‌లు పంపుతుంటారు. స్టాక్ ఎక్ఛ్సేంజ్, ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన యాప్‌లతో వల వేస్తుంటారన్నారు. కమీషన్ ఇస్తామని ఆశ చూపి వాటికి స్పందించే వారి బ్యాంకు ఖాతాల వివరాలతో పాటు ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు సేకరిస్తారు. వివరాలు ఇచ్చిన వారికి కొంత డబ్బు జమ చేసి నమ్మకం కలిగిస్తారు. ఆ తర్వాత ఆ ఖాతాలకు లింక్ అయిన ఫోన్ నంబర్లను మార్చేసి ఆయా ఖాతాలను పూర్తిగా ఆధీనంలోకి తీసుకుంటారు. ఆపై ఆ వివరాలను ఇతర దేశాల్లోని సైబర్ నేరగాళ్లకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటారు. ఆ ఖాతాలను వినియోగించి చైనా, కంబోడియా తదితర దేశాలకు చెందినవారు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండాలని విశాఖ నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్, జాయింట్ పోలీసు కమిషనర్ ఫకీరప్ప సూచించారు.

పాక్ నేవీ ఎయిర్ బేస్‌పై దాడి

» రాత్రంతా భద్రతా బలగాల ఎదురుకాల్పులు

» ఓ జవాను, ఆరుగురు ఉగ్రవాదుల మృతి

» ఖైబర్ పఖ్తుంఖ్వాలో మానవబాంబు దాడి

» ఐదుగురు చైనా ఇంజనీర్లు, ఓ డ్రైవర్ దుర్మరణం

» డేరా ఇస్మాయిల్‌ఖాన్‌లో నలుగురు టెర్రరిస్టుల హతం

ఇస్లామాబాద్, మార్చి 26: బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) ఉగ్రవాదులు, భద్రతాబలగాల ఎదురుకాల్పులతో నైరుతి పాకిస్థాన్ దద్దరిల్లింది. వేర్వేరు ఘటనల్లో 10 మంది ఉగ్రవాదులు హతమవ్వగా.. ఐదుగురు చైనా ఇంజనీర్లు, ఓ డ్రైవర్(చైనీయుడు), పారామిలటరీ జవాను దుర్మరణంపాలయ్యారు. పాకిస్థాన్‌లోని రెండో అతిపెద్ద నేవీ బేస్ అయిన పీఎన్ఎస్ సిద్ధిఖీపై సోమవారం అర్ధరాత్రి బీఎల్ఏ ఉగ్రవాదులు దాడి చేశారు. ఇక్కడి ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని, మూడు వైపుల నుంచి కాల్పులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. దాడి సమయంలో అక్కడ రెండు చైనా తయారీ డ్రోన్లు(సీహెచ్-4), ఓ హెలికాప్టర్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే.. వీటికి ఏమైనా నష్టం వాటిల్లిందా? అనేదానిపై అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదు. వెంటనే భద్రతాబలగాలు స్పందించి, ఎదురు కాల్పులకు దిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఆరుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టామని, ఓ జవాను వీరమరణం పొందినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో రాత్రంతా కాల్పుల మోత వినిపించిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనకు తామే బాధ్యులమని బీఎల్ఏ ఓ ప్రకటనలో తెలిపింది. మాజిద్ బ్రిగేడ్ ఈ దాడి చేసిందని, చైనా చేపడుతున్న చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్(సీపీఈసీ) ప్రాజెక్టుకు తాము వ్యతిరేకమని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. మంగళవారం ఉదయం జరిగిన మరో ఘటనలో.. సీపీఈసీ ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్న ఐదుగురు చైనా ఇంజనీర్లు, ఓ డ్రైవర్‌ను ఉగ్రవాదులు మానవబాంబుతో హతమార్చారు. ఇంజనీర్లు వెళ్తున్న బస్సును దసూ హైడ్రోపవర్ ప్రాజెక్టు సమీపంలో ఓ ఫిదాయీ(మానవ బాంబు) పేలుడు పదార్థాలున్న కారుతో ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఫిదాయీ సహా.. ఆరుగురు చైనీయులు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనను చైనా తీవ్రంగా ఖండించింది. సమగ్ర విచారణ జరపాలని పాకిస్థాన్‌ను ఆదేశించింది. మంగళవారం ఉదయం ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలో నలుగురు బీఎల్ఏ ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు పాక్ నిఘా సంస్థ మీడియా విభాగం ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్(ఐఎస్‌పీఆర్) ఓ ప్రకటనను విడుదల చేసింది.

ట్యాపింగ్ మంటలు

» మా పార్టీ నాయకుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు

» కేసీఆర్‌దే బాధ్యత.. రాష్ట్ర బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి ధ్వజం

» దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో నా ఫోన్లూ విన్నారు

» ఈ నెల 19న.. విమానంలో హరీశ్, రేవంత్ చర్చలు

» అందుకే చర్యలపై సర్కారు వెనకడుగు: రఘునందన్

హైదరాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో రోజుకొక కొత్త పేరు వెలుగులోకి వస్తుండడంతో విపక్ష బీజేపీ నేతలు గత ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. ఈ వ్యవహారానికి నాటి ముఖ్యమంత్రిదే బాధ్యత అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. కొందరు మంత్రులు, ఉన్నతాధికారులు, రిటైర్డ్ అధికారులతో అప్పటి సీఎం ఈ వ్యవహారాన్ని దుర్మార్గంగా నడిపించారంటూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై పరోక్ష వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని రకాల మాఫియాలూ రాజ్యమేలాయని దుయ్యబట్టారు. ట్యాపింగ్ వ్యవహారంతో అవినీతి అంశం కూడా ముడిపడి ఉందని.. దీనిపై న్యాయవిచారణ జరిపితేనే నాటి సీఎం, డీజీపీ, ఉన్నతాధికారుల జోక్యం ఎంతనే విషయం బయటపడుతుందని మంగళవారం వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో వ్యక్తులను బ్లాక్‌మెయిల్ చేసి కోట్లాది రూపాయలు వసూలు చేయడం కోసం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఇక.. ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా మాజీ సీఎం కేసీఆర్‌ను చేర్చాలని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. గతంలో దుబ్బాక ఉప ఎన్నిక సందర్భంగా తన ఫోన్‌ను కూడా ట్యాప్‌చేసి తన ప్రచార తీరుతెన్నులను తెలుసుకొని ఇబ్బందులకు గురిచేశారన్నారు. దానికి సంబంధించి రెండో ముద్దాయిగా మాజీ మంత్రి హరీశ్‌రావును, మూడో ముద్దాయిగా అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డిని చేర్చాలని డిమాండ్ చేశారు. వీరితోపాటు అప్పటి డీజీపీని కూడా ముద్దాయిగా చేర్చాలన్నారు. మంగళవారం సంగారెడ్డిలో రఘునందన్‌రావు మాట్లాడుతూ.. మునుగోడు ఉప ఎన్నికలోనూ బీజేపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి ఓటమికి ఫోన్ ట్యాపింగే కారణమన్నారు. బీజేపీ నేత బీఎల్ సంతోష్ ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేసి కేసుల్లో ఇరికించారని ఆరోపించారు. ఇందులో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాత్ర కూడా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయని, ఆయనను కూడా అరెస్ట్ చేసి విచారించాలని కోరారు. "ఐన్యూస్ చానల్ ఎవరిది? ఆయనను ఎందుకు అరెస్ట్ చేయట్లేదు? చానల్‌ను ఎందుకు సీజ్ చేయట్లేదు?" అని రఘునందన్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు తరువాత హరీశ్‌రావు ఢిల్లీకి వెళ్లిన సందర్భంలో.. ఈ నెల 19న విమానంలో హరీశ్‌రావు, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య రెండు గంటలపాటు చర్చలు జరిగాయని రఘునందన్‌రావు అన్నారు. ఆ చర్చల నేపథ్యంలోనే.. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, హరీశ్‌రావుపై చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారని ఆరోపించారు. ఈ కేసుపై వెంటనే క్యాబినెట్ తీర్మానం చేసి సీబీఐకి అప్పగించాలన్నారు. హైకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ చేయాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 27 మార్చి 2024
diksuchi@andhrajyothy.com



భోపాల్ ఐసర్‌లో పీహెచ్‌డీ

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)- పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్, నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

పీహెచ్‌డీ విభాగాలు - స్పెషలైజేషన్‌లు

- ★ **నేచురల్ సైన్సెస్:** బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, మేథమెటిక్స్, ఫిజిక్స్
- ★ **ఇంజనీరింగ్ సైన్సెస్:** కెమికల్ ఇంజనీరింగ్, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్
- ★ **హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్:** ఎకనామిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(కాగ్నిటివ్ సైన్స్)

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ స్పెషలైజేషన్‌లు

- ★ **నేచురల్ సైన్సెస్:** మేథమెటిక్స్, ఫిజిక్స్

అర్హత: పీహెచ్‌డీలో ప్రవేశానికి ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ/ఎంఏ/ఎంకాం ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ గేట్ స్కోర్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/ఎన్‌బీహెచ్ఎం/డీఎస్‌టీ ఇన్‌స్పెయిర్ ఫెలోషిప్ అర్హత ఉన్నవారు; కనీసం 8 సీజీపీఏతో ఐఐటీల నుంచి బీఈ/బీటెక్, ఐసర్ల నుంచి బీఎస్-ఎంఎస్ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 28 ఏళ్లు మించకూడదు.

- ★ ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీలో ప్రవేశానికి ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. (జెస్ట్/జామ్)(2023/2024) అర్హత తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- ★ **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 2
- ★ **వెబ్‌సైట్:** www.iiserb.ac.in/admission

నోటిఫికేషన్స్

ఏపీ లాసెట్, పీజీఎల్‌సెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపీఎస్‌సీహెచ్ఈ)- లాసెట్, పీజీఎల్‌సెట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలను గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహిస్తోంది. లాసెట్ ద్వారా అయిదేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. పీజీఎల్‌సెట్ ద్వారా రెండేళ్ల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. పరీక్షల సిలబస్, మాక్ టెస్ట్‌ల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత వివరాలు


- ❖ అయిదేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. బీసీ అభ్యర్థులకు 42 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు
- ❖ మూడేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి కనీసం 45 శాతం మార్కులతో డిగ్రీ/పీజీ పూర్తిచేసి ఉండాలి
- ❖ ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి అయిదేళ్ల/మూడేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్ లేదా బీఎల్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- ❖ బేసిక్ క్వాలిఫికేషన్ లేకుండా సింగిల్ సిట్టింగ్ ద్వారా డిగ్రీ/పీజీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు. ఐటీఐ కోర్సులు చేసినవారు లాసెట్ రాయడానికి వీలు లేదు. పాలిటెక్నిక్ డిప్లొమాను ఇంటర్ అర్హతగా పరిగణిస్తారు.
- ❖ ప్రస్తుతం ఇంటర్/డిగ్రీ/పీజీ చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాస్తున్న/రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు కౌన్సెలింగ్ నాటికి కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

లాసెట్ 2024 వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు, మ్యాచింగ్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్షలో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ అంశాల నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. రెండో పార్ట్‌లో కరెంట్ అఫైర్స్ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. మూడో పార్ట్‌లో ఆప్టిట్యూడ్ ఫర్ ద స్టడీ ఆఫ్ లా నుంచి 60 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంటన్నర. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 42 మార్కులు(35 శాతం) రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు. అయిదేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలో; మూడేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలో ఉంటాయి. లాసెట్ ప్రశ్నపత్రాలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో నిర్వహిస్తారు.

పీజీఎల్‌సెట్ 2024: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జ్యూరిస్‌ప్రుడెన్స్, కాన్‌స్టిట్యూషనల్ లా అంశాల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు అడుగుతారు. రెండో పార్ట్‌లో పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, మర్కంటైల్ లా, లేబర్ లా, క్రైమ్స్ అండ్ టార్ట్స్, అదర్ లాస్ అంశాల నుంచి ఒక్కోదానిలో 16 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. పరీక్ష సమయం గంటన్నర. ఈ ఎగ్జామ్‌లో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు, మ్యాచింగ్ ఐటెమ్స్ ఇస్తారు. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 30 మార్కులు(25 శాతం) రావాలి. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఇస్తారు.

ముఖ్య సమాచారం

- ❖ **లాసెట్ దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; బీసీ అభ్యర్థులకు రూ.850; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800
- ❖ **పీజీఎల్‌సెట్ దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; బీసీ అభ్యర్థులకు రూ.950; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- ❖ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 25
- ❖ **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్:** మే 30 నుంచి జూన్ 1 వరకు
- ❖ **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 3 నుంచి
- ❖ **ఏపీ లాసెట్ 2024, పీజీఎల్‌సెట్ 2024 తేదీ:** జూన్ 9
- ❖ **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in



జిప్‌మ్యాట్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)- 'జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (జిప్‌మ్యాట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ఐఐఎం బోధ్‌గయ, ఐఐఎం జమ్మూ ఉమ్మడిగా అందిస్తున్న ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం)లో ప్రవేశాలు కల్పిస్తారు. దీని వ్యవధి అయిదేళ్లు. ఇందులో లాంగ్వేజ్ స్కిల్స్, ఓరల్ కమ్యూనికేషన్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు సంబంధించిన ఫౌండేషనల్ సబ్జెక్టులు, ఎథికల్ అండర్‌స్టాండింగ్ అంశాలు బోధిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూపులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. 2022, 2023 సంవత్సరాల్లో ఇంటర్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైనవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి స్థాయిలో కూడా కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్)/స్టేట్ బోర్డ్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి ఇంగ్లీష్ సహా ఏవేని అయిదు సబ్జెక్టులతో సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

జిప్‌మ్యాట్ వివరాలు: దీనిని సీబీటీ(కంప్యూటర్ బేస్‌డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 33, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 33, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 34 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2000; ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 23 నుంచి 25 వరకు
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 2 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం
- **జిప్‌మ్యాట్ 2024 తేదీ:** జూన్ 6
- **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/JIPMAT/

లిటిల్స్



మీకు తెలుసా?

- బూడిద రంగులో పెద్ద ముక్కుతో పాటు పొడవైన కాళ్లుండే ఈ పక్షిని 'షూబిల్' అని పిలుస్తారు. ఈ పేరు రావటానికి కారణం వీటి ముక్కు 'షూ'ను పోలిఉండటమే.
- తొమ్మిది ఇంచుల పొడవు, నాలుగు ఇంచులు వెడల్పుండే వీటి ముక్కుతో పెద్ద చేపలను కూడా వెంటాడగలవు. ప్రపంచంలోనే అతి పెద్ద ముక్కులుండే పక్షుల్లో షూబిల్ మూడోస్థానంలో ఉంది.
- తూర్పు ఆఫ్రికాలో ఈ పక్షులు ఎక్కువగా కనిపిస్తాయి. ముఖ్యంగా సూడాన్, కాంగో, ఇథియోపియా దేశాల్లో కనిపిస్తాయివి. కేవలం తడినేలలు.. అందునా పచ్చగడ్డి ప్రాంతాల్లో ఎక్కువగా నివసిస్తాయి. నీళ్ల దగ్గర ఎలాంటి చప్పుడు లేకుండా నిలబడి క్షణాల్లో చేపలను పట్టగలవు.



- 4.5 ఫీట్లు పొడవు, ఐదు కేజీల బరువుండే ఈ పక్షులు ముప్పయ్ ఐదేళ్లు బతుకుతాయి.
- నత్తలు, కప్పలు, చేపలు, మొసళ్ల పిల్లలను తిని బతుకుతాయివి.
- ఇవి రెండు కిలోమీటర్ల పరిధిలో కనీసం మూడు గూళ్లు కట్టుకుంటాయి. కేవలం రెండు గుడ్లు పెడతాయి. ఈ పిల్లలను కూడా వేరే పక్షులు చంపేస్తుంటాయి.
- 1840ల్లోనే వీటి ఆనవాళ్లను యూరోపియన్లు కనుక్కున్నారు.
- బ్లాక్ మార్కెట్‌లో ఈ పక్షుల ధర పదివేల డాలర్లు కూడా పలుకుతుంది. అందుకే మనుషులతోనే వాటికి ప్రమాదం ఉంది.
- వీటి రెక్కల పొడవు శరీరానికంటే నాలుగైదు రెట్లు ఉంటుంది. ఇవి గాల్లో దూసుకుపోతాయి.
- దాదాపు ఈ పక్షులన్నీ ఒంటరిగానే ఉంటాయి. గుంపులుగా ఉండటానికి ఇష్టపడవు.


ఏవి ఎన్ని?



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 265

	1		5		7		4	
				2		6	3	
					3		7	
	7	3			8	9		
		4				5		
		9	1			7	6	
	9		8					
	8	5		4				
	3		2		9		5	

సుడోకు - 264 సమాధానం

4	8	3	1	9	7	5	6	2
7	6	9	2	5	3	4	8	1
1	2	5	6	4	8	9	7	3
3	9	7	4	1	5	8	2	6
8	4	1	7	2	6	3	9	5
2	5	6	3	8	9	7	1	4
6	3	2	8	7	4	1	5	9
9	1	8	5	3	2	6	4	7
5	7	4	9	6	1	2	3	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

కోడింగ్ డీకోడింగ్

పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

1. ఒక సంకేత భాషలో LOVEను DTLHగా రాసిన అదే సంకేత భాషలో PONDను ఏ విధంగా రాస్తారు?

ఎ) LCLL బి) CLLL
సి) LLLC డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ:

12 15 22 5 → 4 20 12 8
L O V E - D T L H (-1, -2, -3, -4)

ఇదే విధంగా

16 15 14 4 → 3 12 12 12
P O N D - C L L L (-1, -2, -3, -4)

గా రాస్తారు.

గమనిక:- పై వివరణ పరిశీలిస్తే LOVE అనే పదంలో చివరి అక్షరం E నుంచి మొదటి అక్షరం L వరకు (చివరి నుంచి మొదటికి) -1, -2, -3 -4 అనే క్రమపద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.)

2. ఒక కోడ్ భాషలో ROUNDను NODRUగా రాసిన అదే కోడ్ భాషలో READYను ఏ విధంగా రాస్తారు?

ఎ) DEYAR బి) DEYRA
సి) YADER డి) EDRAY

సమాధానం: (బి)

వివరణ: ROUND అనే పదంలోని అక్షరాల స్థానాలు మారాయి. (జంబ్లింగ్ అయినవి) పదంలోని అక్షరాలపై వరుస సంఖ్యలను రాసుకొని ఏ విధంగా స్థానాలు మారాయో గమనించి అదే పదతిలో మార్చి రాయాలి.

1 2 3 4 5   4 2 5 1 3
R O U N D   N O D R U

ఇదే విధంగా

1 2 3 4 5   4 2 5 1 3
R E A D Y   D E Y R Aగా రాస్తారు.

3. ఒక కోడ్ భాషలో PONDను QRFPగా రాస్తే అదే కోడ్ భాషలో IDEAను ఏ విధంగా రాస్తారు?

ఎ) FKCG బి) FCGK
సి) CFKG డి) FGKC

సమాధానం: (ఎ)

వివరణ: POND అనే పదంలోని అక్షరాలను +2 చేయగా RQPF. ఇప్పుడు దీనిలోని ప్రతి రెండు అక్షరాలు తిప్పిరాయగా QRFPగా కోడ్ చేశారు. అదే విధంగా IDEA అనే పదంలోని అక్షరాలను +2 చేయగా KFGC. ఇప్పుడు దీనిలోని ప్రతి రెండు అక్షరాలను తిప్పి రాయగా FKCG సమాధానం అవుతుంది.

16 15 14 4 / P O N D / +2 +2 +2 +2 / Q R F P / 17 18 6 16
ఇదే విధంగా
9 4 5 1 / I D E A / +2 +2 +2 +2 / F K C G / 6 11 3 7

గా రాస్తారు.

గమనిక: పదాలను పైన, కింద ఇచ్చిన అంకెలను పరిశీలిస్తే క్రాస్‌గా +2 పద్ధతిని అనుసరించిందని తెలుస్తోంది.

4. ఒక కోడ్ భాషలో JOKEను NIDJగా రాసిన అదే కోడ్ భాషలో NIKEను ఏ విధంగా రాస్తారు?

ఎ) HMJD బి)MDJH సి) HMDJ డి) JODL

సమాధానం: (సి)

వివరణ:

10 15 11 5 / J O K E / -1 -1 -1 -1 / N I D J / 14 9 4 10
ఇదే విధంగా
14 9 11 5 / N I K E / -1 -1 -1 -1 / H M D J / 8 13 4 10

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే క్రాస్‌గా -1 పద్ధతిని అనుసరిస్తున్నదని తెలుస్తున్నది.

5. ఒక కోడ్ భాషలో POLICEను NQRGEKగా రాశారు. అదే కోడ్ భాషలో ORANGE ఏ విధంగా రాస్తారు?


ఎ) CTQGIP బి) CQTPIG
సి) QTCPIG డి) CTGQPI

సమాధానం: (ఎ)

వివరణ: POLICE అనే పదంలోని అక్షరాలను +2 చేయగా RQNKEG. ఇప్పుడు మొదటి సగం అక్షరాలను, రెండో సగం అక్షరాలను అవే స్థానాలలో తిప్పి రాయగా NQRGEK. అదేవిధంగా ORANGE అనే పదంలోని అక్షరాలను +2 చేయగా QTCPIG. ఇప్పుడు మొదటి సగం అక్షరాలను, రెండో సగం అక్షరాలను అవే స్థానాలలో తిప్పి రాయగా CTQGIP సమాధానం అవుతుంది.

16 15 12 9 3 5 / P O L I C E / +2 +2 +2 +2 +2 +2 / N Q R G E K / 14 17 18 7 5 11
ఇదే విధంగా
15 18 2 9 13 5 / O R A N G E / +1 +2 +3 +1 +2 +37 / C T Q G I P / 3 20 17 7 9 16

గా రాస్తారు.



గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన అంకెలను గీతల ఆధారంగా జాగ్రత్తగా పరిశీలిస్తే +2 పద్ధతిని అనుసరించిందని తెలుస్తోంది.

6. ఒక కోడ్ భాషలో FAMOUSను PWVGCPగా రాశారు. అదే కోడ్ భాషలో MOBILEను ఏవిధంగా రాస్తారు?

ఎ) JHQNNE బి) QJENNH
సి) JNHNQE డి) JNNHEQ

సమాధానం: (సి)

వివరణ:

6 1 13 15 21 19 / F A M O U S / +1 +2 +3 +1 +2 +3 / P W V G C P / 16 23 22 7 2 16
ఇదే విధంగా
13 15 2 9 12 5 / M O B I L E / +1 +2 +3 +1 +2 -3 / J N H N Q E / 10 14 8 14 17 5

గా రాస్తారు.

జాగ్రత్తగా క్రాస్‌లైన్ గమనించండి. క్రాస్‌లైన్‌కు పైన, కింద ఇచ్చిన సంఖ్యలు +1, +2, +3, +1, +2, +3లో ఉన్నాయి. (లేదా)

FAMOUS అనే పదంలోని అక్షరాలను ముందుగా +1, +2, +3, +1, +2, +3గా రాయగా GCPPWV అవుతుంది. దీనిలో ఎడమవైపు అర్థభాగంలోని అక్షరాలను (GCP) కుడివైపు అర్థభాగంలో, కుడివైపు అర్థభాగంలోని అక్షరాలను (PWV)ఎడమవైపు అర్థభాగంలో రాయగా PWVGCP అవుతుంది. ఇదేవిధంగా పదం MOBILEలోని అక్షరాలను +1, +2, +3, +1, +2, +3లో రాయగా NQEJNH దీనిలో ఎడమవైపు అర్థభాగంలోని అక్షరాలు (NQE) కుడివైపు అర్థభాగంలో, కుడివైపు అర్థభాగంలోని అక్షరాలు (JNH) ఎడమ వైపు అర్థభాగంలో రాయగా JNHNQE సమాధానం అవుతుంది.

7. ఒక కోడ్ భాషలో MISTAKEను SAMKIETగా రాస్తే అదే కోడ్ భాషలో PRIVATEను ఏవిధంగా రాస్తారు?

ఎ) IAPTREV బి) APTIRVE
సి) IAPRTVE డి) IATPREV

సమాధానం: (ఎ)

వివరణ: MISTAKE అనే పదంలోని అక్షరాల స్థానాలు మారాయి. (జంబ్లింగ్ అయినవి) పదంలోని అక్షరాలపై వరుస సంఖ్యలను రాసుకొని ఏ విధంగా స్థానాలు మారాయో గమనించి అదే పద్ధతిలో మార్చి రాయాలి.

1 2 3 4 5 6 7   3 5 1 6 2 7 4
M I S T A K E   S A M K I E T

ఇదే విధంగా

1 2 3 4 5 6 7   3 5 1 6 2 7 4
P R I V A T E   I A P T R E V

గా రాస్తారు.

8. ఒక కోడ్ భాషలో POLICEను ECILOPగా రాస్తే అదే కోడ్ భాషలో CINEMAను ఏవిధంగా రాస్తారు?

ఎ) AMENIC బి) NEACIM
సి) AMNIEC డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: POLICE అనే పదంలోని అన్ని అక్షరాలను తిప్పిరాయగా ECILOP. అదే విధంగా CINEMA అనే పదంలోని అన్ని అక్షరాలను తిప్పి రాయగా AMENIC సమాధానం అవుతుంది.

9. ఒక కోడ్ భాషలో LONGERను OLGNREగా రాశారు. అయితే అదే కోడ్ భాషలో NATIVEను ఏవిధంగా రాస్తారు?

ఎ) ANTIEV బి) NATVEI
సి) ANITEV డి) ఏదీకాదు



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

సమాధానం: (సి)

వివరణ: LONGER అనే పదంలో మొదటి రెండు అక్షరాలు తిప్పిరాయగా OL, తదుపరి 3, 4 అక్షరాలు తిప్పిరాయగా GN, ఆ తరవాత చివరి రెండు అక్షరాలు తిప్పిరాయగా RE అనగా పదంలో ప్రతి రెండు అక్షరాలు తిప్పి రాయడమైనది. ఈ విధంగా LONGER అనే పదం OLGNREగా మారింది. ఇదే విధంగా NATIVE అనే పదంలో మొదటి రెండు అక్షరాలు తిప్పిరాయగా AN, తదుపరి 3, 4 అక్షరాలు తిప్పిరాయగా IT. ఆ తరవాత చివరి రెండు అక్షరాలు తిప్పిరాయగా EV, కావున సమాధానం ANITEV అవుతుంది.